www.andhrajyothy.com

MEDICOVER HOSPITALS

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

MEDICOVER HOSPITALS

బుధవారం | 25-9-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 161 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, బహుళపక్షం; తిథి: అష్టమి మ. 12.11 తదుపరి నవమి; నక్షత్రం: ఆర్ద్ర రా. 10.23 తదుపరి పునర్వసు; వర్జ్యం: ఉ. 6.28-8.06; దుర్ముహూర్తం: ఉ. 11.42-12.30; అమృతఘడియలు: మ. 12.10-1.48; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.07; సూర్యాస్తమయం: 6.05 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



శ్రీ సిద్దరామయ్య గారు
గౌరవ కర్ణాటక రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు

మన మెడికవర్ హాస్పిటల్స్ ఇప్పుడు నమ్మ బెంగళూరు లో!

మెడికవర్ హాస్పిటల్స్

వైట్ ఫీల్డ్స్

గౌరవ కర్ణాటక రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు,

శ్రీ డి. కె. శివకుమార్ గారి

చేతుల మీదుగా ప్రారంభోత్సవం

తేది: 25 సెప్టెంబరు 2024
సమయం: ఉ. 11:30 ని॥లకు





విశిష్ట అతిథులు



శ్రీ సతీష్ జర్కిహోళి గారు
కర్ణాటక రాష్ట్ర పి.డబ్ల్యూ.డి శాఖామాత్యులు



శ్రీ దినేష్ గుండు రావు గారు
కర్ణాటక రాష్ట్ర వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ శాఖామాత్యులు

గౌరవ అతిథులు



శ్రీ బసవరాజ్ బొమ్మై గారు
ఎం పి - హావేరి, కర్ణాటక రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వర్యులు



శ్రీమతి మంజుల అరవింద్ లింబావళి
ఎమ్మెల్యే - మహాదేవపుర నియోజకవర్గం (బెంగళూరు)



శ్రీ యన్. ఏ. హారిస్
ఎమ్మెల్యే - శాంతి నగర్ (బెంగళూరు)

ఆహ్వానించువారు

డా. జి. అనిల్ కృష్ణ
చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ - మెడికవర్ హాస్పిటల్స్

డా. రక్షిత్ పాలలోచన
బి. ఈ (మెకానికల్), పి. జి. డి. ఎం. ఎస్
పి హెచ్ డి- ఇమ్యునాలజీ & జెనెటిక్స్ (అంకాలజీ)

డా. ఎ. శరత్ రెడ్డి
ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ - మెడికవర్ హాస్పిటల్స్

పి. హరి కృష్ణ
ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ - మెడికవర్ హాస్పిటల్స్

డా. ఎ. ఆర్. కృష్ణ ప్రసాద్
డైరెక్టర్ - మెడికవర్ హాస్పిటల్స్

మెడికవర్ బెంగళూరు ప్రత్యేకతలు

- 100+ ఎక్స్‌పర్ట్ డాక్టర్లు
- ప్రపంచస్థాయి క్యాత్‌ల్యాబ్, రోబోటిక్స్, యం.ఆర్.ఐ, సిటి & ఆపరేషన్ థియేటర్స్ మరెన్నో ప్రత్యేకతలు
- 30+ స్పెషాల్టీస్
- ★★★★★ హాస్పిటల్స్ ప్రత్యేక సదుపాయాలు
- ఇన్సూరెన్స్ & టిపిఏ లతో నగదు రహిత వైద్య సేవలు
- 200 కార్ పార్కింగ్ సౌకర్యం

మెడికవర్ ప్రత్యేకతలు

- 13 దేశాలు
- 40+ హాస్పిటల్స్
- 7000+ బెడ్స్
- 3000+ ఐసియు బెడ్స్
- 200+ ఆపరేషన్ థియేటర్స్
- 2 కోట్ల మందికి పైగా వైద్యం
- 1700+ డాక్టర్స్
- 45000+ ఎంప్లాయిస్

మెడికవర్ ఇండియా హాస్పిటల్స్ నెట్‌వర్క్: ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | మహారాష్ట్ర | కర్ణాటక | మరియు యూరప్‌లోని 12 దేశాలలో వైద్యసేవలు

ఎస్ఎంఈ ఐపీఓల్లో మాయ

మర్చంట్ బ్యాంకర్లే సూత్రదారులు... నిగ్గు తేల్చిన సెబీ దర్యాప్తు!

న్యూఢిల్లీ: ఎస్ఎంఈ పబ్లిక్ ఇష్యూలు (ఐపీఓ) భారీగా సబ్‌స్క్రిప్షన్ కావడం వెనక పెద్ద దందానే నడుస్తోంది. కొన్ని సంస్థలు, హై నెట్‌వర్త్ ఇన్వెస్టర్ల (హెచ్ఎన్ఐ) సాయంతో మర్చంట్ బ్యాంకర్లే ఈ దందా నడిపిస్తున్నట్టు సెబీ దర్యాప్తులో తేలినట్టు సమాచారం. ఈ సంస్థలు, హై నెట్‌వర్త్ ఇన్వెస్టర్లు పెద్దమొత్తంలో ఐపీఓ షేర్లకు దరఖాస్తు చేయడం, తీరా షేర్ల కేటాయింపు సమయానికి తమ బిడ్స్ వెనక్కి తీసుకుంటున్నట్టు పేరు వెల్లడించేందుకు ఇష్టపడని సెబీ అధికార వర్గాలు చెప్పాయి. ఈ ఓవర్ సబ్‌స్క్రిప్షన్ చూసి ఇష్యూ బాగుందనే భావనతో రిటైల్ మదుపరులూ భారీగా దరఖాస్తు చేసి మోసపోతున్నట్టు సెబీ దర్యాప్తులో తేలింది. ఈ దందాలో పాత్ర ఉన్న ఆరు మర్చంట్ బ్యాంకర్లని సెబీ ఇప్పటికే గుర్తించింది.

15 శాతం ఫీజు: సెబీ నిబంధనల ప్రకారం ఏ మర్చంట్ బ్యాంకింగ్ సంస్థా, కంపెనీలు ఐపీఓ ద్వారా సమీకరించే నిధుల్లో ఒకటి నుంచి మూడు శాతానికి మించి ఫీజుగా వసూలు చేయకూడదు. అయితే ఈ ఆరు మర్చంట్ బ్యాంకులు, ఈ ఓవర్ సబ్‌స్క్రిప్షన్ దందా నడిపినందుకు తమ క్లయింట్ల నుంచి ఐపీఓ నిధుల్లో 15 శాతం వరకు ఫీజుగా వసూలు చేస్తున్నట్టు తేలింది. దీంతో త్వరలోనే ఈ మర్చంట్ బ్యాంకర్లపై సెబీ క్రమశిక్షణా చర్యలు తీసుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఎస్ఎంఈల ఐపీఓల్లో ఏదో మాయ జరుగుతున్నట్టు చాలా కాలంగా వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సెబీ ఈ దర్యాప్తు జరిపి నిగ్గు తేల్చినట్టు భావిస్తున్నారు.



బంగారం భగ ధగ!

అంతర్జాతీయ మార్కెట్లో పసిడి ర్యాలీ

న్యూయార్క్: ఫెడ్ రేట్ల తగ్గింపుతో పాటు పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో బులియన్ ధరలు క్రమంగా కొండెక్కుతున్నాయి. అంతర్జాతీయ స్పాట్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ధర మరో 18 డాలర్ల మేర పెరిగి 2,646 డాలర్లకు చేరుకుంది. ఫ్యూచర్స్ కాంట్రాక్టు ధర సైతం అర శాతానికి పైగా పెరిగి 2,666 డాలర్లకు ఎగబాకింది. కాగా, దేశీయంగా బంగారం ధర ఇప్పటికే రూ.77,000కు చేరువైంది. ఢిల్లీ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.76,950కి చేరుకుంది. కిలో వెండి రూ.90,000 ధర పలికింది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు బంగారం ధర 28 శాతం వరకు పెరిగింది. అమెరికన్ సెంట్రల్ బ్యాంక్ ఫెడరల్ రిజర్వ్ ప్రామాణిక వడ్డీ రేట్లను 0.50 శాతం తగ్గించడంతో పాటు ఇజ్రాయెల్- లెబనాన్ మధ్య యుద్ధం తీవ్రతరం అవుతుండటం బులియన్ డిమాండ్‌ను ఎగదోస్తున్నాయని వారన్నారు.

పుంజుకుంటున్న ప్రైవేట్ పెట్టుబడులు

రూ.4 లక్షల కోట్ల రుణాలకు ఆమోదం
ఈసారి రెపో రేటు తగ్గకపోవచ్చు
ఎస్‌బీఐ చీఫ్ శ్రీనివాసులు శెట్టి



న్యూఢిల్లీ: దేశంలో ప్రైవేట్ పెట్టుబడులు మళ్లీ ఊపందుకుంటున్నాయి. దీంతో బ్యాంకు రుణాలకూ గిరాకీ పెరగనుందని దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ ఛైర్మన్ శ్రీనివాసులు శెట్టి చెప్పారు. కొన్ని కంపెనీల వ్యాపార విస్తరణ కోసం రూ.4 లక్షల కోట్ల రుణాలు ఇచ్చేందుకు ఇప్పటికే తమ బ్యాంక్ ఆమోదం తెలిపినట్టు తెలిపారు. అయితే ఆ కంపెనీలకు సంబంధించి మరిన్ని విషయాలు పరిశీలించాక ఈ రుణాలు విడుదల చేస్తామన్నారు. నిన్న మొన్నటి వరకు అంతర్గత వనరులతో వ్యాపార విస్తరణ చేపట్టిన ప్రైవేట్ కంపెనీలు ఇప్పుడు బ్యాంకు రుణాల కోసం చూస్తున్నట్టు ఎస్‌బీఐ చీఫ్ చెప్పారు. రహదారులు, పునరుత్పాదక ఇంధన వనరులు, కొన్ని రిఫైనరీ సంస్థల నుంచి రుణాల కోసం దరఖాస్తులు అందుతున్నట్టు తెలిపారు.

అక్టోబరు నుంచి మరింత డిమాండ్

నిజానికి ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో దేశంలో పెట్టుబడుల జోరు తగ్గింది. లోక్‌సభ ఎన్నికలు ఇందుకు ప్రధాన కారణం. జూలై నుంచి కొద్దిగా పుంజుకున్నాయి. అక్టోబరు నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ పెట్టుబడులు రెండూ మరింత జోరందుకుంటాయని శెట్టి చెప్పారు. తమ అనుబంధ సంస్థలు వేటిలోనూ వాటా తగ్గించుకునే ఆలోచన లేదన్నారు. ఒకవేళ ఈ సంస్థల అభివృద్ధికి మరిన్ని నిధులు అవసరమైతే ఆ నిధులు సమకూర్చే విషయాన్నీ బ్యాంకు పరిశీలిస్తుందన్నారు. ప్రస్తుతానికైతే తమ అనుబంధ సంస్థలు వేటికీ తమ నుంచి నిధుల అవసరం లేదన్నారు. వచ్చే నెల 7-9 తేదీల మధ్య జరిగే ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశంలోనూ భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) కీలక రెపో రేటు పెంచకపోవచ్చన్నారు. ఆహార ద్రవ్యోల్బణం ఇంకా ఎక్కువగా ఉండడమే ఇందుకు ప్రధాన కారణమన్నారు.

విస్తరణ బాటలో రామ్‌రాజ్ కాటన్

వచ్చే రెండేళ్లలో కొత్తగా 200 స్టోర్లు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): భారతీయ సాంప్రదాయ, సంస్కృతిని ప్రతిబింబించే విధంగా వస్త్రాలను తయారు చేసి విక్రయిస్తున్న రామ్‌రాజ్ కాటన్ తన కార్యకలాపాలను మరింతగా విస్తరించేందుకు రెడీ అవుతోంది. ప్రస్తుతం కంపెనీ దక్షిణ భారత్‌లో 300కు పైగా షోరూమ్స్‌ను నిర్వహిస్తోంది. కాగా విస్తరణలో భాగంగా వచ్చే రెండేళ్ల కాలంలో షోరూమ్స్‌ను 500కు చేర్చాలని చూస్తున్నట్లు రామ్‌రాజ్ కాటన్ ఛైర్మన్ కేఆర్ నాగరాజన్ వెల్లడించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ప్రస్తుతం రామ్‌రాజ్ 82 షోరూమ్స్‌ను నిర్వహిస్తుండగా వచ్చే ఏడాది మార్చి నాటికి కొత్తగా 28 స్టోర్స్‌ను ప్రారంభించాలని నిర్ణయించినట్లు ఆయన చెప్పారు. రామ్‌రాజ్ కాటన్ నాలుగు వేలకు పైగా వెరైటీలతో ప్రపంచంలోనే అతిపెద్ద ధోవతి ఉత్పత్తిదారుగా ఉందని ఆయన పేర్కొన్నారు. కార్యకలాపాల విస్తరణలో భాగంగా షర్టింగ్, నిట్‌వేర్ విభాగంతో పాటు చీరల విభాగంలోకి కూడా కంపెనీ ప్రవేశించిందన్నారు. ప్రస్తుతం రామ్‌రాజ్ కాటన్ తమిళనాడులో 10, బెంగళూరులో ఒక ప్లాంట్‌ను నిర్వహిస్తోందని నాగరాజన్ తెలిపారు. డిమాండ్‌కు తగ్గట్టుగా ఉత్పత్తి సామర్థ్యాలను పెంచేందుకు రూ.1,000 కోట్లు పెట్టుబడిగా పెట్టాలని నిర్ణయించామని, అయితే ఇందులో రూ.300 కోట్లు ఇప్పటికే ఖర్చు చేయగా, వచ్చే మూడేళ్ల కాలంలో మిగిలిన రూ.700 కోట్ల మొత్తాలను పెట్టుబడులుగా పెట్టనున్నట్లు నాగరాజన్ తెలిపారు.

సెన్సెక్స్ @ 85,000

ఇంట్రాడేలో 26,000కు నిఫ్టీ
సరికొత్త మైలురాయికి సూచీలు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లో మళ్లీ రికార్డుల మోత మోగింది. ప్రామాణిక ఈక్విటీ సూచీలు మంగళవారం ట్రేడింగ్‌లో సరికొత్త గరిష్ఠాలకు ఎగబాకాయి. సెన్సెక్స్ తొలిసారిగా 85,000, నిఫ్టీ 26,000 మైలురాయిని తాకాయి. కానీ, ఇన్వెస్టర్లు ఎఫ్ఎంసీజీ, బ్యాంకింగ్ షేర్లలో లాభాల స్వీకరణకు పాల్పడటంతో సూచీలు మిశ్రమంగా ముగిశాయి. సెన్సెక్స్ ఒక దశలో 234.62 పాయింట్లు పెరిగి 85,163.23 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. చివరికి సూచీ 14.57 పాయింట్ల నష్టంతో 84,914.04 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం ఒక దశలో 72.5 పాయింట్లు ఎగబాకి 26,011.55 వద్ద సరికొత్త ఆల్‌టైం గరిష్ఠాన్ని నమోదు చేసినప్పటికీ, చివర్లో 1.35 పాయింట్ల లాభంతో 25,940.40 వద్ద క్లోజైంది. మార్కెట్ భవిష్యత్ గమనంపై స్పష్టత లోపించడంతో ఇన్వెస్టర్లు రికార్డు గరిష్ఠాల వద్ద లాభాలను స్వీకరిస్తున్నారని ఈక్విటీ నిపుణులు పేర్కొన్నారు. సెన్సెక్స్‌లోని 30 లిస్టెడ్ కంపెనీల్లో సగం లాభపడ్డాయి. టాటా స్టీల్ షేరు 4.29 శాతం వృద్ధితో సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. పవర్‌గ్రిడ్ 2.65 శాతం రాణించగా.. టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్ ఒక శాతానికి పైగా పెరిగాయి. హెచ్‌యూఎల్ షేరు మాత్రం అత్యధికంగా 2.56 శాతం క్షీణించింది.

మెటల్ షేర్ల జిగేల్

చైనా తన ఆర్థిక వ్యవస్థకు, స్థిరాస్తి మార్కెట్‌కు ఊతమిచ్చేలా ప్రామాణిక వడ్డీ రేట్లను తగ్గించడంతోపాటు అదనపు ఉద్దీపనలను ప్రకటించడం అంతర్జాతీయ మార్కెట్లకు సానుకూలంగా పరిణమించింది. దేశీయంగా లోహ రంగ షేర్లకు గిరాకీ పెరిగింది. నేషనల్ అల్యూమినియం షేరు ఏకంగా 6.16 శాతం ఎగబాకగా.. టాటా స్టీల్ 4 శాతానికి పైగా పుంజుకుంది. హిండాల్కో, ఎన్ఎండీసీ, వేదాంత, సెయిల్ షేర్లు మూడు శాతానికి పైగా రాణించాయి. బీఎస్ఈలో మెటల్ ఇండెక్స్ 2.78 శాతం పెరిగింది.

3 సెషన్లలో 1,000 పాయింట్లు

సెన్సెక్స్ కేవలం 3 ట్రేడింగ్ సెషన్లలో 1,000 పాయింట్లు పెరిగి 84,000 నుంచి 85,000 మైలురాయికి చేరుకుంది. 80,000 మార్క్‌ను దాటాక సూచీకిదే అత్యంత వేగవంతమైన వెయ్యి పాయింట్ల వృద్ధి. కాగా, సూచీ 83,000 నుంచి 84,000 స్థాయికి నాలుగు ట్రేడింగ్ సెషన్లలో చేరుకుంది.

నిఫ్టీకి 38 సెషన్లు

ఈ ఆగస్టు 1న తొలిసారిగా ఇంట్రాడే ట్రేడింగ్‌లో 25,000 మైలురాయికి చేరిన నిఫ్టీ.. ఆ తర్వాత కొంత దిద్దుబాటుకు లోనైంది. తిరిగి 25,000 ఎగువకు చేరి, ఆ తర్వాత మరో 1,000 పాయింట్లు పెరిగి 26,000 మార్క్‌ను చేరేందుకు సూచీకి 38 ట్రేడింగ్ సెషన్లు పట్టింది.

ఒక శాతం వడ్డీ రేటుతో బంగారం రుణాలు

ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): బంగారం రుణాల కోసం చూసే వారి కోసం ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ బంపర్ ఆఫర్ ప్రకటించింది. బుధవారం నుంచి ఈ నెలాఖరు వరకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో నెలకు ఒక శాతం వడ్డీ రేటుకే పసిడి రుణాలు అందజేస్తామని ప్రకటించింది. ఈ రుణాలు తీసుకోవడంపై ఆసక్తి ఉన్న వ్యక్తులు తమ బ్రాంచీ కార్యాలయాలు లేదా తమ వెబ్‌సైట్ ద్వారా మరిన్ని వివరాలు తెలుసుకోవచ్చని తెలిపింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	76,360 ▲	70,000 ▲	98,000 ▲
ముంబై	74,764 ▲	68,484 ▲	88,402 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

25వ తేదీ			
హైదరాబాద్	525	విజయవాడ	555
వరంగల్	527	గోదావరి	550
చిత్తూరు	543	విశాఖపట్నం	555
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర	వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్		
హైదరాబాద్	125	విజయవాడ	121
వరంగల్	125	గుంటూరు	126
కరీంనగర్	125	ఒంగోలు	126
మహబూబ్‌నగర్	125	చిత్తూరు	122
కర్నూలు	125	నెల్లూరు	122
విశాఖపట్నం	107	అనంతపురం	122
గోదావరి	121		

ఈసారి రెపో తగ్గొచ్చు: ఎస్ అండ్ పీ

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రేటింగ్ సంస్థ ఎస్ అండ్ పీ 6.8 శాతంగా యథాతథంగా కొనసాగించింది. అక్టోబరు పాలసీ సమీక్షలో ఆర్‌బీఐ కీలక వడ్డీ రేటు తగ్గించే ఆస్కారం ఉన్నట్లు అంచనా వేసింది. అక్టోబరుతో మొదలుపెట్టి ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే లోగా రెండు సార్లు వడ్డీ రేట్లు తగ్గించవచ్చని అభిప్రాయపడింది. దేశం సాధిస్తున్న శక్తివంతమైన వృద్ధి రేటు వల్ల ద్రవ్యోల్బణం అదుపుపై ఆర్‌బీఐ దృష్టి కేంద్రీకరించే వెసులుబాటు ఏర్పడిందని పేర్కొంది. వడ్డీ రేట్లు అధికంగా ఉన్నందు వల్ల పట్టణ డిమాండు తగ్గడం జూన్ త్రైమాసికంలో జీడీపీ వృద్ధి రేటు మందగించడానికి కారణమని తెలిపింది.

పండగ రద్దీకి అమెజాన్ రెడీ

న్యూఢిల్లీ: పండగల సీజన్‌లో ఏర్పడబోయే రద్దీకి ఈ-కామర్స్ దిగ్గజం సర్వసన్నద్ధం అవుతోంది. ఈ ఏడాది సీజన్ అమ్మకాలు గత ఏడాది కన్నా భారీగా ఉంటాయని సంస్థ భావిస్తోంది. దేశంలో వినియోగదారుల సెంటిమెంట్ బలంగా ఉండడమే ఇందుకు కారణమని అమెజాన్ వైస్‌ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) అభినవ్ సింగ్ అన్నారు. భారత మార్కెట్‌ను తాము "దీర్ఘకాలిక అవకాశం"గా భావిస్తున్నట్టు ఆయన చెప్పారు. అమెజాన్ భారీ డిస్కౌంట్లు ఇస్తూ పోటీ సంస్థలను దెబ్బ తీస్తోందన్న ఆరోపణలను ఆయన ఖండించారు. తమ సంస్థ ఎప్పుడూ మార్కెట్ ధరలను అదుపు చేయదని, అది పూర్తిగా తమ వేదిక ద్వారా ఉత్పత్తులు విక్రయిస్తున్న విక్రేతల హక్కు అని ఆయన తెలిపారు. విక్రేతలను డిజిటైజ్ చేయడం, భారీ సంఖ్యలో కస్టమర్లకు సేవలందించడం, భారీ ఎంటర్‌ప్రెన్యూర్ల నెట్‌వర్క్ ఏర్పాటు చేయడం తమ లక్ష్యమని ఆయన అన్నారు. పండగల సీజన్‌కు సిద్ధం కావడంలో భాగంగా ఫుల్‌ఫిల్‌మెంట్ కేంద్రాల సంఖ్య పెంచడంతో పాటు 1.1 లక్షల సీజనల్ ఉద్యోగాలు కల్పించినట్టు అమెజాన్ ఇటీవల ప్రకటించింది.

స్పోర్ట్స్

విజేత జీవన్ జోడీ



న్యూఢిల్లీ: భారత టెన్నిస్ జోడీ జీవన్ నెడుంజెరియన్, విజయ్‌సుందర్ ప్రశాంత్ చైనాలో జరిగిన హంగ్జౌ ఓపెన్‌లో డబుల్స్ విజేతగా నిలిచింది. మంగళవారం ఇక్కడ జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో జీవన్-విజయ్ ద్వయం 4-6, 7-6(5), 10-7తో జర్మనీ జంట కాన్‌స్టాంటిన్-హెండ్రిక్‌ను ఓడించి ఏటీపీ టైటిల్‌ను అందుకుంది. కాగా, చైనాలోనే జరిగిన చెంగ్డూ ఓపెన్‌లో మరో భారత ఆటగాడు యుకీ భాంబ్రీ-అల్బానో (ఫ్రాన్స్) జోడీ డబుల్స్‌లో రన్నరప్‌గా నిలిచింది.

ఇరానీ కప్‌నకు జురెల్, సర్ఫరాజ్

టెస్టు జట్టు నుంచి విడుదల?

న్యూఢిల్లీ: వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్, మిడిలార్డర్ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్‌తోపాటు పేసర్ యశ్ దయాళ్‌ను భారత టెస్ట్ టీమ్ నుంచి విడుదల చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. దేశవాళీ టోర్నీ ఇరానీ కప్ కోసం రుతురాజ్ గైక్వాడ్ కెప్టెన్సీలో మంగళవారం ప్రకటించిన రెస్టాఫ్ ఇండియా జట్టులో జురెల్, యశ్‌కు చోటు కల్పించగా.. ముంబై టీమ్‌కు సర్ఫరాజ్‌ను ఎంపిక చేశారు. అయితే, ఈ నెల 27 నుంచి కాన్పూర్‌లో బంగ్లాదేశ్‌తో జరిగే రెండో టెస్ట్ తుది జట్టులో చోటు దక్కకపోతేనే ఈ ముగ్గురినీ విడుదల చేస్తామని బీసీసీఐ తెలిపింది. వచ్చే నెల ఒకటి నుంచి ఐదు వరకు లఖ్‌నవూలో జరిగే ఇరానీ కప్‌లో రంజీ చాంప్ ముంబైతో రెస్టాఫ్ జట్టు తలపడనుంది. కొంత కాలంగా రెడ్ బాల్ క్రికెట్‌కు దూరమైన ఇషాన్ కిషన్‌తోపాటు ఇటీవలే ముగిసిన దులీప్ ట్రోఫీలో అదరగొట్టిన రికీ భుయ్, శాశ్వత్ రావత్, ప్రసిద్ధ్ కృష్ణ, సాయి సుదర్శన్‌లకు కూడా రెస్టాఫ్ టీమ్‌లో చోటు దక్కింది. కాగా, రహానె సారథ్యంలోని ముంబై జట్టులో శ్రేయాస్ అయ్యర్, పృథ్వీషా ఆడనున్నారు.

జాతీయ చెస్ చాంపియన్ అర్జున్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ జూనియర్ చెస్ చాంపియన్‌షి‌ప్‌లో హైదరాబాద్ క్రీడాకారులు ఆదిరెడ్డి అర్జున్ బాలుర విభాగంలో చాంపియన్‌గా నిలవగా, బాలికల కేటగిరీలో వి.సరయు రన్నరప్ టైటిల్ సాధించింది. హరియాణాలో జరిగిన ఈ పోటీల్లో అర్జున్ 11 రౌండ్లలో 9.5 పాయింట్లతో అగ్రస్థానాన్ని కైవసం చేసుకోగా, సరయు (9) ద్వితీయ స్థానంతో సరిపెట్టుకుంది.

బుమ్రాకు విశ్రాంతి!

మూడో స్పిన్నర్ ఖాయం

కుల్దీప్-అక్షర్ మధ్య పోటీ
27 నుంచి బంగ్లాతో రెండో టెస్టు



న్యూఢిల్లీ: వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) 2023-25 అంచెలో భాగంగా టీమిండియా ఆడే పది టెస్టుల్లో మొదటిదాన్ని ఘన విజయంతో ముగించింది. బంగ్లాదేశ్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో ఏకంగా 280 పరుగుల తేడాతో నెగ్గి డబ్ల్యూటీసీ టేబుల్‌లో తమ అగ్రస్థానాన్ని మరింత పదిలపర్చుకుంది. ఇక శుక్రవారం నుంచి కాన్పూర్‌లో చివరిదైన రెండో టెస్టు జరుగుతుంది. వాస్తవానికి ఈ పది టెస్టుల్లో రోహిత్ సేన సగం మ్యాచ్‌లను గెలిచినా ఫైనల్లో చోటు ఖాయమే. బంగ్లాతో రెండో టెస్టు తర్వాత స్వదేశంలో కివీస్‌తో మూడు టెస్టులు ఉంటాయి. ఆ తర్వాత ఐదు టెస్టుల సిరీస్ కోసం భారత జట్టు ఆస్ట్రేలియా టూర్‌కు వెళ్లాల్సి ఉంటుంది. అయితే అక్కడ ఆత్మవిశ్వాసంతో సిరీస్‌ను ఆరంభించేందుకు, సొంత గడ్డపై మిగిలిన మూడు టెస్టులను గెలిచి ఒత్తిడి తగ్గించుకోవాలనుకుంటోంది.



ఇక నల్ల మట్టి పిచ్‌పై..

ఎర్ర మట్టితో తయారుచేసిన చెన్నై పిచ్‌పై బంతి బాగా బౌన్స్ కావడంతో పేసర్లు ఎక్కువగా లాభపడ్డారు. నాలుగో రోజు మాత్రమే స్పిన్‌కు అనుకూలించింది. అయితే కాన్పూర్‌లో మాత్రం నల్ల మట్టి పిచ్ సిద్ధంగా ఉండనుంది. ఇక్కడ బంతి తక్కువగా బౌన్స్ అవడంతో పాటు స్పిన్‌కు అనుకూలిస్తూనే ఫ్లాట్‌గా ఉండనుంది. దీంతో బ్యాటర్లు, స్పిన్నర్లకు ఇద్దరికీ లాభమే. అలాగే దీనికి తగ్గట్టుగా ఇరు జట్లలోనూ మార్పులు చోటు చేసుకోనున్నాయి.

ఆ ఇద్దరిలో ఎవరో?

కాన్పూర్ పిచ్‌ను అనుసరించి ముగ్గురు స్పిన్నర్లతో వెళ్లాలనుకుంటే జట్టుకు ఓ పేసర్ దూరం కావాల్సిందే. ఒకవేళ బుమ్రాకు రెస్ట్ ఇస్తే ఇబ్బంది లేదు. కానీ తను ఆడితే మరో పేసర్ ఆకాశ్ దీప్‌పై వేటు పడే చాన్సుంది. ఇక మూడో స్పిన్నర్ కోసం తుది జట్టులో కుల్దీప్, అక్షర్‌ల మధ్య పోటీ ఏర్పడనుంది. ఇంగ్లండ్‌తో జరిగిన సిరీస్‌లో కుల్దీప్ 19 వికెట్లు తీయడంతో కోచ్ గంభీర్ అతడి వైపే మొగ్గు చూపవచ్చు. మరోవైపు జట్టులో ఇప్పటికే అశ్విన్, జడేజా రూపంలో ఇద్దరు స్పిన్ ఆల్‌రౌండర్లు ఉన్నారు కాబట్టి అక్షర్ బ్యాటింగ్ సామర్థ్యం పెద్దగా అవసరపడదు.

పని భారం పడకుండా..

భారత పేస్ దళానికి బుమ్రా ప్రధాన ఆయుధంగా చెబుతుంటారు. ముున్ముందు జట్టు మరిన్ని టెస్టులు ఆడాల్సి ఉండడంతో అతడిపై ఎక్కువ భారం పడకుండా చూడాలనేది టీమ్ ఆలోచన. పిచ్ కూడా పెద్దగా పేస్‌కు అనుకూలించదు కాబట్టి కాన్పూర్ టెస్టులో బుమ్రాకు విశ్రాంతి నివ్వాలనుకుంటున్నట్టు సమాచారం. కానీ చెన్నై టెస్టులో బుమ్రా మొత్తంగా 21 ఓవర్లే వేశాడు. అందుకే రెస్ట్ ఇస్తారా? లేక మరింత మ్యాచ్ సమయం కోసం కొనసాగనిస్తారా? అనేది వేచిచూడాల్సిందే.

చెస్ విజేతలకు ఘన స్వాగతం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): చెస్ ఒలింపియాడ్‌లో స్వర్ణాలు సాధించి చరిత్ర సృష్టించిన తెలుగమ్మాయి ద్రోణవల్లి హారిక, గుకేష్, వైశాలిలకు స్వదేశంలో ఘన స్వాగతం లభించింది. మంగళవారం ఉదయం శంషాబాద్ విమానాశ్రయంలో హారికకు తెలంగాణ చెస్ అసోసియేషన్, పలువురు చెస్ క్రీడాకారులు ఘనంగా స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు, శాలువాలతో సత్కరించారు. ఈ పతకాలతో భారత్ సత్తా ఏంటో ప్రపంచానికి తెలిసిందని, ప్రపంచ చెస్‌కు త్వరలో భారత్ పవర్ సెంటర్‌గా మారబోతుందని హారిక చెప్పింది. ఇక, మధ్యాహ్నం చెన్నై విమానాశ్రయంలో దిగిన గుకేష్, ప్రజ్ఞానంద, వైశాలికి వారి కుటుంబ సభ్యులు, ఆత్మీయులు, అభిమానుల మధ్య అపూర్వ స్వాగతం లభించింది. స్వల్ప విరామానంతరం నవంబరులో జరగనున్న వరల్డ్ చెస్ చాంపియన్‌షిప్‌పై దృష్టి పెట్టనున్నానని గుకేష్ తెలిపాడు. దేశం తరపున ఒక జట్టుగా ఆడి ఒలింపియాడ్ మెడల్ సాధించడం చాలా గొప్పగా అనిపిస్తోందని ప్రజ్ఞానంద అన్నాడు. ఒలింపియాడ్‌లో రెండు విభాగాల్లోనూ స్వర్ణాలు సాధించడం సంతోషంగా ఉందని వైశాలి చెప్పింది.

ఒక్క ఫుట్‌బాల్ స్టేడియంతో ఏటా రూ. 81 వేల కోట్లా!



లండన్: ఒక్క ఫుట్‌బాల్ స్టేడియాన్ని నిర్మిస్తే.. బ్రిటన్ ఆర్థిక వ్యవస్థకు ఏడాదికి రూ. 81,733 కోట్ల తోడ్పాటు లభిస్తుందంటూ ఆక్స్‌ఫర్డ్ ఎకనావిక్స్ సంస్థ చేసిన అధ్యయనం ఎంతో ఆసక్తికరంగా మారింది. తాజాగా మాంచెస్టర్ యునైటెడ్ ఫుట్‌బాల్ క్లబ్‌నకు చెందిన ఓల్డ్ ట్రాఫర్డ్ మైదానం, చుట్టుపక్కల ఆధునికీకరణ వ్యయ భారాలకు సంబంధించిన నివేదికను క్లబ్ బయటపెట్టింది. దాదాపు రూ. 22,392 కోట్లతో లక్ష సీట్ల సామర్థ్యం కలిగిన కొత్త స్టేడియాన్ని నిర్మించాలా? లేదా 74 వేల సీట్ల కెపాసిటీ కలిగిన ఓల్డ్ ట్రాఫర్డ్ మైదానాన్ని ఆధునీకరించాలా? అనేదానిపై మాంచెస్టర్ క్లబ్ సమాలోచన చేస్తోంది. అయితే, ఈ స్టేడియం కారణంగా 92 వేల కొత్త ఉద్యోగాలు, 17 వేల నూతన గృహాలు నిర్మితం కావడంతోపాటు ఈ ప్రాంతాన్ని సందర్శించే పర్యాటకుల సంఖ్య 20 లక్షల మేర పెరుగుతుందన్నది సర్వే సంస్థ అంచనా.

అందరూ మహిళలే

టీ20 వరల్డ్‌కప్ అంపైర్ల ప్యానెల్



దుబాయ్: టీ20 ఉమెన్ వరల్డ్‌కప్ కోసం పూర్తిగా మహిళలతో కూడిన ప్యానెల్‌ను ఐసీసీ మంగళవారం ప్రకటించింది. మొత్తం 13 మంది మ్యాచ్ అఫీషియల్స్‌లో 10 మంది అంపైర్లు, ముగ్గురు మ్యాచ్ రెఫరీలు ఉన్నారు. భారత్‌నుంచి తెలుగు మహిళ జీఎస్ లక్ష్మి మ్యాచ్ రెఫరీగా, బృంద రాఠీ అంపైర్‌గా వ్యవహరించనున్నారు. వచ్చే నెల 3 నుంచి యూఏఈ వేదికగా పొట్టికప్ జరగనుంది. కాగా, గత నాలుగు మెగా టోర్నీలకు పనిచేసిన క్లైరీ పొలోసక్‌కు ప్యానెల్‌లో అత్యధిక అనుభవం ఉంది. జింబాబ్వేకు చెందిన సారా డామ్‌బనేవనాకు తొలిసారి టీ20 వరల్డ్‌కప్‌లో అంపైరింగ్ చేసే చాన్స్ దక్కనుంది.

పంత్.. ఓ అద్భుతం: అక్రమ్




కరాచీ: ఘోర ప్రమాదం నుంచి కోలుకుని తిరిగి అంతర్జాతీయ క్రికెట్ ఆడుతున్న భారత వికెట్ కీపర్ రిషభ్ పంత్ ఓ అద్భుతమని పాకిస్థాన్ మాజీ కెప్టెన్ వసీమ్ అక్రమ్ కొనియాడాడు. 'రోడ్డు ప్రమాదం తర్వాత ఎవరికైనా కోలుకునేందుకు చాలా సమయం పడుతుంది. ఇక ఆటగాడికైతే మరింత కష్టంగా ఉంటుంది. కానీ పంత్ అలా కాదు. నిజంగా తను మిరాకిల్ కిడ్. అతడిని యువతరం ఆదర్శంగా తీసుకోవాల్సిందే. ఐపీఎల్, టీ20 ప్రపంచకప్‌లోనూ ప్రభావం చూపి ఇప్పుడు టెస్టుల్లోనూ ఆకట్టుకుంటున్నాడు. ఆసీస్‌తో టెస్టు సిరీస్‌లోనూ తను కీలకం కానున్నాడు' అని అక్రమ్ ప్రశంసించాడు.

రెండో టెస్టుపై కాన్పూర్‌లో నిరసన

కాన్పూర్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా ఆ దేశ క్రికెట్ జట్టుతో టెస్టు సిరీస్‌ను రద్దు చేయాలని పలు సంస్థలు డిమాండ్ చేస్తున్నాయి. ఇందులో భాగంగా కాన్పూర్‌లో ఈనెల 27నుంచి జరిగే రెండో టెస్టును అడ్డుకునేందుకు సోమవారం అఖిలేష్ భారతీయ హిందూ మహాసభ కార్యకర్తలు స్టేడియానికి వెళ్లే రోడ్డుపై హోమాన్ని నిర్వహించారు. అయితే అదే రోజు 20 మంది కార్యకర్తలపై పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే బంగ్లాతో అక్టోబరు 6న జరిగే టీ20 మ్యాచ్‌ను అడ్డుకునేందుకు గ్వాలియర్ బంద్‌ను నిర్వహించనున్నట్టు హిందూ మహాసభ ప్రకటించింది.

'బాక్సింగ్ డే' టిక్కెట్లకు ఫుల్ గిరాకీ

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియాతో ఈ ఏడాది చివర్లో జరిగే బాక్సింగ్ డే టెస్టు కోసం అభిమానులు ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. ఐదు టెస్టుల సిరీస్‌లో భాగంగా డిసెంబరు 26న మెల్‌బోర్న్ క్రికెట్ మైదానంలో ఈ నాలుగో టెస్టు ఆరంభం కానుంది. లక్షకు పైగా సీటింగ్ సామర్థ్యం కలిగిన ఈ స్టేడియంలో మ్యాచ్ టిక్కెట్ల అమ్మకాలు రికార్డు స్థాయిలో సాగుతున్నట్టు క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) పేర్కొంది. 2018/19తో పోలిస్తే ఈసారి తొలి రోజు అమ్మకాలే మూడింతలు పెరిగాయట. అలాగే రెండు నుంచి నాలుగు రోజుల మధ్య గమనిస్తే ఐదున్నర రెట్లు ఎక్కువగా ఇరు జట్ల ఫ్యాన్స్ టిక్కెట్లను కొనుగోలు చేశారని సీఏ ఎగ్జిక్యూటివ్ జీఎం జోయెల్ మారిసన్ తెలిపాడు.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
బుధవారం | 25-9-2024
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**

అమరావతిలో ఎంఎస్ఎంఈ

టెక్ సెంటర్


మెగా ప్రాజెక్టుతో పారిశ్రామిక అభివృద్ధికి బాటలు

ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.250 కోట్లు

కొప్పర్తికి బదులు అమరావతిలో ఏర్పాటుకు కేంద్రం ఆమోదం 12

20 ఎకరాలు బదిలీకి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు

ఎన్ఆర్ఐ కోటా.. ఓ మోసం




డబ్బులు దండుకునే ఎత్తుగడ: సుప్రీం కోర్టు

వైద్య కళాశాలల్లో ప్రవేశాలపై పంజాబ్ ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ కొట్టివేత

న్యూఢిల్లీ, సెప్టెంబరు 24: విద్యా సంస్థల్లో ముఖ్యంగా వైద్య కళాశాలల్లో అమలు చేస్తున్న ఎన్ఆర్ఐ కోటా విధానం పట్ల మంగళవారం సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఇది పూర్తిగా మోసమని, దీనికి తక్షణమే ముగింపు పలకాల్సి ఉందని పేర్కొంది. ప్రతిభావంతులను కాదని డబ్బు

మిగతా 2వ పేజీలో...

కర్ణాటక సీఎంకు షాక్



ముడా స్కాంలో సిద్దరామయ్య ప్రాసిక్యూషన్‌కు రాష్ట్ర హైకోర్టు ఓకే


గవర్నర్ అనుమతిని సవాల్ చేస్తూ ముఖ్యమంత్రి వేసిన పిటిషన్ కొట్టివేత 2

సిద్దూ రాజీనామాకు బీజేపీ డిమాండ్

నేడు కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశం

హైకోర్టు తీర్పుపై సుప్రీంలో సవాల్?

జగన్ వల్లే ఆ నష్టం!



పోలవరానికి ఆయన జమానాలోనే ప్రధాన సమస్యలు

2019, 20ల్లో వచ్చిన వరదలకే దెబ్బతిన్న డయాఫ్రం వాల్ 10

ప్రధాన డ్యాం ప్రాంతంలో భారీ గుంతలు

తేల్చిచెప్పిన అంతర్జాతీయ నిపుణులు

20 కార్పొరేషన్లకు నామినేటెడ్ పదవుల భర్తీ

బడుగులకు పెద్దపీట!

అసెంబ్లీ సీట్లు త్యాగం చేసిన 8 మందికి అవకాశం


కొనకళ్ల నారాయణ ఆర్టీసీ


మంతెన రామరాజు ఏపీఐఐసీ


అబ్దుల్ అజీజ్ వక్ఫ్ బోర్డు


రవి నాయుడు శాప్

ఏపీఐఐసీ చైర్మన్‌గా 'ఉండి' రామరాజు

మాజీ ఎంపీ కొనకళ్లకు ఆర్టీసీ

నెల్లిమర్ల, డోన్ ఇన్‌చార్జులకూ కీలక పోస్టులు

వక్ఫ్ బోర్డు చైర్మన్ పదవి అబ్దుల్ అజీజ్‌కు

లోకేశ్ పాదయాత్రలో వలంటీర్ల కన్వీనర్‌గా పనిచేసిన రవినాయుడికి 'శాప్' బాధ్యతలు

టూరిజం కార్పొరేషన్ నూకసాని బాలాజీకి

పనిచేసినవారికి ప్రాధాన్యమిస్తూ పదవుల భర్తీ

యూనిట్, క్లస్టర్ ఇన్‌చార్జులకూ అవకాశం

20 చైర్మన్, 79 మంది సభ్యుల పేర్లతో తొలి జాబితా.. టీడీపీకి 16, బీజేపీ 1, జనసేన 3

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

టీడీపీ కూటమి ప్రభుత్వం విడుదల చేసిన నామినేటెడ్ పదవుల జాబితాలో.. ఇటీవలి ఎన్నికల్లో సీట్లు త్యాగం చేసిన టీడీపీ నేతలకు పెద్ద పీట వేశారు. రెండ్రోజుల్లో కొన్ని నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తామని పార్టీ నేతలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆదివారం చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు.. ఆ మాట ప్రకారం మంగళవారం ఆ జాబితా విడుదల చేయించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నామినేటెడ్ పదవుల భర్తీకి సంబంధించి ఇదే తొలి జాబితా. పార్టీ కోసం పనిచేసిన వారికి ప్రాధాన్యం

మిగతా 10వ పేజీలో...


సర్వశ్రేష్ఠ త్రిపాఠి

లడ్డూపై సిట్ చీఫ్‌గా ఐజీ త్రిపాఠి!

టీమ్‌లో డీఐజీ గోపీనాథ్, ఎస్పీ హర్షవర్ధన్

సీఎం ఆమోదం.. ఉత్తర్వులే తరువాయి

వెంకన్న లడ్డూ నాణ్యత, కమీషన్ల బాగోతం, అపచారానికి బాధ్యులను తేల్చనున్న సిట్

అమరావతి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరుడి పరమ పవిత్రమైన లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేసినవారి పని పట్టేందుకు 'సిట్' (ప్రత్యేక దర్యాప్తు బృందం) ఏర్పాటైంది. ఈ బృందానికి గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి నాయకత్వం వహించనున్నారు. ఈ మేరకు సిట్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదం తెలిపారు. ప్రభుత్వ జీవో రావాల్సి ఉంది. పశువులు, పంది తదితర జంతువుల కొవ్వు కలిపిన నెయ్యిని తిరుమల లడ్డూల తయారీకి వాడిన వ్యవహారంపై కొన్నిరోజులుగా దేశం భగ్గుమంటున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ వ్యవహారంపై దర్యాప్తునకు సిట్‌ను ఏర్పాటు చేయనున్నట్టు రెండు రోజుల క్రితమే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఐజీ, ఆ పై హోదా కలిగిన పోలీసు అధికారి నేతృత్వంలో సిట్ పనిచేస్తుందని తెలిపారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఐజీ త్రిపాఠి నేతృత్వంలో విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి, కడప ఎస్పీ హర్షవర్ధన్ రాజు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో మంగళవారం సిట్ ఏర్పాటైంది. లడ్డూ నాణ్యత నుంచి దాని వెనక ఉన్న కమీషన్ల

మిగతా 11వ పేజీలో...

సనాతన ధర్మం కోసం ప్రాణాలైనా ఇస్తా

చేతులెత్తి నమస్కరిస్తున్నా.. ఆ ధర్మానికి హానిపై మౌనం సరికాదు

లౌకికవాదం అనేది వన్‌వే కాదు టూ వే

దానికి భంగం కలిగితే కచ్చితంగా నిలదీస్తా

మదమెక్కి మాట్లాడుతున్న పొన్నవోలు

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆగ్రహం

ప్రాయశ్చిత్త దీక్షలో భాగంగా దుర్గ గుడి మెట్లు కడిగిన జనసేనాని 11


మంగళవారం బెజవాడలో కనకదుర్గమ్మ ఆలయం మెట్లను కడిగి పసుపు, కుంకుమ పెడుతున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

ఆ పాపం బోర్డుదే!

గల్లీకి దించి నెయ్యి కల్తీకి దారి

చిన్నాచితక వ్యాపారులు సైతం నెయ్యి అందించేలా అడ్డగోలు తీర్మానాలు

అనుభవం, సామర్థ్యం, నాణ్యత, టర్నోవర్ నిబంధలన్నీ సడలింపు

అధికారంలోకి వచ్చీరాగానే.. తిరుమల నెయ్యిపైనే వైసీపీ కన్ను

తమవారి కోసం రివర్స్ టెండరు

కొనుగోలు నిబంధనల్ని మార్చేసిన వైవీ సుబ్బారెడ్డి పాలకమండలి



(తిరుపతి - ఆంధ్రజ్యోతి)

తిరుమల లడ్డూలకు కల్తీ నెయ్యి సరఫరా చేస్తున్నారనే విషయం శాస్త్రీయంగా వెల్లడవడంతో జగన్ జమానాలో జరిగిన అవకతవకలు ఒక్కటొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. అయినవారికే టెండర్లు కట్టబెట్టే యోచనలో రివర్స్ టెండర్‌లతో పాటు నెయ్యి టెండర్ల నిబంధనలనే వైవీ సుబ్బారెడ్డి నేతృత్వంలోని

మిగతా 11వ పేజీలో...



రాములోరి రథానికి నిప్పు

అర్ధరాత్రి రథంపై పెట్రోల్ పోసి దహనం

కాలిపోయిన చక్రాల మధ్య భాగం

అనంతపురం జిల్లాలో ఘాతుకం 11

సీఎం సీరియస్.. సమగ్ర నివేదికకు ఆదేశం

మందు లేదు!

మద్యం షాపులు దాదాపుగా ఖాళీ

డిపోల నుంచి సరఫరా నిలిపివేత

ఉన్న నిల్వలను అమ్మాలని ఆదేశాలు

ఖరీదైన లిక్కరే అందుబాటులో.. దీంతో బార్లకు జనం బారులు.. ఖజానాకు గండి

కొత్త పాలసీ, బ్రాండ్ల పేరుతో ప్రస్తుత అమ్మకాలపై అధికారుల నిర్లక్ష్యం

అమరావతి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బహుళజాతి కంపెనీల (ఎంఎన్‌సీ) మద్యాన్ని అన్ని షాపుల్లోనూ అందుబాటులోకి తీసుకొస్తామని ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎంకే మీనా ప్రకటించిన మరుసటి రోజు నుంచే రాష్ట్రంలో మద్యం కొరత ఏర్పడింది. ఈ నెల 20న ఆయన

మిగతా 3వ పేజీలో...

జే గ్యాంగ్ ఆటకట్టు!

బలంగా బిగుస్తున్న సీఐడీ ఉచ్చు


వాసుదేవరెడ్డి



నాసిరకం మద్యం స్కామ్ దర్యాప్తులో ముందడుగు

ఏపీ బ్రూవరీస్ కార్యాలయంలో తనిఖీలు

మాజీ ఎండీ వాసుదేవరెడ్డి గది తెరిచిన అధికారులు

మద్యం కేసులో కీలక ఆధారాల సేకరణ?

మద్యం తయారీ కంపెనీలు ఎవరి చేతుల్లోకి నాడు బలవంతంగా వెళ్లాయనేది తేలిన వైనం

తాజా సాక్ష్యాధారాలతో కొత్త కేసు నమోదు

తాడేపల్లి దోపిడీ బాగోతం త్వరలో వెలుగులోకి

వైసీపీ హయాంలో 'జే బ్రాండ్' పేరిట పేదల రక్తాన్ని పీల్చేసి వేల కోట్లు వెనకేసుకున్న తాడేపల్లి ప్యాలెస్‌లో అవినీతి మద్యం కంపు ముక్కుపుటాలు అదిరేలా వస్తోంది.. మద్యం తయారీ మొదలు కొనుగోలు వరకూ... సరఫరా నుంచి విక్రయాల వరకూ.. అన్నీ నాడు జగన్ గ్యాంగ్ గుప్పిట పెట్టుకుంది. ఈ గ్యాంగ్ ఆనాడు సాగించిన అక్రమ దందా వెలికితీసే పనిలో నిమగ్నమైన సీఐడీ మంగళవారం కీలక ముందడుగు వేసింది. మూడు నెలల క్రితం నమోదైన కేసులో సీజ్ చేసిన ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ వాసుదేవ రెడ్డి గదిని సీఐడీ అధికారులు జల్లెడ పట్టారు. అక్కడి ఫైళ్లు, డాక్యుమెంట్లు, కంప్యూటర్లలోని సమాచారాన్ని విశ్లేషించే క్రమంలో 'జే బ్రాండ్' డొంక భారీగా కదిలి నట్టు సమాచారం. బాధ్యులకు సంకెళ్లు వేసేందుకు సీఐడీ అధికారులు సిద్ధమవుతున్నారు.

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

వైసీపీ వందిమాగదుల మద్యం దోపిడీ బయటికి వస్తోంది. ఐదేళ్ల పాటు జగన్ పాలనలో పేదలను దోచిన కుట్రకోణం వెలుగులోకి వస్తోంది.. మద్య నిషేధం హామీతో అధికారంలోకి వచ్చి వెంటనే మాట మార్చిన మోసగాడి గుట్టు బయట పడుతోంది.. స్టార్ హోటళ్లలో తప్ప ఎక్కడా లిక్కర్ లేకుండా చేస్తానంటూ నాసిరకం మద్యాన్ని స్టార్ హోటళ్ల ధరలకు విక్రయించిన వంచకుడి బండారం బయట పడుతోంది. జే బ్రాండుతో పేదల రక్తాన్ని పీల్చేసి వేల కోట్లు వెనకేసుకున్న

మిగతా 11వ పేజీలో...


2

యూనివర్సిటీలకు ఐదేళ్ల యాక్షన్ ప్లాన్

ప్రభుత్వ వర్సిటీలను బలోపేతం చేయాలి

ఖాళీ పోస్టుల భర్తీకి కొత్త నోటిఫికేషన్లు

వచ్చే ఏడాది నుంచి కొత్త కరిక్యులమ్

పీపీపీ విధానంలో ఏఐ వర్సిటీ ఏర్పాటు

రాజధాని అమరావతిలో స్పోర్ట్స్ విలేజ్

ఉన్నత విద్య సమీక్షలో సీఎం చంద్రబాబు

ఆర్టీజీ ద్వారా పౌర సేవలపై వంద రోజుల్లో ప్రత్యేక ప్రాజెక్టు

వరద బాధితులకు పరిహారం నేడు

2

గురుకులాలా ఘోష

గత ఐదేళ్లూ పూర్తిగా నిర్లక్ష్యం.. ఇప్పటికైనా పరిస్థితి మారేనా?

దయనీయంగా పిల్లల మెనూ

కలుషిత ఆహారంతో ఇబ్బందులు

మరుగుదొడ్ల నిర్వహణ అస్తవ్యస్తం

వేధిస్తున్న టీచర్ల కొరత, పర్యవేక్షణ నిల్

తగ్గిన అడ్మిషన్లు, ఫలితాలు అంతంతే

సంక్షేమ హాస్టళ్లు మరీ అధ్వానం

ప్రక్షాళన చేయాలని తల్లిదండ్రుల వినతి

ఒకరోజు నాటి సీఎం కార్యాలయ అధికారి ధనుంజయరెడ్డి 'రేపు ఉన్నత విద్యపై సమీక్ష పెట్టుకుందామా?' అని కొంతమంది అధికారులు ఉన్నప్పుడు అప్పటి సీఎం జగన్‌రెడ్డిని అడిగారు. 'ఉన్నత విద్యపై సమీక్షా? ఆ సమీక్ష చేస్తే ఓట్లు వస్తాయా?' అని జగన్ ప్రశ్నించగా.. 'రావు' అని ధనుంజయరెడ్డి నసిగారు. జగన్ వెంటనే.. 'పోనీ నోట్లు.. అంటే డబ్బులు వస్తాయా?' అని ప్రశ్నించారు. కీలకమైన విద్యపైనా డబ్బులు ఎలా దండుకోవాలి అనే ఆలోచన చేసిన నాటి పాలకుడి నేతృత్వంలో విద్యా వ్యవస్థ ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. గురుకులాలు, హాస్టళ్ల పరిస్థితి అయితే ఇక చెప్పనే అక్కర్లేదు!

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఓ వెలుగు వెలిగిన సంక్షేమ గురుకులాలు, హాస్టళ్ల పరిస్థితి దయనీయంగా తయారైంది. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యం చేయడం, నిర్వహణను గాలికి వదిలేయడం, తగిన నిధులు కేటాయించకపోవడంతో అస్తవ్యస్తంగా తయారయ్యాయి. సంక్షేమ గురుకులాల్లో మెనూ దారుణంగా తయారైంది. అక్కడక్కడా విద్యార్థులు కలుషిత ఆహారం తిని అనారోగ్యం పాలవుతున్నారు. హాస్టళ్లలో మరుగుదొడ్ల నిర్వహణ సరిగా

మిగతా 12వ పేజీలో...



ఆర్.కృష్ణయ్య గుడ్‌బై

రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా.. చైర్మన్ ఆమోదం

సభలో 8కి పడిపోయిన వైసీపీ బలం.. ఇప్పటికే మోపిదేవి, బీద గుడ్‌బై

కోరి తెచ్చుకున్నవారంతా జగన్‌కు దూరం.. మరికొందరూ లైన్లో!

అమరావతి/న్యూఢిల్లీ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బీసీ సంఘం నాయకుడు, వైసీపీ తరపున రాజ్యసభకు ఎన్నికైన తెలంగాణ నేత ఆర్.కృష్ణయ్య తన పదవికి రాజీనామా చేశారు. సోమవారమే రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌ను కలిసి రాజీనామా లేఖ అందజేయగా.. చైర్మన్ మంగళవారం ఆమోదం తెలిపారు. పదవీ కాలం ఇంకా నాలుగేళ్లు ఉండగానే కృష్ణయ్య రాజీనామా చేశారు. వైసీపీ ఘోర పరాజయం తర్వాత ఆ పార్టీని వీడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. ఇటీవలే

మిగతా 12వ పేజీలో...



రఘురామ కేసులో.. విజయపాల్‌కు హైకోర్టు షాక్

సీఐడీ మాజీ ఏఎస్పీ ముందస్తు బెయిల్ పిటిషన్ కొట్టివేత

పౌరుల స్వేచ్ఛ హరించేందుకు అధికారులకు లైసెన్స్ ఇవ్వలేదు

విజయపాల్‌పై ఆరోపణలు చాలా తీవ్రమైనవి

ఆయన్ను విచారించాల్సిన అవసరం ఉంది.. న్యాయమూర్తి స్పష్టీకరణ



అమరావతి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సీఐడీ మాజీ అదనపు ఎస్పీ విజయపాల్‌కు హైకోర్టు షాక్ ఇచ్చింది. సీఐడీ కస్టడీలో తనను చిత్రహింసలకు గురిచేశారని టీడీపీ ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు నమోదు చేసిన హత్యాయత్నం కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేసేందుకు నిరాకరించింది. విజయపాల్‌పై వచ్చిన ఆరోపణలు ఆందోళనకరమైనవి, తీవ్రమైనవని తెలిపింది. రఘురామపై

మిగతా 12వ పేజీలో...

ట్రాములకు టాటా

సేవలను నిలిపివేయాలని నిర్ణయించిన బెంగాల్ సర్కారు



కోల్‌కతా, సెప్టెంబరు 24: కోల్‌కతా వారసత్వ ప్రతీకగా పేరొందిన 'ట్రాము' సర్వీసులను నిలిపివేయాలని బెంగాల్ ప్రభుత్వం నిర్ణయించింది. మిగతా వాహనాలతో పోలిస్తే ట్రాములు నెమ్మదిగా నడవడంతో రోడ్లపై రద్దీ పెరుగుతోందని, ప్రజలు వేగవంతమైన రవాణా సదుపాయాలు కోరుకుంటున్న ఈ సమయంలో వాటిని ఇంకా కొనసాగించడం సరికాదని, అందుకే ఆ సర్వీసులను నిలిపివేయాలని నిర్ణయించామని బెంగాల్ రవాణా మంత్రి స్నేహాశీస్ వెల్లడించారు. అయితే, మైదాన్-ఎస్ప్లనేడ్ మార్గంలో మాత్రం ట్రాము సేవలు కొనసాగుతాయమన్నారు. ప్రస్తుతం దేశంలో కేవలం ఒక్క కోల్‌కతాలోనే ట్రాములు నడుస్తున్నాయి. బ్రిటిష్ హయాంలో 1873లో ఇక్కడ మొదట గుర్రాలతో నడిచే ట్రాములు ప్రారంభమయ్యాయి. తర్వాత ఇంజన్లు వచ్చాయి. అయితే, ట్రాము సర్వీసులను నిలిపివేయాలన్న నిర్ణయానికి వ్యతిరేకంగా ఆందోళనలు నిర్వహించడానికి ట్రాము ప్రేమికులు సిద్ధం అవుతున్నారు. మరోవైపు, ట్రాముల నిర్వహణపై కలకత్తా హైకోర్టులో పిల్ పెండింగ్‌లో ఉంది. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంలో వీటిని నడిపే అవకాశాలను పరిశీలించాలని హైకోర్టు ఇటీవల రాష్ట్రప్రభుత్వానికి సూచించింది.

ఆరేళ్ల బాలికపై ప్రిన్సిపాల్ అత్యాచార యత్నం

- ప్రతిఘటించడంతో గొంతు నులిమి హత్య

అహ్మదాబాద్, సెప్టెంబరు 24: ఒకటో తరగతి చదువుతున్న ఆరేళ్ల బాలికను పాఠశాల ప్రిన్సిపాల్ గోవింద్ నాట్(55) ఆయన కారులోనే అత్యాచారయత్నం చేశాడు. ఆమె ప్రతిఘటించి కేకలు వేయడంతో గొంతు నులిమి చంపేశాడు. గుజరాత్‌లోని దహోద్ జిల్లా శింగ్‌వాడ్ తాలూకా తురానీ గ్రామంలో గత గురువారం జరిగిందీ దారుణం. శవాన్నిప్రహరీ పక్కన ఉన్న చెట్ల పొదల్లే పడేశాడు. బూట్లు, బ్యాగును తరగతి గది వద్ద పెట్టాడు. ప్రిన్సిపాల్‌పై పోక్సో, బీఎన్ఎస్‌లోని పలు సెక్షన్ల కింద కేసు పెట్టి అరెస్టు చేశారు.

నర్సింగ్ విద్యార్థినిపై గ్యాంగ్ రేప్

చెన్నై, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని దిండుగల్‌లో నర్సింగ్ విద్యార్థినిపై సామూహిక అత్యాచారం జరిగింది. దుండగులు సోమవారం సాయంత్రం ఆమెను దుండిగల్ రైల్వేస్టేషన్ వద్ద అపస్మారక స్థితిలో వదిలివెళ్లారు. బాధితురాలు తేనికి చెందిన విద్యార్థినిగా పోలీసులు గుర్తించారు. ఆస్పత్రిలో చేర్పించి, చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

లోకం తీరు



లెబనాన్‌పై గాజా తరహా దాడులు!

- రెండ్రోజుల ఇజ్రాయెల్ బాంబింగ్‌లో 15 మందిదాకా టాప్ కమాండర్ల మృతి
- పౌరుల ఇళ్లలో క్షిపణులున్న వీడియోలను విడుదల చేసిన ఇజ్రాయెల్
- లెబనాన్‌లో 558కి పెరిగిన మరణాలు
- మా యుద్ధం హిజ్బుల్లాపైనే: నెతన్యాహు

టెల్‌అవీవ్/బీరుట్, సెప్టెంబరు 24: మూడు వేలకు పైగా పేజర్ బాంబుల బీభత్సం.. ఆ మర్నాడే వందల సంఖ్యలో వాకీటాకీల పేలుళ్లు.. ఈ దారుణాలు జరిగి వారం గడవక ముందే.. వందల క్షిపణులతో ముప్పేట దాడులు..! వెరసి లెబనాన్‌లో ప్రజాజీవనం అస్తవ్యస్తంగా మారిపోయింది. హమాస్ దాడుల తర్వాత గాజాపై వ్యూహాత్మకంగా దాడులు జరిపిన ఇజ్రాయెల్.. ఇప్పుడు లెబనాన్ విషయంలోనూ అలాంటి పద్ధతులనే అనుసరిస్తోంది. తొలుత హమాస్ ఉగ్రవాదులకు పౌరులు ఆశ్రయం ఇస్తున్నారని, పౌరుల ఇళ్ల కింద నుంచి హమాస్ సొరంగాలున్నాయని అప్పట్లో ఆరోపించిన ఇజ్రాయెల్.. ఇప్పుడు లెబనాన్‌లో పౌరుల ఇళ్లలో హిజ్బుల్లా క్షిపణులు, రాకెట్ లాంచర్లు ఉన్నట్లు వెల్లడించింది. "మా యుద్ధం లెబనాన్ పౌరులపై కాదు. హిజ్బుల్లా ఉగ్రవాదులు మాత్రమే మా లక్ష్యం. లెబనాన్ వ్యాప్తంగా పౌరుల ఇళ్లలో హిజ్బుల్లా క్షిపణులను, రాకెట్ లాంచర్లను దాచిన విషయాన్ని గుర్తించాం. వాటిల్లో గైడెడ్ క్షిపణులు కూడా ఉన్నాయి. ఆ ఇళ్లను టార్గెట్‌గా చేసుకుంటున్నాం. దయచేసి పౌరులంతా సముద్ర తీరానికి వెళ్లగలరు" అని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు సోమవారం లెబనాన్ పౌరులకు ఓ సందేశాన్నిచ్చారు. ఆ తర్వాత కాసేపటికి ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) అధికారులు పౌరుల ఇళ్లలో క్రూయిజ్ క్షిపణులు, వార్‌హెడ్ల నిల్వల వీడియోలను విడుదల చేశారు. లెబనాన్‌లో మరణాల సంఖ్య 558కి చేరుకున్నట్లు లెబనాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. కాగా, "రోజుకు 3 వేలకు పైగా లక్ష్యాలను ఛేదించగల సామర్థ్యం మా వైమానిక దళానికి ఉంది. సోమవారం ఒక్కరోజే 1,600 లక్ష్యాలను టార్గెట్‌గా చేసుకున్నాం" అని ఐడీఎఫ్ అధికారులు పేర్కొన్నారు. దహియాలో హిజ్బుల్లా క్షిపణి విభాగం చీఫ్ ఇబ్రహీం కబిసీ టార్గెట్‌గా జరిపిన దాడుల్లో పది దాకా అపార్ట్‌మెంట్లు కుప్పకూలగా.. ఇబ్రహీంతోపాటు.. హిజ్బుల్లా అనుబంధ సంస్థ లెబనాన్ నెట్‌వర్క్ చీఫ్ అల్-మయాదీన్, మరో 13 మంది కమాండర్లు చనిపోయినట్లు అధికారులు ప్రకటించారు. బీరుట్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌పై దాడిలో హిజ్బుల్లా 910 యూనిట్ కమాండర్ తలాల్ హమియా మృతిచెందినట్లు తెలిపారు. ఎలికిమ్ రీజియన్‌లోని పలు నగరాలు, గ్రామాలు, బెక్కా రీజియన్‌లో ఇళ్లు, అపార్ట్‌మెంట్లు నేలమట్టమై.. మొండిగోడలు కనిపిస్తున్నాయి. రెండ్రోజుల దాడుల్లో దాదాపు 1,700 చదరపు కిలోమీటర్ల మేర ప్రభావం కనిపించిందని ఉపగ్రహ చిత్రాలు స్పష్టం చేస్తున్నాయి. బీరుట్ సహా.. దక్షిణ లెబనాన్‌కు చెందిన పలు పట్టణాల ప్రజలు రాత్రికిరాత్రే సముద్ర తీరప్రాంతాలు సిడోన్, బాల్‌బెక్‌కు చేరుకున్నారు. అక్కడ హోటల్ గదులకు డిమాండ్ పెరగడంతో.. నిర్వాహకులు అద్దెలను పెంచేశారు. వాహనాల ఇంధనం, బేకరీల్లో ఆహార ఉత్పత్తులు నిండుకున్నాయి. ఒకట్రెండ్రోజుల్లో ఆకలికేకలు మొదలవుతాయని ఐక్య రాజ్య సమితి(ఐరాస) ఆందోళన వ్యక్తం చేస్తోంది.

చైనా, భారత్ మధ్య నలిగిపోం

- శ్రీలంక అధ్యక్షుడు దిసనాయకే వ్యాఖ్య
- ప్రధానిగా హరిణి అమరసూర్య ప్రమాణం

కొలంబో, సెప్టెంబరు 24: చైనా, భారత్ మధ్య నలిగిపోదలుచుకోలేదని శ్రీలంక నూతన అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే అన్నారు. చైనా, భారత్‌లు రెండూ శ్రీలంకకు విలువైన స్నేహితులేనని, ఇరు దేశాలతోనూ సత్సంబంధాలు కొనసాగిస్తామన్నారు. కాగా, శ్రీలంక నూతన ప్రధానిగా హరిణి అమరసూర్య నియమితులయ్యారు. మంగళవారం ఆమెతో దిసనాయకే ప్రమాణ స్వీకారం చేయించారు. హక్కుల కార్యకర్తగా, యూనివర్సిటీ అధ్యాపకురాలిగా గుర్తింపు పొందిన హరిణి (58).. శ్రీలంక చరిత్రలో మూడో మహిళా ప్రధాని. మరో ఇద్దరు ఎన్‌పీపీ నేతలు మంత్రులుగా నియమితులయ్యారు. మొత్తం నలుగురితో క్యాబినెట్ కొలువుదీరింది.

ఇసుక లారీలకు డిపాజిట్ మినహాయింపు

అమరావతి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఇసుక లారీల యజమానులు గనుల శాఖ వద్ద ఎంప్యానల్ చేసుకోవడానికి ఫిక్స్‌డ్ డిపాజిట్, అఫిడవిట్ సమర్పించాలన్న నిబంధనల నుంచి మినహాయింపు ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఈమేరకు లారీ యజమానుల సంఘం ప్రతినిధులకు ప్రభుత్వం హామీ ఇచ్చింది. సవరించిన నిబంధనలతో బుధవారం ఉత్తర్వులు జారీ చేస్తామని తెలిపింది. నిబంధనలు మార్చాలని, రవాణా చార్జీలు పెంచాలని, ఫిక్స్‌డ్ డిపాజిట్, అఫిడవిట్‌ల సమర్పణ వంటి అంశాలను ఎత్తివేయాలని డిమాండ్‌చేస్తూ ఇసుక లారీలు గత కొద్దిరోజులుగా లోడింగ్, అన్‌లోడింగ్ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నాయి. దీంతో ఇసుక సరఫరాలో ప్రతిష్ఠంభన ఏర్పడింది. ఈ పరిస్థితిపై గనుల శాఖ స్పందించింది. సవరించిన ఉత్తర్వులు బుధవారం ఇస్తామని మంత్రి కొల్లు రవీంద్ర చెప్పారు. ఇసుక రవాణాలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని సూచించారు.

దీర్ఘకాల సమస్యల్ని పరిష్కరించండి

- సరిపడా సిబ్బంది, ఖర్చులకు నిధులు ఇవ్వాలి
- మంత్రి అనగానిని కోరిన రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్

అమరావతి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖకు సరిపడా సిబ్బంది, నిధులు, మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసి, ఉద్యోగులు పనిచేసే వాతావరణం కల్పించాలని రాష్ట్ర రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రెవెన్యూ మంత్రిని కోరింది. మంగళవారం అమరావతి సచివాలయంలో రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి రామిశెట్టి వెంకట రాజేష్ ఇతర ప్రతినిధులు కలిశారు. రెవెన్యూ శాఖలో దీర్ఘకాలంగా పరిష్కారం కాని సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రెవెన్యూ శాఖ వినియోగించే వెబ్‌సైట్లు, యాప్‌లు, ఇతర ఆన్‌లైన్ సేవలకు సంబంధించి, ఉద్యోగులందరికీ సాంకేతిక పరిజ్ఞానంపై ఎప్పటికప్పుడు శిక్షణ ఇవ్వాలని, నూతన చట్టాలు, ప్రభుత్వ నిబంధనలపై కనీస అవగాహన కల్పించాలని కోరారు. గతంలో జిల్లా కలెక్టరేట్లలో 155 మంది సిబ్బంది ఉంటే... కొత్త జిల్లాల కలెక్టరేట్లలో సగంమందైనా లేరని, రికార్డు అసిస్టెంట్లతో సహా పూర్తి స్థాయిలో సిబ్బంది నియామకాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. తహసీల్దార్ కార్యాలయాల నిర్వహణ ఖర్చులకు తగినంత నిధులు, అద్దె వాహనాల నిర్వహణ వ్యయాన్ని ఇవ్వాలని, కోర్టు కేసుల్లో కౌంటర్లు దాఖలు, తదితర అవసరాలకు బడ్జెట్ ఇవ్వాలని కోరారు. తమ వినతిపై మంత్రి సానుకూలంగా స్పందించారని అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు చెప్పారు.

మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మికి ఉద్వాసన

అమరావతి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మికి ప్రభుత్వం ఉద్వాసన పలికింది. చైర్‌పర్సన్‌గా ఆమె పదవీ కాలం 2024 ఆగస్టు 25నాటికి ముగిసినట్టు మెమోలో పేర్కొంది. గతంలో ఆ పదవిలో ఉన్న వాసిరెడ్డి పద్మ రాజీనామాతో ఆ స్థానంలో వైసీపీ ప్రభుత్వం వెంకటలక్ష్మిని నియమించింది. సెక్షన్ 6(1) నిబంధన ప్రకారం నియామకం జరిగినందున వాసిరెడ్డి పద్మ మిగిలిన కాలానికి మాత్రమే ఆమె నియామకం వర్తిస్తుందని ప్రభుత్వం నిర్ధారించింది. ఆగస్టుతో పదవీ కాలం ముగిసిన వెంకటలక్ష్మిని తప్పిస్తూ రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమశాఖ కార్యదర్శి సూర్యకుమారి మెమో జారీచేశారు.

కర్ణాటక సీఎంకు హైకోర్టు షాక్

ముడా స్కాంలో సిద్దరామయ్య ప్రాసిక్యూషన్‌కు సమర్థన

- గవర్నర్ అనుమతిని సవాల్ చేస్తూ సీఎం వేసిన పిటిషన్ కొట్టివేత
- సిద్ధూ రాజీనామాకు బీజేపీ డిమాండ్
- నేడు కాంగ్రెస్ శాసనసభాపక్ష భేటీ

తన అధికారిక నివాసం కావేరి వద్ద విలేకరులతో మాట్లాడుతున్న సిద్దరామయ్య



బెంగళూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): కర్ణాటక సీఎం సిద్దరామయ్యకు హైకోర్టు షాక్ ఇచ్చింది. మైసూర్ పట్టణాభివృద్ధి సంస్థ(ముడా) ఇంటి స్థలాల కేటాయింపు కుంభకోణంలో సీఎంను ప్రాసిక్యూట్ చేసేందుకు గవర్నర్ అనుమతి ఇవ్వడాన్ని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం సమర్థించింది. గవర్నర్ ఇచ్చిన అనుమతిని సవాల్ చేస్తూ సిద్దరామయ్య వేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. సిద్దరామయ్య భార్య పార్వతి అక్రమమార్గంలో ముడా నుంచి 14 ఇంటి స్థలాలు పొందారని, ఆమె నుంచి ముడా సేకరించిన భూమి కంటే వీటి విలువ ఎన్నో రెట్లు అధికమని సామాజిక కార్యకర్త టీజే అబ్రహం, ప్రదీప్‌కుమార్, స్నేహమయి కృష్ణ గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన గవర్నర్.. సీఎంను ప్రాసిక్యూట్ చేసేందుకు అనుమతి ఇచ్చారు. గవర్నర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ సీఎం సిద్దరామయ్య హైకోర్టులో వేసిన పిటిషన్‌పై జస్టిస్ ఎం.నాగప్రసన్న నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం నెలరోజులపాటు విచారించి మంగళవారం తీర్పు ఇచ్చింది. సిద్దరామయ్య పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది. సీఎం ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతించడం సమంజసమైనదని తీర్పులో స్పష్టం చేసింది. సీఎం కుటుంబసభ్యులు లబ్ధి పొందిన విషయం కావడంతో విచారణ జరగాలని న్యాయమూర్తి పేర్కొన్నారు. సీఎం సిద్దరామయ్యకు వ్యతిరేకంగా హైకోర్టులో తీర్పు రావడంతో కర్ణాటక రాజకీయాలలో కలకలం ఏర్పడింది. బెంగళూరు నగర పర్యటనలో ఉన్న సిద్దరామయ్య హుటాహుటిన అధికారిక నివాసం కావేరికి చేరుకున్నారు. ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, మంత్రులు ఎంబీ పాటిల్, శివరాజ్ తంగడిగి, కృష్ణబైరేగౌడ, భైరతి సురేశ్ తదితరులు కూడా హుటాహుటి కావేరికి చేరుకున్నారు. ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా కావేరికి చేరుకుంటున్నారు. ఓ సదస్సులో పాల్గొనేందుకు ఢిల్లీకి వెళ్లిన శాసనసభ స్పీకర్ యూటీ ఖాదర్ కూడా బెంగళూరుకు బయల్దేరినట్లు సమాచారం. హైకోర్టు తీర్పు మేరకు సీఎం ప్రాసిక్యూషన్‌ను ఎదుర్కోవాల్సిన పరిస్థితి రావడంతో కాంగ్రెస్ అధిష్ఠానం స్పందించింది. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అండగా ఉంటామని సూర్జేవాలా భరోసా ఇచ్చారు. న్యాయపోరాటానికి సిద్ధం కావాలని సూచించారు. తద్వారా రాజీనామా చేయాల్సిన అవసరం లేదని అధిష్ఠానం పరోక్షంగా సందేశమిచ్చింది.

నేడు హైకోర్టు లేదా సుప్రీంలో పిటిషన్..

సిద్దరామయ్య పిటిషన్‌ను హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం తిరస్కరించడంతో ఆయన హైకోర్టు ఉన్నత ధర్మాసనం లేదా సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశం ఉంది. ఏకసభ్య ధర్మాసనం తీర్పు అనంతరం సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి, మరో సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్‌తో ఫోన్‌లో చర్చించారు. ఈ తీర్పును సవాలు చేస్తూ సాధ్యమైనంత త్వరగా పిటిషన్ దాఖలు చేయాలని భావిస్తున్నట్టు సమాచారం. సిద్దరామయ్య తరఫున బుధవారం పిటిషన్ వేసే అవకాశం ఉందని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. కాగా, హైకోర్టు తీర్పు నేపథ్యంలో సీఎం అధికారిక నివాసం 'కావేరి' వద్ద భారీగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఎం రాజీనామా కోరుతూ మైసూరులో బీజేపీ కార్యకర్తలు ఆందోళనలు నిర్వహించారు.

తప్పు చేయలేదు: సిద్ధూ

ముడా ఇంటి స్థలాల విషయంలో తాను ఎటువంటి తప్పూ చేయలేదని సిద్దరామయ్య చెప్పారు. న్యాయవ్యవస్థపైనా, రాజ్యాంగంపైనా తనకు నమ్మకం ఉందని, న్యాయ పోరాటం చేస్తానని చెప్పారు. అంతిమ విజయం సత్యానిదేనన్నారు. సీఎం పదవికి రాజీనామా చేసే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావాలనే దురాలోచనతో కుట్ర పన్నారని, గవర్నర్ రాజకీయ నిర్ణయం తీసుకున్నారని ఆరోపించారు. బీజేపీవి ప్రతీకార రాజకీయాలని ఆరోపించారు. తాజా రాజకీయ పరిస్థితులపై బుధవారం ఉదయం 10 గంటలకు కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ అత్యవసర సమావేశం ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు.



హరియాణా యువత ఎందుకు 'డంకీ'లవుతున్నారు?

- బీజేపీకి రాహుల్‌గాంధీ ప్రశ్న

న్యూఢిల్లీ, సెప్టెంబరు 24: దేశంలో యువతకు ఉపాధి లేకుండా చేసి వారికి బీజేపీ తీరని అన్యాయం చేస్తోందని రాహుల్‌గాంధీ ఆరోపించారు. ఫలితంగా హరియాణా వంటి రాష్ట్రాల్లో యువత విదేశాల బాటపట్టి తీవ్రమైన కష్టాలు ఎదుర్కొంటున్నారని వాపోయారు. ఇటీవల ఆయన అమెరికా వెళ్లినప్పుడు హరియాణా నుంచి అమెరికా వలస వెళ్లినవారితో మాట్లాడిన వీడియోను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. హరియాణాలో ఉపాధి దొరకనందునే తాము అమెరికా వలస వచ్చి కష్టాలు పడుతున్నట్లు వారు రాహుల్‌గాంధీకి చెప్పారు. "హరియాణా యువత ఎందుకు డంకీలుగా మారుతున్నారు..?" అని రాహుల్‌గాంధీ 'ఎక్స్'లో పెట్టిన తన పోస్టులో ప్రశ్నించారు. అక్రమ వలసదారులపై షారుక్‌ఖాన్ నటించిన డంకీ సినిమాతో ఈ పదం జనం నానుడిలోకి వచ్చింది. "బీజేపీ తెచ్చిన నిరుద్యోగ సమస్యతో లక్షలాది మంది తమవారికి దూరంగా విదేశాల్లో కష్టాలు పడుతున్నారు" అని ఆరోపించారు. తాను తిరిగి స్వదేశానికి వచ్చాక హరియాణాలో వారి కుటుంబాలను కలిసినప్పుడు వారి కళ్లలో ఎంతో వేదన కనిపించిందన్నారు. పదేళ్లలో దేశ యువతకు బీజేపీ తీవ్రమైన అన్యాయం చేసిందన్నారు. హరియాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఆ రాష్ట్రంలోని యువత విదేశాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి లేకుండా చేస్తామని, ఇది తమ నిర్ణయమని స్పష్టం చేశారు.

ప్రధాని, రాష్ట్రపతి హిందువులు కాదు!

- అందుకే గోహత్యను నిషేధించటం లేదు
- హిందువుల పవిత్రతను దెబ్బ తీయడానికే తిరుపతి లడ్డూ కల్తీ: అవిముక్తేశ్వరానంద్



లక్నో, సెప్టెంబరు 24: నిర్మాణమే పూర్తి కాని అయోధ్య రామాలయంలో విగ్రహ ప్రాణప్రతిష్ఠ పూజలు ఏమిటని ప్రశ్నించి అప్పట్లో మోదీ ప్రభుత్వాన్ని ఇరుకునపెట్టిన జ్యోతిర్‌మఠ్ శంకరాచార్య అవిముక్తేశ్వరానంద్ సరస్వతి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. దేశంలో గోహత్యను నిలిపివేయని ప్రధాని, రాష్ట్రపతి అసలు హిందువులే కాదన్నారు. ఇప్పటి వరకూ ఆ అత్యున్నత పదవులను అధిష్ఠించిన వారెవరూ హిందువులు కాదని, కాబట్టే, దేశంలో గోహత్య ఇప్పటికీ కొనసాగుతోందని విమర్శించారు. యూపీలో మహంత్ యోగి సీఎంగా ఉన్నప్పటికీ.. గొడ్డు మాంసం(బీఫ్) ఎగుమతులు ఆ రాష్ట్రం నుంచే అత్యధికంగా ఉన్నాయన్నారు. తిరుపతి లడ్డూ వివాదంపై శంకరాచార్య స్పందిస్తూ.. గొడ్డు కొవ్వు కలిగి ఉన్న ప్రసాదాన్ని కోట్లాదిమంది భక్తులకు పంచటం విచారకరమన్నారు. హిందువుల పవిత్రతను దెబ్బతీసే కుట్ర అని వ్యాఖ్యానించారు. దీనిపై వీలైనంత త్వరగా దర్యాప్తు పూర్తి చేయాలన్నారు.

ఎన్‌ఆర్‌ఐ కోటా.. ఓ మోసం

(మొదటి పేజీ తరువాయి)



ఇచ్చేవారికి దొడ్డి దారిన ప్రవేశాలు కల్పించడానికి ఇది అవకాశం ఇస్తోందని మౌలికంగా వ్యాఖ్యానించింది. చట్టవ్యతిరేకమైన ఈ పద్ధతిని సమర్థించలేమని తెలిపింది. వైద్య కళాశాలల ప్రవేశాల్లో ఎన్.ఆర్.ఐ. కోటాపై పంజాబ్ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌ను కొట్టివేస్తూ పంజాబ్-హరియాణా హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. ఎన్ఆర్ఐ అభ్యర్థికి ఇచ్చిన నిర్వచనాన్ని విస్తరిస్తూ పంజాబ్ ప్రభుత్వం ఆగస్టు 20న నోటిఫికేషన్ ఇచ్చింది. దీని ప్రకారం ఎన్ఆర్ఐల దూరపు బంధువులు కూడా సీట్లు పొందడానికి అర్హులేనని తెలిపింది. తాత, అమ్మమ్మ, నాన్నమ్మ, పెద్దనాన్న, చిన్నాన్న, కజిన్స్ తదితరుల 'సంరక్షణ'లో ఉన్నారన్న కారణం చూపి సీట్లు పొందే అవకాశం ఉంది. అయితే దుర్వినియోగానికి దారి తీస్తుందని పేర్కొంటూ హైకోర్టు దానిని కొట్టివేసింది. ఇది ఎన్ఆర్ఐ కోటా స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని తెలిపింది. విదేశాల్లో ఉన్న ఎన్ఆర్ఐలు భారతదేశంలో తమ పిల్లలను చదివించడానికి ఈ కోటాను ప్రవేశ పెట్టారని గుర్తు చేసింది. నిజమైన ఎన్ఆర్ఐ విద్యార్థులే దీని ప్రయోజనం పొందాల్సి ఉందని స్పష్టం చేసింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వంతో పాటు, మరో ఇద్దరు పిటిషనర్లు సుప్రీంకోర్టులో అప్పీలు చేశారు. ఈ మూడు పిటిషన్లపై సీజేఐ జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రల ధర్మాసనం విచారణ జరిపింది. పంజాబ్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఎన్ఆర్ఐ అభ్యర్థి విషయంలో హిమాచల్ ప్రదేశ్, యూపీ ఇతర రాష్ట్రాలు కూడా ఎప్పటి నుంచో 'విస్తృత నిర్వచనాన్నే' ఉపయోగిస్తున్నాయని తెలిపారు. దీనిపై జస్టిస్ చంద్రచూడ్ స్పందిస్తూ "ఈ వాదనను తిరస్కరిస్తున్నాం. ఈ మోసానికి ముగింపు పెట్టాల్సిన అవసరం ఉంది. హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు సంపూర్ణంగా సరైనవే. ఈ ఎన్ఆర్ఐ కోటా వ్యవహారం మోసం తప్ప ఇంకేమీ కాదు. పంజాబ్ ప్రభుత్వ చర్యలను చూడండి. ఆగస్టు 9న ప్రవేశాల నోటిఫికేషన్ జారీ చేసింది. 19న దాని గడువు ముగిసింది. 20న నోటిఫికేషన్ ఇచ్చి 'సంరక్షకుల' నిర్వచనాన్ని విస్తరించింది. దాని దుష్పరిణామాలను పరిశీలించండి. మూడు రెట్లు అధికంగా వచ్చిన అభ్యర్థులకు సీట్లు రావు. దొడ్డిదారిలో మాత్రం కొందరు ప్రవేశిస్తారు" అని వ్యాఖ్యానించారు. "ఎన్ఆర్ఐల బంధువులను కూడా పరిగణనలోకి తీసుకోవాలని అంటారా? ఇది సొమ్ము పిండుకునే చర్య కాకపోతే ఇదేమిటిది? విద్యా వ్యవస్థను ఏమి చేయాలనుకుంటున్నారు? ఏ కేసును పరిశీలిస్తున్నారో న్యాయమూర్తులకు తెలుసు. అందరికీ తెలిసిన విషయాన్నే హైకోర్టు పరిశీలించింది" అని అన్నారు. నిజమైన ఎన్.ఆర్.ఐ.లకే సీట్లు ఇవ్వాలని, ఈ సందర్భంలోనూ మెరిట్‌ను విస్మరించకూడదంటూ గతంలో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును గుర్తు చేశారు. జస్టిస్ పార్దీవాలా మాట్లాడుతూ "ఈ కోటా కింద దరఖాస్తు చేసిన వారంతా భారతీయులే. పెద్దనాన్న, పెద్దమ్మ, చిన్నాన్న, చిన్నమ్మల వంటి చుట్టరికాల పేర్లు చెప్పి దరఖాస్తు చేస్తున్నార"ని అన్నారు. 'విస్తృత నిర్వచనాన్ని' 'డబ్బు పిండే ఎత్తుగడ'గా ధర్మాసనం వ్యాఖ్యానించింది. అంతకుముందు ఓ పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది అభిమన్యు భండారి వాదనలు వినిపిస్తూ 700 మార్కులకుగాను 637 మార్కులు వచ్చిన అభ్యర్థికి సీటు రాలేదని, కానీ 202 మార్కులు వచ్చిన వారికి ఎన్ఆర్ఐ కోటాలో ప్రవేశం లభించిందని చెప్పారు. పంజాబ్‌లో ప్రతి ఒక్కరికీ ఎన్ఆర్ఐ బంధువులు ఉంటారని, వారి పేరుతో సీట్లు పొందే ప్రమాదం ఉందని తెలిపారు. దీనికి ముగింపు పలకాల్సి ఉందని కోరారు. పంజాబ్‌లోని మెడికల్, డెంటల్ కాలేజీల్లో ఎన్ఆర్ఐ కోటా కింద 185 సీట్లు ఉండడం గమనార్హం.

యూనివర్సిటీలకు ఐదేళ్ల యాక్షన్ ప్లాన్

- ప్రభుత్వ వర్సిటీలను బలోపేతం చేయాలి
- విద్యా ప్రమాణాల్లో ర్యాంకులు మెరుగుపర్చాలి
- ఉన్నత విద్యాశాఖ సమీక్షలో ముఖ్యమంత్రి

అమరావతి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ అసమర్థ విధానాల వల్ల ఉన్నత విద్యారంగం గాడి తప్పిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఈ రంగాన్ని పట్టాలెక్కించి తిరిగి గాడిలో పెట్టేందుకు స్వల్ప, దీర్ఘకాలిక ప్రణాళికలు అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యా ప్రమాణాలు, ఇతర అంశాల్లో యూనివర్సిటీల ర్యాంకులు మెరుగుపరిచేందుకు ఐదేళ్ల కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. మంగళవారం సచివాలయంలో ఉన్నత విద్యాశాఖపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ... రాష్ట్రంలోని ప్రభుత్వ యూనివర్సిటీల బలోపేతంపై దృష్టి పెట్టాలన్నారు. మరోవైపు జాతీయ, అంతర్జాతీయ స్థాయి ప్రైవేటు యూనివర్సిటీలను ప్రోత్సహించాలని, దానివల్ల విద్యారంగంలో అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. యూనివర్సిటీల్లో అధ్యాపకులు, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి కొత్త నోటిఫికేషన్లు జారీచేయాలని ఆదేశించారు. మారుతున్న డిమాండ్‌కు అనుగుణంగా కోర్సులు, కరిక్యులమ్ మార్చాలని, ఇందుకోసం దేశవిదేశాల్లో అధ్యయనం చేసి వచ్చే ఏడాది నుంచి కరిక్యులమ్‌లో మార్పులు చేయాలని ఆదేశించారు. గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో ప్రస్తుతం 36 శాతం ఉందని, దాన్ని 2029 నాటికి 60 శాతానికి పెంచాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని అధికారులు ఈ సందర్భంగా సీఎంకు వివరించారు. విద్యార్థుల సర్టిఫికెట్లు నవంబరులో డీజీలాకర్‌లో పెట్టాలని సీఎం ఆదేశించారు. విద్యార్థులకు జాయింట్ డిగ్రీ ఇచ్చే అంశాన్ని పరిశీలించాలన్నారు. యూనివర్సిటీలకు ప్రస్తుతం ఎనిమిది రకాల చట్టాలున్నాయని, వాటి స్థానంలో ఒకే చట్టం తీసుకురావాలని ఉన్నత విద్యాశాఖ చేసిన ప్రతిపాదనకు సీఎం ఆమోదం తెలిపారు. అలాగే ఐఐటీ, ఐఐఎంలలో మాదిరి యూనివర్సిటీల్లో బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ చైర్‌పర్సన్‌లుగా ప్రముఖ పారిశ్రామికవేత్తలను నియమించాలన్నారు. పీపీపీ విధానంలో ఏఐ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని సీఎం నిర్ణయించారు. టాలెంట్ డెవలప్‌మెంట్ అండ్ ఎడ్యుకేషన్, ప్రమోట్ స్టార్టప్ ఎకో సిస్టం, రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్, గవర్నెన్స్ అండ్ ఎథిక్స్ అంశాల ప్రాతిపదికన యూనివర్సిటీ ఏర్పాటు జరగాలని ఆదేశించారు. కేజీ నుంచి పీజీ వరకు కరిక్యులమ్‌లో మార్పులు రావాలని, దీనికోసం ఓ కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వం యూనివర్సిటీలను రాజకీయ పునరావాస కేంద్రాలుగా మార్చి వాటి ప్రతిష్ఠను దెబ్బతీసిందని, ఇప్పుడు సమూల మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. సమీక్షలో మంత్రి నారా లోకేశ్, ఉన్నతాధికారులు సౌరభ్ గౌర్, పోలా భాస్కర్, గణేష్ కుమార్, రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

ఆర్టీజీ ద్వారా పౌర సేవలపై ప్రత్యేక ప్రాజెక్టు

రియల్ టైం గవర్నెన్స్ ద్వారా పౌరసేవలు, ప్రభుత్వ కార్యక్రమాలు చేపట్టడంపై 100 రోజుల్లో ప్రత్యేక ప్రాజెక్ట్ సిద్ధం చేయాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. అమరావతి సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో ఉన్న రియల్ టైం గవర్నెన్స్ సెంటర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు సందర్శించారు. 2024లో ఎన్నికల్లో గెలిచి అధికారం చేపట్టిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు తొలిసారి మంగళవారం ఆర్టీజీ సెంటర్‌ను సందర్శించారు.

నేడు వరద బాధితులకు పరిహారం

అమరావతి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): విజయవాడలో వరద బాధితులకు రాష్ట్రప్రభుత్వం బుధవారం నష్టపరిహారాన్ని అందించనుంది. సీఎం చంద్రబాబు ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ నుంచి నేరుగా నష్టపరిహారం సొమ్మును బాధితుల ఖాతాల్లో జమ చేయనున్నారు. ఎన్యూమరేషన్ పూర్తి కావడంతో అర్హులైన బాధితులందరికీ వారి ఖాతాల్లో పరిహారం డబ్బులు జమ చేయనుంది. వరదలతో నష్టపోయిన వాహనాలకు బీమా చెల్లింపులు కూడా ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను సీఎం ఆదేశించారు. భారీ వర్షాలతో రాష్ట్రవ్యాప్తంగా 16 జిల్లాల్లో ఆస్తులు, పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. బుడమేరు వరదలకు విజయవాడలో పలుప్రాంతాలు ముంపునకు గురై, ప్రజలు అతలాకుతలమైన విషయం తెలిసిందే.



రూ.కోటి చొప్పున చెక్కులను సీఎం చంద్రబాబుకు అందజేస్తున్న జేఎస్‌ఆర్ ఇన్‌ఫ్రా ప్రతినిధి జె.శేఖర్‌రెడ్డి, హైదరాబాద్ కిమ్స్ చైర్మన్ బొల్లినేని భాస్కరరావు

వరద బాధితులకు విరాళాల వెల్లువ

అమరావతి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): వరద బాధితులకు పలువురు దాతలు సీఎం సహాయ నిధికి విరాళాలు ఇస్తున్నారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ తరఫున ఏసీఏ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్ రూ.కోటి, జేఎస్‌ఆర్ ఇన్‌ఫ్రా ప్రతినిధి జె.శేఖర్‌రెడ్డి రూ.కోటి, హైదరాబాద్ కిమ్స్ చైర్మన్ బొల్లినేని భాస్కరరావు రూ.కోటి, కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ తన నియోజకవర్గంలో సేకరించిన రూ.95 లక్షలు, రాష్ట్ర ప్రైవేట్ స్కూల్స్ తరఫున సేకరించిన రూ.82,49,900 ను ఏపీపీఎస్ఏ డెమోక్రటిక్ సభ్యులు, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ చైర్మన్ ప్రమోద్‌కుమార్ రెడ్డి రూ.40 లక్షలు, నెల్లూరు జిల్లా మత్స్యకారులు రూ.15 లక్షలు, సిటీ సిరి డిజిటల్ నెట్‌వర్క్, కేబుల్ టీవీ ఎంఎస్‌వోలు రూ.15 లక్షలు, విజయవాడ కోఫుడ్స్ ప్రాసెసర్స్ తరఫున బీకే మూర్తి రూ.10 లక్షలు, గన్నవరం డివిజన్‌లో సేకరించిన రూ.9 లక్షలను ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ద్వారా సీఎంఆర్ఎఫ్‌కు, అవనిగడ్డలో సేకరించిన రూ.20లక్షలను ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ ద్వారా బాధితులకు అందజేసినట్లు అక్కడి ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు తెలిపాయి.

27న ఏపీ, కర్ణాటక ఎంవోయూ

» కుంకి ఏనుగులను రప్పించేందుకు ప్రభుత్వ చర్యలు

అమరావతి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మన్యం, చిత్తూరు ప్రాంతాల్లో ఏనుగుల గుంపులు జనవాసాల్లోకి వచ్చి, మనుషులు, జంతువుల ప్రాణాలు తీయడం, పంటలను నాశనం చేస్తుండటంతో ఏనుగుల దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఏనుగుల గుంపులను అరికట్టగల కుంకి ఏనుగులు కర్ణాటకలో ఉన్నాయి. అందువల్ల రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, అటవీశాఖ మంత్రి పవన్‌కల్యాణ్ ఇటీవల బెంగుళూరు వెళ్లి కుంకి ఏనుగులను ఏపీకి రప్పించేలా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్య, అటవీ మంత్రి ఖండ్రేతో చర్చలు జరిపారు. ఏపీకి 8 కుంకి ఏనుగులను ఏపీకి పంపాలని కోరారు. దీనికి సంబంధించి, ఇరు రాష్ట్రాల ప్రతినిధులు, అధికారులు ఈ నెల 27న సమావేశమై, ఒక ఒప్పంద పత్రం(ఎంవోయూ)పై సంతకం చేయనున్నట్లు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ 'ఎక్స్'లో వెల్లడించారు.

మందు లేదు!

(మొదటి పేజీ తరువాయి)

ఆ ప్రకటన చేయగా.. అన్ని బ్రాండ్లూ రావడం మాట అటుంచి.. చాలా షాపుల్లో ఉన్న బ్రాండ్లు కూడా కనిపించకుండా పోయాయి. ముఖ్యంగా పేదలకు అందుబాటులో ఉండే మద్యం అసలే దొరకడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో అత్యంత ఖరీదైన టీచర్స్ బ్రాండ్లు అమ్ముతున్నారు. క్వార్టర్‌కు రూ.200 పెట్టడమే ఎక్కువని వినియోగదారులు గగ్గోలు పెడుతుంటే.. రూ.600 పైగా ధరలున్న బ్రాండ్లు మాత్రమే విక్రయిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో ఏర్పడిన ఈ మద్యం కొరత వల్ల అటు వినియోగదారుల జేబులు చిల్లు పడడంతో పాటు ప్రభుత్వ ఖజానాకూ గండి పడుతోంది. అనేక చోట్ల అతి తక్కువ బ్రాండ్లు మాత్రమే షాపుల్లో ఉండడంతో విక్రయాలు పడిపోతున్నాయి.

కొత్త పాలసీ చూపించి..

ప్రస్తుతం అమల్లో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాల పాలసీని ఎత్తివేసి.. ప్రైవేటు షాపుల పాలసీ తేవాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. కొత్త పాలసీపై ఒకట్రెండు రోజుల్లో నోటిఫికేషన్ కూడా రానుంది. వచ్చే నెల మొదటి వారం నాటికి నూతన విధానం అమల్లోకి వస్తుందని అంటున్నారు. అప్పటి నుంచి ప్రభుత్వ షాపులు ఉండవు కాబట్టి ఈలోగా



వాటిలోని స్టాకు మాత్రమే అమ్మాలని అధికారులు షాపుల్లోని సిబ్బందిని ఆదేశిస్తున్నారు. దీంతో డిపోల నుంచి షాపులకు మద్యం సరఫరా ఆగిపోయింది. స్టాకు లేదని సిబ్బంది చెబుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో రాత్రి వేళల్లో కిటకిటలాడే మద్యం షాపులు వెలవెలబోతున్నాయి. విశాఖపట్నం, విజయవాడ లాంటి నగరాల్లోనూ పరిమితమైన సంఖ్యలోనే బ్రాండ్లు అందుబాటులో ఉంచుతున్నారు.

బార్లకు మేలు చేసేలా..

మద్యం షాపుల్లో తమకు నచ్చిన బ్రాండ్లు దొరక్కపోవడంతో వినియోగదారులు బార్లకు వెళ్తున్నారు. నిబంధనల ప్రకారం బార్లలో కేవలం రెస్టారెంట్‌లోనే మద్యం సర్వ్ చేయాలి. కానీ అందుకు విరుద్ధంగా అనేక చోట్ల బార్ల యాజమాన్యాలు యథేచ్ఛగా సీసాలు బయటకు విక్రయిస్తున్నారు. ఇప్పుడు షాపుల్లో బ్రాండ్లు లేకపోవడం బార్లకు కలిసివస్తోంది. బార్లలో ఒక క్వార్టర్‌పైనే రూ.50 నుంచి రూ.80 అదనంగా వసూలు చేస్తున్నారు. అయితే కొత్త పాలసీని చూపించి ముందుగానే షాపులను ఖాళీ చేయడంపై విమర్శలు వస్తున్నాయి. స్టాకు ఖాళీ చేస్తే ప్రభుత్వ షాపుల్లో లెక్కలు సులభంగా ఉంటాయని, మిగిలిపోయిన స్టాకు వెనక్కి తీసుకెళ్లడం కష్టమని అధికార వర్గాలు భావిస్తున్నాయి. అయితే ఈ కారణాలతో బార్లకు మేలు చేసేలా నిర్ణయం తీసుకోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అధికారుల నిర్లక్ష్య వైఖరి

ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు మద్యం అమ్మకాలపై నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నారు. బదిలీలు, కొత్త పాలసీలపై దృష్టిపెట్టిన వారు.. ప్రస్తుత పాలసీని, అమ్మకాలను గాలికొదిలేశారు. ఎంతసేపూ అంతర్జాతీయ బ్రాండ్లు తెస్తున్నాం.. ధరలు తగ్గిస్తున్నామని ప్రకటనలు చేయడం తప్ప.. కొత్త పాలసీ వచ్చేలోగా ఉన్న పాలసీతో పనిలేదన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. అమ్మకాలు తగ్గిపోవడంతో ఆదాయం పడిపోయే ప్రమాదం కనిపిస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో సగటున నెలకు రూ.2,300 కోట్ల మద్యం విక్రయాలు జరుగుతున్నాయి.సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో ఈ మార్కును చేరుకోవడం కష్టంగానే కనిపిస్తోంది. షాపుల్లో మద్యం కొరతపై ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ నిశాంత్‌కుమార్‌ను వివరణ కోరే ప్రయత్నం చేయగా ఆయన అందుబాటులోకి రాలేదు. శాఖ డైరెక్టర్‌గా ఉన్న ఆయనే బేవరేజెస్ కార్పొరేషన్ ఇన్‌చార్జి ఎండీగా వ్యవహరిస్తున్నారు. కార్పొరేషన్ అధికారులు కూడా దీనిపై స్పందించడం లేదు. మొత్తంగా అధికారుల తీరుతో ప్రభుత్వ ఖజానాకు రావలసిన ఆదాయం పక్కదారి పడుతోంది.

ఈడీ కేసులో కోర్టుకు హాజరైన జేసీ



జేసీ ప్రభాకర్‌రెడ్డి

విశాఖపట్నం (లీగల్) సెప్టెంబరు 24: నంబరు ప్లేట్ల మార్పిడి అభియోగంపై ఈడీ నమోదు చేసిన కేసులో ప్రధాన నిందితుడు జేసీ ప్రభాకరరెడ్డి సహా మరో 14 మంది మంగళవారం విశాఖ ప్రధాన మెట్రోపాలిటన్ సెసన్స్ జడ్జి కోర్టులో హాజరయ్యారు. నిందితుల నుంచి న్యాయమూర్తి ఎం.వెంకటరమణ పూచీకత్తులు స్వీకరించారు. అనంతరం కేసును నవంబరు 8కి వాయిదా వేశారు. బెంగళూరుకు చెందిన పాత లారీలను కొనుగోలు చేసి, ఒకే నంబరుతో రెండు, మూడింటిని నడపడం వల్ల పన్ను రూపేణా ప్రభుత్వానికి నష్టం కలిగినట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రెండేళ్ల క్రితం జేసీ దివాకరరెడ్డి, మరో 14 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేసింది.

ఉత్తరాఖండ్ హైకోర్టు సీజేగా జస్టిస్ నరేందర్!

» కేంద్రానికి సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు



అమరావతి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ జి.నరేందర్ నియామకానికి సుప్రీంకోర్టు కొలీజియం మంగళవారం కేంద్రానికి సిఫారసు చేసింది. ఏపీ హైకోర్టులో న్యాయమూర్తిగా ఉన్న ఆయన్ను పదోన్నతిపై ఉత్తరాఖండ్ హైకోర్టు సీజేగా నియమించాలని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని కొలీజియం తీర్మానం చేసింది. జస్టిస్ జి.నరేందర్ 2023 అక్టోబరులో బదిలీపై కర్ణాటక హైకోర్టు నుంచి ఏపీ హైకోర్టుకు వచ్చారు. ప్రస్తుతం ఏపీ హైకోర్టు జడ్జీల సీనియార్టీలో ఆయన రెండో స్థానంలో ఉన్నారు. కర్ణాటక నుంచి హైకోర్టు సీజేగా ప్రస్తుతం ఎలాంటి ప్రాతినిధ్యం లేనందున జస్టిస్ నరేందర్‌ను ఉత్తరాఖండ్ సీజేగా సిఫారసు చేస్తున్నట్లు కొలీజియం వెల్లడించింది. ప్రస్తుతం ఉత్తరాఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ రీతూ బారీ అక్టోబరు 10న పదవీ విరమణ చేయనున్నారు. జస్టిస్ నరేందర్ 1964 జనవరి 10న తమిళనాడులో జన్మించారు. బీఏ, ఎల్ఎల్‌బీ పూర్తిచేసిన ఆయన 1989 ఆగస్టు 23న తమిళనాడు బార్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకున్నారు. 1989 నుంచి 1992 వరకు మద్రాసు హైకోర్టులో ప్రాక్టీస్ చేశారు. 1993లో తన ప్రాక్టీస్‌ను కర్ణాటకకు మార్చుకొని అక్కడ బార్ కౌన్సిల్‌లో రిజిస్టర్ అయ్యారు. ఓబీసీ వర్గానికి చెందిన జస్టిస్ నరేందర్ 2015 జనవరి 2న కర్ణాటక హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2017లో శాశ్వత న్యాయమూర్తి అయ్యారు.

స్టీల్ ప్లాంటులో ప్రమాదం

» సీనియర్ మేనేజర్‌పై పడిన ద్రవ ఉక్కు

» తీవ్ర గాయాలు.. ఆస్పత్రికి తరలింపు

ఉక్కుటౌన్‌షిప్ (విశాఖపట్నం), సెప్టెంబరు 24: విశాఖ ఉక్కు కర్మాగారంలోని స్టీల్ మెల్ట్ షాప్ (ఎస్ఎంఎస్)-1లో మంగళవారం సంభవించిన ప్రమాదంలో సీనియర్ మేనేజర్ సీహెచ్.మల్లేశ్వరరావు (53) తీవ్రంగా గాయపడ్డారు. ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలుకు చెందిన మల్లేశ్వరరావు స్టీల్ ప్లాంటులో సీనియర్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. మంగళవారం ప్లాంటులోని ఎస్ఎంఎస్ విభాగంలో విధి నిర్వహణలో ఉన్నారు. ఆ విభాగంలో కదులుతున్న స్టీల్ ట్రాన్స్‌ఫర్ కార్ (ఎస్‌టీసీ) నుంచి ద్రవ రూప ఉక్కు (లిక్విడ్ స్టీల్) కొంతమేర ఒలికి కిందనున్న ఆయనపై పడింది. తీవ్రంగా గాయపడిన మల్లేశ్వరరావును హుటాహుటిన ఉక్కు జనరల్ ఆస్పత్రికి అక్కడ నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. స్టీల్‌ప్లాంటు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గాయపడిన సీనియర్ మేనేజర్ మల్లేశ్వరరావు

రెవెన్యూ అవినీతికి రైతు బలి

» పాస్‌బుక్ ఇవ్వకుండా ఏడాది నుంచి తిప్పుకొన్న అధికారులు

» డబ్బులు ముట్టజెబితేనే ఇస్తామంటూ వేధింపులు

» కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో నాలుగు సార్లు అర్జీ.. దక్కని న్యాయం

» అనంతపురంలో పురుగుల మందు తాగి అన్నదాత ఆత్మహత్య

అనంతపురం టౌన్, సెప్టెంబరు 24: అనంతపురం జిల్లాలో రెవెన్యూ అధికారుల అవినీతి దాహానికి ఓ రైతు బలయ్యాడు. వారసత్వంగా వచ్చిన తన భూమికి సంబంధించిన పాస్‌బుక్ ఇవ్వకుండా, లంచం ముట్టచెబితేనే ఇస్తామంటూ వేధింపులకు పాల్పడుతుండటంతో తట్టుకోలేని ఆ రైతు.. ఏకంగా జిల్లా కలెక్టరేట్‌లోనే పురుగుల మందు తాగాడు. అనంతరం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మరణించాడు. వివరాల ప్రకారం.. గార్లదిన్నె మండలం క్రిష్టాపురం గ్రామానికి చెందిన సూర్యనారాయణ(54)కు



రైతు సూర్యనారాయణ మృతదేహం

బూదేడు సర్వే నంబరు 135-1లో 1.54 ఎకరాల భూమి ఉంది. ముగ్గురు అన్నదమ్ముల భాగాల పరిష్కారం తర్వాత ఆయనకు ఈ భూమి వాటాగా వచ్చింది. మిగిలిన ఇద్దరు సోదరులకు పాస్‌బుక్‌లు మంజూరు చేసిన రెవెన్యూ అధికారులు.. సూర్యనారాయణకు మాత్రం పాస్‌బుక్ ఇవ్వకుండా ఏడాదిగా తమ చుట్టూ తిప్పుకున్నారు. డబ్బులు ఇస్తేగానీ పాస్‌బుక్ ఇప్పించేది లేదని వీఆర్‌ఓ మధు అన్నారని, దీంతో తహశీల్దారు కార్యాలయం చుట్టూ తన భర్త పలుమార్లు తిరిగాడని బాధిత రైతు భార్య ఈశ్వరమ్మ కంటతడి పెట్టుకుంది. తన భూమికి పాస్‌బుక్ మంజూరు విషయంపై సూర్యనారాయణ జిల్లా కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో సైతం 3-4 సార్లు అర్జీ ఇచ్చాడు. మరోమారు కలెక్టరేట్‌లోని ప్రజాఫిర్యాదుల విభాగంలో సోమవారం ఫిర్యాదు చేశాడు. ఆ తర్వాత కలెక్టరేట్ ఆవరణలోని ఓ చెట్టుకింద కూర్చొని... ఎన్నాళ్లు తిరిగినా తనకు న్యాయం జరగడం లేదన్న ఆవేదనతో వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగాడు. గమనించిన పోలీసులు వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. విషయం బయటకు పొక్కకుండా సూర్యనారాయణను జిల్లా సర్వజన వైద్యశాలకు తరలించారు. సాయంత్రం 5 గంటలకు రైతు కుటుంబసభ్యులకు పోలీసులు సమచారం ఇచ్చారు. సూర్యనారాయణ భార్య ఈశ్వరమ్మ తన బంధువులతో కలిసి ఆస్పత్రికి చేరుకున్నారు. సూర్యనారాయణ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మరణించారు. రెవెన్యూ అధికారుల అవినీతి కారణంగానే తన భర్త ప్రాణాలు కోల్పోయాడని, తమకు న్యాయం చేయాలని ఈశ్వరమ్మ డిమాండ్ చేశారు. వీఆర్‌ఓపై చర్యలు తీసుకోవాలని, అప్పటి వరకు పోస్టుమార్టం చేయడానికి వీలులేదని రైతు బంధువులు ఆందోళన చేశారు. అనంతపురం ఆర్డీఓ వసంతబాబు ఆస్పత్రికి వచ్చి బాధితులతో మాట్లాడారు. న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో బాధితులు శాంతించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమృత్ పథకం అమలుకు కొత్త టాస్క్‌ఫోర్స్

అమరావతి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకమైన అమృత్ 2.0 ద్వారా పట్టణాల్లో తాగునీటి అందించేందుకు ఉన్న టాస్క్‌ఫోర్స్‌ను పునర్నియమిస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈ పథకం కింద కుళాయి ద్వారా 24 గంటలూ తాగునీరు అందించేందుకు ప్రణాళికలు రూపొందించి అమలు చేసేందుకు ఇప్పటికే ఉన్న టాస్క్‌ఫోర్స్ స్థానంలో కొత్త కమిటీని ఏర్పాటు చేశారు. ఏపీయూఎఫ్ఐడీసీ ఎండీ చైర్‌పర్సన్‌గా, పబ్లిక్ హెల్త్ ఇంజనీర్-ఇన్-చీఫ్‌ను కోచైర్మన్‌గా, సభ్యులుగా గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ చీఫ్ ఇంజనీర్, ఐఐటీ తిరుపతిలోని సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.నరసమ్మ, ఏపీయూఐఏఎంఎల్ చీఫ్ టెక్నికల్ ఆఫీసర్, ఆర్థిక శాఖకు చెందిన పీపీపీ నిపుణులు డి.షలీమ్‌రాజు, ఎన్‌సీపీఏ హైదరాబాద్ ఎండీ డాక్టర్ ఎస్.ఎం.సుభాని, మెంబర్ సెక్రటరీ అండ్ కోఆర్డినేటర్‌గా పబ్లిక్ హెల్త్ ఈఈను నియవిస్తూ మున్సిపల్ శాఖ ఆదేశాలిచ్చింది.

రెరా పోస్టుల నియామకాలకు ఎంపిక కమిటీ

అమరావతి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ(రెరా)లో చైర్మన్, సభ్యులు, రియల్ ఎస్టేట్ అప్పిలేట్ ట్రిబ్యునల్‌లో ఖాళీ అయ్యే పోస్టులను ఎప్పటికప్పుడు భర్తీ చేసేందుకు ఎంపిక కమిటీని పునర్నియమిస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీచేసింది. చైర్మన్‌గా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్.రఘునందన్‌రావు, సభ్యులుగా మున్సిపల్‌శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని, న్యాయశాఖ కార్యదర్శిని నియమిస్తూ ఆదేశాలిచ్చారు.

రైతు యాజమాన్య సాగునీటి విధానంలోకి మరో 1,26,257 ఎకరాలు

రైతు యాజమాన్య సాగునీటి విధానం పరిధిలోకి మరో 1,26,257 ఎకరాలను తీసుకువస్తూ రాష్ట్ర జల వనరుల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. పుష్కర ఎత్తిపోతల పథకం కింద 89,449, మడ్డువలస రిజర్వాయరు పరిధిలో 24,877, సూరంపాలెం పరిధిలో 11,931 ఎకరాలను రైతు యాజమాన్య సాగునీటి విధానంలోకి తీసుకువస్తూ మంగళవారం ఉత్తర్వులు ఇచ్చింది.

సున్నిత అంశంపై నిర్లిప్తంగా ఉంటే ఎలా?

» కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల న్యాయవాదులపై ధర్మాసనం అసంతృప్తి

» కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశం

» ప్రత్యేక హోదాపై హైకోర్టు, సుప్రీంకోర్టులో దాఖలైన వ్యాజ్యాలపై ఆరా

» తగిన నిర్ణయం కోసం హైకోర్టులోని వ్యాజ్యాలను సీజే ముందు ఉంచండి

» రిజిస్ట్రీకి ధర్మాసనం ఆదేశం

» కేఏ పాల్ పిల్‌పై హైకోర్టులో విచారణ

అమరావతి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఏపీకి ప్రత్యేక హోదా ఇచ్చేలా ఆదేశాలు ఇవ్వాలని వేసిన పిల్ విచారణ సమయంలో డిప్యూటీ సొలిసిటర్ జనరల్(డీఎస్‌జీ), రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది అందుబాటులో లేకపోవడంపై ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. సున్నితమైన అంశంలో ఇంత నిర్లిప్తంగా ఉంటే ఎలా? అని ప్రశ్నించింది. ప్రత్యేక హోదా కోరుతూ సుప్రీంకోర్టు, హైకోర్టులో దాఖలైన వ్యాజ్యాల స్థితి గురించి ఆరా తీసింది. వివరాలు తెలుసుకొని కోర్టుకు నివేదించాలని న్యాయవాదులకు సూచించింది. ప్రస్తుత పిల్‌తో పాటు ఇదే వ్యవహారంపై దాఖలైన వ్యాజ్యాలను ఏ బెంచ్ విచారించాలనే అంశంపై నిర్ణయం తీసుకొనేందుకు వీలుగా వీటన్నింటినీ సీజే ముందు ఉంచాలని రిజిస్ట్రీని ఆదేశించింది. విచారణను దసరా సెలవుల తరువాతకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.నరేందర్, జస్టిస్ మండవ కిరణ్మయితో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులిచ్చింది. ఏపీకి ప్రత్యేక హోదా ఇచ్చేలా కేంద్రాన్ని ఆదేశించాలని కోరుతూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. రాష్ట్ర ఆర్థిక పునరుజ్జీవానికి ఆర్థిక సహాయం, ఇతర అవసరమైన సహకారం అందించేలా ఆదేశాలు ఇవ్వాలని అభ్యర్థించారు. రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పేందుకు ముందుకు వచ్చేవారికి పన్ను మినహాయింపులు ఇచ్చేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఈ పిల్ మంగళవారం మరోసారి విచారణకు రాగా పార్టీ ఇన్ పర్సన్ కేఏ పాల్ వాదనలు వినిపిస్తూ... రాష్ట్ర పునర్విభజన సమయంలో రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని పార్లమెంట్ వేదికగా హామీ ఇచ్చి అమలు చేయడం లేదన్నారు. రాష్ట్రం లక్షల కోట్ల అప్పుల్లో ఉందన్నారు. ప్రత్యేక హోదా ప్రకటించడం వల్ల పరిశ్రమలు నెలకొల్పేందుకు ప్రోత్సాహకంగా ఉంటుందన్నారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. ఇప్పటికే 11 రాష్ట్రాలకు ప్రత్యేక హోదా ఇచ్చారన్నారు. ఏపీ విషయంలో మాత్రం వెనకాడుతున్నారన్నారు. ధర్మాసనం స్పందిస్తూ పార్లమెంట్, అసెంబ్లీ వేదికగా చేసే ప్రకటనలపై న్యాయ సమీక్ష జరపడం సాధ్యపడదని వ్యాఖ్యానించింది. అభ్యంతరం ఉంటే పార్లమెంట్ ప్రివిలేజ్ కమిటీలకు ఫిర్యాదు చేయాలని సూచించింది. న్యాయస్థానాలు ఆర్థిక విధానాలు రూపకల్పనకు ఆదేశాలు ఇవ్వగలవా అనే విషయంపై అధ్యయనం చేసి వాదనలు వినిపించాలని పాల్‌కు స్పష్టం చేసింది.

సాంకేతిక సమస్యతో వెనుదిరిగిన విమానం

రేణిగుంట, సెప్టెంబరు 24: హైదరాబాద్ నుంచి తిరుపతికి రావాల్సిన అలయన్స్ ఎయిర్‌లైన్స్ విమానం సాంకేతిక సమస్యతో మధ్యలో వెనుదిరిగింది. హైదరాబాద్ నుంచి మంగళవారం ఉదయం 7.30 గంటలకు బయలుదేరి 8 గంటలకు తిరుపతికి చేరుకోవాల్సి ఉండగా సాంకేతిక లోపాన్ని గుర్తించిన పైలట్ హైదరాబాద్ విమానాశ్రయంలో దింపారు. రేణిగుంట నుంచి ఈ విమానంలో ఉదయం హైదరాబాద్‌కు వెళ్లాల్సిన ప్రయాణికులు ఈ విషయం తెలిసి అసహనం వ్యక్తం చేశారు. సగం మంది డబ్బు తీసుకుని వెనక్కు వెళ్లిపోగా మిగిలిన వారు మధ్యాహ్నం ఢిల్లీ నుంచి హైదరాబాద్ మీదుగా తిరుపతి చేరుకున్న విమానంలో 2.20గంటలకు బయల్దేరి వెళ్లారు.

సీడీఎంఏ హరినారాయణకు అదనపు బాధ్యతలు

అమరావతి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏపీ టిడ్కో ఎండీ సాయికాంత్‌వర్మను బదిలీ చేయడంతో మున్సిపల్ శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్(సీడీఎంఏ) ఎం.హరినారాయణ్‌కు ఆ పోస్టు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు మున్సిపల్ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. అదేవిధంగా ఏపీ హౌసింగ్ బోర్డు వైస్‌చైర్మన్ అండ్ హౌసింగ్ కమిషనర్ ఇన్‌చార్జి బాధ్యతతో పాటు, ఏపీ రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ఇన్‌చార్జి ఎండీగాను, దక్కన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ల్యాండ్ హోల్డింగ్స్ లిమిటెడ్(డిల్) ఇన్‌చార్జి ఎండీగాను నియమిస్తూ ఆదేశాలిచ్చారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

చెస్‌లో సువర్ణాధ్యాయం

భారత చెస్ అంటే దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ గుర్తుకొస్తాడు. ప్రపంచ చదరంగ చిత్రంపై విషీ అంతలా తనదైన ముద్ర వేశాడు. ఇప్పుడు ఆయన బాటలో సాగుతూ మన యువకిశోరాలు అదరగొడుతున్నారు. క్యాండిడేట్స్ టోర్నమెంట్‌లో విన్నర్, ప్రపంచ కప్‌లో రన్నరప్, ప్రపంచ బ్లిట్జ్ చెస్‌లో పతకం.. ఇలా ప్రతి అంతర్జాతీయ ఈవెంట్‌లోనూ తమదైన ఆటతీరుతో సమర్థత చాటుతున్నారు. తాజాగా.. చెస్ ఒలింపిక్స్‌గా పిలుచుకునే ఒలింపియాడ్‌లోనూ స్వర్ణ చరిత్ర సృష్టించి చదరంగంలో మరింత 'ఎత్తు'కు దూసుకెళ్లారు.

అరవై నాలుగుగళ్ల ఆటలో సంచలనాల మోత మోగిస్తున్న భారత క్రీడాకారులు.. హంగేరీ రాజధాని బుడాపెస్ట్‌లో జరిగిన చెస్ ఒలింపియాడ్‌లో చాంపియన్లుగా నిలిచి అరుదైన ఘనత సాధించారు. 193 జట్లు పోటీపడ్డ పురుషుల విభాగం, 181 జట్లు తలపడ్డ మహిళల కేటగిరిలోనూ సత్తా చాటి భారత చెస్ చరిత్రలో తొలిసారి రెండు స్వర్ణాలు కొల్లగొట్టారు. ఇప్పటిదాకా కాంస్య పతకాలకే పరిమితమైన మన జట్లు ఈమారు ఏకంగా టైటిల్‌తో మురిపించారు. వందేళ్ల చెస్ ఒలింపియాడ్ చరిత్రలో ఏకకాలంలో ఒకే దేశానికి చెందిన రెండు జట్లు విజేతలుగా నిలవడం ఇది మూడోసారే. గతంలో చైనా, రష్యా ఒకే అంచెలో రెండు పసిడి పతకాలు గెలిచి రికార్డు సృష్టించాయి.

పెంటేల హరికృష్ణ, అర్జున్ ఇరిగేసి, గుకేశ్, ప్రజ్ఞానంద, విదిత్ గుజరాతీలతో కూడిన భారత పురుషుల జట్టు చెస్ ఒలింపియాడ్‌లో పూర్తి ఆధిపత్యంతో ఆడిన తీరు అమోఘం. పదునైన వ్యూహాలు, విభిన్నమైన ఎత్తులతో ప్రత్యర్థులను చిత్తుచేస్తూ ఆరంభం నుంచి అగ్రస్థానంలోనే కొనసాగిన జట్టు, చివరిదాకా అంతే జోరును చూపుతూ అద్భుత ఫలితాన్ని రాబట్టిన తీరు ప్రశంసనీయం. ఒక్క రౌండ్‌లోనూ ఓటమన్నదే లేకుండా అజేయంగా ఆడిన మన ఆటగాళ్లు.. డిఫెండింగ్ చాంపియన్ ఉజ్బెకిస్థాన్, టాప్‌సీడ్ అమెరికాలాంటి అగ్రశ్రేణి జట్లను దాటుకొని విజయకేతనం ఎగురవేశారు. ద్రోణవల్లి హారిక, తానియా సచ్‌దేవ్, వైశాలి, దివ్యా దేశ్‌ముఖ్, వంతికా అగర్వాల్‌లతో కూడిన మహిళల జట్టూ టోర్నీలో చూపిన తెగువ అంతాఇంతా కాదు. ఏమాత్రం అంచనాలు లేకుండా బరిలోకి దిగిన మన అమ్మాయిల బృందం.. చైనా, రష్యాలాంటి బలమైన జట్లను ఢీకొని విజయ దుందుభి మోగించింది.

భారత జట్ల చారిత్రక ప్రదర్శనలో తెలుగు క్రీడాకారుల ప్రదర్శన ఎనలేనిది. పురుషుల జట్టులో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ప్రధాన భూమిక పోషించాడు. బోర్డుపై తనదైన వ్యూహాలతో ప్రత్యర్థులను చిత్తుచేస్తూ జట్టు చాంపియన్‌గా నిలవడానికి బాటలు వేశాడు. తానాడిన మొత్తం పదకొండు గేముల్లో తొమ్మిది విజయాలు సాధించాడంటేనే అర్జున్ నైపుణ్యం ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు. మరో తెలుగు ఆటగాడు హరికృష్ణ తన అనుభవంతో సహచర ఆటగాళ్లకు మార్గదర్శనం చేస్తూ జట్టును గెలుపు దిశగా నడిపించాడు. ఇక హారిక కీలక సమయాల్లో ప్రత్యర్థులను ఓడించి మహిళల జట్టు పసిడి పతకం నెగ్గడంలో కీలక భాగమైంది. తొమ్మిది గేమ్‌ల్లో మూడింటిలో విజయాలు సాధించి, మూడు గేమ్‌లను డ్రా చేసుకున్న హారిక.. నిర్ణాయక ఆఖరి రౌండ్ గేమ్‌లో పైచేయి సాధించి భారత విజయాన్ని ఖరారు చేసిన తీరు అద్భుతం.

చెస్‌లో ప్రతిష్ఠాత్మకంగా భావించే గ్రాండ్‌మాస్టర్ హోదాను పొందిన తొలి భారతీయుడిగా నిలిచిన విశ్వనాథన్ ఆనంద్.. 1988లోనే ఆ ఘనతను సాధించి దేశంలో ఈ క్రీడకు ఊపిరి పోశాడు. అనంతరం ఐదుసార్లు ప్రపంచ చాంపియన్‌గా నిలిచి చదరంగంలో భారత్ సత్తాను ఘనంగా చాటాడు. ఆనంద్ స్ఫూర్తితో ఇటీవలికాలంలో అనేక మంది భారత క్రీడాకారులు ప్రపంచ వేదికపై తమదైన ముద్ర వేస్తున్నారు. 1988 నుంచి 2017 నాటికి మన దేశంలో గ్రాండ్ మాస్టర్ల సంఖ్య 50 ఉంటే.. ఈ ఏడేళ్లలో మరో 35 మంది కొత్త గ్రాండ్ మాస్టర్లుగా అవతరించారు. ముఖ్యంగా గుకేశ్, ప్రజ్ఞానంద, అర్జున్ లాంటి యువ ఆటగాళ్లు ఒత్తిడిని సమర్థంగా తట్టుకుంటూ అంతర్జాతీయస్థాయిలో మెరుగైన ప్రదర్శన కనబరుస్తున్నారు. కొన్నేళ్లుగా చెస్‌ను శాసిస్తున్న ప్రపంచ నెంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్‌తో పాటు అత్యుత్తమ ఆటగాళ్లను ఓడిస్తూ ప్రభంజనాలు సృష్టిస్తున్నారు. ప్రజ్ఞానంద నిరుడు ప్రపంచకప్‌లో రన్నరప్‌గా నిలిస్తే, ఈ ఏడాది క్యాండిడేట్స్ టోర్నీలో గుకేశ్ టైటిల్ గెలవడమే అందుకు నిదర్శనం. ఇప్పుడు సాధించిన ఒలింపియాడ్ విజయంతో భారత చదరంగంలో మన యువ తరంగాలు సువర్ణాధ్యాయాన్ని లిఖించారని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.

మోదీ ఇండియా, రాహుల్ భారత్

'మనం మన దేశం గురించి మరణించక పోవచ్చు.. కానీ మన దేశం కోసం తప్పనిసరిగా జీవించాలి' అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. తన అమెరికా పర్యటనలో భాగంగా లాంగ్ ఐలాండ్‌లోని ఒక స్టేడియంలో 13 వేల మంది ప్రవాస భారతీయులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. దాదాపు 60 బస్సుల్లో అమెరికాలోని 40 రాష్ట్రాల నుంచి భారతీయులను రప్పించారు. 'భారతదేశం అవకాశాలకోసం ఎదురుచూడడం లేదు. అవకాశాలను కల్పిస్తోంది. ప్రతి భారతీయుడికీ భారతదేశం, దాని విజయాల పట్ల ఆత్మవిశ్వాసం ఉన్నది' అని మోదీ అన్నారు. సరిగ్గా మూడు వారాల క్రితం ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఇదే అమెరికాలో విస్తృతంగా పర్యటించి అనేక అంశాలను ప్రస్తావించారు. మోదీ తన అమెరికా పర్యటనలో రాహుల్ ప్రస్తావించిన అంశాలు ఏవీ లేవనెత్తలేదు. తన పాలనలో దేశం అభివృద్ధి చెందుతున్న తీరు, మౌలిక సదుపాయాల విషయంలో శీఘ్ర ప్రగతి గురించి వివరించారు. దాదాపు 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేలా చేశామని, ప్రపంచానికి మొబైల్ ఫోన్లను ఎగుమతి చేసే స్థాయికి ఎదిగామని చెప్పుకున్నారు. సహజంగానే 'భారత మాతాకీ జై' అన్న నినాదాలు మిన్నుముట్టాయి. ఆనందోత్సాహాలతో ఎంతో మంది స్త్రీ పురుషులు మోదీతో సెల్ఫీలు దిగేందుకు పోటీపడడంలో ఆశ్చర్యం లేదు.



నరేంద్ర మోదీ, రాహుల్‌గాంధీ ఇద్దరూ తమ అమెరికా పర్యటనలో ఒకే ఇండియా గురించి మాట్లాడారు. మోదీ ప్రచారం చేసిన ఇండియా వేరు, రాహుల్ ప్రదర్శించిన ఇండియా స్వరూపం వేరు. ఒకరిది సంపన్న భారతదేశం, అభివృద్ధి కోసం ఉరకలు వేస్తున్న ఇండియా అయితే మరొకరిది నిరుద్యోగం, అధిక ధరల మధ్య సతమతమవుతూ, పలు అణచివేతలను ప్రతిఘటిస్తున్న భారతదేశం. ఎవరు వాస్తవం చెబుతున్నారనుకోవాలి? నిజానికి మోదీ చాటి చెప్పిన సంపన్నత, రాహుల్ ప్రస్తావించిన సమస్యలు భారతదేశంలో ఉన్నాయని ఎవరైనా అంగీకరించక తప్పదు.

మోదీకి పెద్ద ఎత్తున జనాన్ని రప్పించి మాట్లాడడమంటే చాలా ఇష్టం. కేంద్రంలో తొలిసారి అధికారంలోకి రాగానే 2014లో మేడిసన్ స్క్వేర్ గార్డెన్‌లోను, 2016లో కాలిఫోర్నియాలోని శాన్‌జోస్‌లోను, 2018లో టెక్సాస్‌లోని హ్యూస్టన్‌లోనూ ఆయన ఇదే విధంగా అమెరికాలో భారతీయ జనాన్ని రప్పించి మరీ వారి ముందు అనర్గళంగా ప్రసంగించి హర్షధ్వానాలు స్వీకరించారు.

మోదీ పర్యటించడానికి కొద్ది రోజుల ముందు రాహుల్‌గాంధీ కూడా అమెరికాలో మూడు రోజుల పాటు పర్యటించారు. యువజనులు, సాంకేతిక నిపుణులు, విద్యార్థులను, జర్నలిస్టులను కలుసుకున్నారు. అమెరికాలో ట్రక్కు నడుపుతూ ప్రమాదానికి గురైన ఒక సిక్కు డ్రైవర్‌ను, ఆయన మిత్రులను కూడా కలుసుకుని వారి జీవన పరిస్థితులను తెలుసుకున్నారు. ఇండియా రాగానే కర్నాల్‌లో ఆ డ్రైవర్ ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మోదీ, రాహుల్ ఇద్దరూ అమెరికాలో పర్యటించినప్పటికీ వారు కలుసుకున్న ప్రజలు వేరు, మాట్లాడిన అంశాలు వేరు. ఇప్పటి వరకూ అమెరికా వంటి అగ్రరాజ్యానికి వెళ్లి నరేంద్రమోదీ చెప్పిన దానికి భిన్నంగా మాట్లాడిన భారతీయ నేత లేరు. గత పది సంవత్సరాలుగా రాహుల్‌గాంధీ పడుతూ, లేస్తూ, పాఠాలు నేర్చుకుంటూ అటు పార్లమెంట్‌లోనూ, బహిరంగ సభల్లో మాత్రమే కాకుండా అమెరికాకు కూడా వెళ్లి మాట్లాడగలిగిన స్థాయికి చేరుకున్నారనడంలో సందేహం లేదు. ఈ ఇద్దరి పర్యటనలు వారి ఆలోచనా దృక్పథాలను ప్రతిఫలించాయి. ఒక ప్రధానిగా మోదీ భారతదేశంలో అద్భుతాలు జరుగుతున్నాయని, తన హయాంలో అభివృద్ధి తార స్థాయికి చేరుకున్నదని చెప్పుకోవడం సహజం. అదే సమయంలో భారతదేశంలో నిరుద్యోగం గురించి, ఎన్నికల్లో ప్రతిపక్షాలకు సమాన అవకాశాలు లేకపోవడం గురించి, ప్రతిపక్ష పార్టీల అణచివేత గురించి, రైతుల సమస్యల గురించి రాహుల్ అమెరికాలో భారత జనానికి వివరించారు. మోదీ మాటలు విని హర్షధ్వానాలు చేసే ప్రేక్షకులు వేరు. రాహుల్ మాటలు విని ప్రశ్నలు లేవనెత్తే జనం వేరు. ఈ ఇద్దరూ తమ ఆడియెన్స్‌ను తాము సృష్టించుకున్నారు. రాహుల్ గాంధీలా వాషింగ్టన్‌లోని నేషనల్ ప్రెస్ క్లబ్‌కు మోదీ వెళ్లి జర్నలిస్టులతో మాట్లాడే అవకాశాలు లేవు. భారత దేశంలోనే ఆయన గత పదేళ్లలో విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. ఇరువురి భావాల ఘర్షణకు అమెరికా వేదిక అయింది.



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

తేడా ఏమంటే మోదీ ఇప్పటికే తనతో ప్రభావితమైన వారితో మాట్లాడితే రాహుల్ తన ప్రభావం చూపేందుకు అమెరికాలో రకరకాల భారతీయ వర్గాలను కలుసుకున్నారు. ఇద్దరూ ఒకే ఇండియా గురించి మాట్లాడారు. అయితే మోదీ ప్రచారం చేసిన ఇండియా వేరు, రాహుల్ ప్రదర్శించిన ఇండియా స్వరూపం వేరు. ఒకరిది సంపన్న భారతదేశం, అభివృద్ధి కోసం ఉరకలు వేస్తున్న ఇండియా అయితే మరొకరిది నిరుద్యోగం, అధిక ధరల మధ్య సతమతమవుతూ, పలు అణచివేతలను ప్రతిఘటిస్తున్న భారతదేశం. మోదీ, రాహుల్‌లలో ఎవరు వాస్తవం చెబుతున్నారనుకోవాలి? నిజానికి ప్రధానమంత్రి, ప్రతిపక్ష నేత ప్రస్తావించిన వేర్వేరు ఇండియాలు భారతదేశంలో ఉన్నాయని ఎవరైనా అంగీకరించక తప్పదు. మోదీ తన హయాంలో సృష్టించిన సంపద గురించి మాట్లాడితే రాహుల్‌గాంధీ ఈ సంపద కొద్ది మంది చేతుల్లో కేంద్రీకృతం కావడం గురించి మాట్లాడారు. 'నేను మోదీని ద్వేషించను.. నా ఆలోచనా విధానం వేరు, ఆయన ఆలోచనా విధానం వేరు..' అని రాహుల్ వాషింగ్టన్‌లోని జార్జిటౌన్ యూనివర్సిటీలో విద్యార్థులతో మాట్లాడుతూ చెప్పారు.

రాహుల్‌గాంధీ తన అమెరికా పర్యటనలో సరిహద్దుల్లో చైనా బలగాల మోహరింపు గురించి మాట్లాడారు. చైనా దళాలు చొచ్చుకురావడం గురించి ఆయన చేసిన వ్యాఖ్యలను భారతదేశంలో ఎవరూ పెద్దగా ఖండించ లేదు. నిజానికి ఈ విషయంలో మోదీ ప్రభుత్వంలో కూడా ఆందోళన నెలకొన్నది. అందువల్ల ఒక వైపు అమెరికాలో మోదీ క్వాడ్ సమావేశంలో పాల్గొని, కీలకమైన రక్షణ ఒప్పందాలను కుదుర్చుకున్నప్పటికీ మరోవైపు చైనాతో చర్చలకు ద్వారాలు తెరిచారు. కొద్ది రోజుల క్రితం సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో జరిగిన బ్రిక్స్ జాతీయ రక్షణ సలహాదారుల సమావేశంలో భారత భద్రతా సలహాదారు అజిత్ డోవల్ రష్యా అధ్యక్షుడు పుతిన్‌తోనూ, చైనా విదేశాంగ మంత్రితోనూ చర్చలు జరిపారు. వాస్తవ నియంత్రణ రేఖ వద్ద నుంచి ఇరు దేశాల సైన్యాలు తక్షణమే వెనక్కు వెళ్లేలా చేయాలని కోరారు. అంతకు ముందు భారత విదేశాంగ మంత్రి జైశంకర్ కూడా చైనా విదేశాంగ మంత్రితో మాట్లాడారు. సరిహద్దుల్లో ఉద్రిక్తత తగ్గడంతోపాటు భారతదేశం మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా మారాలంటే చైనాతో వ్యాపార సంబంధాలు సజావుగా సాగడం ముఖ్యమని ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్ లాంటి వారు కూడా సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో చైనా దూకుడు గురించి రాహుల్ చేసిన వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఉన్నదని చెప్పక తప్పదు. చైనా బలగాలు వెనక్కు తగ్గేలా చేయడం మోదీకి కూడా రాజకీయ అవసరం.

స్థూలంగా చూస్తే ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి పెద్ద సమస్యల్లేవు. 13 సంవత్సరాలు గుజరాత్‌లో ముఖ్యమంత్రి పదవి నిర్వహించిన తర్వాత ఆయన పది సంవత్సరాలు కేంద్రంలో అధికారం చెలాయించారు. భారతీయ జనతా పార్టీని రెండుసార్లు తిరుగులేని మెజారిటీతో గెలిపించిన మోదీ మూడోసారి కూడా ఆ పార్టీకి 240 సీట్లు సంపాదించి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేయగలిగారు. ఇప్పటికీ బీజేపీ, దాని మిత్రపక్షాలు 16 రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నాయి. లోక్‌సభలో 543 సీట్లలో 293 సీట్లు, రాజ్యసభలో దాదాపు సగం సీట్లు ఎన్డీఏకు ఉన్నాయి. మరో అయిదేళ్ల వరకూ నరేంద్ర మోదీ సారథ్యంలోని బీజేపీకి ఢోకా లేదని చెప్పేందుకు అనేక కారణాలున్నాయి.

అయితే రాజకీయాల్లో స్థిరత్వం పూర్తిగా సంఖ్యాబలంపై ఆధారపడి ఉండదు. ప్రజలు మన గురించి ఏమనుకుంటున్నారు, మన పాలన ఎలా సాగుతుంది, మన విధానాలు ఎలా ఉన్నాయి, ఇతర రాజకీయ పార్టీలకు ఎంత మేరకు జనాదరణ లభిస్తుంది అన్న అంశాలపై ప్రభుత్వం గ్రాఫ్ పెరుగుతోందా, పడిపోతుందా సులభంగా చెప్పవచ్చు. మోదీ మూడోసారి తక్కువ సంఖ్యాబలంతో గెలిచిన తర్వాత మళ్లీ పూర్తి మెజారిటీ సాధించేలా పార్టీని నడిపించడం ఆయనకు కత్తిమీద సాములా కనపడుతోంది. ఒకరి నాయకత్వంలో పార్టీ దినదిన ప్రవర్ధమానమవుతుంటే అందరూ ఆరాధించేవారే కనపడుతుంటారు. కాని అదే పార్టీ దెబ్బతినడం ప్రారంభమవుతే బహిర్గత విమర్శకులతో పాటు అంతర్గత ప్రత్యర్థులు కూడా సిద్ధమవుతారు. శ్రీశ్రీ అన్నట్లు నిప్పులు చిమ్ముకుంటూ ఎగిరిపోతుంటే నిబిడాశ్చర్యం ప్రదర్శించినవారే నేలకు రాలిపోతున్నప్పుడు నిర్దాక్షిణ్యంగా వ్యవహరిస్తారు. మోదీకి ఇకనుంచి అగ్ని పరీక్షలు మొదలు కానున్నాయి. హర్యానా, జమ్ము–కశ్మీర్, మహారాష్ట్ర, జార్ఖండ్, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు ఆయన శక్తి సామర్థ్యాలకు పరీక్షగా మారనున్నాయి. ఇప్పటి వరకూ ప్రతి ఎన్నికలోనూ మోదీయే తాను ముందుండి నిలిచి ఉధృతంగా ప్రచారం చేసి గెలిపించారు. పార్టీ అంతా ఆయనపైనే ఆధారపడవలసిన పరిస్థితి ఆయనే కల్పించారు. ఎన్నికల్లో గెలిపించడం అనేది సింహంపై స్వారీ చేయడం లాంటిదని ఆయనకు కూడా తెలుసు. ప్రత్యర్థులను బలహీనపరిచేందుకు మోదీ, షాలు ఇంతవరకూ ప్రయోగించిన అస్త్రాలు ఇక ముందు కూడా పనిచేస్తాయో లేదో చెప్పలేము.

మోదీకి ఎన్ని సమస్యలున్నాయో రాహుల్‌కు కూడా అన్ని సమస్యలున్నాయి. బీజేపీ అంతా మోదీ వైపు చూస్తున్నట్లు ఇండియా కూటమి అంతా రాహుల్ నాయకత్వ శైలిపైనే ఆధారపడి ఉన్నదని చెప్పక తప్పదు. అందువల్ల రాహుల్ వేసే ప్రతి అడుగూ, మాట్లాడే ప్రతి మాటా ఆచితూచి మాట్లాడక తప్పదు. మోదీ ఎదుర్కొనే ప్రతి సమస్యను రాహుల్ తనకు అనుకూలంగా మార్చుకోవాల్సి ఉంటుంది. కాంగ్రెస్ 99 సీట్లు సాధించిన తర్వాత ఆయన ప్రతిపక్ష నేతగా అమెరికా వెళ్లి మాట్లాడే ధైర్యం చేయగలిగారు. కాని ఇంటగెలవకుండా రచ్చగెలవడం సాధ్యం కాదు. అనేక చోట్ల సంస్థాగత బలహీనతలు, అసమ్మతి, అసంతృప్తి, నాయకుల మధ్య కుమ్ములాటలు కాంగ్రెస్ సహజలక్షణాలుగా మారాయి. ఏఐసీసీ హర్యానా నేతలతో నిండిపోవడం, తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాలనుంచి నేతలు ఢిల్లీ చుట్టూ తిరగడం చూస్తుంటే పాత సంస్కృతిలోంచి కాంగ్రెస్ ఇంకా బయటపడలేదని తెలుస్తోంది. నరేంద్ర మోదీ, రాహుల్‌గాంధీలలో ఎవరు దేశానికి దిశానిర్దేశం చేయగలరు?

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

ట్రిబ్యునల్ పాపం జగన్, బీజేపీలదే!

1956 అంతర్ రాష్ట్ర జల వివాద చట్టం కింద నియమింపబడి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య కృష్ణా నదీ జలాలను తిరిగి పంపిణీ చేసేందుకు విచారణ జరుపుతున్న ట్రిబ్యునల్.. విచారణ సందర్భంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఏ ట్రిబ్యునల్ పంపిణీ చేసిన నీటి కేటాయింపులను ప్రామాణికంగా తీసుకొంటుంది?

బేసిన్ మొత్తంగా గాని, రెండు తెలుగు రాష్ట్రాల మధ్య గాని బచావత్ ట్రిబ్యునల్ తీర్పు ప్రస్తుతం అమలులో ఉంది. బేసిన్ మొత్తం మీద కృష్ణా నదీ జలాల పంపిణీకి 2004లో నియమితమైన ట్రిబ్యునల్–2 (బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్) 2013లో ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు స్టే విధించడంతో అమలులో లేదు. ఇన్నేళ్లుగా సుప్రీంకోర్టులోనే పెండింగ్‌లో ఉంది. కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేస్తే తప్ప దానికి చట్టబద్ధత ఏర్పడదు. లేకుంటే ఉనికిలో లేనట్లే. ట్రిబ్యునల్–2 కేటాయింపులు అమలు కోసం కర్నాటక, మహారాష్ట్ర ప్రభుత్వాలు స్టే ఎత్తివేసేందుకు సుప్రీంకోర్టు చుట్టూ తిరుగుతూ విశ్వప్రయత్నాలు చేస్తున్నాయి. అయితే ప్రస్తుతం విచారణ జరుపుతున్న ట్రిబ్యునల్ విచారణాంశాల్లో రెండవ ట్రిబ్యునల్ కేటాయింపులు కూడా చేర్చినట్లు చెబుతున్నారు. కృష్ణా జల వివాద ట్రిబ్యునల్–1 చేసిన 811 టియంసిల కేటాయింపు, ట్రిబ్యునల్–2 చేసిన అదనపు కేటాయింపుల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వాటాలు తేల్చడం విచారణాంశంగా ఉందని వార్తలొచ్చాయి. అదే నిజమైతే చట్టబద్ధత లేని ట్రిబ్యునల్–2 అదనపు కేటాయింపులు ఎలా పరిగణనలోనికి తీసుకొంటారు? న్యాయ పరంగా ఇది ఎంతవరకు చెల్లుబాటు అవుతుంది? సెప్టెంబర్ 20వ తేదీ నుంచి విచారణ జరపదలచిన ట్రిబ్యునల్, నవంబర్‌కు విచారణను వాయిదా వేసింది.

ప్రస్తుతం విచారణ జరుపుతున్న బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ 40 అంశాలను విచారణకు పరిగణనలోకి తీసుకొన్నది. ప్రధానంగా "బచావత్ ట్రిబ్యునల్ చేసిన బేసిన్ పరిధిలో, బేసిన్ బయట ప్రాజెక్టుల నీటి కేటాయింపులు, వినియోగానికి సంబంధించి రక్షణ కల్పించిన అంశాలను తిరిగి విచారించే అధికారం ట్రిబ్యునల్‌కు ఉందా?" అనే అంశం చుట్టే ఉండబోతోంది. బచావత్ ట్రిబ్యునల్ తను కేటాయించి, వినియోగంలో ఉంటే ఆ నీటి కేటాయింపులు తర్వాత వచ్చే ట్రిబ్యునల్ గాని, కాంపిటెంట్ అథారిటీ గాని సాధ్యమైనంత వరకు మార్పు చేయకూడదని బేసిన్‌లోని అన్ని రాష్ట్రాలకు రక్షణ కల్పించి ఉన్నది. బచావత్ ట్రిబ్యునల్ తన తుది తీర్పు చాప్టర్ 7 క్లాజు 14(a)లో ఇలా ఉంది. "ఎట్ ఎనీ టైమ్ ఆఫ్టర్ ది 31 మే, 2000 దిస్ ఆర్డర్ మే బి రివ్యూడ్ ఆర్ రివైజ్డ్ బై ఎ కాంపిటెంట్ అథారిటీ ఆర్ ట్రిబ్యునల్ బట్ రివ్యూ ఆర్ రివిజన్ షల్ నాట్ యాజ్ ఫార్ యాజ్ పాసిబుల్ డిస్టర్బ్ ఎనీ యుటిలైజేషన్ దట్ మే యావ్ బీన్ అండర్‌టేకన్ బై ఎనీ స్టేట్ విత్ ఇన్ ది లిమిట్స్ ఆఫ్ ది అలకేషన్ మేడ్ టు ఇట్ అండర్ ది ఫర్ గోయింగ్ క్లాసెస్". బచావత్ ట్రిబ్యునల్ చేసిన కేటాయింపులు తప్ప బేసిన్ వెలుపలికి కృష్ణా జలాలు తరలించలేదు.



తెలంగాణ రాష్ట్రం తను మాత్రం గోదావరి జలాలు కృష్ణ బేసిన్‌కు బేషుగ్గా తరలిస్తూ, ఆంధ్రప్రదేశ్ మాత్రం కృష్ణ జలాలు పెన్నా బేసిన్‌కు తరలించకూడదని ప్రస్తుతం ట్రిబ్యునల్ ముందు వాదిస్తోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే నిర్మించిన కాకతీయ కాలువ గాని, ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు గాని, అంతిమంగా కాళేశ్వరం ప్రాజెక్టుగాని గోదావరి జలాలను కృష్ణ బేసిన్‌కు తరలించడమనే అంశాన్ని మరుగుపరుస్తున్నది.

బచావత్ ట్రిబ్యునల్ తీర్పులోని ఈ క్లాజ్‌ను దృష్టిలో పెట్టుకొనే 2013లో తీర్పు ఇచ్చిన ట్రిబ్యునల్–2 (బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్) బచావత్ ట్రిబ్యునల్ చేసిన కేటాయింపుల జోలికి వెళ్లకుండా, బేసిన్‌లో 65 శాతం నీటి లభ్యత కింద 163 టియంసిల నికర జలాలు, సరాసరి కింద 285 మిగులు జలాలను లెక్కించి మొత్తం 448 టియంసిలను అన్ని రాష్ట్రాల మధ్య పంపిణీ చేసింది. కృష్ణలో చుక్క మిగులు నీరు లేకుండా చేసింది. అంతే కాకుండా ట్రిబ్యునల్–2 కూడా తన తుది తీర్పులో ఇదే రక్షణను తను చేసిన కేటాయింపులకు కల్పించింది. ఫైనల్ ఆర్డర్ క్లాస్ 16లో ఇలా పేర్కొన్నది. "ఎట్ ఎనీ టైమ్ ఆఫ్టర్ 31 మే, 2050 ఆర్డర్ మే బి రివ్యూడ్ ఆర్ రివైజ్డ్ బై ది కాంపిటెంట్ అథారిటీ ఆర్ ట్రిబ్యునల్ బట్ ఫర్ రివ్యూ ఆర్ రివిజన్ షల్ నాట్ యాజ్ ఫర్ యాజ్ పాసిబుల్ డిస్టర్బ్ ఎనీ యుటిలైజేషన్ దట్ మే యావ్ బీన్ అండర్‌టేకన్ బై ఎనీ స్టేట్ విథిన్ ది లిమిట్స్ ఆఫ్ అలకేషన్ మేడ్ టు ఇట్". గతంలో బేసిన్ మొత్తం మీద తను చేసిన వినియోగంలో ఉన్న నీటి కేటాయింపులకు రక్షణ కల్పించిన బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్, తిరిగి రెండు రాష్ట్రాల మధ్య ఇప్పుడు నీటి వాటాలు పంపిణీ చేసే సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో వినియోగంలో ఉన్న నీటిని తిరిగి ఎలా పంపకం చేస్తుందనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. ఈ అంశంలో రాష్ట్ర ప్రభుత్వం సరిగానే స్పందించింది. కృష్ణా బేసిన్‌లో పాత ప్రాజెక్టుల కింద నీటి వినియోగానికి రక్షణ ఉందని, ఈ అంశం సమీక్షించడం తగదని ట్రిబ్యునల్‌కు లేఖ రాసింది. గోదావరి జలాలు వాడుకున్నంత మాత్రాన కృష్ణా జలాలపై హక్కు లేదనడం సరి కాదని లేఖలో స్పష్టం చేసింది.

ఆంధ్రప్రదేశ్‌లో వినియోగంలో వున్న కృష్ణా జలాలను తిరిగి పంపకం చేయడంలో న్యాయపరంగా చిక్కులున్నాయని భావించిన తెలంగాణ ప్రభుత్వం అడ్డమైన డొంక దారులను తెరమీదకు తెచ్చింది. ప్రధానంగా బేసిన్ అంశంతో పాటు పరీవాహక ప్రాంతం ప్రబలంగా ముందుకు తెచ్చింది. దీనికి తోడు ఏ ఆయకట్టుకైనా రెండు విధాలుగా నీటి వసతి ఉంటే (డెల్టాకు గోదావరి జలాలు), మిగులు నీరు తమకు కేటాయించాలని కోరింది. దీనికి తోడు అమరావతి రాజధాని ప్రాంతంలో మిగిలే నీళ్లకు కూడా ఎసరు పెట్టింది. గమనార్హమైన అంశమేమంటే తను మాత్రం గోదావరి జలాలు కృష్ణ బేసిన్‌కు బేషుగ్గా తరలిస్తూ ఆంధ్రప్రదేశ్ మాత్రం కృష్ణ జలాలు పెన్నా బేసిన్‌కు తరలించకూడదని ప్రస్తుతం ట్రిబ్యునల్ ముందు వాదిస్తోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే నిర్మించిన కాకతీయ కాలువ గాని, ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టుగాని, అంతిమంగా కాళేశ్వరం ప్రాజెక్టుగాని గోదావరి జలాలను కృష్ణ బేసిన్‌కు తరలించడమనే అంశాన్ని మరుగుపరుస్తున్నది.

ప్రస్తుతం విచారణ జరుపుతున్న ట్రిబ్యునల్ ఏ విధమైన తీర్పు ఇస్తుందో అటుంచితే ఇంత కర్మకాండకు వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి ప్రధానంగా బాధ్యత వహించవలసి ఉంటుంది. అయిదేళ్ల కాలం కేసీఆర్ చెప్పినట్లు వ్యవహరించి, అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో అడ్డుచెప్పకపోవడంతో ప్రస్తుత ట్రిబ్యునల్ నియామకమయింది. కాగా అపెక్స్ కౌన్సిల్ సమావేశం జరిగి మూడేళ్లు గడిచినా, ప్రతిపాదనను దస్త్రాలకే పరిమితం చేసిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, 2023లో తెలంగాణ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ట్రిబ్యునల్ నియామకం చేసి, ఆంధ్రప్రదేశ్ మెడ మీద కత్తి వేలాడదీసింది. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ఏ సమస్య పరిష్కారం కావాలన్నా రాష్ట్ర విభజన చట్టం కరదీపికగా ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం కూడా ప్రతి తగాదా పరిష్కారానికి రాష్ట్ర విభజన చట్టం ప్రామాణికంగా తీసుకొంటోంది. రాష్ట్ర విభజన చట్టం సెక్షన్ 89 మేరకు ట్రిబ్యునల్ విచారణ జరుపుతున్నా దాన్ని పక్కనబెట్టి కేంద్ర ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాలతో మరొక ట్రిబ్యునల్‌ను నియమించింది. భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్‌కు ఏమైనా నష్టం, కష్టం సంభవిస్తే జగన్మోహన్‌రెడ్డితో పాటు బీజేపీ కూడా అందుకు బాధ్యులవుతుంది. వీరిని చరిత్ర క్షమించదు. సాగర్ కుడి కాలువ, తుంగభద్ర ఎగువ కాలువ, కేసీ కెనాల్ కింద పంటల విధానం మార్పు చేసి ఒక పంటకే నీళ్లు ఇచ్చి, మిగులు నీళ్లు తమకు కేటాయించాలని తెలంగాణ ట్రిబ్యునల్ ముందు డిమాండ్ చేసే పరిస్థితి వీరిద్దరూ కల్పించారు. ట్రిబ్యునల్ తీర్పు ఆంధ్రప్రదేశ్‌కు వ్యతిరేకంగా ఉంటే తీవ్రంగా నష్టపోయేది గొంతెండిపోతున్న రాయలసీమ మాత్రమే. కోస్తా ప్రాంతాన్ని గోదావరి నీళ్లు ఆదుకొంటాయి.

● వి. శంకరయ్య
విశ్రాంత పాత్రికేయులు

జ్ఞాన సరోవరంలో భారతీయ పద్మం

ప్రాచీన కాలంలో తన తాత్విక చింతనతో ఆచార్య నాగార్జునుడు ప్రపంచాన్ని ఉర్రూతలూగిస్తే ఆధునిక కాలంలో తెలుగువారైన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, జిడ్డు కృష్ణమూర్తి, ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి ప్రభృతులు తత్వశాస్త్రాన్ని సామాన్యులకు అర్థమయ్యేట్లు చేయటంలో అనుపమానమైన కృషి చేశారు. నేడు ఆచార్య సచ్చిదానందమూర్తి శతజయంతి. 1924 సెప్టెంబర్ 25న గుంటూరు జిల్లా సంగం జాగర్లమూడి గ్రామంలో సామాన్య రైతు కుటుంబంలో ఆయన జన్మించారు.

మతాల పట్ల అధ్యయన ఆసక్తి ఉన్న తండ్రి వీరభద్రయ్య ప్రభావంతో సచ్చిదానందమూర్తి చిన్నతనం నుండే పురాణేతిహాసాలు, దయానంద, వివేకానంద జీవిత చరిత్రలు, బైబిల్, ఖురాన్ తెలుగు అనువాదాలు చదివారు. ఇంటి వద్దనే సుప్రసిద్ధ పండితుల వద్ద సంస్కృతం, హిందీ అధ్యయనం చేశారు. అలా తత్వశాస్త్ర అధ్యయనం వైపు ఆకర్షితుడైన సచ్చిదానందమూర్తి సంప్రదాయ, నవీన తర్క శాస్త్రాలు, తులనాత్మక తత్వశాస్త్ర అధ్యయనాలలో ప్రముఖులు అయిన శైలేశ్వర్ సేన్, పి.టి. రాజు శిష్యరికంలో వైట్ హెడ్, ఉడ్ రాస్, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గ్రంథాలు, రామతీర్థకృతులు లోతుగా అధ్యయనం చేశారు. విశ్వవిఖ్యాత తత్వవేత్తగా ప్రసిద్ధి చెంది నాలుగు చెరగులా భారతీయ వేదాంత గరిమను సచ్చిదానందమూర్తి వ్యాప్తి చేసారు.

ఆచార్య సచ్చిదానందమూర్తి చిన్నతనంలో సుప్రసిద్ధ పండితులైన కాశీ కృష్ణమాచార్యుల వద్ద సంస్కృతం అభ్యసించారు. 15 ఏళ్ల వయసులో 'భగవద్గీత'పై వినూత్న దృక్పథంతో తెలుగులో వ్యాఖ్యానం చేసి సర్ సి.ఆర్. రెడ్డి ప్రశంస పొందారు. డాక్టర్ ఎస్. రాధాకృష్ణన్ దృష్టిని ఆకర్షించారు. ఆచార్య మూర్తి గుంటూరులో కళాశాల విద్య పూర్తి చేసి, ఆంధ్ర విశ్వకళాపరిషత్తులో 1946లో ఆనర్స్ డిగ్రీ తీసుకున్నారు. ఆ తరువాత కొద్ది కాలం తిరుపతి శ్రీ వేంకటేశ్వర కళాశాలలోనూ, ఒడిషాలోని మయూర్ భంజ్ కళాశాలలో కొంతకాలం పనిచేశారు.

1949లో ఆంధ్ర విశ్వవిద్యాలయ తత్వశాస్త్ర విభాగంలో అధ్యాపకుడిగా ప్రవేశించి, ఆ విభాగాధ్యక్షుడిగా, ఆచార్యుడిగా, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ కులపతిగా, అఖిల భారతీయ దర్శన పరిషత్ అధ్యక్షునిగా, ఇండియన్ ఫిలసాఫికల్ కాంగ్రెస్ అధ్యక్షునిగా, ఇండియన్ ఫిలాసాఫికల్ కాంగ్రెస్ నిర్వాహక వర్గ చైర్మన్‌గా, వివిధ పదవులు అలంకరించి యూరప్, ఏసియా, అమెరికా, ఆస్ట్రేలియా, ఖండాలన్నీ పర్యటించి, అక్కడి విశ్వవిద్యాలయాల సదస్సులలో తత్వశాస్త్రానికి సంబంధించిన అనేక విషయాలపై ప్రసంగాలు చేసి విద్వజ్జల మన్ననలు పొందారు.

ఏ పదవిలో ఉన్నా, ఏ వ్యాపకంలో ఉన్నా, ఆయన తత్వశాస్త్ర అధ్యయనానికే విశేష ప్రాధాన్యాన్ని ఇచ్చారు. అమెరికా, బ్రిటన్, చైనా, థాయిలాండ్, జపాన్, మంగోలియా, బర్మా మొదలైన పలు దేశాలలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. 1973–75లో యు.జి.సి. నేషనల్ ఫెలోగా, 1978, 1987 సం.లలో నేషనల్ ప్రొఫెసర్‌గా ఉన్నారు. పీ.వీ. నరసింహారావు ప్రధానమంత్రిగా జర్మనీని సందర్శించినప్పుడు అక్కడి ఇండాలజిస్టులు భారతదేశం ఒకప్పుడు తాత్విక విషయాలలో ఎంతో ముందున్నదనీ, దాని ఆ జ్ఞాన గరిమ పునరుద్ధరణకు పూనుకోవాలని ఆయనకు విజ్ఞప్తి చేశారు. భారతదేశం తిరిగి వచ్చిన వెంటనే నరసింహారావు దానిని నిర్వర్తించగల శక్తి సామర్థ్యాలు కలిగిన వ్యక్తి ఆచార్య సచ్చిదానందమూర్తేనని భావించి ఢిల్లీలోని ఐ.సి.సి.ఆర్ ఆధ్వర్యంలో కేరళలో భారతీయ దర్శనాలలో విశేష కృషి సల్పిన దేశ విదేశీయులతో, అంతర్జాతీయ సదస్సును నిర్వర్తించమని కోరారు. ఇది, ప్రొఫెసర్ మూర్తి బహుముఖ ప్రజ్ఞా ప్రాభవానికి ఒక మచ్చుతునక మాత్రమే.

సచ్చిదానందమూర్తి పాల్గొన్న తాత్విక సభలు, సమావేశాలు నూరుకు పైగా ఉంటాయి. 1958లో పాట్నాలో జరిగిన భారతీయ తత్వశాస్త్ర సభకు వారు అధ్యక్షులు. 1980–94 మధ్య ఇండియన్ ఫిలసాఫికల్ కాంగ్రెస్‌కు ఆయనే అధ్యక్షులు. 1993లో బ్యాంకాక్‌లో యునెస్కో తరఫున జరిగిన తాత్విక సభకూ ఆచార్య మూర్తే అధ్యక్షులు. సారనాథ్‌లో విశ్వవిద్యాలయ స్థాయిలో గల సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టిబెటియన్ స్టడీస్ అనే సంస్థకు వారు 1988 నుంచి అధ్యక్షులు.

ఆచార్య మూర్తి కృషికి గుర్తింపుగా మాస్కోలోని రష్యన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్, బల్గేరియాలోని సోఫియా యూనివర్సిటీ, బీజింగ్‌లోని పీపుల్స్ యూనివర్సిటీ ఆఫ్ చైనా, జర్మనీలోని హాల్ విట్టేవ్ యూనివర్సిటీ తదితర సంస్థలు గౌరవ డాక్టరేట్ డిగ్రీలు ప్రదానం చేశాయి. అత్యంత ప్రతిష్ఠాకరమైన పద్మవిభూషణ్ గౌరవం వారికి లభించింది. స్వామి ప్రణవానంద తత్వశాస్త్ర జాతీయ బహుమతి, శృంగేరి పీఠం వారి విద్యాసాగర్, వాచస్పతి లభించింది. ఇలా తాత్విక రంగంలో ఎవరూ పొందనన్ని గౌరవాలు వారు పొందారు. విశేష విద్వత్ కృషికి గుర్తింపుగా వారి 71వ ఏట నాగార్జున విశ్వవిద్యాలయంలో రూ. 30 లక్షల వ్యయంతో ఆఫ్రో–ఏసియన్ తత్వశాస్త్రాధ్యయన సంస్థ విదేశీ ప్రముఖుల సమక్షంలో ఏర్పడింది. ఈ సంస్థ ప్రారంభోత్సవానికి సెనెగల్ రిపబ్లిక్ అంబాసిడర్ అహ్మద్ ఎల్. మన్సూర్ దియోస్, దక్షిణ కొరియా అంబాసిడర్ బ్యూంగ్ యోంగ్ సోలు గౌరవ అతిథులుగా హాజరయ్యారంటేనే ఆచార్య మూర్తి కీర్తిప్రతిష్ఠలను అంచనా వేయవచ్చు. ఇంతటి అపూర్వ గౌరవం భారతదేశంలో ఒకరిద్దరికి మాత్రమే లభించి ఉండవచ్చు. ఆచార్య మూర్తి ఆంధ్రాంగ్ల భాషలలో 30కి పైగా గ్రంథాలు రాశారు. వీటిలో రివేలేషన్ అండ్ రీజన్ ఇన్ అద్వైత వేదాంత (1959), ఇండియన్ ఫారిన్ పాలసీ (1964), ఫార్ ఈస్టరస్ ఫిలాసఫీస్ (1975), అద్వైతిక్ విజన్ (1990) తదితర గ్రంథాలు వారి తాత్విక చింతనాగరిమకు గీటురాళ్లు. తత్వశాస్త్రం ఒక నిరంతర ప్రవాహమనీ, ఈ ప్రవాహంలో మానవుడు ఒక భాగమని వివరిస్తూ, తత్వశాస్త్రాన్ని సామాన్యుడికి అర్థమయ్యే రీతిలో అన్వయించిన అసాధారణ ప్రతిభాశాలి ఆచార్య మూర్తి. భారతీయ దర్శనాల అధ్యయనంలో రాధాకృష్ణన్ వారసత్వాన్ని ఆచార్య మూర్తి తన భుజస్కంధాలపై ఉంచుకొన్నారనీ అంటారు ప్రముఖ భాషా శాస్త్రవేత్త సునీతి కుమార్ చటర్జీ.



తత్వశాస్త్ర అధ్యయనంలో జాతి ఆధిక్యతలకు, అహంకారాలకు ఆస్కారం ఉండరాదని సచ్చిదానందమూర్తి హితవు చెప్పారు. సమాజ పురోగమనానికి అవసరమైన వాటిని విచక్షణతో పరిగ్రహించి, కాలం చెల్లిన వాటిని పరిత్యజించడంలోనే హేతుబద్ధమైన జీవిత విధానం, ఆలోచనా సమగ్రత, సంపూర్ణ మానవ ఆదర్శాల సంపూర్ణ అవగాహన సాధ్యమని ఆచార్య మూర్తి భావన.

తత్వశాస్త్రాన్ని నిర్వచిస్తూ 'ఏది ఉన్నదో అదే తత్వం. ఉన్నది ఉన్నట్లుగా చూడటం తత్వదర్శనం. ఉన్న దాని స్వరూపాన్ని గ్రహించటం తత్వశాస్త్ర లక్ష్యం. వేదాంతం తత్వశాస్త్రంలో ఒక భాగమని' ఆచార్య సచ్చిదానందమూర్తి అన్నారు. ప్రాక్పశ్చిమ తత్వశాస్త్రాల విశేష అధ్యయన అవగాహనతో ఆచార్య మూర్తి గీతలో బోధించిన సమదృష్టి అందరికీ కావాలంటారు. భర్తృహరి ఉద్ఘాటించిన శాస్త్ర సమత్వం కూడా వివిధ శాస్త్రాల పౌరసత్వక ఆధారిత ప్రక్రియా పద్ధతులలో సమన్వయంతో ఆయన పరిశీలించారు.

తత్వశాస్త్ర అధ్యయనంలో జాతి, దేశ ఆధిక్యతలకు, అహంకారాలకు ఆస్కారం ఉండరాదని సచ్చిదానందమూర్తి హితవు చెప్పారు. సమాజ పురోగమనానికి అవసరమైన వాటిని విచక్షణతో పరిగ్రహించి, ఇముడ్చుకుంటూనే కాలం చెల్లిన వాటిని పరిత్యజించడంలోనే హేతుబద్ధమైన జీవిత విధానం, ఆలోచనా సమగ్రత, మానవ ఆదర్శాల సంపూర్ణ అవగాహన సాధ్యమని ఆచార్య మూర్తి భావన.



తత్వశాస్త్రంలో విశేషమైన కృషి చేసిన వారికి ప్రదానం చేయుటకు ఏర్పాటు చేయబడిన అత్యున్నతమైన డాక్టర్ బి.సి రాయ్ జాతీయ బహుమతి తొలిసారిగా ఆచార్య సచ్చిదానందమూర్తికి ఇచ్చి ఆ బహుమతి నిర్వాహకులు తమ గౌరవాన్ని పెంచుకున్నారు. తత్వశాస్త్ర అధ్యయన జగత్తులో డాక్టర్ రాధాకృష్ణన్ తరువాత ప్రపంచవ్యాప్తంగా దాదాపు అన్ని గౌరవాలు, సన్మానాలు పొందిన ప్రజ్ఞామూర్తి సచ్చిదానందమూర్తి. రాగద్వేషాలకు అతీతంగా, కీర్తి కాంక్షలకు దూరంగా, తనకు ప్రియమైన స్వగ్రామంలో అధ్యయన, అనుశీలన, రచనా, వ్యాసంగాలతో జీవించి వున్నంతవరకు గడిపారు. ప్రపంచమంతా చుట్టి వచ్చినా, మూడున్నర దశాబ్దాల పాటు కాస్మోపాలిటన్ సిటీగా ప్రసిద్ధి చెందిన విశాఖపట్నంలో ఉన్న ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పదవీ విరమణ చేసిన తరువాత తన కన్న ఊరు అయిన సంగం జాగర్లమూడిలో పితృ పితామహులు నివసించిన ఇంటిలోనే నివసిస్తూ అవకాశం, అవసరం, కలిగినప్పుడల్లా తన మేధాశక్తిని సమాజానికి పంచుతూ వచ్చారు.

అప్పుడప్పుడు అవసరానికి మించి కటువుగా మాట్లాడటం, తన సంభాషణలో తీవ్రమైన వ్యంగ్యాన్ని విసరటం, గిలిగింతలు పెట్టే హాస్యాన్ని వెదజల్లటం, సరుకున్నవాడు ఎంత చిన్నవాడైనా ఆదరించటం, సరుకు లేని వాళ్ళు ఎంత ఉన్నతులైనా తృణీకరించటం ఆచార్య మూర్తి ప్రత్యేక లక్షణాలు. ఒత్తిడుల జీవితానికి దూరంగా ఉంటూ కలిమిలేములకు ఆనంద విషాదాలకు లొంగని స్థితప్రజ్ఞుడు, తాత్విక సంపన్నుడు. భారతీయ తత్వదృక్పథాన్ని విశ్వవ్యాప్తంగా వ్యాపింపచేసిన ఆధునిక నాగార్జునుడు. నవీన బుద్ధఘోషుడు ఆచార్య మూర్తిగారు. విద్యావేత్తగా, తత్వశాస్త్ర పీఠాధిపతిగా, జాతీయ, అంతర్జాతీయ కీర్తిప్రతిష్ఠలు సంతరించుకున్న మహామనిషి ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి 2011 జనవరి 24వ తేదీన స్వగ్రామమైన సంగం జాగర్లమూడిలో కన్నుమూశారు.

■ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్
జాతీయ అధ్యక్షులు, విశ్వ హిందీ పరిషత్

(నేడు ఆచార్య సచ్చిదానందమూర్తి శతజయంతి)



ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5

ఎన్.టి.ఆర్
జిల్లా వార్తలు
బుధవారం 25 సెప్టెంబరు 2024

పవిత్ర మెట్ల పూజతో అమ్మవారి సేవలో..

దుర్గమ్మను దర్శించుకున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



● పవిత్ర కృష్ణాజలంతో మెట్లు కడిగి, శుభ్రం చేసి, పసుపు రాసి, కుంకుమ బొట్లు పెట్టి, కొబ్బరికాయ కొట్టి..

విజయవాడ, సెప్టెంబరు 24 : వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుపతి లడ్డూ ప్రసాదానికి కలిగిన అపవిత్రతను తొలగించేందుకు 11 రోజుల ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మంగళవారం జగజ్జనని బెజవాడ కనక దుర్గమ్మను దర్శించుకున్నారు. ఇంద్రకీలాద్రిపై అడుగు పెట్టే ముందు దుర్గామల్లేశ్వరస్వామి ఆలయం మెట్లను అత్యంత భక్తి శ్రద్ధలతో కృష్ణాజలంతో కడిగి, పసుపు రాసి, కుంకుమ బొట్లు పెట్టారు. చివరి మెట్టుపై కొబ్బరికాయ కొట్టి ఆలయ ప్రాంగణంలోకి పాదం మోపారు. ఆయన వెంట మెట్ల పూజలో ఎంపీలు వల్లభనేని బాలశౌరి, కేశినేని శివనాథ్ (చిన్ని), కూటమి నేతలు పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం ఆయనకు వేదపండితులు, అర్చకులు ఆశీస్సులు అందజేశారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మెట్ల పూజ చేస్తున్నంత సేపూ అభిమానులు, కూటమి నాయకులు పెద్ద సంఖ్యలో అక్కడే ఉండి వీక్షించడంతో కొండపై కోలాహలం నెలకొంది.



ఎక్సైజ్‌లో బదిలీలలు!

కీలక స్టేషన్లలో సీఐ పోస్టింగ్‌ల కోసం పోటాపోటీ

- నూతన మద్యం పాలసీతో పంట పండుతుందన్న ఆశ
- భారీగా ఖర్చు పెట్టుకునేందుకూ వెనుకాడకుండా ప్రయత్నాలు



(విజయవాడ - ఆంధ్రజ్యోతి) ఎక్సైజ్ శాఖలో బదిలీల సందడి కొనసాగుతోంది. మిగిలిన శాఖల్లో బదిలీల ప్రక్రియ ముగిసిపోగా ఎక్సైజ్‌శాఖలో ఈ నెల 30వ తేదీతో బదిలీల ప్రక్రియ ముగియనుంది. ఇప్పటికే డిప్యూటీ కమిషనర్, సూపరింటెండెంట్ పోస్టులకు ప్రయత్నాలు చేసుకున్న వారు దాదాపు తమ తమ పోస్టులను ఖరారు చేసుకోగా, తాజాగా సీఐల పోస్టులకు భారీ ఎత్తున డిమాండ్ నెలకొంది. వైసీపీ హయాంలో ఆ పార్టీ నేతలతో అంటకాగిన వారు, ఏళ్ల తరబడి జిల్లాలో చేసి ప్రస్తుతం బయట చేస్తున్న వారు మళ్లీ రెండు జిల్లాల్లో కీలక స్థానాల్లో పోస్టింగ్ కోసం పెద్ద ఎత్తున పైరవీలు చేసుకుంటున్నారు. కృష్ణా జిల్లాలో 8 ఎక్సైజ్ స్టేషన్లు ఉండగా అక్కడ ఎనిమిది మంది సీఐలు విధులు నిర్వహిస్తుంటారు. జిల్లాకో టాస్క్‌ఫోర్స్ సీఐ ఉంటారు. ఎన్టీఆర్ జిల్లాలోనూ ఎనిమిది ఎక్సైజ్ స్టేషన్లకు ఎనిమిది మంది సీఐలు, ఓ టాస్క్‌ఫోర్స్ సీఐ పనిచేస్తుంటారు. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలకు కలిపి గుడివాడ, గొల్లపూడి, నిడమానూరుల్లో ఎక్సైజ్ డిపోలు ఉన్నాయి. ఇక్కడ ముగ్గురు సీఐలు విధులు నిర్వహిస్తుంటారు. మొత్తం మీద 21 మంది సీఐలు రెండు జిల్లాల్లో పనిచేస్తుంటారు.

ఎక్సైజ్‌శాఖలో బదిలీలకు మంచి గిరాకీ ఏర్పడింది. ప్రభుత్వం తెచ్చిన నూతన మద్యం పాలసీ కాసుల వర్షం కురిపిస్తుందన్న ఆశతో కీలకమైన స్టేషన్లపై అధికారులు కన్నేశారు. ఎంత ఖర్చుకైనా వెనుకాడబోమంటూ ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. సిఫార్సు లేఖల కోసం స్థానిక ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు.

కీలక స్టేషన్లపైనే అందరి గురి

విజయవాడ నగరంలోని విజయవాడ తూర్పు(పటమట), విజయవాడ పశ్చిమ(సీతారాంపురం), భవానీపురం స్టేషన్లకు బాగా డిమాండ్ ఉంది. వీటితోపాటు విజయవాడ శివారులోని గన్నవరం, పెనమలూరు సీఐ పోస్టులకూ పోటీ ఎక్కువగా ఉంటుంది. గతంలో విజయవాడ తూర్పు, భవానీపురం స్టేషన్లలో సుదీర్ఘకాలం పనిచేసి ప్రస్తుతం రాజమండ్రిలో చేస్తున్న ఓ సీఐ తిరిగి నగరంలోని ఏదో ఒక స్టేషన్‌కు రావాలని విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే నగరానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి సిఫార్సు లేఖ కూడా ఆయన తీసుకున్నారు. మరో సీఐ భవానీపురం స్టేషన్‌లో చాలాకాలం పనిచేసి ఆ తర్వాత గొల్లపూడి డిపోలో కొంతకాలం చేశారు. తప్పనిసరిగా జిల్లా మారాలన్న నిబంధన కారణంగా కొంతకాలం గన్నవరం వెళ్లి అక్కడ పనిచేసి తిరిగి నగరానికి వచ్చారు. ఎన్నికల సమయంలో ఏలూరుకు బదిలీ చేశారు. ఆయన తిరిగి నగరంలోని ఏదో ఒక స్టేషన్‌లో పోస్టింగ్ కోసం విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. మచిలీపట్నం స్టేషన్‌లో పోస్టింగ్ కోసం కూడా పెద్ద ఎత్తున పైరవీలు నడుస్తున్నాయి.

నూతన మద్యం పాలసీతోనే..

ప్రభుత్వ మద్యం దుకాణాలను రద్దు చేసి ప్రైవేటు మద్యం దుకాణాలు వస్తున్న నేపథ్యంలో గతంలో ఎన్నడూ లేనంత డిమాండ్ ఈ పోస్టింగ్‌లకు ఏర్పడింది. ప్రభుత్వం నూతన మద్యం పాలసీని అనుసరించి టెండర్ల ద్వారా లేదా లాటరీ ద్వారా మద్యం షాపులను ప్రైవేటు వ్యక్తులకు కేటాయించనుంది. దీంతో ప్రైవేటు వ్యక్తులు సిండికేట్ ద్వారా మద్యం ధరలు పెంచి విక్రయాలు సాగించేందుకు అవకాశం ఉంది. దీన్ని ఆసరాగా చేసుకుని అధికారులు నెల మామూళ్లకు తెరలేప వచ్చనే ఆశతో మంచి స్టేషన్ల కోసం పోటీలు పడుతున్నారు. సీఐలకు స్థానిక ప్రజాప్రతినిధి సిఫార్సు లేఖ తప్పనిసరి కావడంతో చాలా మంది సిఫార్సు లేఖల కోసం ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నారు. ఎంత ఖర్చయినా పెట్టుకుని కీలక స్టేషన్లలో పోస్టింగ్‌ల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.

రెవెన్యూలోనూ అదే జాతర

జిల్లాలో ఆరుగురు తహసీల్దార్లకు స్థానచలనం

- 48 మంది డిప్యూటీ తహసీల్దార్లు కూడా..
- పూర్తిస్థాయిలో వీఆర్వోల అంతర జిల్లా బదిలీలు
- కొలిక్కిరాని డీఆర్‌ఓ, ఆర్‌డీఓల వ్యవహారం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): రెవెన్యూ విభాగంలో భారీ ఎత్తున అధికారుల బదిలీలు చేపట్టారు. తహశీల్దార్ల బదిలీలు ఇంతకు ముందే జరిగినా ఎన్టీఆర్ జిల్లాలో మరో ఆరుగురు తహశీల్దార్లకు స్థానచలనం కల్పించారు. జగ్గయ్యపేటలో పనిచేస్తున్న ఎం.వెంకటరామయ్యను విజయవాడ సెంట్రల్ మండల తహశీల్దార్‌గా బదిలీ చేశారు. ఇక్కడ ఉన్న ఎం.సూర్యారావును విజయవాడ నార్త్ మండల తహశీల్దార్‌గా నియమించారు. చందర్లపాడులో పనిచేస్తున్న ఎం.పాల్‌ను ఏ కొండూరు తహశీల్దార్‌గా బదిలీ చేశారు. అక్కడ ఉన్న బి.ఆశయ్యను చందర్లపాడు తహశీల్దార్‌గా నియమించారు. తూర్పు గోదావరి జిల్లా నుంచి బదిలీపై ఇక్కడి వచ్చిన ఎం.రామకృష్ణను ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్‌గా నియమించారు. పశ్చిమ గోదావరి జిల్లా నుంచి బదిలీపై వచ్చిన ఎస్‌కే హుస్సేన్‌ను వీరులపాడు తహశీల్దార్‌గా బదిలీ చేశారు. అలాగే డిప్యూటీ తహశీల్దార్లను పూర్తి స్థాయిలో బదిలీ చేశారు. మొత్తం 48 మంది డిప్యూటీ తహశీల్దార్లకు స్థాన చలనం కలిగింది.

199 మంది వీఆర్‌ఓల బదిలీ

ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా వీఆర్‌ఓల స్థాయిలో పూర్తిగా అంతర జిల్లా బదిలీలు జరిగాయి. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా 199 మంది వీఆర్‌ఓలను బదిలీ చేశారు. వీరిలో గ్రేడ్-1 వీఆర్‌ఓలు 113 మంది, గ్రేడ్ - 2 వీఆర్‌ఓలు 86 మందికి స్థానచలనం కల్పించారు. అయితే విజయవాడ రూరల్ మండలం పరిధిలో పాతుకుపోయిన వీఆర్‌ఓలను కదిలించాలని అధికార పార్టీ నుంచి సూచనలు వచ్చినా ఎక్కడా అమలుకు నోచుకోలేదు. ఇక్కడ పాతుకుపోయిన వీఆర్‌ఓలంతా ఇదే మండలం పరిధిలోని సమీప గ్రామాల్లో పోస్టులు తెచ్చుకోవటం గమనార్హం. అలాగే జిల్లా వ్యాప్తంగా మొత్తం 38 సీనియర్ అసిస్టెంట్లకు స్థాన చలనం లభించింది. జూనియర్ అసిస్టెంట్ల విషయానికి వస్తే కేవలం 10 మందిని మాత్రమే బదిలీ చేయటం గమనార్హం. జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్లుగా పనిచేసే వారిలో కేవలం ఒక్కరిని మాత్రమే బదిలీ చేశారు. ఏ కొండూరు మండలంలో పనిచేసే బణావతు పవన్ సాయి నాయక్‌ను కంచికచర్ల పంపారు. కాగా, డీఆర్‌ఓ, ఆర్‌డీఓలకు సంబంధించి ఇంకా సస్పెన్స్ కొనసాగుతోంది.

సముచిత స్థానం


కొనకళ్ల నారాయణరావు

కొనకళ్ల నారాయణరావుకు ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ పదవి

- మెరుగైన సేవలందించి పదవికి న్యాయం చేస్తా
- ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు కృతజ్ఞతలు : కొనకళ్ల

మచిలీపట్నం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్‌గా కొనకళ్ల నారాయణరావును నియమిస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పదవికి కట్టబెట్టడంతో ఆయనకు సముచిత స్థానం కల్పించినట్లయింది. మచిలీపట్నం ఎంపీగా గతంలో రెండు సార్లు, లోక్‌సభ ప్యానల్ స్పీకర్ గా పనిచేసి గుర్తింపు పొందిన కొనకళ్ల నారాయణరావు ప్రస్తుతం కృష్ణాజిల్లా టీడీపీ అధ్యక్షుడిగా ఉన్నారు. ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో కూటమి పొత్తులో భాగంగా మచిలీపట్నం ఎంపీ స్థానాన్ని జనసేనకు కేటాయించారు. దీంతో కొనకళ్ల ఎన్నికల్లో పోటీ చేయకుండా కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేశారు. కొనకళ్లకు సముచితస్థానం కల్పిస్తామని ఎన్నికల సమయంలోనూ, కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చెబుతూ వచ్చారు. ఆర్టీసీ చైర్మన్ పదవి ఇవ్వడం ద్వారా ఆ మాటను నిలబెట్టుకున్నారు.

కొనకళ్లకు అభినందనల వెల్లువ

ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్‌గా నియమితులైన కొనకళ్ల నారాయణరావును మచిలీపట్నంలోని ఆయన నివాసంలో పలువురు కూటమి నాయకులు మంగళవారం కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వంలో తనను ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్‌గా నియమించినందుకుగాను ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు టీడీపీలో తనకు అత్యంత ప్రాధాన్యతనిచ్చారన్నారు. జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా నియమించడంతోపాటు, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ పదవిని తనకు ఇచ్చారని అన్నారు. తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించి ప్రజలకు సేవ చేస్తానని తెలిపారు. సమైక్యాంధ్ర ఉద్యమ సమయంలో పార్లమెంటులో తాను చేసిన పోరాటాన్ని చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ప్రత్యేకంగా గుర్తుంచుకుని, తన త్యాగాన్ని పలు సభల్లో ప్రస్తావించారన్నారు. ఆ విషయం తనకు ఎంతగానో స్ఫూర్తినిచ్చిందని కొనకళ్ల అన్నారు.

రైల్ నీర్ ప్లాంట్ రెడీ

- అక్టోబరు రెండో వారంలో ప్రారంభం.. కేంద్ర మంత్రి రాక
- విజయవంతంగా ట్రయల్ రన్స్

6లో

బొండా అనుచరుల అత్యుత్సాహం

వరద సాయం అడిగేందుకు వచ్చిన బాధితుడిపై దాడి

- అడ్డుకోబోయిన మహిళలకు బెదిరింపులు
- భారీగా జనం రావడంతో వదిలేశారు


బాధితుడిని స్తంభానికి కట్టేసి కొడుతున్న ఉమా అనుచరులు

అజిత్‌సింగ్‌నగర్, సెప్టెంబరు 24 : వరద బాధితులపై ఎమ్మెల్యే బొండా ఉమా అనుచరులు అత్యుత్సాహం ప్రదర్శించారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయం వద్దకు వరద సాయం అడిగేందుకు వచ్చిన బాధితుల్లో ఓ వ్యక్తిని ఇనుప పోల్‌కు కట్టేసి కొట్టారు. దాసరి దుర్గారావు అలియాస్ పెప్సీ, బెజ్జం జైపాల్, మొత్యారి ఖాశీం, గౌస్ బాషాలతో పాటు సుమారు 15 మంది ఎమ్మెల్యే అనుచరులు విచక్షణా రహితంగా బాధితుడిపై దాడికి పాల్పడ్డారు. అందిన వివరాల ప్రకారం వరద ముంపు ప్రాంతాల్లో ఇంటింటికి ప్రభుత్వం బియ్యం, నిత్యావసర సరుకులు సరఫరా చేసింది. అలాగే సెంట్రల్ ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ఇతర స్వచ్ఛంద సంస్థల నుంచి కూడా వివిధ ప్రాంతాల్లో నిత్యావసరాలను అందించారు. నిత్యావసరాలు అందని వరద బాధిత కుటుంబాలు గత ఐదు రోజులుగా బొండా ఉమా కార్యాలయానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి ఓ వ్యక్తి సెంట్రల్ కార్యాలయానికి వచ్చి తమకు సహాయం అందలేదని చెప్పుకున్నాడు. మద్యం మత్తులో ఉన్న సదరు వ్యక్తి బొండా ఉమాకు ఓట్లు వేసి గెలిపించి తప్పు చేశామంటూ గట్టిగా మాట్లాడాడు. దాంతో సదరు వ్యక్తిని ఈడ్చుకువెళ్లిన బొండా ఉమా అనుచరులు తీవ్ర పదజాలంతో తిడుతూ అతనిపై దాడి చేశారు. అంతటితో శాంతించకుండా అతన్ని పార్టీ కార్యాలయం ఎదురు ఇనుప పోల్‌కు కట్టివేసి సుమారు విచక్షణా రహితంగా దాడి చేశారు. దాంతో ధైర్యం చేసిన కొందరు మహిళలు దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించినా ప్రయోజనం లేకపోయింది. దీంతో భయపడిన మహిళలు కార్యాలయం నుంచి 20 మీటర్ల దూరంలో నిలబడిపోయారు. అరగంటపాటు సినిమా తరహాలో దాడి జరిగినా ఒక్క పోలీసు అధికారి కూడా ఆ దిక్కుకు వెళ్లలేదు. విషయం స్థానికంగా వ్యాపించి భారీగా ప్రజలు కార్యాలయం వద్దకు చేరుకుంటుండంతో ఉమా అనుచరులు అతనికి కట్లు విప్పి పంపించి వేశారు. అయితే ఉమా అనుచరుల చేతిలో చావుదెబ్బలు తిన్న అనుచరుడు ఎవరనే విషయం తెలియరాలేదు.



అపర్ణ మృతదేహం

భవిష్యత్తుపై కోటి ఆశలతో గురుకులానికి వచ్చిన చిన్నారిని చిదిమేసిన పాపం ఎవరిది?. పేదింటి బిడ్డలను అక్కున చేర్చుకుని ఆదరించాల్సిన గురుకుల సిబ్బంది నిర్లక్ష్యానిదా! విద్యాబుద్ధులు నేర్పి భావి పౌరులుగా తీర్చిదిద్దాల్సిన ఉపాధ్యాయుల ఉదాసీనతదా! వైద్యం అందించి ప్రాణాలు పోయాల్సిన వైద్యులు, సిబ్బంది అలసత్వానిదా! ఎవరిదీ పాపం. ఎప్పుడు మారతారు వీరు. ఇంకెన్ని దీపాలు ఆరాలో వీరిలో మార్పునకు.. - చందర్లపాడు

ఈ పాపం ఎవరిది?

అనారోగ్యంతో గురుకుల విద్యార్థిని మృతి

- 15 రోజులుగా ఇబ్బంది పడుతున్నా అలాగే వదిలేశారు
- అపస్మారక స్థితిలో ఆస్పత్రికి తరలింపు.. అక్కడా నిర్లక్ష్యమే
- అసలు 'గురుకులం'లో ఏం జరిగింది అనే దానిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం

15 రోజుల కిందట ఒక ట్యాబ్లెట్ ఇచ్చి సరిపెట్టారు..

ఎనిమిదవ తరగతి విద్యార్థిని కస్తాల అపర్ణ(13) ఈ నెల 9వ తేదీన అనారోగ్యానికి గురైంది. తనకు ఆరోగ్యం బాగా లేదని ఉపాధ్యాయులు, హాస్టల్ నిర్వాహకులకు చెప్పింది. దీంతో వారు ఆమెకు ఒక ట్యాబ్లెట్ ఇచ్చి చేతులు దులుపుకున్నారు. సరైన వైద్య సేవలు గానీ, పౌష్టికారం గానీ అందించలేదు. దీంతో అప్పటి నుంచి నీరసంగానే ఉంది. తోటి విద్యార్థినులు గమనించి ఈ విషయాన్ని ఉపాధ్యాయులకు చెప్పినా పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో సోమవారం విద్యార్థిని అపస్మారక స్థితికి చేరుకుంది. 15 రోజులుగా ఆ చిన్నారి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నా తల్లిదండ్రులకు కనీస సమాచారం ఇవ్వలేదు. అపస్మారక స్థితికి చేరిన అపర్ణను నందిగామ ప్రభుత్వ వైద్యశాలలో చేర్చిన తర్వాత పరిస్థితి చేయి దాటుతుందని గ్రహించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. కనీసం తల్లిదండ్రులు వైద్యశాలకు వచ్చే వరకూ కూడా ఉండకుండా చిన్నారిని వదిలేసి వెళ్లిపోయారు.

- మిగతా 6లో

వైసీపీకి కొత్త సారథులు?

- కృష్ణాజిల్లాకు పేర్ని నాని
- ఎన్టీఆర్ జిల్లా బాధ్యతలు దేవినేని అవినాశ్‌కు
- నేడు జగన్ వద్ద రెండు జిల్లాల నేతల భేటీ

6లో

నగరానికి నిఘారింపు



విజయవాడలో కొత్తగా 200 సీసీ కెమెరాల ఏర్పాటు

- కమిషనరేట్ పరిధిలో 2 వేల నిఘానేత్రాలతో పటిష్ట భద్రత
- కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అదనంగా మరో ముగ్గురు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) విజయవాడ కమిషనరేట్ పరిధిలో నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నారు. నగరంతో పాటు కమిషనరేట్ పరిధిలో ప్రధానమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయబోతున్నారు. తాజాగా 100 సీసీ కెమెరాలను కొత్తగా కొనుగోలు చేశారు. ప్రస్తుతం కమిషనరేట్ పరిధిలో రెండు వేల సీసీ కెమెరాలు ఉన్నాయి. వాటిలో కొన్ని సాంకేతిక కారణాలతో పనిచేయడం లేదు. వాటి స్థానంలో కొత్త కెమెరాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇంద్రకీలాద్రిపై వచ్చే నెల మూడో తేదీ నుంచి శరన్నవరాత్రులు ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాల్లో అమ్మవారి దర్శనం కోసం దేశం నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివస్తారు. కమిషనరేట్ పరిధిలో ఉన్న అన్ని సీసీ కెమెరాలు విజయవాడ ఎంజీ రోడ్డులో ఉన్న ఆపరేషనల్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానమై ఉంటాయి. ఈ కెమెరాలు చిత్రీకరించే దృశ్యాలను వీక్షించడానికి వీడియో వాల్ ఉంది. సిబ్బంది కంప్యూటర్లలో సీసీ కెమెరాలు చిత్రీకరించే దృశ్యాలను చూస్తుంటారు. దాన్ని పెద్దది చేసి చూడాలనుకున్నప్పుడు వీడియో వాల్‌పై డిస్‌ప్లే చేస్తారు. కొద్దిరోజుల కిందట వీడియో వాల్ పాడైపోయింది. దాన్ని తిరిగి వాడుకలోకి తీసుకొచ్చారు. నగరంలో ప్రధాన కూడళ్లలో ఉన్న సీసీ కెమెరాలను ట్రాఫిక్‌తో పాటు ఇతర అంశాలకు సంబంధించి ఉపయోగిస్తున్నారు. కమిషనరేట్ పరిధిలో పీటీజెడ్, బుల్లెట్ సీసీ కెమెరాలు ఉన్నాయి. ఇవి కాకుండా పోలీసులు వివిధ సంస్థలు, వాణిజ్య సముదాయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. ఈ మొత్తం సీసీ కెమెరాలన్నీ నిరంతరం పనిచేసేలా అధికారులు ప్రణాళిక రూపొందించారు. శరన్నవరాత్రుల్లో నగరం మొత్తాన్ని నిఘా నేత్రాల్లో బంధించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ బలోపేతానికి సిబ్బంది సంఖ్యను పెంచారు. ఇంతకుముందు ఇక్కడ పది మంది సిబ్బంది ఉండే వారు. మొత్తం రెండు షిఫ్టుల్లో విధులు నిర్వర్తిస్తారు. ఇప్పుడు ఇక్కడ సిబ్బంది సంఖ్యను 13కి పెంచారు. సాంకేతిక పరిజ్ఞానంపై పూర్తి అవగాహన, నైపుణ్యం ఉన్న పోలీసులను ఇక్కడికి బదిలీ చేశారు. కొత్తగా కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు వచ్చిన వారికి అధికారులు శిక్షణ ఇస్తున్నారు. వీడియో ఎడిటింగ్, వీడియోలపై పాయింట్ మ్యాపింగ్‌లపై తర్ఫీదు ఇస్తున్నారు.

రైల్ నీర్ ప్లాంట్ రెడీ

» అక్టోబరు రెండో వారంలో ప్రారంభం.. కేంద్ర మంత్రి రాక » విజయవంతంగా ట్రయల్ రన్స్



(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

అక్టోబరు రెండోవారంలో రైల్ నీర్ బాటిళ్ల ప్లాంట్‌ను ప్రారంభించేందుకు ఐఆర్‌సీటీసీ రంగం సిద్ధం చేస్తోంది. అక్టోబరు 3న ప్రారంభించాలని ముందుగా నిర్ణయించినా.. అనివార్య కారణాల వల్ల రెండో వారానికి

మల్లవల్లిలో మరో ప్రతిష్ఠాత్మక పరిశ్రమ ఐఆర్‌సీటీసీ 'రైల్ నీర్' బాట్లింగ్ ప్లాంట్ సిద్ధమైంది. అక్టోబరు రెండో వారంలో బాట్లింగ్ ప్లాంట్‌ను అధికారులు ప్రారంభించనున్నారు. ప్లాంట్ ఇప్పటికే పూర్తికాగా పక్షం రోజులుగా ట్రయల్ రన్స్ జరుగుతున్నాయి. ఎలాంటి ఆటంకాలు లేకుండా బాటిళ్ల ఉత్పత్తి జరుగుతోంది.

వాయిదా పడింది. కేంద్ర రైల్వే మంత్రి దీనిని ప్రారంభిస్తారని తెలుస్తోంది. పన్నెండేళ్ల క్రితం బెజవాడకు కేంద్ర ప్రభుత్వం రైల్‌నీర్ బాట్లింగ్ ప్లాంట్‌కు కేటాయింపులు చేసింది. అయితే ఈ ప్రాజెక్టు అప్పట్లో పట్టాలెక్కలేదు. ప్రాజెక్టును ఎక్కడ ఏర్పాటు చేయాలన్న మీమాంస చాలాకాలం నడిచింది. రైల్వే స్థలాలు అందుబాటులో లేకపోవటంతో కృష్ణానది దగ్గర రైల్వే బ్రిడ్జి సమీపంలో రైల్ నీర్ బాట్లింగ్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని అప్పట్లో ప్రజల నుంచి సూచనలు కూడా వచ్చాయి. అయితే ఇక్కడ సాధ్యం కాదని ఐఆర్‌సీటీసీ అభిప్రాయపడింది. దీంతో కేంద్ర ప్రభుత్వం ప్రాజెక్టును కార్యరూపంలోకి తీసుకు రాలేదు. రాష్ట్ర విభజన జరిగి 2014లో టీడీపీ ప్రభుత్వం కొలువు తీరిన తర్వాత మల్లవల్లి మోడల్ ఇండస్ట్రియల్ పార్క్‌ను అభివృద్ధి చేసి పరిశ్రమలు పెట్టేవారికి తక్కువ ధరకు భూములను అవుట్ రేట్ సేల్ (ఓఆర్ఎస్) విధానంలో అమ్మకాలు పెట్టడం, పలు ప్రోత్సాహకాలు అందించటంతో.. ఐఆర్‌సీటీసీ అధికారులు మల్లవల్లిలో భూములు కొన్నారు. బాట్లింగ్ ప్లాంట్ ఏర్పాటుకు వెంటనే టెండర్లు కూడా పిలిచారు. గుణ్‌రాజ్ సంస్థ టెండర్లు దక్కించుకుని యూనిట్‌ను ఏర్పాటు చేసింది. మెషినరీని కొంత మేర తీసుకువచ్చింది. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత పనులు నిలిచిపోయాయి. లక్షల విలువ చేసే





మల్లవల్లిలో ఉత్పత్తికి సిద్ధంగా ఉన్న ప్లాంట్

మోటార్లు, ఇతర పరికరాల చోరీకి గురయ్యాయని ఆరోపణలు వచ్చాయి. సంఘ విద్రోహశక్తులు అక్కడ జూద కార్యక్రమాలు నిర్వహించారు. ప్లాంట్ పనులు అంగుళం కూడా ముందుకు పడలేదు. దీంతో ఆ సంస్థను వదిలించుకోవటానికి ఐఆర్‌సీటీసీ మూడేళ్ల కాలం పట్టింది. మళ్లీ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే సందర్భంలో గుణ్‌రాజ్ సంస్థకు తుది ఫైనల్ నోటీసు ఇచ్చి కాంట్రాక్టు నుంచి టెర్మినేషన్ చేసింది. ఆ తర్వాత వాటర్ బాటిళ్ల రంగంలో మంచి పేరున్న 'మెకాయ్ ఆక్వా' సంస్థకు ప్లాంట్ పనులు అప్పగించటం జరిగింది. మెకాయ్ ఆక్వా ఆధ్వర్యంలో ప్లాంట్ పనులు చకచకా సాగాయి. టీడీపీ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ప్లాంట్‌ను దాదాపుగా పూర్తి చేసింది. కొద్ది రోజులుగా వాటర్ బాటిళ్ల ఉత్పత్తిని కూడా ట్రయల్ రన్ విధానంలో ప్రారంభించింది. రైల్ నీర్ వాటర్ బాటిళ్లు అందుబాటులోకి వస్తే రైలు ప్రయాణికులకు తక్కువ ధరకు నాణ్యమైన తాగు నీరు అందే అవకాశం ఉంది. ఇప్పటి వరకు అధికారులు సికింద్రాబాద్ నుంచి రైల్‌నీర్‌ను తెప్పిస్తున్నారు. రవాణా చార్జీలు అదనపు భారంగా మారుతున్నాయి. విజయవాడ బాట్లింగ్ ప్లాంట్ అందుబాటులోకి వస్తే అటు హైదరాబాద్, ఇటు విశాఖపట్నం వరకు అతిపెద్ద రైల్‌నీర్ సరఫరాదారుగా ఉంటుంది.



స్థానిక మహిళకు కరపత్రం ఇస్తున్న ఎంపీ కేశినేని చిన్ని

ఇది మంచి ప్రభుత్వం

» ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)

పాతరాజరాజేశ్వరి పేట, సెప్టెంబరు 24 : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని, ఇచ్చిన మాట ప్రకారం హామీలు నెరవేర్చే ప్రభుత్వమని విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఎన్డీయే కూటమి వందరోజుల పాలనపై రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని 55వ డివిజన్ నైజాంగేట్ ప్రాంతంలో మంగళవారం ప్రారంభించారు. ఎంపీ ఇంటింటికి వెళ్లి చంద్రబాబు నాయకత్వంలో వంద రోజుల్లో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వివరించి, 'ఇది మంచి ప్రభుత్వం' స్టిక్కర్‌లను నివాసాలకు అంటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్నివర్గాల ప్రజల అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ఇమామ్‌లకు రూ.10వేలు, మౌజామ్‌లకు రూ.5వేల గౌరవ వేతనం వచ్చేనెల నుంచి ఇవ్వనున్నట్టు చెప్పారు. అలాగే హజ్ యాత్రికులకు రూ.లక్ష ప్రభుత్వం అందించనుందన్నారు. పశ్చిమలో డ్రెయినేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తానని, నైజాంగేట్ ప్రాంతంలోని రైల్వేలైన్‌ల కింద ఉన్న డ్రెయిన్లను మెరుగుపరిచే విషయం అధికారులతో మాట్లాడతానని స్థానికులకు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్రకార్యదర్శి గన్నెప్రసాద్ (అన్నా), అధికార ప్రతినిధి నాగుల్ మీరా, కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్, నాయకులు ఫతావుల్లా, జాహిద్, హర్షద్, సొంగా సంజయ్ వర్మ, షేక్ కరిముల్లా, వడ్డాది రమణ, యేదుపాటి రామయ్య తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ తరఫున రూ.5 లక్షల చెక్కు అందజేస్తున్న తంగిరాల సౌమ్య

అపర్ణ కుటుంబాన్ని ఆదుకుంటాం

» ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

నందిగామ, సెప్టెంబరు 24 : ఉపాధ్యాయులు, వైద్యుల నిర్లక్ష్యం కారణంగా మృతిచెందిన గురుకుల విద్యార్థిని కస్తాల అపర్ణ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. మంగళవారం అపర్ణ మృతదేహాన్ని పరిశీలించిన ఆమె పాఠశాల ఉపాధ్యాయుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్డీవో రవీంద్రరావు, ఏసీపీ రవికిరణ్‌తో కలిసి ఆమె ఘటనపై సమీక్ష జరిపారు. విషయాన్ని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు వివరించి అపర్ణ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. వెంటనే స్పందించిన ఆయన పార్టీ సహాయం కింద రూ.5 లక్షలు, ప్రభుత్వం నుంచి మరో రూ.5లక్షలు బాధితురాలి కుటుంబానికి అందజేయనున్నట్టు ప్రకటించారన్నారు. అపర్ణ తల్లిదండ్రుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, సోదరులిరువురికి గురుకుల పాఠశాలలో సీట్లు ఇప్పిస్తానని హామీ ఇచ్చారన్నారు. అనంతరం అపర్ణ కుటుంబసభ్యులను ఓదార్చి పార్టీ సాయం కింద రూ. 5 లక్షల చెక్కు అందజేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని సౌమ్య చెప్పారు. తెలుగుదేశం నాయకులు కోట వీరబాబు, కోగంటి బాబు, వాసిరెడ్డి ప్రసాద్, ఉన్నం నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పట్టించిన ఫోన్‌పే..
నల్గొండలో ఎన్టీఆర్ జిల్లా వాసి చోరీ

సూర్యాపేట క్రైం, సెప్టెంబరు 24 : నిందితులు వాడిన ఫోన్‌పే వారిని పట్టించింది. చోరీకి పాల్పడిన ఐదుగురిని సూర్యాపేట జిల్లా కోదాడ రూరల్ సర్కిల్ పోలీసులు అరెస్ట్ చేశారు. కేసుకు వివరాలను జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఎన్టీఆర్ జిల్లాకు చెందిన డ్రైవర్ వేమవరపు నాగరాజు చింతలపాలెం మండలం మల్లారెడ్డిగూడెంలో బంధువుల ఇంటికి వచ్చివెళ్తుండేవాడు. ఈ క్రమంలో ఆయనకు మేళ్లచెర్వుకు చెందిన మిర్చి వ్యాపారి వేముల వెంకటేశ్వర్లుతో పరిచయమైంది. డబ్బులు అవసరం కాగా నాగరాజు ఎక్కడైనా చోరీ చేయాలని భావించి ఆ విషయాన్ని వెంకటేశ్వర్లుతో చర్చించాడు. వెల్లటూరుకాలనీలో తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు నివాసంలో చోరీ చేయాలని భావించారు. సుమారు రూ.30 లక్షల వరకు డబ్బు లభిస్తుందని నాగరాజు భావించాడు. చోరీకి పాతమిత్రులైన నల్లగొండ జిల్లాకు చెందిన రమావత్ మాత్రు, ఎన్టీఆర్ జిల్లాకు చెందిన వేమవరపు పుల్లారావు, భీక్షం, నాగర్‌కర్నూల్‌కు చెందిన చిక్కుల అంజనేయులను సంప్రదించాడు. అందరూ కలిసి ఈ నెల 19న తెల్లవారుజామున వెంకటేశ్వర్లు ఇంట్లోకి చొరబడి కత్తులతో బెదిరించి ఆరున్నర తులాల బంగారు ఆభరణాలు, 30 తులాల వెండి ఆభరణాలు, రూ.50 వేల నగదును దోచుకెళ్లారు. ఈ ఘటనపై బాధితుడు ఫిర్యాదు చేశాడు. విచారణలో భాగంగా అదే గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ పోలీసులకు కీలక సమాచారమిచ్చాడు. నేరానికి పాల్పడిన వ్యక్తులు మేళ్లచెర్వు వద్ద మద్యం దుకాణంలో మద్యం కొనుగోలు చేసి వారి ఫోన్‌పే ద్వారా డబ్బులు చెల్లించారని, తెలిపాడు. దీంతో పోలీసులు ఆ దిశగా టెక్నాలజీ సాయంతో విచారణ చేసి నేరానికి పాల్పడిన వ్యక్తులను గుర్తించారు.

నష్టపరిహారం, బీమా కౌలు రైతులకే ఇవ్వాలి

» ఏపీ రైతు, కౌలు రైతుల సంఘాల డిమాండ్

గవర్నర్‌పేట, సెప్టెంబరు 24 : ముఖ్యమంత్రి ప్రకటించిన విధంగా వరదల వల్ల పంట నష్టపరిహారం వాస్తవ కౌలు రైతులకే ఇచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం, కౌలు రైతు సంఘాల నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వి.క్రిష్టయ్య, కె.ప్రభాకరరెడ్డి, కౌలురైతుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వై.రాధాకృష్ణ, ఎం.హరిబాబులు మీడియా సమావేశంలో మాట్లాడుతూ, పంట నష్టపరిహారం, బీమా అన్నీ వాస్తవ సాగుదారులైన కౌలు రైతులకి ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రెండు హెక్టార్లకే నష్టపరిహారం ఇస్తామనడం సరికాదని, ప్రతిఎకరాకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వరి పంటకు పెట్టుబడి పెట్టిన వాస్తవ కౌలు రైతు నిలబడాలంటే కనీసం ఎకరాకు రూ. 25 వేలు చెల్లించాలని, దామాషా ప్రకారం వాణిజ్య పంటల సాగుదారులకు పెట్టుబడిలో మూడోవంతు పరిహారం చెల్లించాలని కోరారు. ముఖ్యమంత్రి ప్రకటన, అధికారుల ఆదేశాలు




సమావేశంలో ఏపీ రైతు, కౌలు రైతు సంఘాల నేతలు

పూర్తిస్థాయిలో అమలు కావడం లేదన్నారు. భూ యజమానులు గ్రామస్థాయిలో ప్రభుత్వ రెవెన్యూ సిబ్బందిపై ఒత్తిడి తెచ్చి ఈ-క్రాప్‌లో కౌలుదారుల పేర్లకు బదులు తమ పేర్లు నమోదు చేయించుకుంటున్న సంఘటనలు తమ దృష్టికి వచ్చాయని, దీనిపై అధికారులు దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. వరదల వల్ల దెబ్బతిన్న వ్యవసాయ ప్రాంతాలను తమ బృందాలు పర్యటించి వాస్తవ పరిస్థితులు ప్రభుత్వ అధికారుల దృష్టికి తెస్తామని, కౌలు రైతులకు అన్యాయం జరిగితే సహించేది లేదని స్పష్టం చేశారు.

బొల్ల రామకృష్ణ చౌదరి ఇంట్లో ఐటీ సోదాలు

» రెయిన్‌బో విస్టాలో ఉదయం నుంచి రాత్రి వరకు సోదాలు



కేపీహెచ్‌బీకాలనీ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : బీఆర్‌కే న్యూస్, ఫైనాన్స్, హాస్పిటల్ వ్యాపారాలు చేస్తున్న బొల్ల రామకృష్ణ చౌదరి ఇంట్లో మంగళవారం ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు. మూసాపేట్ టూ కైత్లాపూర్ రోడ్డులోని రెయిన్‌బో విస్టా రాక్‌గార్డెన్ ఐ బ్లాక్‌లోని ఫ్లాట్ నంబర్ 101 రామకృష్ణ ఇంటితో పాటు తనబంధువు జె బ్లాక్ ఫ్లాట్ 407లోని తన బావమరిది రాజేష్ ఇంట్లో కూడా ఏకకాలంలో తెల్లవారుజామున 6.15 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కొనసాగాయి. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటకు చెందిన రామకృష్ణ కుటుంబం గత రెండేళ్లుగా ఇక్కడ అద్దెకు ఉంటున్నట్లు తెలిసింది. ఐటీ అధికారుల సోదాలతో అక్కడ ఏం జరుగుతుందోనని ఉదయం కాస్త పలువురు చర్చించుకోవడం కనిపించినా సాయంత్రానికి పట్టించుకున్న నాథుడే కరవయ్యారు.

న్యూస్ బాక్స్

విమానాశ్రయ డీఎస్పీగా మురళీ రామకృష్ణ బాధ్యతలు



గన్నవరం : విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయ డీఎస్పీగా పి.మురళీ రామకృష్ణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ ఎస్బీలో సీఐగా ఉన్న ఆయనను పదోన్నతి కల్పిస్తూ ఇటీవల జరిగిన బదిలీల్లో విమానాశ్రయ డీఎస్పీగా నియమించారు. ఇక్కడ పని చేసిన వెంకటరత్నంను బదిలీ చేశారు. ఈ సందర్భంగా మురళీ రామకృష్ణ మాట్లాడుతూ, విమానాశ్రయ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామన్నారు.



చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

సీఎం సహాయ నిధికి విరాళం

లబ్బీపేట : ది కృష్ణా డిస్ట్రిక్ ఫైనాన్షియర్స్ అసోసియేషన్ సభ్యులు వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.10లక్షల చెక్కును ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులను ముఖ్యమంత్రి అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ, కార్యదర్శి వి.నాగర్జున, కోశాధికారి టి.హరికృష్ణ, సుంకర వీరభద్రరావు, బీవై నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సైక్లింగ్, సెపక్ తక్రా స్కూల్ గేమ్స్‌కు ఎన్టీఆర్ జిల్లా ఆతిథ్యం

విజయవాడ స్పోర్ట్సు : 68వ ఏపీ అంతర్ జిల్లాల స్కూల్ గేమ్స్‌కు రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు కేటాయిస్తూ క్యాలెండర్‌ను స్కూల్ ఎడ్యుకేషన్ ఆఫ్ డైరెక్టర్ వి.విజయ రామరాజు విడుదల చేశారని రాష్ట్ర స్కూల్ గేమ్స్ కార్యదర్శి పి.భానుమూర్తి రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 50 క్రీడాంశాలకు అండర్-14, 17, 19 విభాగాల్లో బాలబాలికల పోటీల నిర్వహణకు జిల్లాలు కేటాయించినట్టు తెలిపారు. జిల్లాలకు కేటాయించిన అంతర్ జిల్లా టోర్నమెంట్‌లు నిర్వహించి రాష్ట్ర జట్లను ఎంపిక చేసి జాతీయ పోటీలకు సిద్ధం చేయాలన్నారు. ఎన్టీఆర్ జిల్లాను సైక్లింగ్ రోడ్డు క్రాసింగ్ అండర్-14,17,19విభాగాలతో పాటు, సెపక్ తక్రా అండర్-14 బాలబాలికల టోర్నీల నిర్వహణకు ఎంపిక చేసినట్టు తెలిపారు.



రూ.10లక్షల మంజూరు పత్రాలను అందజేస్తున్న తాతయ్య

బాలుడి వైద్యానికి రూ.10 లక్షలు మంజూరు

జగ్గయ్యపేట : ఆర్టీసీ కాలనీలో వరద నీటితో వచ్చిన ఇన్‌ఫెక్షన్‌తో కాలు పోగొట్టుకున్న బాలుడు కొత్తా భవదీప్‌కు ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్యకృషితో రూ.10లక్షలు ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరైంది. మంగళవారం విజయవాడలో బాలుడు చికిత్స పొందుతున్న అంకుర్ ఆసుపత్రిలో మంజూరు పత్రాన్ని అందచేశారు. ఒక్కరోజులో రూ.10లక్షలు సీఎం చంద్రబాబు మంజూరు చేశారు. బాలుడు తండ్రి నాగరాజు సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే తాతయ్యకు ధన్యవాదాలు తెలిపారు.

అత్యంత పారదర్శకంగా

నష్టగణన పూర్తి

» నేడు బాధితుల ఖాతాల్లో పరిహారం జమ
» 179 సచివాలయాల పరిధిలో ఎన్యూమరేషన్
» ప్రభుత్వానికి నివేదిక సమర్పించాం
» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన



కృష్ణలంక, సెప్టెంబరు 24 : ముంపు ప్రభావిత 179 సచివాలయాల పరిధిలో అత్యంత పారదర్శకంగా నష్టగణన ప్రక్రియను పూర్తిచేసి, రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించినట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన మంగళవారం తెలిపారు. ఈనెల 25న బాధితుల ఖాతాల్లో డీబీటీ విధానం ద్వారా నేరుగా పరిహారం మొత్తాన్ని జమచేయనున్నట్టు వెల్లడించారు. ఏ ఒక్క బాధిత కుటుంబం ఎన్యూమరేట్ కాకుండా ఉండకూడదనే ముఖ్యమంత్రి మార్గదర్శకాలకు అనుగుణంగా పలు అవకాశాలు కల్పించడం జరిగిందని, అర్హుల జాబితాలను సచివాలయాల్లోను ప్రదర్శించినట్టు తెలిపారు. వివిధ కారణాల వల్ల ఎన్యూమరేషన్ సమయంలో ఇళ్లవద్ద లేనివారిని కూడా ప్రత్యేక బృందాలతో ఆది, సోమవారం ప్రత్యేకంగా నమోదు చేసినట్టు వివరించారు. అయితే 38వ వార్డు నివాసితులు కొందరు తమను కూడా ముంపు బాధితుల జాబితాల్లో చేర్చాలంటూ విజ్ఞప్తి చేస్తున్నారని, ఈ వార్డు ఎన్యూమరేషన్ పరిధిలోకి రాదని, అందువల్లే సర్వే నిర్వహించలేదని వివరించారు. ఈ బృందాల విచారణలో 38వ వార్డు నివాసితులు అర్హులు కాదని గుర్తించినట్టు కలెక్టర్ స్పష్టం చేశారు.



ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న నేతలు, అధికారులు

ఘనంగా దసరా ఉత్సవాల నిర్వహణ

» పోస్టర్ ఆవిష్కరించిన ఎంపీ, ఎమ్మెల్యేలు

వన్‌టౌన్, సెప్టెంబరు 24 : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో అక్టోబరు 3 నుంచి 12వ తేదీ వరకు జరగనున్న దసరా మహోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఘనమైన ఏర్పాట్లు చేస్తున్నట్టు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. మంగళవారం మహా మండపంలో దసరా మహోత్సవాల బ్రోచర్, పోస్టర్లను పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాములతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఉత్సవాల నిర్వహణకు కమిటీని నియమించారని తెలిపారు. భక్తుల ఇబ్బందులను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు కాల్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఉత్సవాలను మరింత మెరుగ్గా నిర్వహించేందుకు భక్తులు సలహాలను ఇవ్వాలని సూచించారు. వరద ముంపుతో బాధపడిన విజయవాడ ప్రజలందరూ సీఎం చంద్రబాబు కృషి, దుర్గమ్మ చల్లని చూపుతో సాధారణ స్థితికి వచ్చారన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రామారావు, ఈఈ కోటేశ్వరరావు, స్థానాచార్యులు విష్ణుభొట్ల శివప్రసాద్ శర్మ, అధికారులు పాల్గొన్నారు.

వైసీపీకి కొత్త సారథులు?

» కృష్ణాజిల్లాకు పేర్ని నాని
» ఎన్టీఆర్ జిల్లా బాధ్యతలు దేవినేని అవినాశ్‌కు
» నేడు జగన్ వద్ద రెండు జిల్లాల నేతల భేటీ
» కొడాలి నాని, వల్లభనేని వంశీ వచ్చే అవకాశం

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) సార్వత్రిక ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత పార్టీని గాడిన పెట్టేందుకు వైసీపీ పెద్దలు ప్రయత్నాలు ప్రారంభించారు. ఎన్టీఆర్, కృష్ణాజిల్లాలకు కొత్త సారథులను నియమించేందుకు సిద్ధమవుతున్నారు. బుధవారం ఉదయం 10.30 గంటలకు తాడేపల్లిలోని పార్టీ అధినేత జగన్ నివాసంలో రెండు జిల్లాల వైసీపీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో రెండు జిల్లాల్లో పార్టీ పరిస్థితిపై సమీక్షతోపాటు కొత్త సారథుల నియామకం కూడా చేపట్టనున్నట్టు సమాచారం. ఎన్నికల అనంతరం ఎన్టీఆర్ జిల్లాలో వైసీపీకి కోలుకోలేని పరిస్థితి ఏర్పడింది. జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయ భాను పార్టీని వీడటంతో అక్కడ కొత్త ఇన్‌చార్జిని నియమించాల్సి ఉంది. మైలవరం నియోజకవర్గం నుంచి గత ఎన్నికల్లో పోటీ చేసిన సర్నాల తిరుపతిరావు అక్కడ పార్టీని బలోపేతం చేసే పరిస్థితి లేకపోవడంతో మాజీ మంత్రి జోగి రమేశ్‌ను మైలవరం ఇన్ చార్జిగా నియమించారు. అయితే ఆయన, ఆయన తనయుడు కేసుల్లో మునిగి తేలుతుండటంతో వారు కూడా మైలవరంలో పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టే పరిస్థితి లేదు. నందిగామలో మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు, తిరువూరులో నల్లగట్ల స్వామి దాసు నియోజకవర్గ ఇన్‌చార్జులుగా ఉన్నారు. విజయవాడ తూర్పు ఇన్‌చార్జిగా దేవినేని అవినాశ్ ఉండగా, సెంట్రల్ ఇన్‌చార్జిగా ఎవరు ఉన్నారనే దానిపై స్పష్టత లేదు. గత ఎన్నికల్లో ఇక్కడ పోటీ చేసిన మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు తిరిగి సొంత నియోజకవర్గమైన పశ్చిమానికి వెళ్లిపోయారు. ఆయన పార్టీ మారే యోచనలో కూడా ఉన్నట్లు సమాచారం. పశ్చిమ నుంచి గత ఎన్నికల్లో పోటీ చేసిన షేక్ ఆసిఫ్‌ను ఇన్‌చార్జిగా కొనసాగిస్తారా లేదా అన్న దానిపై స్పష్టత లేదు. ఎన్టీఆర్ జిల్లా వైసీపీ బాధ్యత లను దేవినేని అవినాశ్‌కు అప్పగిస్తారని సమాచారం. కృష్ణాజిల్లాలో మచిలీపట్నం నుంచి గత ఎన్నికల్లో పేర్ని కిట్టు పనిచేశారు. అయితే కిట్టుకు అనుభవం లేకపోవడంతో పేర్ని నానికి మళ్లీ జిల్లా వైసీపీ బాధ్యతలు అప్పగించాలని జగన్ భావిస్తున్నారు. ఈ సమావేశానికి కొడాలి నాని, వల్లభనేని వంశీ కూడా హాజరవుతున్నట్టు సమాచారం.

మాజీ మంత్రి జోగి అండతో 50 ఎకరాల చెరువులో చేపలు దోచుకెళ్లారు

» ఆలేరు కాలువకు 119 ఎకరాలు తీసుకున్నారు
» నష్టపరిహారం అడిగితే అధికారులు దురుసుగా మాట్లాడుతున్నారు
» అత్యాచారం చేసి, సెల్‌లో చిత్రీకరించి.. బెదిరిస్తున్నాడు
» గ్రామంలో సీసీ రోడ్లకు 10 లక్షలు ఖర్చు చేశా
» 2018 నుంచి ఇప్పటి వరకూ పైసా ఇవ్వలేదు
» టీడీపీ గ్రీవెన్స్‌లో బాధితుల ఫిర్యాదులు

అమరావతి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): 'ధర్మవరం పట్టణంలోని నా ఇంట్లో ఎవరూ లేని సమయంలో కుళ్లాయప్ప అనే దర్జీ నాపై అత్యాచారం చేశాడు. సెల్‌ఫోన్‌లో రికార్డు చేసి పదేపదే నన్ను బెదిరిస్తున్నాడు' అని ఓ మహిళ టీడీపీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసింది. మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రజావేదిక నిర్వహించారు. ఎమ్మెల్సీ అశోక్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డి, బీదా రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి, ఆచంట సునీత వినతులు స్వీకరించారు. కడప చిన్నచౌక్‌లో ఒక వ్యక్తి చిట్టీలు కట్టించుకుని, రూ.20 కోట్లుతో పరారయ్యాడని హనుమంతరావు, హరిప్రసాద్ తదితరులు టీడీపీ నేతలకు ఏకరవు పెట్టారు. తాము టీడీపీలో చేరడంతో వైసీపీ వ్యక్తి తప్పుడు కేసు పెట్టి, టాంజానియా వెళ్లిన తన కొడుకును ఇబ్బంది పెడుతున్నారని సత్యసాయి జిల్లా లింగాలవారిపల్లికి చెందిన సోమశేఖర్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. బాపట్ల జిల్లాలో ఆలేరు కాలువ తవ్వకంలో 119 ఎకరాల పొలం పోతే, నష్టపరిహారం అడిగితే.. అధికారులు దురుసుగా మాట్లాడుతున్నారని, తమకు ఆత్మహత్యే గతి అంటే.. ఇష్టం వచ్చింది చేసుకోమంటున్నారని టీడీపీ నేతలకు ఫిర్యాదు చేశారు. 2018లో గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.10 లక్షలు ఖర్చు పెడితే ఇప్పటికీ ఇవ్వలేదని పెద్దారవీడుకు చెందిన తిరుపతయ్య యాదవ్ వాపోయారు. కావలి మండలం తుమ్మలపెంటలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పద్మావతి వైసీపీ నేతలకు అనుకూలంగా ఉండి, పాఠశాలలో విద్యార్థులను ఇబ్బంది పెడుతోందని పలువురు ఫిర్యాదు చేశారు. రానున్న డీఎస్సీ నోటిఫికేషన్‌లో వయో పరిమితిని 46 ఏళ్లకు పెంచాలని పలువురు నిరుద్యోగులు కోరారు. మాజీ మంత్రి జోగి రమేష్ అండదండలతో కృత్తివెన్ను మండలం శీతనపల్లి వద్ద ఉన్న 50 ఎకరాల మంచినీటి చెరువులోని చేపలు మొత్తం దోచుకెళ్లారని, లక్ష్మీపురం పల్లెపాలెం గ్రామానికి చెందిన పెదసింగు దావీదు టీడీపీ నేతలకు ఫిర్యాదు చేశారు.

టీడీపీ పాలనలోనే అంగన్వాడీలకు మేలు ఆచంట

అమరావతి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ పాలనలోనే అంగన్వాడీలకు మేలు జరుగుతుందని, వారి సమస్యలు పరిష్కారమౌతాయని అంగన్వాడీ, డ్వాక్రా సంఘాల కన్వీనర్ ఆచంట సునీత అన్నారు. మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో అంగన్వాడీ సంఘాల ప్రతినిధులతో కలసి ఆమె మీడియాతో మాట్లాడారు. అవసరం ఉన్నప్పుడు అంగన్వాడీలను రెచ్చగొట్టి రోడ్లపైకి తెచ్చే సీఐటీయూ నేతలు వరద బాధితులకు సాయం చేయమంటే బీద పలుకులు పలుకుతున్నారని మండిపడ్డారు. సీఐటీయూ నేతలకు అంగన్వాడీలంటే ఏటీఎంలా అని ప్రశ్నించారు.

ఈ పాపం ఎవరిదీ?

(5వ పేజీ తరువాయి)

ఉదయం నుంచి ఆస్పత్రిలోనే ఉన్నా..

అపస్మారక స్థితిలో ఆస్పత్రికి చేరిన చిన్నారి అపర్ణ విషయంలో నందిగామ ప్రభుత్వ వైద్యశాల వైద్యులు, సిబ్బంది అడుగడుగునా అలసత్వమే ప్రదర్శించారు. తన కుమార్తెకు వైద్యం అందించాలంటూ తల్లిదండ్రులు మొరపెట్టుకున్నా ఎవరూ పట్టించుకోలేదు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ వైద్యుల మధ్యలోనే విద్యార్థిని ఉన్నప్పటికీ ఆమె పరిస్థితిని సమీక్షించలేదు. ఎటువంటి వైద్య పరీక్షలూ నిర్వహించలేదు. సాయంత్రం అపర్ణ పరిస్థితి ఒక్కసారిగా విషమించడంతో కొద్ది సేపు హడావుడి చేసిన వైద్యులు చివరకు ఆమె మరణించినట్లు ధ్రువీకరించారు.

ఇంటికి తీసుకెళ్లిపోతున్న తల్లిదండ్రులు

అపర్ణ మరణం విషయం తెలుసుకున్న తోటి విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం ఉదయమే పాఠశాల వద్దకు చేరుకున్నారు. తమ పిల్లలను చూసుకొని స్థిమిత పడి ఇంటికి తోడ్కొని పోయారు. పరిస్థితులు చక్కబడే వరకూ తాము పాఠశాలకు పంపబోమని స్పష్టం చేస్తున్నారు.

మన పిల్లలైతే ఇలాగే చేస్తామా - సిబ్బందిపై ఆర్డీవో ఆగ్రహం

గురుకుల పాఠశాలను మంగళవారం సందర్శించిన ఆర్డీవో రవీంద్రరరావు వసతి గృహం, వంటశాల, తరగతి గదులు పరిశీలించారు. అపర్ణ అనారోగ్యంపై ఆరా తీశారు. ఒక విద్యార్థినికి జ్వరం వస్తే 15 రోజుల పాటు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారా అంటూ మండిపడ్డారు. అదే మన పిల్లలైతే ఇలాగే చేస్తామా అని నిలదీశారు. ఇకపై ఏమాత్రం అలసత్వం వహించినా సహించేది లేదని హెచ్చరించారు.

పాఠశాలలోకి రానివ్వడంలేదు - పాఠశాల అభివృద్ధి కమిటీ

ఈ ఘటనపై పాఠశాల అభివృద్ధి కమిటీ తీవ్రంగా స్పందించింది. తమను కూడా పాఠశాలలోకి రానివ్వడం లేదని, ఇక్కడి విషయాలు తమకు ఏమీ తెలియనీయకుండా జాగ్రత్త పడుతున్నారంటూ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి వద్ద నుంచి కూడా ఆర్డీవో స్టేట్‌మెంట్ తీసుకున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 555

సీఎం చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లది ముందుచూపు



వన్‌టౌన్, సెప్టెంబరు 24: రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ల ముందు చూపుతో 2047కల్లా ఏపీ స్వర్ణాంధ్ర ప్రదేశ్‌గా మారుతుందని 42వ డివిజన్ జనసేన అధ్యక్షురాలు తిరుపతి అనూష అన్నారు. డివిజన్‌లో మంగళవారం నిర్వహించిన విజన్ 2047 అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు. జోనల్ కమిషనర్ కీర్తన, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, కూటమి నేతలు పాల్గొన్నారు.

చంద్రబాబు కృషి మరువలేనిది

● 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో బొప్పన భవకుమార్



వంద రోజుల పాలనను ప్రజలకు వివరిస్తున్న బొప్పన భవకుమార్

పటమట, సెప్టెంబరు 24: వరద బాధిత నగరాన్ని మళ్లీ మామూలు స్థితికి తీసుకురావటానికి సీఎం చంద్రబాబు నాయుడు చేసిన కృషి మరువలేనిదని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొప్పన భవకుమార్ తెలిపారు. టీడీపీ అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఐదో డివిజన్‌లో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బొప్పన భవకుమార్ మాట్లాడుతూ మెగా డీఎస్సీ, అన్న క్యాంటీన్ల ప్రారంభం, పింఛను పెంపు, ల్యాండ్ టైటిలింగ్ రద్దు, తుఫాన్ బాధితులను ఆదుకోవడం వంటివి ప్రభుత్వం వచ్చిన 100 రోజుల్లోనే దిగ్విజయంగా నిర్వహించారన్నారు. గుమ్మడి గురుప్రసాద్, దేవానంద్, రత్నాకర్, రమేశ్, షరీఫ్, బీజేపీ నేతలు జాస్తి సతీష్ పాల్గొన్నారు.

ముత్యాలంపాడులో..



స్టిక్కర్లు పంపిణీ చేస్తున్న దెందుకూరి

సత్యనారాయణపురం : ఎన్డీయే కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలన సక్సెస్ అని టీడీపీ ముత్యాలంపాడు యూనిట్ ఇన్‌చార్జి దెందుకూరి మురళీకృష్ణంరాజు అన్నారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఆదేశాలతో మురళీకృష్ణంరాజు ఆధ్వర్యంలో వానపాల వారి వీధి, అల్లూరి సీతారామరాజు రోడ్డులో మంగళవారం ఇది మంచి ప్రభుత్వం పాంప్లెట్లను పంచి, ఇంటింటికీ స్టిక్కర్లు అంటించారు. టీడీపీ నేతలు గుర్రం సుబ్బారావు, బోను శ్రీనివాసరావు, అర్జున్‌రావు, రామకోటయ్య, శ్రీనివాస్, సచివాయం వెల్ఫేర్ సెక్రటరీ అనికుమార్ పాల్గొన్నారు.

49వ డివిజన్‌లో..



మాట్లాడుతున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్

చిట్టినగర్ : ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని, ఇది మాటల ప్రభుత్వం కాదు, చేతల ప్రభుత్వమని 49వ డివిజన్ కార్పొరేటర్ బుల్లా విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం 49వ డివిజన్‌లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో చేసిన సంక్షేమాన్ని, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ కృష్ణ, అడ్మిన్ పాల్గొన్నారు.

7వ డివిజన్‌లో

మొగల్రాజపురం : టీడీపీ అధికారంలోకి వచ్చి 100 రోజులైన సందర్భంగా పార్టీ ఆదేశాలతో ప్రభుత్వ పాలనను ప్రజలలోకి తీసుకెళ్లే ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి గుమ్మడి గురుప్రసాద్ మంగళవారం 7వ డివిజన్‌లో 40 సచివాలయ పరిధిలో ప్రారంభించారు.



7వ డివిజన్‌లో..

గిరిజన సంక్షేమ పథకాలు కొనసాగించాలి



టీఎస్ఎఫ్ శాంతియుత నిరసన

లబ్బీపేట, సెప్టెంబరు 24: గత వైసీపీ ప్రభుత్వంలో గిరిజన సంక్షేమం కుంటుపడిందని, గత ప్రభుత్వంలో రద్దయిన గిరిజన సంక్షేమ పథకాలను కొనసాగించాలని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు అక్కులప్ప నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప డిమాండ్ చేశారు. మొగల్రాజపురంలోని గిరిజన సంక్షేమ కార్యాలయం వద్ద మంగళవారం తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శాంతియుత నిరసనతో పాటు గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ సదా భార్గవికి వినతిపత్రం అందజేశారు. ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి పల్లాల రాజకుమార్ రెడ్డి, రామరాజు, వెంకటేశ్వర్లు నాయిక్, జాన్‌వెస్లీ పాల్గొన్నారు.

వరద సాయాన్ని పెంచాలి: సీపీఐ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న సీపీఐ నేతలు

అజిత్‌సింగ్‌నగర్, సెప్టెంబరు 24: సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయం వద్ద 600 వరద బాధిత కుటుంబాలకు మంగళవారం దుప్పట్లు, టవల్స్, చీరలు పంపిణీ జరిగింది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు పాల్గొని వీటిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముంపు బాధితులకు నష్టపరిహారం రూ.25వేలు నుంచి రూ.50 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. నేతలు లంక దుర్గారావు, వీరభద్రరావు, భాస్కరరావు, రమణారావు పాల్గొన్నారు.

వంట సామగ్రి అందజేత

పాయకాపురం, సెప్టెంబరు 24: కమ్మవారి ఐక్య సేవా సమితి ఆధ్వర్యంలో 64వ డివిజన్ కండ్రిక కాలనీలో వరద బాధిత కుటుంబాలకు మంగళవారం వంట సామగ్రి పంపిణీ జరిగింది. సమితి సభ్యుడు పరుచూరి ప్రసాద్, పరుచూరి వనజ 200 మంది వరద బాధిత కుటుంబాలకు వంట సామగ్రితో పాటు దుప్పట్ల కిట్లను అందజేశారు. బుద్దా రాజలింగం, సూర్యదేవర మురళి, రాజేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు..

వరద బాధితుల సహాయార్థం స్పందన సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక ఎల్‌బీఎస్‌నగర్‌లోని పుచ్చలపల్లి సుందరయ్య వీఎంసీ పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం పాఠ్యపుస్తకాల పంపిణీ జరిగింది. సమితి అధ్యక్షుడు ఇమ్మానేని కృష్ణప్రసాద్ అధ్యక్షతన దాదాపు 300 మంది విద్యార్థులకు రూ.12వేలు విలువైన పాఠ్యపుస్తకాలను అందజేశారు. సమితి సభ్యులు నరసింహమూర్తి, వి.విమలరాణి, ఎస్. భార్గవి, శారద పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

భారతీనగర్, సెప్టెంబరు 24: రింగ్ రోడ్డు సెక్షన్ పరిధిలోని విద్యుత్‌లైన్ల మరమతుల కారణంగా బుధవారం ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ నిలిపేస్తున్నట్టు గుణదల సబ్‌స్టేషన్ కార్యనిర్వహక ఇంజనీర్ పి.హరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీస్తురాజుపురం, క్రీస్తురాజుపురం కొండ ప్రాంతం, ఆర్‌సీఎం చర్చి, సింహాచలం అపార్టుమెంట్, విఎధులా నగర్, ఆర్‌పీ టవర్స్, ఎల్ఐసీ కాలనీ, అమ్మకల్యాణ మండపం ఏరియా, సున్నపుబట్టీల సెంటర్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

కార్మికులకు జీతాలు చెల్లించాలి



చిట్టినగర్, సెప్టెంబరు 24: పారిశుధ్య కార్మికుల బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని సీపీఎం కార్పొరేటర్ బోయి సత్యబాబు పలువురు కార్మికులతో కలిసి మంగళవారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏసీజీ సత్యవతిని కలిసి వినతి పత్రం అందజేశారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో అవార్డులు రావటానికి కారణమైన కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించకుండా ఇబ్బందులు పెట్టడం సరికాదని వెంటనే జీతాలు చెల్లించాలని కోరారు.

మర్యాదపూర్వక కలయిక

పాతరాజరాజేశ్వరి పేట, సెప్టెంబరు 24: వెస్ట్ జోన్ ఏసీపీగా నూతనంగా నియమితులైన దుర్గారావును ఎస్సీ నేతలు బొబ్బిలి లీలాకుమార్ మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ మేరకు ఏసీపీ దుర్గారావుకు పుష్పగుచ్ఛం అందజేశారు. బీజేపీ నేత మఠం శివరామకృష్ణ, కూర్మ శ్రీనివాసరావు, మంద ప్రభాకర్ పాల్గొన్నారు.

నదిలో గుర్తుతెలియని మృతదేహం

వన్‌టౌన్, సెప్టెంబరు 24: కృష్ణానదిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించినట్టు మంగళవారం కృష్ణలంక పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ప్రకాశం బ్యారేజి దిగువన సీతమ్మవారి పాదాల సమీపంలోని కృష్ణానదిలో ఓ వ్యక్తి మృతదేహం ఉన్నట్టు పోలీసులకు సమాచారం వచ్చింది. వారు ఘటనా స్థలం వద్దకు వెళ్లి మృతదేహాన్ని ఒడ్డుకు తెచ్చి పరిశీలించారు. ఎలాంటి గుర్తింపు ఆధారాలు లేనందున పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడికి సుమారు 45ఏళ్లలోపు ఉంటుందని, ఒంటి పై బ్లూ, బ్లాక్ రంగుల ప్యాంట్ ఉన్నట్టు పోలీసులు తెలిపారు.

వీడీఆర్‌యూసీ కమిటీ సభ్యుడిగా రవీంద్ర

విజయవాడ లీగల్, సెప్టెంబరు 24: విజయవాడ డివిజనల్ రైల్వే యూజర్స్ కన్సలేటివ్ కమిటీ సభ్యుడిగా టి.రవీంద్ర ప్రతాప్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు రైల్వే సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఉత్తర్వులు జారీ చేశారు. వృత్తిరీత్యా న్యాయవాది అయిన రవీంద్ర 25ఏళ్లుగా బెజవాడ కన్స్యూమర్ కౌన్సిల్ జాయింట్ సెక్రటరీగా వ్యవహరిస్తున్నారు. ఈయన తన పదవిలో 2026 ఆగస్టు 16 వరకు కొనసాగుతారు.

ఎన్ఎస్ఎస్ సేవలు అభినందనీయం

మంత్రి సత్యకుమార్ యాదవ్



మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

కృష్ణలంక, సెప్టెంబరు 24 : జనసేవ సొసైటీ, జాతీయ సేవా పథకం జిల్లా సంయుక్తంగా నిర్వహించిన జాతీయ సేవా పథకం దినోత్సవం పీవీ సిద్ధార్థ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స అండ్ సైన్స్‌లో ఘనంగా జరిగాయని జిల్లా ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్ మంగళవారం తెలిపారు. జనసేవా సొసైటీ స్వచ్ఛంద సంస్థ పిలుపుమేరకు జాతీయ సేవా పథకం జిల్లా 1300 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు వరద బాధితులకు సేవలందించినందుకు వారిని అభినందించడానికి రాష్ట్ర ప్రభుత్వం, మంత్రి సత్యకుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికసిత భారత్ కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని, వరద బాధితులు సహాయం చేసిన యువతని మనస్ఫూర్తిగా అభినందించారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు వరద బాధితుల ప్రాంతాలకు వెళ్లి సేవలందించడం ప్రసంసించదగ్గ విషయమన్నారు. జిల్లాలోని వివిధ కళాశాలలకు చెందిన 1300 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు. జనసేవ సొసైటీకి చెందిన నేతలు ఆదిశేషు, రాష్ట్ర బీజేపీ మీడియా ఇన్‌చార్జి పాతూరి నాగభూషణం, రాష్ట్ర బీజేపీ ప్రొటోకాల్ ఇన్‌చార్జి పీయూష్ దేశాయ్, ఆర్‌వీ స్వామి, చక్రధర్ పాల్గొన్నారు.

మత్తు వదిలితేనే భవిష్యత్తు

వన్‌టౌన్, సెప్టెంబరు 24: మత్తు వదిలితేనే భవిష్యత్తు అని భవానీపురం సబ్ ఇన్‌స్పెక్టర్ డి.ఆనంద్ అన్నారు. నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో విద్యాధరపురంలోని దళవాయి సుబ్బరామయ్య వీఎంసీ ఉన్నతపాఠశాలలో మంగళవారం మత్తు పదార్థాల దుర్వినియోగం అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు జరిగింది. స్కీన్ ప్రొజెక్టర్ ద్వారా మత్తు పదార్థాలు తెచ్చే అనర్థాలపై ప్రదర్శన ఇచ్చారు. నవజీవన్ బాలభవన్ ప్రోగ్రామ్ మేనేజర్ గోళ్లమూడి, నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కో-ఆర్డినేటర్ కె.ప్రియాంక, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం. కోటయ్య, ఉపాధ్యాయులు డి.మురళి, సి.హెచ్.వసంతకుమారి, కె.నాగఅనసూయ, కె.సుమలత, పి.అన్నపూర్ణ పాల్గొన్నారు.

బాధితులందరి పేర్లు నమోదు చేయాలి



వరద బాధితులను పరామర్శిస్తున్న సీపీఎం నేతలు

వన్‌టౌన్, సెప్టెంబరు 24: వరద బాధితులందరి పేర్లను నమోదు చేయాలని, వారందరికీ న్యాయం చేయాలని వరదకు మునిగిన కొన్ని ప్రాంతాలను గుర్తించకపోవటం సరికాదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సి.హెచ్.బాబూరావు, కార్పొరేటర్ సత్యబాబు అన్నారు. మంగళవారం 38వ డివిజన్ లోని కుమ్మరిపాలెం, భవానీపురం కరకట్ట ప్రాంతంలోని వరద బాధితులను నేతలు పరామర్శించారు. వీవీ నారాయణ, సుబ్బారెడ్డి, శేషమణి, విక్రమ్, లక్ష్మి, మస్తాన్, వెంకట్రావు పాల్గొన్నారు. ● వరదను జాతీయ విపత్తుగా ప్రకటించాలని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం రాత్రి జరిగిన లాఠీచార్జికి గురైన 38, 39 డివిజన్ల వరద బాధితులను మంగళవారం ఆయన పరామర్శించారు. నగర కార్యదర్శివర్గ సభ్యురాలు పంచదార్ల దుర్గాంబ, కార్యవర్గ సభ్యులు కంచర్ల నాగేశ్వరరావు, పార్టీ డివిజన్ నేతలు కోట రాంబాబు, నడకుదిటి వెంకటేశ్వరరావు, ఎస్.కె.షంషుద్దీన్ పాల్గొన్నారు.

సాంకేతికతతో మరిన్ని విజయాలు

వన్‌టౌన్, సెప్టెంబరు 24: విద్యార్థులు నూతన సాంకేతిక పరిజ్ఞానంతో మరిన్ని విజయాలను సాధించవచ్చని ఎస్ఆర్ఐ కళాశాల డిపార్టుమెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ అధ్యాపకురాలు డాక్టర్ జి.శోభన అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో డేటా మినింగ్ టెక్నిక్స్ ఫర్ డెసిషన్ మేకింగ్ అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్యవక్తగా హాజరైన డాక్టర్ శోభన మాట్లాడుతూ కామర్స్ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడిస్తే కచ్చితమైన ఫలితాలు వస్తాయన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి, విభాగాధిపతి హేమంత్ పాల్గొన్నారు.

500 మందికి దుప్పట్లు పంపిణీ

భవానీపురం, సెప్టెంబరు 24: వరద బాధితులకు భారత్ గ్యాస్ తన వంతు సాయంగా సహాయ సహకారాలను అందించడం అభినందనీయమని భారత గ్యాస్ దక్షిణ భారత జనరల్ మేనేజర్ (చెన్నై) పీయూష్ గుప్తా అన్నారు. విద్యాధరపురంలోని శ్రీ భవానీ గ్యాస్ కంపెనీ ప్రాంగణంలో అధినేత గద్దె హరిబాబు ఆధ్వర్యంలో వరదల్లో నష్టపోయిన ప్రజలు, గ్యాస్ వినియోగదారులు 500 మందికి మంగళవారం దుప్పట్లను ఉచితంగా పంపిణీ చేశారు.

డిప్యూటీ తహసీల్దార్లకు స్థాన చలనం

ఆంధ్రజ్యోతి - విజయవాడ : డిప్యూటీ తహసీల్దార్లను పూర్తిస్థాయిలో బదిలీ చేశారు. మొత్తం 48 డిప్యూటీ తహసీల్దార్లకు స్థాన చలనం జరిగింది. అతిథి గృహ సూపరింటెండెంట్ కే బసివిరెడ్డిని తిరువూరు ఆర్‌డీవో ల్యాండ్ రికార్డ్స్‌కు, విజయవాడలో పనిచేసే సుంకర బేబి సరోజినిని విజయవాడ రూరల్ డీటీగా, విజయవాడ పశ్చిమ డీటీ సీహెచ్ అప్పారావును విజయవాడ నార్త్ డీటీగా, విజయవాడ సెంట్రల్ డీటీ సీహెచ్ శైలజను మైలవరం డీటీగా, విజయవాడ తూర్పు డీటీ ఎస్ సురేష్ రెడ్డిని జీ కొండూరుకు, నందిగామ డీటీ రిబ్కాను పశ్చిమకు, కంచికచర్ల డీటీ పీ విజయలక్ష్మిని విజయవాడ పశ్చిమకు, నందిగామ ఎస్‌డీటీ - ఎపిక్ ఎస్‌కే ఇస్మాయిల్‌ను విజయవాడ పశ్చిమ డీటీ - ఎపిక్‌గానూ, గంపలగూడెం డీటీ ఎన్ కోటేశ్వరరావును విజయవాడ డీఎండబ్ల్యూకు, విజయవాడ నార్త్ డీటీ ప్రవీణ్‌ను సెంట్రల్ డీటీ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు, గన్నవరం ఎస్‌డీటీ - ఎపిక్ ఏఎస్ఆర్ గోపాల రెడ్డిని ప్రభుత్వ అతిథి గృహ సూపరింటెండెంట్‌గాను, జీ కొండూరు డీటీ ఎస్ సురేష్‌ను విజయవాడ అర్బన్ ల్యాండ్ సీలింగ్ డీటీగా, తిరువూరు డీటీ ఎం రాజేశ్వరిని విజయవాడ సెంట్రల్‌కు, వీరులపాడు రెవెన్యూ డీటీ పీ పద్మావతిని విజయవాడ రూరల్ డీటీగా , విజయవాడ రూరల్ డీటీ జీ ప్రవీణ్ కుమార్ రెడ్డిని విజయవాడ తూర్పుకు బదిలీ చేశారు.

ప్రజల మనిషి గద్దె రామ్మోహన్

సినీ ప్రముఖుడు తమ్మారెడ్డి భరధ్వాజ



గద్దె దంపతులను సత్కరిస్తున్న బోయపాటి

పటమట, సెప్టెంబరు 24: నిత్యం ప్రజల్లో తిరుగుతూ, తన సొంత నిధులతో నియోజకవర్గ ప్రజలకు సహాయం చేస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందచేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ వంటి రాజకీయ నేతలు అరుదుగా ఉంటారని సినీ రంగ ప్రముఖులు తమ్మారెడ్డి భరద్వాజ, దర్శకుడు బోయపాటి శ్రీను తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయం సాధించిన తర్వాత మొదటిసారి హైదరాబాద్‌లోని మూవీ టవర్స్‌కు ఎమ్మెల్యే గద్దె దంపతులు మంగళవారం వెళ్లారు. ఈ సందర్భంగా అక్కడి సినీ ప్రముఖులు, మూవీ టవర్స్ అసోసియేషన్ సభ్యులు గద్దె దంపతులను ఘనం గా సత్కరించారు. మాజీ ఎంపీ మాగంటి బాబు, ప్రముఖ పారిశ్రామిక వేత్త పుట్టగుంట సతీష్, గద్దె క్రాంతికుమార్‌తో పాటు 'మా' సభ్యులు పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా ఉంటాం



కానూరులోని కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుజనా చౌదరి

వన్‌టౌన్, సెప్టెంబరు 24: వరదల్లో నష్టపోయిన కుటుంబాలకు అండగా ఉంటామని 38వ డివిజన్ వరద బాధితులకు ఎమ్మెల్యే సుజనా చౌదరి హామీ ఇచ్చారు. మంగళవారం కానూరు కేసీపీ కాలనీలో ఉన్న తన కార్యాలయంలో 38వ డివిజన్ కుమ్మరిపాలెం ప్రాంత వరద బాధితులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాధితులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నివేదికల ఆధారంగా ప్రభుత్వం పరిహారం ప్రకటిస్తుందని తెలిపారు. నేతలు పితాని పద్మ, తమ్మిన లీలా కరుణాకర్, జి.శంకర్, సురభి బాలు పాల్గొన్నారు.

ముంపు ప్రాంత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గవర్నర్‌పేట, సెప్టెంబరు 24: వరద ప్రభావిత ప్రాంతాల్లోని కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ నేతలు మంగళవారం జిల్లా కలెక్టర్ సృజనకు వినతిపత్రం అందజేశారు. కృష్ణానదీ, మునేరు, బుడమేరు, పాలేరు వరదలు, భారీ వర్షాల కారణంగా జిల్లాలోని 14 మండలాలు ముంపునకు గురయ్యాయని, నగరంలోని 32 డివిజన్లలోని పేద వర్గాలు తీవ్రంగా నష్టపోయారన్నారు. కార్మికులకు పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ. వెంకటేశ్వరరావు, ఎన్‌సీహెచ్ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు కె. దుర్గారావు, కార్యదర్శులు ఎ. కమల, బి. వెంకటేశ్వరరావు, ఎం. సోమేశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఆర్‌లో స్వచ్ఛతా హి సేవ

కృష్ణలంక, సెప్టెంబరు 24 : ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉమెన్ ఎమ్‌పవర్‌మెంట్ సెల్, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హిసేవ నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి మంగళవారం తెలిపారు. స్వచ్ఛతాహి సేవలో భాగంగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ కె.అరుణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ లక్ష్మీ సర్వాణి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

భవానీపురం : వీఎంసీ పరిధిలో చెత్త నిర్మూలనకు ప్రతి ఒక్కరూ భాగస్వామం వహించాలని, ప్రజల్లో చైతన్యం పెంచేందుకు స్వచ్ఛతాహీ సేవను ఆదరించి చైతన్యవంతులు కావాలని వీఎంసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ రత్నావళి అన్నారు. 43వ డివిజన్‌లో జరిగిన బహుమతుల ప్రదానోత్సవంలో పాల్గొన్నారు.

పేరంటాలమ్మ దేవస్థానం ఈవోగా ప్రియాంక

ఆటోనగర్, సెప్టెంబరు 24: శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా పి.ప్రియాంక బదిలీపై వచ్చారు. ప్రస్తుతం ఆ బాధ్యతలు నిర్వహిస్తున్న పి.లోకేశ్వరి మాచవరం దాసాంజనేయస్వామి దేవస్థానానికి బదిలీపైవెళ్లారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

పాయకాపురం, సెప్టెంబరు 24: పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరమవుతాయని ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధనా సంస్థ ఇన్‌చార్జ్ డైరెక్టర్ బి.వెంకటేశ్వర్లు అన్నారు. పాయకాపురం రాధానగర్‌లో స్వచ్ఛతా హీ సేవా మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన ఇంటింటికీ వెళ్లి పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం పారిశుధ్య సిబ్బందికి మాస్కులు, గ్లౌసులు అందజేశారు. సంస్థ సిబ్బంది ఏజేవీ సాయి పాల్గొన్నారు.

భార్య అదృశ్యంపై ఫిర్యాదు

అజిత్‌సింగ్‌నగర్, సెప్టెంబరు 24: తన భార్య అదృశ్యంపై ఓ వ్యక్తి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ప్లంబర్‌గా పనిచేస్తున్న పిడుగు సతీష్, భార్యగంగానమ్మ గుడి ప్రాంతంలో కుటుంబ సభ్యులతో నివాసముంటున్నాడు. సోమవారం ఉదయం పని నిమిత్తం ఇంటి నుంచి వెళ్లాడు. తిరిగి సాయంత్రం వచ్చేసరికి భార్య పిడుగు అజయ్ దుర్గ (35) కనిపించలేదు. చుట్టుపక్క ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద ఆరా తీసిన దుర్గ ఆచూకీ తెలియలేదు. దీంతో కుటుంబ సభ్యులు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దిక్సూచి DIKSUCHI

తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయం(ఎన్ఎస్‌కేటీయూ-సెంట్రల్ యూనివర్సిటీ)కి చెందిన సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్(సీడీఓఈ)- ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్(ఓడీఎల్) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో డిస్టెన్స్ కోర్సులు



సంస్కృతంలో సర్టిఫికెట్ కోర్సు
కోర్సు వ్యవధి ఆర్నెల్లు. గరిష్ఠంగా ఏడాదిలో పూర్తిచేయాలి. సంస్కృత మాధ్యమంలో బోధన ఉంటుంది. **అర్హత:** దేవనాగరి లిపి రాయడం, చదవడం తెలిసి ఉండాలి. ఆగస్టు 15 నాటికి అభ్యర్థుల వయసు పదమూడేళ్లు నిండి ఉండాలి.

సంస్కృతంలో డిప్లొమా కోర్సు
కోర్సు వ్యవధి ఏడాది. గరిష్ఠంగా మూడేళ్లలో పూర్తిచేసే వీలుంది. ట్రెడిషనల్ సబ్జెక్టులను సంస్కృత మాధ్యమంలో, మోడరన్ సబ్జెక్టులను ఇంగ్లీష్ మాధ్యమంలో బోధిస్తారు. ఈ కోర్సు పూర్తిచేసినవారు సమ్మానిత శాస్త్రీ/బీఏ ప్రోగ్రామ్‌లో నేరుగా ప్రవేశం పొందవచ్చు. **అర్హత:** ఆర్ఎస్ విద్యాపీఠం/ఎస్ఎస్ యూనివర్సిటీ నుంచి సంస్కృతంలో సర్టిఫికెట్ కోర్సు పూర్తిచేసినవారు; న్యూఢిల్లీలోని ఆర్ఎస్ సంస్థానం నుంచి సంస్కృత ప్రథమ దీక్ష కోర్సు ఉత్తీర్ణులు; ప్రాక్ శాస్త్రీ/ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. వయసు పదహారేళ్లు నిండి ఉండాలి.

ప్రాక్ శాస్త్రీ
ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. గరిష్ఠంగా నాలుగేళ్లలో పూర్తిచేయవచ్చు. ఇది ఇంటర్ లెవెల్ ప్రోగ్రామ్. **అర్హత:** పదోతరగతి ఉత్తీర్ణులు; పూర్వ మాధ్యమ కోర్సు పూర్తిచేసిన వారు; శాన్‌స్క్రిట్ ఎంట్రెన్స్ ఎగ్జామ్‌లో అర్హత సాధించినవారు; వేద భూషణ్ సర్టిఫికెట్ కోర్సు ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. పదోతరగతి స్థాయిలో సంస్కృతం ఒక సబ్జెక్టుగా చదివినవారికి, ఎస్ఎస్‌యూ నుంచి సర్టిఫికెట్ ప్రోగ్రామ్ ఆఫ్ శాన్‌స్క్రిట్ పూర్తిచేసినవారికి ప్రాధాన్యం ఉంటుంది. అభ్యర్థుల వయసు ఆగస్టు 15 నాటికి పదిహేనేళ్లు నిండి ఉండాలి.

బీఏ ఆనర్స్ శాన్‌స్క్రిట్
ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. గరిష్ఠంగా ఎనిమిదేళ్లలో పూర్తిచేయాలి. **అర్హత:** ఇంటర్/ప్రాక్ శాస్త్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్ స్థాయిలో సంస్కృతం ఒక సబ్జెక్టుగా చదివినవారికి; ఎస్ఎస్‌యూ నుంచి సంస్కృతంలో సర్టిఫికెట్/డిప్లొమా కోర్సులు పూర్తిచేసినవారికి; ఇతర సంస్కృత సంబంధిత ప్రోగ్రామ్‌లు ఉత్తీర్ణులైనవారికి ప్రాధాన్యం ఉంటుంది. ఆగస్టు 15 నాటికి వయసు పదిహేడేళ్లు నిండి ఉండాలి.

శాస్త్రీ ఆనర్స్ సాహిత్య, శాస్త్రీ ఆనర్స్ వ్యాకరణ
ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. గరిష్ఠంగా ఎనిమిదేళ్లలో పూర్తిచేయాలి. ఇవి డిగ్రీ లెవెల్ ప్రోగ్రామ్‌లు. **అర్హత:** ఇంటర్/ప్రాక్ శాస్త్రీ/ఉత్తర మాధ్యమ/మాధ్యమ/వరిష్ఠోపాధ్యాయ/ఉప శాస్త్రీ/సాహిత్య/వేద విభూషణ కోర్సులు పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. డిప్లొమా ఇన్ సంస్కృతం/ విచక్షణ కోర్సు పూర్తిచేసినవారికి ప్రాధాన్యం ఉంటుంది. వయసు పదిహేడేళ్లు నిండి ఉండాలి.

పీజీ డిప్లొమా ఇన్ యోగ విజ్ఞాన
ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. గరిష్ఠంగా నాలుగేళ్లలో పూర్తిచేయాలి. ఇంగ్లీష్ లేదా సంస్కృత మాధ్యమంలో బోధన ఉంటుంది. **అర్హత:** ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు ఆగస్టు 15 నాటికి 20 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండాలి.

- **దరఖాస్తు ఫీజు:** రూ.700
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 10
- **వెబ్‌సైట్:** https://nsktu.ac.in

ఆచార్య సాహిత్య, ఆచార్య పురాణేతిహాస, ఆచార్య ఫలిత జ్యోతిష, ఆచార్య ధర్మ శాస్త్ర

ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. గరిష్ఠంగా నాలుగేళ్లలో పూర్తిచేయాలి. సంస్కృత మాధ్యమంలో బోధన ఉంటుంది. ఇవి పీజీ లెవెల్ ప్రోగ్రామ్‌లు. **అర్హత:** మూడేళ్ల డిగ్రీ/శాస్త్రీ/బీఏ సంస్కృతం/శిరోమణి/మాధ్యమ/శాస్త్ర భూషణ/విద్యా ప్రవీణ/విద్యాలంకార /వేదాలంకార /విద్వత్ మాధ్యమ/బ్యాచిలర్ ఆఫ్ ఆయుర్వేదిక్ మెడిసిన్/బ్యాచిలర్ ఆఫ్ ఆయుర్వేదిక్ మెడిసిన్ అండ్ సర్జరీ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు ఆగస్టు 15 నాటికి 20 ఏళ్లు నిండి ఉండాలి. ఎన్ఈపీ 2020 నిబంధనల ప్రకారం ప్రోగ్రామ్‌ల నుంచి వైదొలగే వీలుంది.

SCHOLARSHIP ALERT

SBIF Asha Scholarship Program 2024

Description: The SBIF Asha Scholarship Program 2024, one of India's largest scholarship programs, is an initiative of the SBI Foundation. This scholarship aims to provide financial assistance to meritorious students from low-income families across India, ensuring the continuity of their education.

Eligibility: Open to school students from Class 6 to 12 and undergraduate & postgraduate students from the top 100 NIRF universities/colleges, undergraduate students from IITs, and students pursuing MBA/PGDM courses from IIMs. Applicants must have scored a minimum of 75% marks in the previous academic year. Their gross annual family income must be up to INR 6 lakh (Up to INR 3 lakh for Class 6-12 students).

Prizes & Rewards: * **Classes 6 to 12:** INR 15,000 each * **UG Students:** Up to INR 50,000. * **PG Students:** Up to INR 70,000. * **UG Students from IITs:** Up to INR 2,00,000 * **MBA Students from IIMs:** Up to INR 7,50,000

Last Date to Apply: 01-10-2024. **Application mode:** Online only

Short Url: www.b4s.in/aj/SBIFS7

Reliance Foundation PG Scholarships 2024-25

Description: The Reliance Foundation Postgraduate Scholarships aim to enable and propel India's future leaders who can think big, think green, and think digital for the benefit of society.

Eligibility: * Students who are enrolled in the first-year full-time regular postgraduate programmes pursuing select future-ready courses from Engineering, Technology, Energy and Life-Sciences

* Must have secured 550 to 1,000 in the GATE examination **OR**

* Must have scored 7.5 or above in their undergraduate CGPA (or % normalized to CGPA) [If students have not attempted GATE]

* Open for resident Indian citizens.

Prizes & Rewards: Up to INR 6,00,000 over the duration of the degree. **Last Date to Apply:** 06-10-2024. **Application mode:** Online applications only. **Short Url:** www.b4s.in/aj/RFS10

buddy4study.com

ఎన్టీఆర్‌తో నా జర్నీ ఎప్పుడూ స్పెషలే!

జూనియర్ ఎన్టీఆర్, జాన్వీ కపూర్ జంటగా నటించిన 'దేవర' చిత్రం ఈ శుక్రవారం విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు కొరటాల శివ ఆ సినిమా గురించి ఆసక్తికరమైన విషయాలను మీడియాకు తెలియజేశారు.



● మనిషికి మితిమీరిన ధైర్యం కూడా కరెక్ట్ కాదు. అది మూర్ఖత్వం అవుతుంది. మనకు తెలియకుండానే మనలో ఓ భయం ఉంటుంది. దాన్ని గౌరవించాలని చెప్పే కథ 'దేవర'. అయితే భయం లేకుండా ఉండాలనుకోవడం తప్పు. లా ఆఫ్ ల్యాండ్ అనేది ఉంటుంది కదా. దాన్ని అందరూ పాటించాలి. జవాబుదారీతనం కూడా ఒక భయమే. ఇలాంటి భయం ఉండడం వల్ల మనం చేసే పనిని చెక్ చేసుకుని మంచి రిజల్ట్ పొందుతాం.

● ఎన్టీఆర్‌తో జర్నీ ఎప్పుడూ నాకు స్పెషలే. ఏ విషయమైనా ఆయనతో డిస్కస్ చేసినప్పుడు బాగున్నా, బాగో లేకపోయినా డిప్లొమాటిక్‌గా సమాధానం చెప్పరు. ఓపెన్‌గా మనసులో ఉన్న భావాన్ని చెబుతారు. 'దేవర' లైన్ చెప్పినప్పుడు ఎన్టీఆర్ స్పందించిన తీరుతోనే నెక్ట్స్ లెవల్‌కు వెళ్లాలని నిర్ణయించుకున్నాం.

● 'దేవర' సినిమాను సెట్స్‌కు తీసుకెళ్లడానికి ఆరు నెలల సమయం తీసుకున్నాం. సముద్రం మీద ఎలా షూట్ చేయాలి, అక్కడ లైటింగ్ లో ఎలాంటి వేరియేషన్స్ ఉంటాయి. మనం సముద్రాన్ని ఎలా క్రియేట్ చేసుకోవాలి.. అనే అంశాలను బాగా స్టడీ చేశాం. దానికి ఎక్కువ సమయం పట్టింది. మన టెక్నీషియన్స్ గురించి ఎంత చెప్పినా తక్కువే. అద్భుతమైన టాలెంట్ ఉన్నవాళ్లు ఎలాంటి ప్రిపరేషన్ లేకుండా స్పాట్‌కు వెళ్లినా వర్క్ చేసెయ్యగలరు. హాలీవుడ్ టెక్నీషియన్లు అలా కాదు. వాళ్లు ప్రిపేర్ కాకపోతే భయపడిపోతారు. ప్రతి సన్నివేశాన్నీ రిహార్సల్స్ చేసుకుని వెళతారు. మనవాళ్లకు కూడా హాలీవుడ్ టెక్నీషియన్స్ తరహాలో ప్రిపరేషన్ టైమ్ ఇస్తే ఇంకా అద్భుతాలు చేస్తారు.

● ఆచార్య సినిమా ఆశించిన స్థాయిలో ఆడలేదు. అయితే దానికి ఒత్తిడేం పడలేదు. 'దేవర' చిత్రానికి ఇంకా బాగా ప్రిపేర్ అయ్యా. 'ఆచార్య' రిలీజ్ అయిన 20 రోజుల్లోనే దేవర సినిమా మోషన్ పోస్టర్ పనిలో నిమగ్నమయ్యా.

● ఇంత పెద్ద కథను మూడు గంటల లోపు చెప్పగలమా అని 'దేవర' సెకండ్ షెడ్యూల్ టైమ్‌లోనే అందరం అనుకున్నాం. ఎందుకంటే నేరేషన్ నాలుగు గంటలుంది. పేపర్ మీద పెట్టినప్పుడు అది ఆరేడు గంటలు వచ్చింది. అయినా రెండు పార్టులు వద్దనుకుని రివర్స్‌లో వెళ్లాం. కానీ కుదరదని తేలిపోయింది. దాంతో రెండు భాగాలుగా తీయాలని నిర్ణయించుకున్నాం.

● కథ రాసుకునేటప్పుడే దేవర, అతని కొడుకు వర పాత్రలకు ఎన్టీఆర్‌నే అనుకున్నా. మరో హీరో కోసం రాసుకున్న కథ కాదు. మనిషిలో భయం ఉండాలని నేను చెప్పే ప్రయత్నం చేశా. ఆ భయాన్ని జాన్వీకపూర్‌లో చూశా. వారం పది రోజుల ముందే సీన్ పేపరు కావాలని అడిగి నా దగ్గర తీసుకుని ప్రాక్టీస్ చేసి సెట్స్‌కు వచ్చేది. ఫస్ట్ డే షూటింగ్‌లో ఆమె పాల్గొన్న సీన్ పూర్తి కాగానే తారక్ 'ఫెంటాస్టిక్' అంటూ అభినందించారు.

● 'ఓంకార' సినిమా చూశాక భైర పాత్రకు సైఫ్ అలీఖాన్ సరిపోతాడని ఫీల్ అయ్యా. కానీ ఆయనలో నార్త్ లుక్ ఉంటుందేమోనని సందేహించా. లుక్ టెస్ట్ చేద్దామని చెప్పి స్కెచ్ వేసి పంపించా. ఆయనే ముందు నమ్మలేదు. షూటింగ్‌కు ఒక గంట ముందే వచ్చి ప్రిపేర్ అయ్యేవారు. 'భైర' ఎలా ఉండాలని నేను అనుకున్నానో సైఫ్ అలాగే ఉన్నారు.

● అనిరుధ్ మ్యూజిక్‌కు నేను హ్యాపీ. నా కాన్సెప్ట్‌ను అర్థం చేసుకుని మంచి సంగీతం ఇచ్చాడు. త్వరలోనే ఆయుధ పూజ సాంగ్ రిలీజ్ చేసే ఆలోచనలో ఉన్నాం.

పి.సుశీలకు 'కలైంజర్ స్మారక కళారంగ' పురస్కారం



తమిళనాడు ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి శతజయంతి వేడుకల సందర్భంగా చిత్రసీమ ప్రముఖులకిచ్చే 'కలైంజర్ స్మారక కళారంగ విద్వాంసుల అవార్డు'కు గానకోకిల పి.సుశీల ఎంపికయ్యారు. గత మూడేళ్లుగా డీఎంకే ప్రభుత్వం ఈ అవార్డులను సినీ, కళారంగాలకు, దశాబ్దాల తరబడి సేవలందిస్తున్న దిగ్గజాలకు ప్రదానం చేసి సత్కరిస్తోంది. ఆ మేరకు 2023వ సంవత్సరానికి గాను ఈ అవార్డుకు తమిళ సినీ గేయరచయిత సాహిత్య అకాడమీ గ్రహీత ఎం.మేత్తా, సినీ నేపథ్య గాయని పి.సుశీల ఎంపిక అయ్యారు. ప్రముఖ తమిళ సినీ దర్శకుడు ఎస్పీ ముత్తురామన్ నేతృత్వంలో నడిగర్ సంఘం అధ్యక్షుడు నాజర్, మరో దర్శకుడు కరుపళనియప్పన్ సభ్యులుగా ఉన్న ఎంపిక కమిటీ ఈ మేరకు మంగళవారం ప్రకటించింది. ఈ అవార్డు గ్రహీతలకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ రూ.10లక్షల నగదు బహుమతి, ప్రశంసపత్రాన్ని అందజేయనున్నారు. ఈ నెల 30న చెన్నై సచివాలయంలో జరుగనున్న ప్రత్యేక కార్యక్రమంలో సినీ గేయరచయిత ఎం.మేత్తా, గాయని పి. సుశీల ఈ అవార్డులను అందుకోనున్నారు.

- చెన్నై (ఆంధ్రజ్యోతి)

అమ్మ సెంటిమెంట్‌తో...



శ్రీనువైట్ల దర్శకత్వంలో గోపిచంద్, కావ్యథాపర్ జంటగా నటిస్తున్న చిత్రం 'విశ్వం'. టీ.జీ.విశ్వప్రసాద్, వేణు దోనేపూడి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం నుంచి సెకండ్ సింగిల్ 'మొండి తల్లి పిల్ల నువ్వు'ను మేకర్స్ లాంచ్ చేశారు. అమ్మ సెంటిమెంట్‌తో గుండెలకు హత్తుకునేలా సాగే ఈ గీతాన్ని శ్రీహర్ష ఈమని రాయగా.. చేతన్ భరద్వాజ్ సంగీతం అందించారు. సాహితీ చాగంటి ఆలపించారు. దసరా కానుకగా అక్టోబర్ 11న ఈ చిత్రం విడుదలవుతోంది. ఎడిటర్: అమర్‌రెడ్డి కుడుమల, డీఓపీ: కే.వీ.గుహన్.

కోరుకున్నంత వినోదం ఉంటుంది



'ఈ సినిమా కథ వినగానే వివేక్ గారు 'అచ్చ తెలుగు సినిమాలా ఉంది. టైటిల్ ఏమనుకుంటున్నారు' అని అడిగారు 'శ్వాగ్' అని చెప్పగానే ఆయన ఆశ్చర్యపోయారు. వంశవృక్షం గురించి అందరికీ తెలిసిందే కదా దాన్ని గురించి సినిమాలో చెప్పాం' అన్నారు హసిత్ గోలి. శ్రీవిష్ణు హీరోగా ఆయన రూపొందించిన 'శ్వాగ్' చిత్రం అక్టోబర్ 4న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో హసిత్ సినిమా గురించి వివరిస్తూ 'ఇందులో డిఫరెంట్ జనరేషన్స్ టచ్ చేశాం ఇది ఒక వంశానికి చెందిన కథ. ప్రతి జనరేషన్‌లో విష్ణు పాత్ర ఉంటుంది. తరతరాలుగా మగ, ఆడ గొడవ అనేది ఎలా మారుతూ వచ్చింది, ఇప్పటికి దాని రిలవెన్స్ ఏమిటనే ఆలోచనలో చేసిన కథ ఇది' అన్నారు. 'ఈ సినిమాలో పాత్రల పేర్లు రిథమిక్‌గా పెట్టాలని అనుకున్నాం. అందుకే భవభూతి లాంటి పేర్లు పాత్రలకు పెట్టాం. సినిమాలో నాలుగు పాత్రలకు సమాన ప్రాతినిధ్యం ఉంటుంది. ఆ నాలుగు పాత్రలు కలసి ఎలాంటి కథ చెప్పబోతున్నారన్నది ఆసక్తికరం. చాలా మంచి కథ ఇది. విష్ణు నుంచి కోరుకునే ఫన్ ఉంటుంది. ఇంటర్వెల్ బ్లాక్ ఆశ్చర్యపోయేలా ఉంటుంది. అలాగే రీతూ వర్మ వింధ్యామర వంశీ రాణిగా కనిపిస్తారు. అద్భుతంగా నటించారు. వంశవృక్ష నిలయం అనే ప్లేస్‌ని క్రియేట్ చేసి పెద్ద సెట్ వేశాం. అందరం ఒక ఛాలెంజ్‌గా తీసుకుని వర్క్ చేశాం. శ్రీవిష్ణు చాలా ఎనర్జిటిక్‌గా పెర్ఫార్మ్ చేశారు. నాలుగు పాత్రల్లో స్పష్టమైన వ్యత్యాసం కనిపించాలని 'భారతీయుడు' తదితర చిత్రాలకు పని చేసిన రషీద్‌గారు ప్రోస్తెటిక్స్ చేశారు' అని వివరించారు హసిత్.

సరికొత్త ప్రపంచంలోకి...



సుధీర్‌బాబు నటిస్తున్న సూపర్ నేచురల్ థ్రిల్లర్ 'జటాధర'. ఈ పాన్ ఇండియా సినిమాను వెంకట్‌కల్యాణ్ దర్శకత్వంలో ప్రేరణ్ అరోరా, శివన్ నారంగ్, నిఖిల్ నంద, ఉజ్వల్ ఆనంద్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా నుంచి సెకండ్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా సుధీర్‌బాబు మాట్లాడుతూ "ఈ సినిమా మిమ్మల్ని ఓ సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తుంది. విజువల్‌గా.. ఎమోషనల్‌గా అద్భుతంగా ఉంటుంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్‌లో ఉన్న ఈ చిత్రం వచ్చే ఏడాది శివరాత్రికి విడుదలవుతుంది" అని చెప్పారు.

సిరిమల్లె చెట్టు లాంటి చిత్రం

- కార్తి



'దేవర' వార్‌ఫైర్ లాంటి సినిమా అయితే 'సత్యం సుందరం' సిరిమల్లె చెట్టు లాంటి అందమైన చిత్రం. ఈ రెండింటినీ తెలుగు ప్రేక్షకులు ఆదరించాలి' అని హీరో కార్తి కోరారు. ఆయన కథానాయకుడిగా ప్రేమ్‌కుమార్ దర్శకత్వం వహించిన చిత్రమిది. ఈ నెల 28న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా కార్తి మాట్లాడుతూ "అన్నయ్య సూర్యకూ ఈ కథ చాలా నచ్చింది. అరవింద్‌స్వామి కొత్తగా కనిపిస్తారు' అని హీరో కార్తి అన్నారు. ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ 'ప్రతి ఒక్కరి జీవితాలకు దగ్గరగా ఉండే చిత్రమిది. '96' చిత్రం లానే ఇది మీ మనసును చూరగొంటుంది' అన్నారు.

పుట్టిన రోజు పార్టీలు, పెళ్లి వేడుకలకు అనువైన సమయం సాయంకాలమే! అలాంటి సందర్భాల్లో సంప్రదాయ వస్త్రధారణకు బదులుగా ఆధునికత ఉట్టిపడే ఈవినింగ్ గౌన్స్ ఎంచుకోవచ్చు. అందుకోసం ఉద్దేశించినవే ఈ గౌన్స్!





ఫ్యాషన్

ఎవర్‌గ్రీన్ ఈవినింగ్ గౌన్స్







అందమైన డిజైన్లలో...

మెరుపులీనే సెక్విన్లు, ఆకట్టుకునే ఎంబ్రాయిడరీలు... ఇలా చెప్పుకుంటూపోతే ఈవినింగ్ గౌన్స్ కలిగి ఉండే హంగులకు ఒక అంతంటూ ఉండదు. మెటీరియల్ మొదలు, స్టిచింగ్ వరకూ వినూత్నంగా ఆకట్టుకునే అంశాలెన్నో ఈ గౌన్లలో ఉంటాయి. విలాసవంతమైన పార్టీలు మొదలు, సన్నిహితులతో జరుపుకునే చిన్నపాటి వేడుకల వరకూ ఎలాంటి సందర్భానికైనా ఈ గౌన్లు బ్రహ్మాండంగా సూటవుతాయి. స్లిట్ స్టైల్, ఎ లైన్ కట్ స్టిచ్... ఎలాంటి స్టైల్ గౌన్‌ను ఎంచుకున్నా ప్రత్యేకత ఉట్టిపడేలా ఉండాలంటే, ఒడ్డు పొడవుకు నప్పే లాంగ్ గౌన్ ఎంచుకోవాలి.

భిన్నమైన మెటీరియల్స్‌తో...

జార్జెట్, క్రేప్, షిఫాన్... ఇలా లాంగ్ గౌన్స్ ఎన్నో రకాల మెటీరియల్స్‌తో తయారవుతూ ఉంటాయి. లేయర్డ్ గౌన్స్ బుట్టబొమ్మలా కనిపించేలా చేస్తాయి కాబట్టి పీలగా ఉండే వాళ్లు వీటిని ఎంచుకోవచ్చు. పియర్ షేప్ శరీరాకృతి కలిగిన వాళ్లు, షిఫాన్, జార్జెట్ మెటీరియల్‌తో తయారైన లాంగ్ గైన్స్ ఎంచుకోవచ్చు. నాజూకుగా కనిపించడం కోసం నలుపు రంగు మెటీరియల్స్ ఎంచుకోవాలి.

యాక్సెసరీస్ ఇలా...

బోట్ నెక్ లాంగ్ గౌన్స్ వేసుకున్నప్పుడు చోకర్, హ్యాంగింగ్స్ పెట్టుకోవాలి. లో నెక్ లాంగ్ గౌన్స్‌కు, నెక్లెస్ సూటవుతుంది. చేతికి బ్రేస్‌లెట్, ట్రెండీ పర్స్ బాగుంటాయి. కచ్చితంగా హైహీల్స్ వేసుకోవాలి. కిటెన్ హీల్స్, ఫ్లాట్స్ లాంగ్ గౌన్స్‌కు ఏమాత్రం సూట్ కావు.

టీనేజ్.. బాధ్యత పేరెంట్స్‌దే

టీనేజ్... స్వేచ్ఛను కోరుకునే వయసు. నాకన్నీ తెలుసు అని అనిపించేలా చేసే వయస్సు. ఈ సమయంలో పిల్లల చదువు, వారి ఇతర అవసరాలను కల్పించడంతో తల్లిదండ్రుల బాధ్యత తీరిపోదు. జీవితంలో ఎలా నడుచుకోవాలో చెప్పాలి. సెల్ఫ్ కంట్రోల్ గురించి వివరించాలి. బాధ్యత అనేది ఎంత ముఖ్యమో అర్థమయ్యేలా చేయాలి. బౌండరీస్ పెట్టాలి. అదే సమయంలో ప్రేమను కనబరచాలి. సమయం వచ్చినప్పుడు అభినందించాలి. రోల్‌మోడల్‌గా నిలబడాలి. టీనేజ్ పిల్లలను తీర్చిదిద్దడం పేరెంట్స్‌తో చేతుల్లోనే ఉంటుంది.



బాధ్యత గుర్తెరిగేలా...

టీనేజ్‌లోకి వచ్చాక కూడా పిల్లలను చిన్న పిల్లలుగా లేక పెద్ద వాళ్లుగా ట్రీట్ చేయకూడదు. టీన్ అంటే చిన్న పిల్లాడు కాదు. అదే సమయంలో పెద్ద వాడు కాదు. కాబట్టి పేరెంట్స్ తమ అంచనాలను అడ్జస్ట్ చేసుకోవాలి. పెద్ద పెద్ద బాధ్యతలు అప్పగించకూడదు. తప్పులు చేయడం వాటి నుంచి పాఠాలు నేర్చుకోవడం ఎక్కువగా జరిగేది టీనేజ్‌లోనే. నెగెటివ్ అనుభవాలను లెర్నింగ్ ఎక్స్‌పెరీయన్సులుగా ఫ్రేం చేసి అందించాలి. పిల్లలు బాధ్యతాయుతంగా ఉన్నామని గట్టిగా చూపించే ప్రయత్నం చేస్తుంటే కొంత ఫ్రీడం ఇవ్వాలి. ఒకవేళ వాళ్ల ఎంపిక తప్పయితే నియంత్రించాలి. ఫైనల్‌గా మీ బిహేవియరే మీకు స్వేచ్ఛను అందించాలా? లేక పరిమితులు విధించాలా అన్నది నిర్ణయిస్తుందని తెలియజెప్పాలి. ఒకవేళ టీనేజ్ పిల్లాడు ఏదైనా పని చేయడానికి, ఎక్కడికైనా వెళ్లడానికి అనుమతి అడుగుతుంటే నేను అందుకు సిద్ధంగా లేనని పేరెంట్ చెప్పాలి. పిల్లలు తల్లిదండ్రుల పట్ల నమ్మకంగా ఉండేలా చేయాలి. ఒకవేళ ఆ నమ్మకాన్ని పోగొట్టుకుంటే వాళ్లకు తెలిసి వచ్చేలా పరిమితులు విధించాలి. అప్పుడే వారికి నమ్మకం విలువ అర్థమవుతుంది.

బౌండరీస్ ఉండాల్సిందే...

టీనేజ్ పిల్లలకు బౌండరీస్ విధించి వాటికి కట్టుబడి ఉండమని చెప్పడం తప్పేమీ కాదు. తల్లిదండ్రులు ఆ పని చేయాల్సిందే. బౌండరీస్ గురించి పిల్లలతో చర్చించాలి. బౌండరీస్, రూల్స్ పెట్టడంవల్ల వాళ్ల దగ్గర నుంచి ఏం ఆశిస్తున్నామో అర్థమవుతుంది. మీ నిర్ణయాన్ని మార్చే అవకాశం పిల్లలకు ఇవ్వకూడదు. అలా అని డిక్టేటర్‌గా ఉండకూడదు. అలా ఉంటే పిల్లలు రెబెల్‌గా మారే అవకాశం ఉంటుంది. ఒకవేళ పిల్లలు ఏదైనా తప్పు చేస్తే విమర్శించకూడదు. దానివల్ల జరిగే పరిణామాలు, అందులో ఉన్న నిజాల గురించి వివరించాలి. అలా అని సాధ్యం కాని రూల్స్‌ని పెట్టకూడదు. రాత్రి ఏడున్నర కల్లా పడుకోవాలి. స్నేహితులతో కలిసి ఎక్కడికీ వెళ్లకూడదు వంటి రూల్స్ సరైనవి కావు. టీనేజ్ పిల్లలు స్వేచ్ఛను కోరుకుంటారు. కొంత స్వేచ్ఛను కూడా ఇవ్వాలి. పిల్లల బలాలు, బలహీనతల పట్ల తల్లిదండ్రులకు అవగాహన ఉండాలి. కొన్నిసార్లు టీనేజ్ పిల్లలు తమను తాము ప్రూవ్ చేసుకోవడానికి ప్రయత్నిస్తారు. అలాంటప్పుడు వారితో వాదించకూడదు. నిదానంగా వాళ్లతో మాట్లాడాలి. పేరెంట్స్‌కు కోపం వచ్చేలా ప్రయత్నిస్తారు. కానీ పేరెంట్స్ నియంత్రణ కోల్పోకూడదు. ఒకవేళ పిల్లలు ఒత్తిడితో ఉన్నప్పుడు, అప్‌సెట్‌గా ఉన్నప్పుడు వాళ్లకు కొంత స్పేస్ ఇవ్వాలి. కమ్యునికేషన్ చాలా ముఖ్యం. వాళ్ల పరిస్థితిని అర్థం చేసుకోకుండా తప్పు చేశావు అని అనడం కూడా కరెక్ట్ కాదు. ఒకవేళ పిల్లలు మీతో మాట్లాడకపోతే టెక్స్ట్ మెసేజ్ చేయాలి. మీరెప్పుడూ అందుబాటులో ఉంటారన్న సందేశం ఇవ్వాలి. కమ్యునికేషన్ వల్ల పాజిటివ్ ఫలితాలు పొందవచ్చు.

ప్రేమను వ్యక్తపరచాలి

టీనేజ్ పిల్లలతో కలిసి ఎంజాయ్ చేసేందుకు సమయం కేటాయించాలి. ప్రతి నెలా ఒకరోజు రాత్రి పిల్లలతో కలిసి బోర్డ్‌గేమ్స్ ఆడుతూ ఎంజాయ్ చేసేలా ప్లాన్ చేసుకోవాలి. ఒకవేళ మీ పిల్లలు సాహసప్రియులైతే కార్టింగ్‌కు తీసుకెళ్లాలి. రోజూ మార్నింగ్‌వాక్ కలిసి వెళితే ఇంకా బాగుంటుంది. టీనేజ్ పిల్లలు ఎదిగేకొద్దీ స్నేహితులతో ఎక్కువ సమయం గడిపేందుకు ఆసక్తి చూపుతారు. అలాంటప్పుడు ఫ్యామిలీ యాక్టివిటీస్‌లో పాల్గొనమని ఒత్తిడి చేయకూడదు. పిల్లల వ్యక్తిగత ఇష్టాలను కూడా గౌరవించాలి. ఒకవేళ పిల్లలు ఏదైనా సమస్యతో వస్తే వాళ్లు చెప్పేది వినాలి. కొన్నిసార్లు ఒంటరితనం టీనేజ్ పిల్లలపై నెగెటివ్ ప్రభావాన్ని చూపిస్తుంది. హార్మోన్ల ప్రభావం ఉంటుంది. అవన్నీ తల్లిదండ్రులుగా అర్థం చేసుకుని తోడ్పాటునందించాలి. మిమ్మల్ని పిల్లలు రోల్‌మోడల్‌గా తీసుకుంటారు. పిల్లలు చేప్పేది వింటూ కొంత స్వేచ్ఛను ఇవ్వాలి. కొన్ని బాధ్యతలు అప్పగించాలి. స్కూల్‌లో, ఆటలలో, ఫ్యామిలీ ఈవెంట్స్‌లో వాళ్లు పెట్టే ఎఫర్ట్‌ని గుర్తించినప్పుడు అభినందించాలి. అప్పుడప్పుడు స్నేహితులను ఇంటికి పిలుచుకునే అవకాశాన్ని ఇవ్వాలి. ఇంట్లో ఫ్రెండ్స్‌తో కలిసి ఆడుకునే స్వేచ్ఛను ఇవ్వాలి. తల్లిదండ్రులు తమ పిల్లలకు అన్‌కండిషనల్ లవ్‌ని అందించాలి. అది వాళ్లలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతుంది.

ఆడపడుచు సలహాతో ఐదొందల రూపాయలతో మొదలుపెట్టారు. నడివయసులో వ్యాపారానికి శ్రీకారం చుట్టి... ఆరు పదులు దాటినా అదే ఉత్సాహంతో పని చేస్తున్నారు. పచ్చళ్లు... పొడులు... అప్పడాలు... అంచెలంచెలుగా ఎదుగుతూ... సంస్థను నేడు కోట్ల టర్నోవర్‌కు తీసుకువెళ్లారు. ఎందరో మహిళలకు ఉపాధి కల్పిస్తూ... సంప్రదాయ రుచులను ప్రపంచంలోని తెలుగువారందరికీ అందిస్తున్నారు. 'జంధ్యాల ఫుడ్స్' అధినేత జయప్రద జంధ్యాలతో 'నవ్య' మాటామంతి.



సంప్రదాయ రుచులకు ఈమే చిరునామా

"అంతకముందు మా కుటుంబంలో వ్యాపారం చేసినవారు ఎవరూ లేరు. నాకూ ఆ ఆలోచన ఎప్పుడూ రాలేదు. అదికూడా పెళ్లయ్యి, ఇద్దరు పిల్లలు పుట్టాక బిజినెస్ గురించి ఆలోచించేంత సమయం ఎక్కడుంటుంది! నాటి పరిస్థితులవల్ల అనుకోకుండా నా అడుగులు ఇటువైపు పడ్డాయి. ఇదంతా ఇరవయ్యేళ్ల కిందట మొదలైంది. మా నాన్నా వాళ్లది గుంటూరు జిల్లా రేపల్లె దగ్గర పెదపులివర్రు. దర్శకుడు కె.విశ్వనాథ్ గారి ఊరు. మా అత్తగారిది తెనాలి. 1986లో నా పెళ్లి అయింది. మావారు జంధ్యాల శివరామకృష్ణకు హైదరాబాద్ ఐడీపీఎల్ మార్కెటింగ్ విభాగంలో ఉద్యోగం. నేను తెనాలి ప్రభుత్వ పాఠశాలలో హిందీ టీచర్‌గా చేసేదాన్ని.

> **ఇష్టంతో కష్టపడితేనే...**
>
> వ్యాపారంలో రాణించాలనుకొనే మహిళలకు నేను చెప్పేది ఏంటంటే... ఇష్టంతో కష్టపడాలి. ఆసక్తి ఉంటేనే ఇందులోకి అడుగుపెట్టాలి. ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని... పైకి ఎదగాలన్న పట్టుదల, కసితో నిజాయతీగా పని చేయాలి. స్వశక్తితో మనం నిలదొక్కుకొంటే... మనతోపాటు మరికొందరికి ఉపాధి మార్గం చూపినవారం అవుతాం. వ్యాపారంలో ఎంత బిజీగా ఉన్నా ఒక మహిళగా ఇంటి బాధ్యతలు కూడా తప్పవు. రెండిటినీ సమన్వయం చేసుకొంటూ ముందుకు సాగడం పెద్ద సవాలే. కానీ ఏ సవాలునైనా స్వీకరించడానికి సిద్ధంగా ఉండాలి.

1983లో ఉద్యోగంలో చేరాను. పెళ్లయ్యాక రెండేళ్లు తెనాలిలో మా అత్తగారి దగ్గర ఉన్నాను. అయితే ఆయన హైదరాబాద్‌లో... నేను తెనాలిలో... ఇలా అయితే కుదరదనుకున్నా. దాంతో 1990లో ఉద్యోగానికి రాజీనామా చేసి హైదరాబాద్‌కు వచ్చేశాను. సాధారణంగా కష్టపడి సాధించుకున్న ప్రభుత్వ ఉద్యోగం వదులుకోవడానికి ఎవరూ



ఇష్టపడరు. కానీ మావారి కోసం ఆ నిర్ణయం తీసుకున్నాను. ఇక్కడ ఏదోఒక స్కూల్లో చేరవచ్చని అనుకున్నా. చాలాచోట్ల ప్రయత్నించాక ఒక స్కూల్లో ఉద్యోగం వచ్చింది.

ఆడపడుచు ఆలోచన...

కొన్నాళ్లకు మా అత్తగారు పోయారు. మా ఆడపడచులు, మరిది పెళ్లిళ్లు వచ్చాయి. మావారే ఇంటికి పెద్ద కావడం... ఆ బాధ్యతలన్నీ చూసుకోవాల్సి రావడంతో స్కూలు మానేశాను. అదే సమయంలో ఐడీపీఎల్ కూడా ఒడుదొడుకులు ఎదుర్కొంటోంది. దాంతో ఆయన వీఆర్ఎస్ తీసుకున్నారు. ఆయన ఖాళీ. నేనూ ఖాళీ. ఇద్దరు పిల్లలు, వారి చదువులు... ఇల్లు గడవాలి కదా. ఏంచేద్దామని ఆలోచిస్తున్నాం. ఒక రోజు మా ఆడపడుచు వచ్చింది. 'వదినా... నువ్వు పచ్చళ్లు, పొడులు బాగా చేస్తావు కదా. రూ.500 ఇస్తాను. దాంతో మొదలుపెట్టు' అంది. ఆ సలహా నాకు బాగా నచ్చింది. ఆ ఐదొందలతో కందిపప్పు, ఇతర దినుసులు తీసుకువచ్చాను. కంది పొడి కొట్టి తెలిసినవాళ్లదరికీ ఇచ్చాను. చాలా బాగుందన్నారు.

స్నేహితులకు పంపిస్తే...

తరువాత రెండు కిలోలు టమాటా, కిలో అల్లం తెచ్చి పచ్చళ్లు చేసి ఇచ్చాం. అందరికీ నచ్చాయి. మావారు... 'జయప్రద చేసింది' అని తన స్నేహితుడికి పంపించారు. ఆ పచ్చళ్లను తమ ఇంట్లో డైనింగ్ టేబుల్ మీద పెట్టుకున్నారట. అదే సమయంలో వాళ్లింటికి విదేశాల నుంచి స్నేహితులు వచ్చారు. వాళ్ల ఆ పచ్చళ్లు తిని, తమకూ కావాలని అడిగారు. వాళ్ల కోసం మొదటిసారి కాస్త ఎక్కువ మొత్తంలో పచ్చళ్లు చేసి ఇచ్చాను. అందరూ బాగున్నాయంటున్నారు. అలాంటప్పుడు దీన్ని ఒక వ్యాపారంగా మారిస్తే ఎలా ఉంటుంది? ఆ ఆలోచనతో 2003లో ఇంట్లోనే పచ్చళ్ల తయారీ మొదలుపెట్టాను. అప్పుడు నా వయసు నలభై ఏళ్లు. నెలకు ఐదు వేలు సంపాదిస్తే చాలనుకున్నాను. ఒక అమ్మాయిని హెల్పర్‌గా పెట్టుకున్నాను. పచ్చళ్లు, పొడులు... ఏదైనా పొద్దున అడిగితే సాయంత్రానికల్లా చేసేదాన్ని. మావారు కిలో అయినా... పావు కిలో అయినా ఆర్డర్లు ఇంటికి వెళ్లి ఇచ్చేవారు. వచ్చిన డబ్బుతో సరుకులు కొని... రొటేషన్ చేసేదాన్ని. గ్రైండర్ ఉన్నా... మంచి రుచి కోసం అన్నీ రోట్లోనే రుబ్బేదాన్ని. క్రమంగా ఆర్డర్లు పెరిగాయి. ఆరేడేళ్ల తరువాత ఒడియాలు కూడా ప్రారంభించాం. అప్పటి నుంచి గ్రైండర్ వాడకం మొదలైంది.

ఇరవై దేశాలకు...

కొన్నేళ్లకు మా 'జంధ్యాల ఫుడ్స్' పేరిట వెబ్‌సైట్ తెరిచాం. ఇప్పుడు ఇరవై రకాల పచ్చళ్లు, పది రకాల పొడులు, అప్పడాలు, ఒడియాలు తయారు చేస్తున్నాం. చర్లపల్లిలో తయారీ యూనిట్ ఉంది. హబ్సిగూడలో ఒక స్టోర్ నెలకొల్పాం. మరో రెండు చోట్ల కూడా స్టోర్స్ ప్రారంభించే ఆలోచన ఉంది. అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ సహా ఇరవై దేశాలకు మా ఉత్పత్తులు వెళతాయి. యాభై మందికి పైగా మా సంస్థలో పని చేస్తున్నారు. అందులో అత్యధికంగా మహిళలే. ఐదు వందలతో మొదలైన మా సంస్థ ఇప్పుడు 3.6 కోట్ల టర్నోవర్‌కు చేరింది.

వాళ్లిద్దరి నుంచే...

నేను వంటలు ఇంత బాగా చేయడానికి కారణం... మా అమ్మ, తరువాత మా అత్తగారు. తెనాలిలో అత్తగారి దగ్గర ఉన్నప్పుడు చాలా వంటలు నేర్చుకున్నా. ఏదైనా వెరైటీ చూస్తే... అది బాగా వచ్చేవరకు నిద్రపోను. వంట చేయడం నాకు ఎంతో ఇష్టం. మన సంప్రదాయ వంటలన్నీ బాగా చేస్తాను. అయితే మసాలాల జోలికి వెళ్లను. నాణ్యత, రుచి... ఇదే మా ప్రత్యేకత.

లేటు వయసులో మొదలుపెట్టి...

నలభై ఏళ్ల వయసులో కొత్తగా వ్యాపారం ఏంటని చాలామంది అనుకున్నారు. కానీ లక్ష్య సాధనలో పట్టుదల ఉంటే వయసు అవరోధం కాదనేది నా నమ్మకం. ప్రత్యేకించి ఆ వయసు మహిళలు... ఇల్లు, పిల్లలు, వారి బాధ్యతల్లో మునిగిపోతారు. వాటి నుంచి బయటికి రావడం అంత సులువు కాదు. అయితే ఎంచుకున్న రంగంలో మహిళలు రాణించాలంటే... కుటుంబ సహకారం ఎంతో అవసరం. నా విషయమే తీసుకొంటే... నేను బిజినెస్ ప్రారంభించేనాటికి మా అమ్మాయి సీఏ ఇంటర్ అయిపోయింది.

మా అబ్బాయూ పెద్ద తరగతుల్లో ఉన్నాడు. ఆర్థికంగా ఇబ్బందులు. అయితే నాకు ఇంట్లో ఖాళీ దొరికింది. మావారితో పాటు పిల్లలు కూడా నాకు సహకరించారు. వారందరి సహకారంతోనే ఇంతవరకు రాగలిగాను. ఇప్పుడు మా అమ్మాయికి పెళ్లయింది. మా అబ్బాయి నా బిజినెస్ చూసుకొంటున్నాడు.

• హనుమా

తారలు గ్లామర్‌కే పరిమితం కాదు, ఉక్కు మహిళలా తడాఖా చూపించగలుగుతారని నిరూపించింది బాలీవుడ్, టాలీవుడ్ కథానాయకి సయామి ఖేర్! బెర్లిన్‌లో జరిగిన ప్రపంచంలోని అత్యంత కఠినమైన ట్రయథ్లాన్ 'ఐరన్ మ్యాన్' రేస్‌లో మొదటిసారిగా పాల్గొని, విజయవంతంగా ముగించగలిగిన సయాని, తన అనుభవాన్ని ఇలా పంచుకుంది.

ఐరన్ మ్యాన్ రేస్ అంతు చూశా!

1.9 కిలోమీటర్ల ఈత, 90 కిలోమీటర్ల బైక్ రైడ్, 21.1 కిలోమీటర్ల పరుగు... విరామం లేకుండా, ఈ మూడింటినీ ఒకదాని తర్వాత ఒకటిగా పూర్తి చేయడమే 'ఐరన్ మ్యాన్ 70.3 రేస్'. 70.3 అనేది మొత్తం మైళ్లు. అంటే సుమారు 113 కిలోమీటర్లు. ఈ పోటీలో పాల్గొనడం కోసం ప్రపంచం నలుమూలల నుంచి క్రీడాకారులతో పాటు, ఎంతో మంది ఔత్సాహికులు జర్మనీలోని బెర్లిన్‌కు చేరుకుంటూ ఉంటారు. శారీరక దారుఢ్యంతో పాటు, దృఢమైన ఆత్మవిశ్వాసం, మానసిక స్థైర్యం కలిగి ఉన్నవాళ్లు మాత్రమే ఈ పోటీని అసాంతం పూర్తి చేయగలుగుతారు. ఇలాంటి కఠినమైన పోటీలో పాల్గొనాలనే కోరిక తనకు ఎప్పటి నుంచో ఉందనీ, దానికి కొవిడ్ అడ్డుపడి, చివరకు ఎలాగైతేనేం పూర్తి చేయగలిగానని చెప్పుకొస్తోంది సయాని.

షూటింగ్‌లతో బిజీగా ఉంటూనే...

"ఐరన్ మ్యాన్ రేస్ నా బకెట్ లిస్ట్‌లో ఎప్పటి నుంచో ఉంది. ఈ రేస్‌కు సిద్ధపడడం కోసం నేను ఎన్నో ఏళ్లుగా మారథాన్‌లలో పాల్గొంటూనే ఉన్నాను. కానీ ఈ రేస్ ఎప్పటికప్పుడు వాయిదా పడుతూ పోయింది. చివరకు ఈ సెప్టెంబర్‌లో మొదటిసారిగా ఈ రేస్‌లో పాల్గొనడమే కాకుండా, విజయవంతంగా పూర్తి చేయగలిగిన మొట్టమొదటి భారతీయురాలిగా నాకెంతో సంతోషంగా ఉంది. ఈ రేసులో గెలవడం ప్రధానం కాదు. పోటీలో పాల్గొని చివరివరకూ కొనసాగడమే ఎంతో గొప్ప విషయం. ఎంతో అనుభవమున్న క్రీడాకారులు, రేసులో పూర్వ అనుభవం ఉన్నవాళ్లు కూడా మధ్యలోనే విరమించుకుంటూ ఉంటారు. అత్యధిక శారీరక శ్రమకు లోనుచేసే ఈ రేసులో పాల్గొనడానికి ఏళ్ల తరబడి శిక్షణ అవసరమవుతుంది. ఓ పక్క షూటింగ్‌లతో బిజీగా గడుపుతూనే, మరో పక్క పరుగు, సైక్లింగ్, ఈతలను సాధన చేస్తూ నేను ఈ రేస్‌కు అన్ని విధాలా సిద్ధ పడ్డాను.





శిక్షణతోనే సాధ్యం

రేసులోకి అడుగు పెట్టినప్పటి నుంచి 8 గంటల పాటు వరుసగా సైక్లింగ్, పరుగు, ఈతలతో నాకు సమయమే తెలియలేదు. కానీ రేసు పూర్తి చేశానని అర్థమైన తర్వాత, పట్టలేనంత సంతోషం కలిగింది. నిజాన్ని జీర్ణించుకోడానికి సమయం పట్టింది. ఈ రేసులో మొదటిసారిగా పాల్గొన్న చాలా మంది రేసును పూర్తి చేయలేక, మధ్యలోనే వెనుదిరిగారు. నేను ఓ పక్క 12 నుంచి 14 గంటల పాటు షూటింగ్స్‌లో పాల్గొంటూ, మరో పక్క రేసు కోసం శిక్షణను కూడా కొనసాగించాను. గత ఫిబ్రవరిలో శిక్షణ మొదలుపెట్టిన మొదట్లో 3 కిలోమీటర్ల పరుగు, 50 మీటర్ల ఈతకే అలసిపోయేదాన్ని. ఆరు నెలల తర్వాత, నా మీద నాకు నమ్మకం పెరిగింది. మునుపటి కంటే ఎంతో మెరుగ్గా ఈత కొట్టగలుగుతున్నట్టు, పరిగెత్తగలుగుతున్నట్టు గ్రహించాను.

షూటింగ్‌లతో ఎంత అలసిపోయినా, ఉదయాన్నే 3:30కు లేచి శిక్షణ మొదలుపెట్టి, మళ్లీ షూటింగ్స్‌కు హాజరవడం అలవాటు చేసుకున్నాను. రేసులో ఎదుర్కోవలసిన సవాళ్ల గురించి నాకు తెలుసు. కానీ మెరుగ్గా శిక్షణ పొందగలిగితే, రేసును పూర్తి చేయడం పెద్ద సమస్య కాదనే విషయాన్ని నేను గ్రహించాను. కాబట్టి శిక్షణ మీదే దృష్టి పెట్టాను.

ఆత్మవిశ్వాసం, మానసిక స్థైర్యం

ట్రయథ్లాన్ పూర్తిగా శరీర సామర్థ్యానికి సంబంధించిన పోటీ. అయితే ఇలాంటి పోటీలు మానసిక స్థైర్యాన్ని కూడా పెంచుతాయి. మనసులోని గందరగోళాన్ని తొలగించి, ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయి. ఆ ఆత్మవిశ్వాసాన్ని నేను నటనా వృత్తి కోసం ఉపయోగించడం మొదలుపెట్టాను. దాంతో నా మీద నాకు నమ్మకం పెరిగింది. నటులకు ఇదెంతో ముఖ్యమైన అంశం. కాబట్టి నటులు ఏదో ఒక క్రీడలో పాల్గొంటూ ఉండడం అవసరమని నేను భావిస్తాను" అంటూ మీడియాతో తన క్రీడానుభవాన్ని పంచుకుంది సయామి.

నాటు గుడ్డులో పోషకాలు ఎక్కువ?

తెల్ల గుడ్డు, నాటు గుడ్డు... ఈ రెండూ మార్కెట్లో దొరుకుతున్నాయి. అయితే తెల్ల గుడ్ల కంటే నాటు గుడ్లలోనే పోషకాలు ఎక్కువగా ఉంటాయనే అపోహ స్థిరపడిపోయింది. కానీ నిజానికి పోషకాల పరంగా రెండు గుడ్లూ సమానమే! రెండింట్లోనూ ఒకే రకమైన పోషకాలు, ప్రొటీన్, విటమిన్లు, ఖనిజ లవణాలు ఉంటాయి. అలాంటప్పుడు నాటు గుడ్డు పెంకు



గోధుమ రంగులో ఎందుకుంది? అనే అనుమానం రావచ్చు. గుడ్డు పెట్టే ప్రక్రియలో, పెంకు మీద పిగ్మెంట్లు చేరుకోవడం వల్లే పెంకు రంగు మారుతుంది. అంతే తప్ప పెంకు రంగు గోధమ రంగులో ఉన్నంత మాత్రాన నాటు గుడ్లలో పోషకాలు ఎక్కువగా ఉంటాయనుకోవడం అపోహ మాత్రమే!

ఇది జగన్ పాపమే!

- పోలవరానికి ఆయన జమానాలోనే ప్రధాన నష్టం
- 2019, 20ల్లో వచ్చిన వరదలకే దెబ్బతిన్న డయాఫ్రం వాల్
- ప్రధాన డ్యాం ప్రాంతంలో భారీ గుంతలు
- తేల్చిచెప్పిన అంతర్జాతీయ నిపుణులు.. ప్రాజెక్టు అథారిటీకి నివేదిక

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



జగన్మోహన్‌రెడ్డి సీఎం అయిన తర్వాతే 2019, 2020లో వచ్చిన వరదలకు డయాఫ్రం వాల్ సహా పోలవరం ప్రాజెక్టు కీలక నిర్మాణాలు దెబ్బతిన్నాయని అంతర్జాతీయ నిపుణుల కమిటీ (పీఈవో) స్పష్టం చేసింది. ఆయన హయాంలోనే ప్రాజెక్టుకు ప్రధాన నష్టం జరిగిందన్నారు. ఆయన బాధ్యతలు చేపట్టాక నిర్మాణాన్ని యథాతథంగా కొనసాగించి ఉంటే.. డయాఫ్రం వాల్‌పై ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యాంను నిర్మించి ఉంటే.. 2020 వరదలకు వాల్ దెబ్బతినేది కాదని పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ)కి పంపిన సమగ్ర నివేదికలో పేర్కొంది. ప్రాజెక్టులో కీలకమైన డయాఫ్రం వాల్ దెబ్బతినడంతో.. మరమ్మతులు చేయాలా, కొత్తది నిర్మించాలా అనే సందేహాల నివృత్తికి అమెరికా, కెనడా దేశాలకు చెందిన ఇద్దరేసి నిపుణులను కేంద్ర జలశక్తి శాఖ నియమించింది. అమెరికాకు చెందిన ప్రాజెక్టుల నిర్మాణ నిపుణులు జియాన్ ఫ్రాంకో డి సిక్కో, డేవిడ్ బి పాల్.. కెనడా నిపుణులు సీన్ హించ్‌బెర్గర్, రిచర్డ్ డొనెల్లీ జూన్ 30, జూలై మొదటివారంలో ప్రాజెక్టు ప్రాంతంలో 4 రోజులు పర్యటించి స్వదేశాలకు వెళ్లిన వీరు.. తర్వాత ప్రాథమిక నివేదిక పంపారు. అందులోని కొన్ని అంశాలపై కేంద్ర జల సంఘం, రాష్ట్ర జల వనరుల శాఖ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. ప్రధానంగా 2016లో ప్రారంభించిన వాల్ 2018లోనే పూర్తయితే.. 2018లోనే దెబ్బతిన్నట్లుగా ప్రాథమిక నివేదికలో పేర్కొనడాన్ని ఆక్షేపించాయి. సమగ్ర అధ్యయనం చేశాక.. స్పష్టమైన నివేదిక ఇవ్వాలని అంతర్జాతీయ నిపుణులను కోరుతూ లేఖ రాశాయి. దీనిపై స్పందించి అధ్యయనం చేసిన వారు.. సోమవారం పీపీఏకి సమగ్ర నివేదిక పంపారు. 2019, 2020ల్లో వచ్చిన భారీ వరద ప్రవాహాన్ని స్పిల్‌వేతో పాటు ప్రధాన డ్యాం ప్రాంతం మీదుగా వదిలేయడం వల్లే డయాఫ్రం వాల్ దెబ్బతిందని అందులో స్పష్టం చేశారు. 2020లో వచ్చిన భారీ వరద ప్రవాహ సుడుల కారణంగా 485 మీటర్ల మేర వాల్‌కు నష్టం జరిగిందని.. గ్యాప్-2 ప్రాంతంలో భారీ గుంతలు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. ఇలా దెబ్బతిన్న డయాఫ్రం వాల్‌కు మరమ్మతు చేయడం కంటే.. కొత్తది నిర్మించడమే ఉత్తమమని తెలిపారు. ఈ దిశగా ఎప్పుడో నిర్ణయం తీసుకున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు.. మేఘా ఇంజనీరింగ్ సంస్థకు నిర్మాణ బాధ్యతను అప్పగించాయి కూడా.

మరిన్ని సూచనలివీ..

2023 జూలై 21న ఎగువ, దిగువ కాఫర్ డ్యాంల మధ్య బూడిద రంగులో ఉన్న బురదతో కూడిన సీపేజీని గుర్తించారు. ఈ బురద 7.91 మీటర్ల ఎత్తులో నిల్వ ఉంది. గత ఏడాది ఆగస్టు రెండో తేదీన 7.91 మీటర్లు, ఈ ఏడాది జూలై 21న 15.57 మీటర్లు, జూలై 22న 13.76 మీటర్లు, జూలై 29వ తేదీన 11.31 మీటర్ల మేర సీపేజీ వరద రెండు కాఫర్ డ్యాంల మధ్య నిల్వ ఉంది. ఈ సీపేజీని తగ్గించేందుకు పంపింగ్ ద్వారా డీవాటరింగ్ చేయాలని నిపుణులు పేర్కొన్నారు. 'కొత్త వాల్ నిర్మాణం సందర్భంగా ప్లాక్సిస్, సిగ్మా, అన్సిస్ పరీక్షలు నిర్వహించాలి. దాని నిర్మాణం ప్రస్తుతం ఉన్న డయాఫ్రం వాల్‌కు దిగువ భాగాన నిర్మించాలి. ఇప్పుడున్న వాల్ నిర్మాణ విధానాన్నే కొత్త వాల్‌కూ అనుసరించాలి. పొడి వాతావరణంలో, నేత చిత్తడిగా లేనప్పుడు దాని నిర్మాణం చేపట్టాలి' అని సూచించారు. ఈ ఏడాది నవంబరులో మొదలుపెట్టి.. 2025 జూలైలోగా డయాఫ్రం వాల్‌ను నిర్మించేందుకు రాష్ట్రప్రభుత్వం సిద్ధంచేసిన కార్యాచరణ ప్రణాళికను నిపుణులు ఆమోదించారు. ఒకే సీజన్‌లో వాల్ నిర్మాణం పూర్తి చేయడం మంచిదన్నారు. ప్రధాన డ్యాం నిర్మాణ సమయంలో.. జలసంఘం, పీపీఏ, కాంట్రాక్టు సంస్థ నిరంతరం చర్చించుకుంటూ సమన్వయంతో పనులు పూర్తి చేయాలని, డిజైన్లపై వర్క్‌షాపు నిర్వహించుకోవాలని పేర్కొన్నారు.



అబద్దయ్య | అజయ్ బాబు | పీతల సుజాత | తాతయ్య బాబు | శ్రీనివాసులు | దామచర్ల సత్య | దీపక్ రెడ్డి | సుబ్బారెడ్డి | లంకా దినకర్ | బంగార్రాజు | మాణిక్యాలరావు

బడుగులకు పెద్దపీట!

(మొదటి పేజీ తరువాయి)

ఉంటుందని అదే టెలికాన్ఫరెన్స్‌లో చెప్పిన చంద్రబాబు.. అదే మాట ప్రకారం బాగా పనిచేసినవారు తొలి జాబితాలో ప్రముఖంగా కనిపించేలా చూశారు. కేవలం పై స్థాయి నాయకులే కాకుండా కింది స్థాయిలో పనిచేసిన వారికీ చోటు కల్పించారు. ఎన్నికల ముందు టీడీపీ అంతర్గతంగా ఐదు వేల మంది ఓటర్లకు ఒక యూనిట్ ఇన్‌చార్జిని.. 25 వేల మందిని ఓటర్లకు ఒక క్లస్టర్ ఇన్‌చార్జిని నియమించి వారితో ఎన్నికల యుద్ధాన్ని నడిపించింది. ఇందులో ఒక క్లస్టర్ ఇన్‌చార్జికి ఇప్పుడు ఏకంగా చైర్మన్ పదవి లభించింది. శ్రీకాకుళం జిల్లాలో కాళింగ సామాజిక వర్గానికి చెందిన వజ్జా బాబూరావు ఇటీవలి ఎన్నికల్లో ఒక ప్రాంతంలో క్లస్టర్ ఇన్‌చార్జిగా పనిచేశారు. ఆయన్ను రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కౌన్సిల్ చైర్మన్‌గా నియమించారు. చైర్మన్, డైరెక్టర్లు కలిపి మొదటి జాబితాలో 99 మందికి చోటు కల్పించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కూడా టీడీపీ తన అభ్యర్థులకు సంబంధించి 99 మంది అభ్యర్థులతో తొలి జాబితా విడుదల చేయడం విశేషం. వీరిలో 11 మంది క్లస్టర్ ఇన్‌చార్జులు ఉన్నారు. ఆరుగురు యూనిట్ ఇన్‌చార్జులకు డైరెక్టర్ పదవులు దక్కాయి. 20 చైర్మన్ పదవుల్లో 16 టీడీపీ, మూడు జనసేన, ఒకటి బీజేపీకి లభించాయి. డైరెక్టర్ల పదవులను కూడా కూటమి పార్టీల మధ్య పంచారు.

త్యాగరాజులు వీరే..

తమ నియోజకవర్గాల్లో కొంతకాలం పనిచేసి తర్వాత రకరకాల కారణాలతో సీటు త్యాగం చేసిన 8 మంది టీడీపీ నేతలకు ఈ జాబితాలో చైర్మన్ పదవులు లభించాయి. వీరిలో మచిలీపట్నానికి చెందిన మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ, నెల్లూరు జిల్లా పార్టీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, పోలవరం మాజీ ఎమ్మెల్యే బొరగం శ్రీనివాసులు, నెల్లిమర్ల టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు, డోన్ నియోజకవర్గానికి చెందిన మన్నె సుబ్బారెడ్డి, ఉండి మాజీ ఎమ్మెల్యే మంతెన రామరాజు, అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే పీతల సుజాత ఉన్నారు. వీరిలో నలుగురు మిత్రపక్షాల కోసం సీట్లు త్యాగం చేయగా.. మరో నలుగురు సొంత పార్టీ నేతల కోసం త్యాగం చేశారు. ఉదాహరణకు నాటి ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు మాజీ ఎంపీ రఘురామకృష్ణంరాజుకు అవకాశం కల్పించడం కోసం తాను పోటీ నుంచి వైదొలిగారు. అలాగే నెల్లూరులో నారాయణ అబ్దుల్ అజీజ్ తప్పుకొన్నారు. వారిద్దరికీ ఇప్పుడు పదవులు లభించాయి. మిత్రపక్షాలకు సీట్లు పోవడం వల్ల బొరగం శ్రీనివాసులు, బంగార్రాజు, పీలా గోవింద్ పోటీ చేయలేకపోయారు. వారికి కూడా నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం ఇచ్చారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఎస్సీలకు రిజర్వు అయిన 3 అసెంబ్లీ సీట్లను టీడీపీ అధిష్ఠానం మాదిగ వర్గానికి కేటాయించింది. సామాజిక సమతుల్యత కోసం మాల సామాజిక వర్గానికి చెందిన పీతల సుజాతకు తాజాగా రాష్ట్ర వినియోగదారుల పరిరక్షణ మండలి చైర్‌పర్సన్ పదవి ఇచ్చారు. మాదిగ సామాజిక వర్గానికి చెందిన పార్టీ అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యాలరావుకు కూడా లిడ్‌క్యాప్ చైర్మన్ పదవి లభించింది. మంత్రి లోకేశ్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి నియోజకవర్గంలో పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన వారు అధికంగా ఉండడంతో ఆ వర్గానికి చెందిన నందం అబద్ధయ్యకు రాష్ట్ర పద్మశాలి సంక్షేమ-అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా అవకాశమిచ్చారు. లోకేశ్ పాదయాత్రలో వాలంటీర్ల విభాగం కన్వీనర్‌గా పనిచేసిన తెలుగు యువత నేత రవి నాయుడికి శాప్ చైర్మన్ పదవి దక్కింది. అనేక మంది ఆశలు పెట్టుకున్న పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పదవి ఒంగోలు జిల్లా పార్టీ అధ్యక్షుడు నూకసాని బాలాజీ యాదవ్‌కు ఇచ్చారు. ఆయనతోపాటు ఎన్నికల సమయంలో జిల్లా పార్టీ అధ్యక్షులుగా పనిచేసిన నలుగురికి పదవులు దక్కాయి. వీరిలో కొనకళ్ల నారాయణ (కృష్ణా), అబ్దుల్ అజీజ్ (నెల్లూరు), బత్తుల తాతయ్య (అనకాపల్లి) ఉన్నారు. కుప్పంలో పార్టీ సీనియర్ నేత, బీసీ వర్గాలకు చెందిన పీఎస్ మునిరత్నానికి ఆర్టీసీ వైస్ చైర్మన్ పదవి లభించింది. దామచర్ల సత్యకు కూడా కీలకమైన ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ పదవి లభించింది. మాజీ మంత్రి జేసీ దివాకర్‌రెడ్డి మేనల్లుడు, పార్టీ అధికార ప్రతినిధి దీపక్ రెడ్డికి కొత్త ఉద్యోగాల కల్పనకు సంబంధించిన సీడాప్ చైర్మన్ పదవిని ఇచ్చారు.

డైరెక్టర్ పదవి వద్దన్న శిష్టా లోహిత్

పౌర సరఫరాల సంస్థలో డైరెక్టర్‌గా నియమితులైన టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శిష్టా లోహిత్ తనకు ఆ పదవి వద్దని పార్టీ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబుకు మంగళవారం సాయంత్రం లేఖ రాశారు. 'నాకు ఈ పదవి ఇచ్చినందుకు ధన్యవాదాలు. మీరు అభిమానంతో ఇచ్చిన ఈ పదవిని తీసుకోవడానికి సిద్ధంగా లేను. నాకు కేటాయించిన ఈ పదవిని పార్టీ కోసం నిరంతరం కష్టపడుతున్న మరెవరికైనా కేటాయించాలని నా మనవి. పదవి ఉన్నా, లేకున్నా క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నాను' అని అందులో పేర్కొన్నారు.

డైరెక్టర్లలో మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యేలు

కార్పొరేషన్లకు డైరెక్టర్లుగా వేసిన వారిలో మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యేలు కూడా ఉండడం విశేషం. తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గానికి చెందిన మాజీ మంత్రి పరసా రత్నాన్ని మార్క్‌ఫెడ్ డైరెక్టర్‌గా నియమించారు. రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి, చీపురుపల్లి మాజీ ఎమ్మెల్యే గద్దె బాబూరావు, సాలూరు మాజీ ఎమ్మెల్యే ఆర్‌పీ భాంజుదేవ్‌ను పౌర సరఫరాల సంస్థ డైరెక్టర్లుగా నియమితులయ్యారు.



సత్యనారాయణ | బాలాజీ | శివశంకర్ | సీతారామ సుధీర్ | బాబురావు

కొనకళ్లకు ఆర్టీసీ...

అమరావతి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పోస్టుల కోసం ఎదురు చూస్తున్న ఆశావహులకు ప్రభుత్వం మంగళవారం శుభవార్త అందించింది. 20 కీలక నామినేటెడ్ చైర్మన్లు, పలు కార్పొరేషన్లకు సంబంధించి 79 మంది సభ్యులను ప్రకటించారు. వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, వారి అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు సభ్యుల పేర్ల వివరాలు ఇలా ఉన్నాయి.

20 సూత్రాల సంఘం, చైర్మన్: లంకా దినకర్ (బీజేపీ - ఒంగోలు)

పౌరసరఫరాల సంస్థ, చైర్మన్: తోట మెహర్ సీతారాం సుధీర్ (జనసేన - కాకినాడ సిటీ)

డైరెక్టర్లు: వంతల రాజేశ్వరి, మోకా ఆనంద్ సాగర్, రాయపాటి శైలజ, వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, ప్రవీణ్‌తాజ్, శిష్టా లోహిత్, బోయ మహేష్ నాయుడు, గద్దె బాబూరావు, ఆర్‌పీ భాంజ్‌దేవ్, తోట పార్థసారథి, కోటేశ్వర కేశన్, కె.లక్ష్మీనారాయణ, తుమ్మల పద్మజ లక్ష్మి (బీజేపీ), కడలి ఈశ్వరి (జనసేన), బోడపాటి శివదత్(జనసేన)

ఏపీ పద్మశాలి సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్, చైర్మన్: నందం అబద్ధయ్య, మంగళగిరి

సభ్యులు: దాసరి శ్రీనివాస్, హరికిశోర్, గంజి మాధవయ్య, పి.పురుషోత్తం, కందుల నాగార్జున, మత్సెట్టి శివ సత్యప్రసాద్, సింగం వెంకటేశ్వరరావు, తాళ్ల నరసింహస్వామి, జొన్నాదుల మహేశ్వరరావు, శ్రీరామదాసు గంగాధర, పి. లక్ష్మి నరసింహులు, తేడా సత్యనారాయణ, బిట్రా వెంకటసత్యనారాయణ(బీజేపీ), పర్వతం మధుసూదన్‌రావు(జనసేన), సూరిశెట్టి జయనాగకృష్ణ(జనసేన)

ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, చైర్మన్: పీలా గోవింద సత్యనారాయణ, అనకాపల్లి

సభ్యులు: పంతంగి నరసింహప్రసాద్, డాక్టర్ చందన స్రవంతి, గోనుగుంట్ల విజయ్‌కుమార్, దాసరి రాజా మాస్టర్, బచ్చల పుల్లయ్య, వూకా విజయ్‌కుమార్, రామాంజనేయులు(పాణ్యం), బూక్యా కాలే నాయక్, షేర్ రమణయ్య, వెంగమాంబ శ్రీనివాస్(బీజేపీ), యర్రా వేణుగోపాలరాయుడు, అంగ దుర్గ ప్రశాంతి(జనసేన), వడ్రాణం మార్కండేయ బాబు(జనసేన)

ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్, చైర్మన్: నూకసాని బాలాజీ, కొండెపి

సభ్యులు: పీవీజీ కుమార్, కిల్లు రమేష్‌నాయుడు, కుర్రా అప్పారావు, కటారి హేమలత, కైపా పద్మలతారెడ్డి, ఇందుకూరి సుబ్బలక్ష్మి, వాసిరెడ్డి రాంబాబు, కొడాలి వినోద్‌కుమార్, గంటా స్వరూపాదేవి(జనసేన), డాక్టర్ పాకంటి గౌతమ్‌రాజ్(జనసేన)

మార్క్‌ఫెడ్ చైర్మన్: కర్రోతు బంగార్రాజు, నెలిమర్ల

సభ్యులు: అన్నెపు రామకృష్ణనాయుడు, పరసా వెంకటరత్నం, కేసీ హరి, తాతిరెడ్డి తులసిరెడ్డి, వంగల శశిభూషణ్‌రెడ్డి(బీజేపీ), గుండుబోగుల నరసింహరావు(జనసేన)

ట్రైకార్, చైర్మన్: బొరగం శ్రీనివాసులు, పోలవరం

సభ్యులు: పూవల లావణ్య, తిరువీధి అనూరాధ, కుడా కృష్ణారావు(బీజేపీ)

ఏపీ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, చైర్మన్: మన్నె సుబ్బారెడ్డి, డోన్

సభ్యులు: కమతం కాటమయ్య, చిల్లా జగదేశ్వరి

స్టేట్ కన్జ్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్, చైర్‌పర్సన్: పీతల సుజాత, భీమవరం **సభ్యులు:** నగిడి నాగేశ్వరరావు

ఆర్‌టీసీ, చైర్మన్: కొనకళ్ల నారాయణ, మచిలీపట్నం

వైస్ చైర్మన్: పీఎస్ మునిరత్నం

ఏపీఐఐసీ చైర్మన్: మంతెన రామరాజు, ఉండి

మారిటైం బోర్డు, చైర్మన్: దామచర్ల సత్య, కొండెపి

ఏపీ హౌసింగ్ బోర్డు, చైర్మన్: బత్తుల తాతయ్య బాబు, చోడవరం

ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ లిమిటెడ్(ఏపీటీపీసీ), చైర్మన్: వజ్జా బాబూరావు, పలాస

లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, చైర్మన్: పిల్లి మాణిక్యాలరావు, చీరాల

సీడాప్, చైర్మన్: దీపక్‌రెడ్డి, రాయదుర్గ

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్), చైర్మన్: అనిమిని రవినాయుడు, తిరుపతి

ఏపీ టిడ్కో, చైర్మన్: వేములపాటి అజయ్‌కుమార్(జనసేన), నెల్లూరు సిటీ

ఏపీఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, చైర్మన్: తమ్మిరెడ్డి శివశంకర్(జనసేన), శ్రీకాకుళం


వక్ఫ్‌బోర్డు, చైర్మన్: అబ్దుల్ అజీజ్, నెల్లూరు రూరల్

బుడమేరులో గుర్తు తెలియని మహిళ మృతదేహం

అజిత్‌సింగ్‌నగర్: స్థానిక ఇందిరానాయక్‌నగర్ ప్రాంతంలోని బుడమేరులో గుర్తు తెలియని మృతదేహాన్ని పోలీసులు సోమవారం రాత్రి గుర్తించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. స్థానిక 5వ లైన్ సమీపంలోని బుడమేరులో మహిళ మృతదేహం ఉండటాన్ని సోమవారం రాత్రి స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతురాలి వయస్సు సుమారు 25 నుంచి 35 ఏళ్ల ఉంటుందని, నలుపు రంగు లెగ్గిన్, బ్లూకలర్ టీషర్టు ధరించి ఉన్నట్టు తెలిపారు. మృతదేహం రెండు రోజులుగా బుడమేరులో ఉందని, కుళ్లిపోయి చెడువాసన వస్తోందన్నారు. మృతురాలు వరద వలన కొట్టుకువచ్చిందా లేక మరేదైనా జరిగిందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానం షాపుల వేలం

గవర్నర్‌పేట: చల్లపల్లి బంగ్లా సమీపంలోని శ్రీ కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానంకు చెందిన షాపు నెంబరు 1, 2ల్లో మూడేళ్లకు పాటు వ్యాపారం చేసుకునేందుకు లైసెన్సు హక్కులు పొందేందుకు, దేవస్థానానికి భక్తులచే సమర్పించబడిన వస్త్రాలు బహిరంగ వేలంలో విక్రయించేందుకు అక్టోబరు 1న ఉదయం 10 గంటలకు సీల్డు టెండర్‌కు బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్టు ఈవో యడ్లపల్లి సీతారామయ్య, వంశపారంపర్య ధర్మకర్తలు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గలవారు షాపు ఒక్కింటికీ రూ.50వేలు చొప్పున ప్రథమ ధరావతులు చెల్లించి పాల్గొనవచ్చన్నారు. వేలంలో చీరెలు, పంచెకండువాలు పాడుకున్నవారు హెచ్చు పాట మొత్తం వెంటనే చెల్లించి సదరు వస్త్రాలు తీసుకుని వెళ్లవచ్చన్నారు. వివరాలకు 70937 28892 నెంబరును సంప్రదించాలని కోరారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్దవాగు

పొంగిన నున్న పెద్దవాగు

● రాకపోకలకు అంతరాయం

విజయవాడ రూరల్: నున్న గ్రామ శివారుల్లోని చినకంచి వద్ద పెద్దవాగు మంగళవారం ఉధృతంగా ప్రవహించింది. నున్న పరిసర ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు వరద నీరు పెద్దవాగుకు చేరడంతో వాగు ప్రవాహం ఎక్కువైంది. అకస్మాత్తుగా వాగు ప్రవాహం పెరగడంతో నున్న గ్రామం నుంచి వికాస్ కాలేజీ వైపు రాకపోకలు నిలిచిపోయాయి. వాగు ప్రవాహం కారణంగా ఎవరు ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు నున్న రూరల్ పోలీసులు మంగళవారం రాత్రి బందోబస్తు ఏర్పాటు చేశారు.

టీటీ, ఎయిర్ రైఫిల్‌లో ఎన్ఎస్ఎం విద్యార్థుల ప్రతిభ

పటమట: సీబీఎస్ఈ రాష్ట్రస్థాయిలో విద్యార్థులకు క్లస్టర్ పేరిట టేబుల్ టెన్నిస్‌ను పెద్దాపురం శ్రీ ప్రకాష్ సినర్జీ ఇంటర్‌నేషనల్ స్కూల్‌లో నిర్వహించారు. ఎన్ఎస్ఎం పాఠశాలకు చెందిన విద్యార్థులు చేతన్‌సాయి, హర్షిత్, ప్రత్యక్ దీపక్ ప్రథమ స్థానం కైవసం చేసుకుని అక్టోబర్‌లో హిమాచల్‌ప్రదేశ్‌లో జరిగే జాతీయ పోటీలకు ఎన్నికయ్యారు. అండర్-17 విభాగంలో నజ్మా, అద్విత, శన్విత లక్ష్మి ద్వితీయస్థానాన్ని, అండర్-14 విభాగంలో మిథిలాచార్య, సునీత, మాలిక, మాన్యా ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారు. తమిళనాడులో నిర్వహించిన క్లస్టర్‌లో పీప్‌సైట్ ఎయిర్ రైఫిల్ విభాగంలో మురారి ద్వితీయ స్థానం చేసుకుని అక్టోబర్‌లో భోపాల్ జరిగే జాతీయ పోటీలకు ఎన్నికయ్యాడు. ప్రిన్సిపల్ రాయప్రెడ్డి వైస్ ప్రిన్సిపాల్ బాలారెడ్డి, పీఈటీ ప్రియాంక వాజ్‌పేయ్, ఉపాధ్యాయులు వీరిని అభినందించారు.

సీఎం గారూ.. మా సమస్యలకు పరిష్కారం చూపండి

కృష్ణలంక, సెప్టెంబరు 24: కొన్నేళ్లుగా లారీ యజమానులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని, కొత్త ప్రభుత్వం వాటి పరిష్కారానికి చొరవ చూపాలని కోరుతూ రాష్ట్ర లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వైవీ ఈశ్వరరావు, అధ్యక్షుడు నాగుమోతు రాజా మంగళవారం సచివాలయంలో ఎంపీ కేశినేని శివనాథ్ సమక్షంలో సీఎంను కలిసి వినతిపత్రం ఇచ్చారు. రవాణా రంగానికి పూర్వవైభవం తెస్తామని సీఎం వారికి హామీ ఇచ్చారు.

వరద బాధితులకు రూ.10 లక్షల విరాళం

ది కృష్ణా డిస్ట్రిక్టు లారీ ఓనర్స్ మ్యూచ్యువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ స్టోర్స్ లిమిటెడ్ అధ్యక్షుడు కోనేరు వెంకట రమేష్, కార్యదర్శి కోనేరు జగదీశ్వరరావు మంగళవారం సీఎం సహాయ నిధికి రూ.10లక్షల చెక్కు అందజేశారు. సొసైటీ కార్యదర్శి కోనేరు జగదీశ్వరరావు తన వ్యక్తిగత సాయంగా రూ.లక్ష చెక్కును సీఎంకు అందజేశారు. కృష్ణా డిస్ట్రిక్ట్ ట్రైలర్స్ ఓనర్స్ అసోసియేషన్ కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు.



విరాళం అందచేస్తున్న సంస్థలు, అసోసియేషన్ల ప్రతినిధులు

సీఎం రిలీఫ్ ఫండ్‌కు భారీగా విరాళాలు

వన్‌టౌన్: వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి రాజధాని ప్రాంతంలోని పలు సంస్థలు, అసోసియేషన్లు సీఎం చంద్రబాబును సచివాలయంలో మంగళవారం కలిసి విరాళాలు అందజేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ తరపున రూ.80,23,533లు, ఫైనాన్షియర్ల అసోసియేషన్ రూ.10లక్షలు, ఓఎన్‌జీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రూ.40లక్షలు, సిటీకేబుల్ దండమూడి కృష్ణమోహన్ రూ.15లక్షలు, బీఎస్ఎన్ఎల్ పెన్షనర్ల సంఘం రూ.లక్ష అందజేశారు. వీరిని సీఎం అభినందించారు.

కాలుష్యాన్ని తగ్గించేలా చర్యలు తీసుకోవాలి

● వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

లబ్బీపేట, సెప్టెంబరు 24: నగర అందాన్ని మరింత పెంచేందుకు కెనాల్ బండ్ బ్యూటిఫికేషన్ చేయడమే కాకుండా కాలుష్యాన్ని తగ్గించే దిశగా ఎస్టీపీల అప్‌గ్రేడషన్ పనులు చేపట్టాలని వీఎంసీ కమిషనర్ అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన మంగళవారం రామలింగేశ్వరనగర్, సింగ్‌నగర్, జక్కంపూడి కాలనీ ఎస్.టీ.పీ, బందర్ కెనాల్ బండ్, పీసీఆర్ జంక్షన్ ప్రాంతాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ధ్యానచంద్ర మాట్లాడుతూ నగర పరిధిలో అభివృద్ధి పనులు పరిశీలించామని, యూనిడో ప్రాజెక్టు ద్వారా సెవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్లను మరింత అభివృద్ధి చేస్తూ కాలుష్యాన్ని తగ్గించేలా ముందుకు వెళ్తామన్నారు. నగరాన్ని కెనాల్ బండ్ బ్యూటిఫికేషన్ ప్రాజెక్టును చేపడుతున్నమని, బందరు కెనాల్ ఏలూరు కెనాల్‌లో ఉన్న కెనాల్ బండ్లను పచ్చదనంతో నింపడమే కాకుండా వాకింగ్ ట్రాక్, ప్లే ఎక్విప్మెంట్, జిమ్‌తో మరింత ఆహ్లాదకరమైన వాతావరణాన్ని నెలకొల్పే ప్రణాళికలే సిద్ధం చేయడమే కాకుండా త్వరగా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. అడిషనల్ కమిషనర్ కేవీ సత్యవతి, సూపరిండెంటింగ్ ఇంజనీర్ రామ్మోహనరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఏఎస్ఎన్ ప్రసాద్, వి.శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ ధ్యానచంద్ర

సీఆర్‌డీఏలో ఉద్యోగాల నోటిఫికేషన్లు

● 12 కాంట్రాక్టు ఉద్యోగాలకు నోటిఫికేషన్

● 106 ఇంజనీరింగ్ పోస్టులకు డిప్యుటేషన్ విధానంలో ఆహ్వానం

విజయవాడ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (సీఆర్‌డీఏ) లో కాంట్రాక్టు ప్రాతిపదికన ఉద్యోగాలకు నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. మొత్తం 12 పోస్టులకు ఔత్సాహికులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. సంస్థలో లీగల్ వ్యవహారాలను పర్యవేక్షించేందుకు లీగల్ మేనేజర్, ఫైనాన్స్ అకౌంట్స్ నిర్వహించేందుకు ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ మేనేజర్, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ అసిస్టెంట్ మేనేజర్, ఎన్విరాన్‌మెంటలిస్ట్, ఎన్విరాన్‌మెంటల్ స్పెషలిస్ట్, పబ్లిక్ రిలేషన్స్ మేనేజర్, ఇంగ్లీషు కంటెంట్ రైటర్, తెలుగు కంటెంట్ రైటర్, క్రియేటివ్ గ్రాఫిక్ డిజైనర్, వీడియో ఎడిటర్, ఎంఐఎస్ ఆపరేటర్, జాయింట్ డైరెక్టర్ కమ్యూనికేషన్స్ వంటి పోస్టులకు కాంట్రాక్టు పద్ధతిన తీసుకోవటానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆయా పోస్టులకు 3ఏళ్ల నుంచి పోస్టులను బట్టి 15 ఏళ్ల అనుభవాన్ని కోరుతోంది. ఆసక్తి కలిగిన అభ్యర్థులు సీఆర్‌డీఏ వెబ్‌సైట్‌లో అక్టోబరు 7లోపు తమ దరఖాస్తులను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

106 ఇంజనీరింగ్ పోస్టులకు...

సీఆర్‌డీఏలో ఇంజనీరింగ్ విభాగాన్ని బలోపేతం చేసుకునేందుకు భారీ సంఖ్యలో 106 పోస్టులకు ఇతర శాఖల నుంచి వచ్చే వారికి డిప్యుటేషన్ అవకాశం కల్పిస్తోంది. సీఆర్‌డీఏలో సూపరింటెండెంట్ ఇంజనీర్లు (ఎస్ఈ) - 9, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు - 24, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు - 38, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు (ఏఈఈ) - 35 పోస్టులకు డిప్యుటేషన్ ప్రాతిపదికన ఇతర ప్రభుత్వ ప్రభుత్వ రంగ సంస్థలకు సంబంధించిన వారిని ఆహ్వానిస్తోంది. మునిసిపల్ కార్పొరేషన్లు, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, ఇరిగేషన్, పబ్లిక్ హెల్త్ తదితర శాఖల నుంచి ఎవరైనా సీఆర్‌డీఏలో పనిచేయాలన్న ఆసక్తి ఉంటే డిప్యుటేషన్ ప్రాతిపదికన దరఖాస్తు చేసుకోవచ్చు.

రాజధానిలో స్టేడియం అభివృద్ధికి సహకరించండి

● మంత్రి లోకేశ్‌ను కోరిన ఎంపీ చిన్ని

వన్‌టౌన్, సెప్టెంబరు 24: రాజధాని అమరావతి ప్రాంతంలోని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జాతీయ, అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడేందుకు స్టేడియం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి సహకారం అందించాలని మంత్రి నారా లోకేశ్‌ను ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) కోరారు. మంగళవారం ఉండవల్లిలో లోకేశ్‌ను ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వెస్టరన్ బైపాస్ నుంచి స్టేడియానికి వచ్చేందుకు అనుబంధ రోడ్లు, నిడమర్రు రైల్వే లైన్ దగ్గర రోడ్డు ఓవర్ బ్రిడ్జి, పార్కింగ్ స్థలం, డ్రైనేజీ వ్యవస్థ, తదితర సదుపాయాలు కల్పించాలని వినతి పత్రంలో కోరారు.



రైతు సంక్షేమం, ప్రజారోగ్యానికి పెద్దపీట

● ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



గన్నవరం, సెప్టెంబరు 24: రైతు నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోపు వారి ఖాతాలకు సొమ్ము జమ చేసేలా కూటమి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పేర్కొన్నారు. రైతు పండించిన ప్రతి గింజా కొనుగోలు చేసేలా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. మంగళవారం గన్నవరంలో రూ.8.75లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామీణ ఆరోగ్య ఉప కేంద్ర భవనాన్ని, రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు సేవా కేంద్రాన్ని ఎమ్మెల్యే యార్లగడ్డ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతుకు అవసరమైన ఎరువులు, విత్తనాలు సకాలంలో అందించడానికి రైతు సేవా కేంద్రాలు ఉపయోగపడతాయన్నారు. సీఎం చంద్రబాబు విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, సర్పంచ్ నిడమర్తి సౌజన్య, ఉప సర్పంచ్ పాలడుగు నాని, టీడీపీ మండలాధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు, నేతలు దొంతు చిన్న, దేవినేని సులోచన దేవి, గూడపాటి తులసీమోహన్, నాగేంద్రమణి, జనసేన, బీజేపీ నేతలు చిమటా రవివర్మ, నేత చందు, నేతలు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా సీనియర్ మహిళా ఫుట్‌బాల్ టోర్నీ

విజయవాడ సెప్టెంబరు 24: కానూరు 100 అడుగుల రోడ్డులోని అనుమోల ప్రభాకర్ గ్రౌండ్స్‌లో రాష్ట్రస్థాయి సీనియర్ మహిళా ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్, జిల్లా అసోసియేషన్లు సంయుక్తంగా 3రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ పోటీలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కోటగిరి శ్రీధర్ ప్రారంభించగా 12 క్రీడాజట్లు బరిలో దిగాయి. ఏ పీఎఫ్ఏ ఉపాధ్యక్షుడు ముని శ్రీనివాసరావు, సెక్రటరీ డేనియల్ ప్రదీప్, ట్రెజరర్ విజయ్, సెలక్షన్ కమిటీ చైర్మన్ పి ఆలీబాబా, టెక్నికల్ కమిటీ చైర్మన్ సుధాకర్ దడా కళాధర్, సుధీర్‌తో పాటు జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వై శేషగిరిరావు, చక్రవర్తి, చీఫ్ రిఫరీ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ ఫుట్‌బాల్ మ్యాచ్‌ల్లో శ్రీకాకుళంపై అనంతపురం 8-0తోను, పల్నాడు పై కడప 11-0తోను, అన్నమయ్యపై పల్నాడు 2-0తోను, అనకాపల్లింపై అనంతపురం 10-0 తోను గెలిచాయి. శ్రీకాకుళం తన రెండో మ్యాచ్‌లో అనకాపల్లితో మ్యాచ్ డ్రాగా ముగించింది.



50 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

వన్‌టౌన్: మినీ వాహనంలో బిల్లులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న 50 బస్తాల రేషన్ బియ్యంను సోమవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసు అధికారులు వారధి వద్ద పట్టుకుని కృష్ణలంక పోలీసులకు అప్పగించారు. సింగ్‌నగర్‌కు చెందిన ఓ రేషన్ డీలర్ వన్‌టౌన్ ప్రాంతంలో రేషన్ కార్డుదారుల నుంచి రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొని ఇతర ప్రాంతాలకు తీసుకువెళ్లి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఆ డీలర్ రేషన్ బియ్యాన్ని గుంటూరుకు తరలించే ప్రయత్నం చేశాడు. సమాచారం తెలుసుకున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు నిఘా ఏర్పాటు చేసి వ్యాన్‌ను పట్టుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కృష్ణలంక పోలీసులకు అప్పగించారు. అయితే రేషన్ డీలర్‌ను కేసు నుంచి కాపాడటానికి స్టేషన్‌లోని ఓ కానిస్టేబుల్ గట్టి ప్రయత్నం చేసినట్టు సమాచారం. అతడి సూచనతోనే బిల్లులు లేకుండా తరలిస్తున్న బియ్యం బస్తాలకు మంగళవారం బిల్లులు తీసుకువచ్చి సివిల్ సప్లయ్ అధికారులకు చూపించేలా ప్రయత్నం చేసినట్టు తెలిసింది. అసలు సూత్రధారి డీలర్‌ను ఈ కేసు నుంచి తప్పించి మరో వ్యక్తిని చూపించినట్టు విమర్శలు వినిపించాయి.

విద్యుత్ ఉపకరణాల వినియోగంలో జాగ్రత్త

● విద్యుత్ కార్యనిర్వాహక ఇంజనీరు సుధాకర్

అజిత్‌సింగ్‌నగర్: వరద బాధిత కుటుంబాలు విద్యుత్ ఉపకరణాలు వినియోగించే సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలని విద్యుత్ కార్యనిర్వాహక ఇంజనీర్ బీవీ సుధాకర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వరద ముంపు ప్రాంతాల్లో మీటర్ రీడింగ్ తియ్యలేని కారణంగా సర్వీసులకు సరాసరి కింద బిల్లులివ్వడం జరిగిందన్నారు. ఈ మొత్తం బిల్లులను అక్టోబరులో సర్దుబాటు చేసి మాత్రమే బిల్లులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. సెప్టెంబరు విద్యుత్ బిల్లులు చెల్లించకపోయినా కరెంట్ సరఫరా నిలిపివేయబడదన్నారు. వరద ప్రభావానికి గురైన వినియోగదారులు తడిగా ఉన్న స్విచ్‌బోర్డులు, వైర్లు, తెగిపడి ఉన్న సర్వీస్ వైర్లు, విద్యుత్ ఉపయోగకరణ వస్తువులు వినియోగించరాదన్నారు. మెకానిక్‌తో సర్వీసింగ్ చేయించుకుని మాత్రమే వినియోగించాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలుంటే టోల్‌ఫ్రీ నెం 1912, లేదా అజిత్‌సింగ్‌నగర్ ఫ్యూజ్ ఆఫ్ కాల్ 9490615657 తెలపాలన్నారు.

హజ్ దరఖాస్తు గడువు 30 వరకు పెంపు: ఫరూక్

అమరావతి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): హజ్ యాత్రకు ఆన్‌లైన్ దరఖాస్తు నమోదు గడువును మరోసారి పొడిగించినట్లు రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖా మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మంగళవారం తెలిపారు. రాష్ట్రం నుంచి హజ్‌యాత్రకు వెళ్లేందుకు ఇప్పటి వరకు 1,937 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని వెల్లడించారు. ఇందులో 1,589 దరఖాస్తులు సక్రమంగా ఉన్నాయని తెలిపారు. సీఎం చంద్రబాబు హజ్‌యాత్రకు వెళ్లే వారికి రూ.లక్ష ఆర్థికసాయం అందించబోతున్నట్లు తెలిపారు. విజయవాడ గన్నవరం విమానాశ్రయం నుంచి హజ్‌కి వెళ్లే రాష్ట్ర ప్రయాణీకులకు మాత్రమే ఈ సౌలభ్యం ఉంటుందని మంత్రి ఫరూక్ తెలిపారు. ఈ అవకాశాన్ని రాష్ట్రం నుంచి హజ్ వెళ్లే యాత్రికులు సద్వినియోగం చేసుకోవాలని ఫరూక్ కోరారు. రాష్ట్రంలో రూ.105 కోట్లతో మూడు సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాలను ఏర్పాటు చేసి, మైనార్టీ యువత నైపుణ్యాభివృద్ధిని పెంపొందించేందుకు కార్యాచరణ అమలు చేయబోతున్నట్లు మంత్రి ఫరూక్ తెలిపారు. వీటిని గుంటూరు, నంద్యాల, అనంతపురం జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నైపుణ్యాభివృద్ధి శిక్షణలో భాగంగా ఏఐ, డేటా అనలిటిక్స్, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి అధిక డిమాండ్ ఉన్న అధునాతన కోర్సుల్లో మైనార్టీ యువతకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.



టీటీడీ ఏడీ బిల్డింగ్ ఎదుట నిరసనలో పాల్గొన్న స్వామీజీలు, హిందూ సంఘాల ప్రతినిధులు

కల్తీ నెయ్యి దోషులను శిక్షించాల్సిందే

● హిందూ సమాజానికి జగన్, వైసీపీ నేతలు క్షమాపణ చెప్పాలి

● తిరుపతిలో హిందూ సంఘాల నిరసన

తిరుపతి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): శ్రీవారి లడ్డూలో కల్తీ నెయ్యి వాడటాన్ని నిరసిస్తూ తిరుపతిలో హిందూ సంఘాలన్నీ రోడ్డెక్కాయి. శంఖం పూరించి ఉద్యమానికి శ్రీకారం చుట్టాయి. 'సేవ్ తిరుమల- సేవ్ టీటీడీ' నినాదంతో చలో తిరుపతి పేరిట మంగళవారం తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనం ఎదుట ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు చెందిన స్వామీజీలు, హిందూ సంఘాల ప్రతినిధులు నిరసన దీక్ష చేపట్టారు. శ్రీవారి లడ్డూ ప్రసాదాలను అపవిత్రం చేసినవారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కల్తీ నెయ్యిపై సమగ్ర దర్యాప్తు జరగాలని, వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని నినదించారు. రాష్ట్రప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్‌ను స్వాగతిస్తున్నామన్నారు. రూ.320లకు కేజీ నెయ్యి ఎక్కడైనా వస్తుందా? వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర రెడ్డి, ధర్మారెడ్డి ఎవరిని మోసం చేయాలని కల్తీ నెయ్యి తెప్పించారని మండిపడ్డారు. నెయ్యిలో జంతువుల కొవ్వుందని ఎన్డీడీబీ ఇచ్చిన నివేదికను వైసీపీ నేతలు తప్పని చెప్పడంలో ఆంతర్యం ఏమిటో అర్థంకావడం లేదన్నారు. టీటీడీ ఈవో శ్యామలరావును కలిసేందుకు ఏడీ బిల్డింగ్‌లోకి వెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు, టీటీడీ విజిలెన్స్ సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో ఈవో బయటకు రావాలంటూ నేలపై బైఠాయించి నినాదాలు చేయడంతో కొద్దిసేపటి తర్వాత అనుమతించారు. కల్తీ నెయ్యి వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరిపాలని, బాధ్యులను కఠినంగా శిక్షించాలని ఈ సందర్భంగా హిందూ సంఘాల ప్రతినిధులు ఈవోను కోరారు. శ్రీనివాసానంద సరస్వతి స్వామి (శ్రీకాకుళం), భైరవానంద స్వామి (ఒంగోలు), మహదేవానంద స్వామి (కామారెడ్డి), శివానంద స్వామి (మహబూబ్‌నగర్), తిరుపతికి చెందిన గణేష్ స్వామి, ఓంకార్, కిరణ్, బండ్ల లక్ష్మీపతి, రెడ్డి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సిట్‌తో కల్తీ నెయ్యిపై నిజాలు బయటకు..

» త్వరలో టీటీడీకి ధర్మకర్తల మండలి: మంత్రి ఆనం

తిరుమల, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): శ్రీవారి లడ్డూలో వినియోగించే నెయ్యిలో కల్తీ జరగడంపై దేవదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మంగళవారం తిరుమలలో స్పందించారు. 'టీటీడీ ఈవో, అదనపు ఈవోలు నెయ్యి కల్తీపై ఇచ్చిన నివేదిక ఆధారంగా సీఎం చంద్రబాబు సిట్ వేశారు. సిట్ తన నివేదిక అన్ని నిజాలు బయటపెడుతుంది' అన్నారు. తిరుమల శ్రీవారి దర్శనం అనంతరం ఆయన అన్నమయ్య భవనం ముందు మీడియాతో మాట్లాడుతూ.. ఇకపై శ్రీవారి అన్నప్రసాదాలు, లడ్డూ ప్రసాదాలు ఏ గ్రేడ్ క్వాలిటీతోనే ఉండాలని సీఎం ఆదేశించారన్నారు. గతంలో టీటీడీలో జరిగిన అక్రమాలపై ఇప్పటికే విజిలెన్స్ విచారణ పూర్తయిందని, నెయ్యి కొనుగోలు అంశంపై వేసిన సిట్ నివేదిక కూడా వచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటామన్నారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై టీటీడీ ఈవో, అదనపు ఈవో, అధికారులతో సమీక్షించినట్టు తెలిపారు. త్వరలోనే టీటీడీకి ధర్మకర్తల మండలిని సీఎం ఏర్పాటు చేస్తారని, ఆలాగే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 27వేల ఆలయాలకూ పాలకవర్గాలు ఏర్పాటవుతాయని మంత్రి తెలిపారు.

లడ్డూ కల్తీపై సీబీఐ దర్యాప్తు చేయాలి: మోషేన్‌రాజు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై సీబీఐ దర్యాప్తు చేపట్టాలని ఏపీ శాసన మండలి ఛైర్మన్ కె.మోషేన్ రాజు డిమాండ్ చేశారు. మంగళవారం ఢిల్లీలోని ఏపీ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. 'తిరుమల లడ్డూ తయారీలో కల్తీ జరిగిందని స్వయంగా సీఎం చెప్పారు. కల్తీ అనేది సర్వ సాధారణం. అయితే జంతువుల కొవ్వు కలిసిందనేది చాలామందిని ఆందోళనకు గురి చేసింది. గత ప్రభుత్వంలో ఇది జరిగిందని చెబుతున్నారు. దీనిపై మాజీ సీఎం, టీటీడీ మాజీ ఛైర్మన్లు కూడా సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. దేశంలోనే అత్యంత విశ్వసనీయత కలిగిన దర్యాప్తు సంస్థ సీబీఐ. అందుకే.. తిరుమల లడ్డూ వ్యవహారంపై సీబీఐ దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నా' అని అన్నారు.

కల్తీ నెయ్యి కారకుడు జగన్ రెడ్డే: నారాయణ

తిరుపతి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యికి ప్రధాన కారణం అప్పటి సీఎం జగన్మోహన్ రెడ్డేనని, కల్తీ నెయ్యిలో వచ్చిన కమీషన్ ఆయనకు వెళ్లిందని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఆరోపించారు. సుప్రీంకోర్టు ఈ లడ్డూ వివాదాన్ని సుమోటోగా తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంగళవారం తిరుపతిలో ఆయన మీడియాతో మాట్లాడారు.

'జే గ్యాంగ్' ఆట కట్టు!

(మొదటి పేజీ తరువాయి)

తాడేపల్లి ప్యాలెస్‌లో అపరిమిత మద్యం కథ ముక్కపుటలు ఆదిరేలా వస్తోంది. మద్యం తయారీ మొదలు కొనుగోలు వరకూ... సరఫరా నుంచి విక్రయాల దాకా.. అన్నీ గుప్పిట పెట్టుకుని జగన్ గ్యాంగ్ సాగించిన అక్రమ దందా వెలికితీసే పనిలో నిమగ్నమైన సీఐడీ మంగళవారం కీలక ముందడుగు వేసింది. రూ.వేల కోట్ల స్కాంకు మూలమైన ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డిపై 3 నెలల క్రితం దొంగతనం కేసు నమోదైంది. ప్రసాదంపాడులోని బేవరేజెస్ కార్పొరేషన్ కార్యాలయం నుంచి రాత్రి పదింటికి ఎవరో కారులో ఫైళ్లు, కొన్ని బాక్సులు పట్టుకెళుతున్నారంటూ అందిన ఫిర్యాదు మేరకు సీఐడీ కేసు నమోదుచేసింది. అప్పట్లోనే తనిఖీలు చేసింది. మొత్తం సమాచారాన్ని క్రోడీకరించి అసలు సూత్రధారులు, వేలకోట్ల కమీషన్లు పొందిన వారికి ఉచ్చు బిగించేందుకు సంసిద్ధమైంది. అన్నింటికీ ప్రధాన సాక్షి అయిన వాసుదేవ రెడ్డి కేసుల నుంచి తప్పించుకునేందుకు ఎంచుకున్న మార్గాలు. వారిని జాగ్రత్తగా పరిశీలించి న్యాయపరమైన అడ్డంకులేవీ లేకుండా జాగ్రత్త పడ్డ దర్యాప్తు అధికారులు, ఆధారాలు సేకరించి కీలక అధికారులు అధికారులు... అడుగువేశారు. మంగళవారం సాయంత్రం కార్పొరేషన్ ఆఫీసుకు చేరుకున్న సీఐడీ బృందాలు గతంలో సీజ్ చేసిన వాసుదేవ రెడ్డి కార్యాలయాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశాయి. ఆయన గదిలో ఫైళ్లు, కంప్యూటర్లు, ఇతరత్రా కీలక ఆధారాలు సేకరించాయి.

దర్యాప్తు అధికారులే విస్మయపోయేలా..

వాసుదేవరెడ్డి గదిలో జరిపిన తనిఖీల్లో కొత్తగా లభ్యమైన సమాచారం సీఐడీ అధికారులనే నివ్వెరపాటుకు గురిచేసినట్టు సమాచారం. ప్రభుత్వమే ఇంత నాసిరకం మద్యంతో ప్రజల ప్రాణాలు తీసిందా అని ఆశ్చర్యపోయారు. వైసీపీ ప్రభుత్వంలో పెద్దలు, సన్నిహితులు, ఆనుయాయులు కోటరీగా ఏర్పడి ఇతర యాజమాన్యంలో ఉన్న డిస్టిలరీస్, బ్రూవరీస్‌ను కైవసం చేసుకున్నారు. అప్పటినుంచి జనంపైకి జే బ్రాండ్ల మద్యం వదిలారు. దీనివెనుక వేల కోట్ల కుంభకోణం పథక రచన ఉన్నట్టు సీఐడీ అధికారులు పసిగట్టారు. ఈ బ్రాండ్ల అమ్మడుపోని ఆడిగే వ్యాపారులేకుండా మద్యం దుకాణాల్ని నాడు ప్రభుత్వమే తన చేతిలో పెట్టుకుంది. కొనుగోలు దారులు ఏది అడిగినా మేమిచ్చిందే తీసుకో. అంటూ ప్రాణాంతకమైన జె బ్రాండ్ సీసాలు ఇవ్వడంలో అవినీతిని గుర్తించారు. అత్యంత నాసిరకమైన రసాయనాలతో తయారు చేసిన నాటు సారా కన్నా హాని కరమైన మద్యం విక్రయించి లక్షలాది మంది ఆరోగ్యంతో ఆడుకున్న వారికి సంకెళ్లు వేసేందుకు సిద్ధం అవుతున్నారు.

కీలక ఆధారాలతో కొత్తగా ఎఫ్ఐఆర్!

2019 జూన్ నుంచి మద్యం తయారు చేసిన కంపెనీలు ఎవరి చేతుల్లోకి బలవంతంగా వెళ్లాయనేది సీఐడీ గుర్తించింది. జే బ్రాండ్లన్నీ జగన్ అనుయాయుల కంపెనీలకు వెళ్లడానికి ముందు కంపెనీల యజమానుల ఆధారాలు సేకరించింది. వాటికి ఇష్టారాజ్యంగా అనుమతులిచ్చి ప్రాణాంతక రసాయనాలతో మద్యం తయారు చేయించిన వైనాన్ని పసిగట్టింది. దాని వెనకుండి జే బ్రాండ్లు, లేబుళ్లకు అడ్డగోలుగా అనుమతులు ఇచ్చేశారు. దీనివెనుక తాడేపల్లి నుంచి వచ్చిన ఒత్తిళ్ల మర్మాన్ని ఛేదించింది. ఆ మద్యాన్ని జగన్ అనుయాయుల కంపెనీల నుంచే బేసిక్ ధర కన్నా ఎక్కువ చెల్లించి కొనుగోలు చేసి ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టిన వైనాన్ని గుర్తించింది. బేసిక్ ధర ఎక్కువగా చెల్లించడంలో వ్యత్యాసంతో పెద్దల జేబుల్లోకి వెళ్లిన నిధులను గుర్తించారు. ఈ నేపథ్యంలో తాజాగా ఎఫ్ఐఆర్‌ను సీఐడీ నమోదుచేయనుంది. అయితే, ఎవరు నిందితులు.. సెక్షన్లు.. ఎన్నుంటాయ్? ఇతరత్రా వివరాలు బయటికి చెప్పడం లేదు. తమకు లభించిన ఆధారాల మేరకే బాధ్యులను కేసు నమోదు చేశామని, దర్యాప్తులో వెల్లడయ్యే మరిన్ని సాక్ష్యాల ఆధారంగా వెల్లడిస్తామని అధికారులు చెబుతున్నారు.

"తప్పు జరిగినపుడు ప్రాయశ్చిత్తం చేసుకుంటామని చెప్పాలి. లేదా ఆ తప్పులో తమకు ప్రమేయం లేదని తెలపాలి. అంతేకాని ఇష్టానుసారం మాట్లాడట మేవిటి? దుర్గగుడిలో వెండిరథంలోని మూడు వెండి సింహాల ప్రతిమలు మాయమైతే అప్పట్లో వైసీపీ నాయకులు అవహేళన చేస్తూ మాట్లాడారు. వైసీపీ హయాంలో వందల ఆలయాలు ధ్వంసమయ్యాయి. దేవతల విగ్రహాలను అపవిత్రం చేశారు. తిరుమల ఘటన వంటివి ఏ మసీదులోనో, చర్చిలోనో జరిగితే వైసీపీ నాయకులు ఇలానే మాట్లాడతారా?"

- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



బెజవాడ కనకదుర్గమ్మ ఆలయం మెట్లను కడుగుతున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

సనాతన ధర్మం కోసం ప్రాణాలైనా ఇస్తా

● డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

● పవన్ దీక్షకు సంఘీభావంగా 4రోజుల కార్యక్రమాలు

● దీక్ష తొమ్మిదోరోజు నుంచి దీపార్చన, సంకీర్తన, భజనలు

విజయవాడ(వన్‌టౌన్), సెప్టెంబరు 24: సనాతన ధర్మానికి హాని కలిగితే ఎటువంటి పరిస్థితిలోనూ ఊరుకునేది లేదని, ప్రాణాలు ఇచ్చేందుకైనా తాను సిద్ధమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. "చేతులెత్తి నమస్కరిస్తున్నా.. సనాతన ధర్మానికి హాని జరిగితే మౌనంగా ఉండబోం ఉండలేని కాదు" అని రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి అన్నారు. తిరుమలలో లడ్డూ కల్తీ వ్యవహారంలో వెంకటేశ్వరస్వామికి జరిగిన అపచారానికి క్షమాపణలు కోరుతూ ఆయన 11 రోజుల ప్రాయశ్చిత్త దీక్షను చేపట్టిన విషయం తెలిసిందే. అందులో భాగంగా మంగళవారం ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర దేవస్థానం గుడి మెట్ల మార్గాన్ని నీళ్లు పోసి కడిగి శుభ్రం చేశారు. పసుపు రాసి కుంకుమ అద్దారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. పూజల అనంతరం ఆయనకు వేద పండితులు, అర్చకులు ఆశీస్సులు అందజేశారు. అనంతరం పవన్ కల్యాణ్ మీడియాతో మాట్లాడారు. "తిరుమల లడ్డూ నెయ్యి కల్తీపై హిందువులందరూ కలికట్టుగా మాట్లాడాలి. దీనిపై మౌనం మంచిది కాదు. వైసీపీ వాళ్ల మాటలు మరింత వేదన కలిగిస్తున్నాయి. తప్పును ఒప్పుకోకుండా బుకాయింపులతో కాలక్షేపం చేస్తున్నారు. తప్పు జరిగినప్పుడు ప్రాయశ్చిత్తం చేసుకుంటామని చెప్పాలి. అంతేకాని ఇష్టానుసారం మాట్లాడటమేమిటి? దుర్గగుడిలో వెండిరథం సింహాల ప్రతిమలు మాయమైతే అప్పట్లో వైసీపీ నాయకులు అవహేళన చేస్తూ మాట్లాడారు. ఆ వ్యాఖ్యలు నాడు క్రైస్తవులో, మరెవరో చేయలేదు. చేతులకు తాళ్లు కట్టుకుని బొట్టు పెట్టుకునే హిందువులే మాట్లాడారు" అన్నారు.

నాడు వందల ఆలయాల ధ్వంసం..

వైసీపీ హయాంలో వందల ఆలయాలను ధ్వంసం చేశారని, దేవతల విగ్రహాలను అపవిత్రం చేశారని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. రామతీర్థంలో రాముడి విగ్రహానికి శిరచ్ఛేదం చేస్తే సంయమనం పాటించామన్నారు. "భారతదేశంలో సెక్యులరిజం వన్ వే కాదు.. రెండువైపుల నుంచి ఉండాలి. ఇతర మతాల ఆచారాలకు, సంప్రదాయాలకు విఘాతం కలిగితే ఎలా స్పందిస్తున్నారో.. హిందువుల మనోభావాలకు, ఆచారాలకు, సంప్రదాయాలకు, ధర్మాలకు విఘాతం కలిగితే అంతే స్థాయిలో స్పందించాలి. దేశంలో అన్ని మతాలకు సమాన హక్కులు ఉన్నాయి. తిరుమల ఘటన వంటివి ఏ మసీదులోనో, చర్చిలోనో జరిగితే వైసీపీ నాయకులు ఇలానే మాట్లాడతారా?" అని ప్రశ్నించారు.

పొన్నవోలూ.. జాగ్రత్త!

మాజీ ఏజీపీ పొన్నవోలు సుధాకర్ రెడ్డి మదమెక్కి మాట్లాడుతున్నారని పవన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. "పందికొవ్వు చాలా ఎక్కువ ధర ఉంటుందని, తక్కువ ధర గల నెయ్యిలో ఎలా కలుపుతారని పొన్నవోలు అంటున్నారు. భక్తుల మనోభావాలను మరింత దెబ్బకొట్టేలా ఆయన మాటలున్నాయి. టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని విచారణకు రమ్మంటే రిటైర్డు తనకు పంపించాలంటున్నారు. మరో మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి తిరుమలలో పెద్ద యాక్టింగ్ చేశారు. ఇంత పెద్ద అపచారం జరిగితే అప్పటి ఈవో ధర్మారెడ్డి ఎక్కడ ఉన్నారు?" అని పవన్ నిలదీశారు.

ప్రకాష్‌రాజ్, కార్తి గుర్తుంచుకోండి

నటుడు ప్రకాష్‌రాజ్ సున్నిత అంశాల విషయంలో తెలుసుకుని మాట్లాడాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ప్రకాష్‌రాజ్ తనకు మంచి మిత్రుడని, అతనిపై ఎంతో గౌరవం ఉందని, అయితే సనాతన ధర్మ పవిత్రతకు భంగం కలిగినప్పుడు మాట్లాడటం కూడా తప్పేనా అని ప్రకాష్ రాజ్ చెబితే ఎట్లా అని ప్రశ్నించారు. లడ్డూ విషయంలో జోకులు వేయడం సరికాదని తమిళ నటుడు కార్తిని ఉద్దేశించి అన్నారు. "సినీ ఫంక్షన్‌లో లడ్డూ సున్నిత అంశం అంటూ (కార్తి) సరదాగా మాట్లాడారు. అలా అనొద్దు. నేను నటులను గౌరవిస్తా. మీరు ఒకటికి వందసార్లు ఆలోచించుకుని మాట్లాడండి" అని అన్నారు. ఏదైనా తప్పు ఓ మసీదుకు, చర్చికి జరిగితే ఇలానే మాట్లాడతారా? అని ప్రశ్నించారు. "ఏదైనా మీరు చెబుతున్నా లేకా వాద దర్శం? సనాతన ధర్మం పై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదు. తోటి హిందువులను సాటి హిందువులే తూలనాడటం మానుకోవాలి" అని హెచ్చరించారు. కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, మచిలీపట్నం ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పల్లె పల్లెకు ప్రాయశ్చిత్త దీక్ష!

● కార్యాచరణ సిద్ధంచేసిన జనసేన

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్ష లక్ష్యాన్ని పల్లెపల్లెకు తీసుకువెళ్లేందుకు ఆ పార్టీ శ్రేణులు సిద్ధమవుతున్నాయి. జనసేనాని పిలుపుపై వీర మహిళలు, జనసైనికులు, క్రియాశీలక సభ్యులు తదుపరి కార్యాచరణకు సిద్ధమవుతున్నారు. పవన్ కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఆయన దీక్ష 9వ రోజుకు చేరుకున్నప్పటి నుంచి మూడు రోజుల పాటు ఈ కార్యక్రమాలు చేపడతారు. అందులోభాగంగా ఈ నెల 30వ తేదీ సాయంత్రం రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో దీపాలు వెలిగించి పూజలు నిర్వహిస్తారు. అక్టోబరు 1వ తేదీన ప్రతి ఒక్కరూ "ఓం నమో నారాయణాయ" అనే మంత్రాన్ని సామూహికంగా ఆలయాలు, యోగా కేంద్రాలు, నివాసాల్లో పఠిస్తారు. 2వ తేదీన నగర సంకీర్తన కార్యక్రమాలు చేపడతారు. దీక్ష పరిసమాప్తం అయ్యే చివరి రోజు 3వ తేదీన ఆలయాల్లో భజన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు.

లడ్డూ సిట్ చీఫ్‌గా ఐజీ త్రిపాఠి!

(మొదటి పేజీ తరువాయి)



బాగోతాన్ని, అపచారానికి బాధ్యులను ఈ బృందం తేల్చనుంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుమల దేవస్థానానికి సరఫరా అయిన నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసినట్టు నివేదికలు బయటికి వచ్చాయి. హిందువులు, వెంకటేశ్వర స్వామి భక్తుల మనోభావాలు ప్రపంచ వ్యాప్తంగా దెబ్బ తినడంతోపాటు దేశ విదేశాల్లో నిరసనలు వ్యక్తం అయ్యాయి. పార్టీలకు అతీతంగా హిందువులు, క్రైస్తవులు, నాస్తికులు అందరూ స్పందించారు. రెండు ట్యాంకర్ల నెయ్యి నుంచి శాంపిల్స్ తీసి ల్యాబ్‌కు పంపగా, నివేదికలో జంతువుల కొవ్వు ఉన్నట్టు తేలిందని టీటీడీ ఈవో శ్యామలరావు వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఏర్పాటుచేసిన సిట్‌కు అధిపతిగా తెలుగుదేశం ఐపీఎస్ అధికారిని నియమించడం గమనార్హం. ఉత్తరప్రదేశ్‌లో హైందవ ధర్మాన్ని ఆచరించే కుటుంబంలో జన్మించిన త్రిపాఠి ఆంధ్రప్రదేశ్ కేడర్ ఐపీఎస్ అధికారి. హిందూ ధర్మ ఆచార వ్యవహారాలపై ఆయనకు అవగాహన ఉంది. సిట్‌లోని మరో అధికారి గోపీనాథ్ జెట్టి నెల్లూరు జిల్లా. వెంకటేశ్వర స్వామికి ఆయన పరమ భక్తుడు. గతంలో టీటీడీ చీఫ్ విజిలెన్స్ సెక్యూరిటీ చీఫ్‌గా తిరుమల కొండపై సుదీర్ఘకాలం పని చేసిన అనుభవం ఆయనకు ఉంది. అలిపిరి తనిఖీల నుంచి ప్రతి అంశంపైనా ఆయనకు అవగాహన ఉంది. గత వైసీపీ ప్రభుత్వం జెట్టిని అక్కడి నుంచి బదిలీ చేసిన తర్వాత కొండపై గంజాయి, మద్యం లాంటివి తరచూ కనిపించాయి. సిట్‌లోని మూడో అధికారి అయిన కడప ఎస్పీ హర్షవర్ధన్ రాజుకు ఇంటి నుంచి అధికారిగా పేరుంది. తన మొదటి ఎస్పీ పోస్టు అన్నమయ్య జిల్లాలో చేశారు. ఎన్నికల సమయంలో తిరుపతి ఎస్పీపై ఆరోపణలు రావడంతో ఈసీ..హర్షవర్ధన్ రాజును ఎంపిక చేసింది. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం పోయి ఎన్డీఏ సర్కారు ఏర్పాటయ్యాక కీలకమైన కడప జిల్లాకు ఎస్పీగా ఆయన నియమితులయ్యారు. ఇటువంటి బ్యాక్‌గ్రౌండ్ ఉన్న పోలీసు అధికారులతో సిట్ కూర్పు సిద్ధమైంది. కోట్లాది మంది భక్తులకు ఊరట కలిగించేలా ఈ సిట్ పనితీరు ఉంటుందని పోలీసు శాఖలో వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

రాములోరి రథానికి నిప్పు

● అనంతపురంజిల్లాలో దుండగుల ఘాతుకం



దహనమైన రథం

కణేకల్లు, సెప్టెంబరు 24: అనంతపురం జిల్లా కణేకల్లు మండలం హనకనహళ్ రామాలయ ఉత్సవ రథానికి దుండగులు నిప్పు పెట్టారు. సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకున్న ఈ ఘటన జిల్లాలో కలకలం రేపింది. హనకనహళ్ గ్రామానికి చెందిన మాలింటి ఎర్రిస్వామి కుటుంబ సభ్యులు రూ.19 లక్షలు వెచ్చించి మూడేళ్ల క్రితం రథాన్ని తయారు చేయించి పురాతన రామాలయానికి సమర్పించారు. రథాన్ని భద్రపరిచేందుకు ఆలయ ప్రాంగణంలో రేకుల షెడ్డు ఏర్పాటు చేశారు. ఉత్సవాల సమయంలో రథాన్ని గ్రామంలో ఊరేగించి, యథాస్థానంలో ఉంచుతారు. రథం షెడ్డులో సోమవారం అర్ధరాత్రి మంటలు చెలరేగడాన్ని గ్రామస్థులు గుర్తించారు. రథానికి నిప్పు పెట్టారని కేకలు వేయడంతో అందరూ మేల్కొని మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. షెడ్డు తాళాలను పగలగొట్టి రథంపై పెట్రోల్ పోసి నిప్పు అంటించినట్లు గుర్తించారు. మంటలను ఆర్పేలోగా రథం చక్రాల మధ్య భాగం పాక్షికంగా దహనమైంది. ఇక్కడ ఇటీవల సామాజికవర్గానికి చెందిన రెండు వర్గాల మధ్య ఉన్న కక్షలే రథానికి నిప్పు పెట్టడానికి కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ దిశగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ ఘటనను తీవ్రంగా పరిగణించారు. విషయం తెలియగానే ఆ జిల్లా అధికారులకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. బాధ్యులను వెంటనే గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమగ్ర నివేదిక సమర్పించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీశ్ గ్రామాన్ని మంగళవారం సందర్శించారు. దాగ్నోస్టిక్ బృందాన్ని పిలిపించి దర్యాప్తు చేయించారు. రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. నిప్పు పెట్టినవారిని వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

తాడేపల్లి గూటి పలుకులు పలుకుతున్న పొన్నవోలు

● లోకేశ్ ట్వీట్‌ను వక్రీకరించి రోత పత్రిక రాతలు

● అన్యమతాన్ని పాటిస్తున్న జగన్ ఏనాడైనా డిక్లరేషన్ ఇచ్చారా?

● ఇవ్వాలని చైర్మన్లుగా పనిచేసిన వైవీ, కరుణాకరరెడ్డి అడిగారా?: పట్టాభి, దీపక్‌రెడ్డి




అమరావతి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): జంతువుల కొవ్వు అత్యుత్తమం అంటూ మాజీ ఏజీపీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి తాడేపల్లి గూటి పలుకులు పలుకుతున్నారని తెలుగుదేశం పార్టీ విమర్శించింది. తిరుమల లడ్డూ వివాదంలో తమను తాము ఎలా సమర్థించుకోవాలో తెలియక వైసీపీ నేతలు బిగ్ బాస్ షోకు పనికివచ్చేలా రకరకాల వేషాలు వేస్తున్నారని ఆ పార్టీ వ్యాఖ్యానించింది. ఆ పార్టీ అధికార ప్రతినిధులు కొమ్మారెడ్డి పట్టాభిరాం, దీపక్‌రెడ్డి మంగళవారం ఇక్కడ తమ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'జంతువుల కొవ్వు బంగారం, ఆవు నెయ్యి ఇత్తడి అంటూ పొన్నవోలు మాట్లాడిన మాటలు చూసి ప్రజలు నివ్వెరపోతున్నారు. ఆవు నెయ్యి కంటే జంతువుల కొవ్వు రేటు పదింతలు ఎక్కువ ఉంటుందని పొన్నవోలు నిస్సిగ్గుగా మాట్లాడుతున్నారు. ఆన్‌లైన్‌లో ధరలు తనిఖీ చేస్తే జంతువుల కొవ్వు ఒక కిలో రూ.50 నుంచి కూడా దొరుకుతోంది. దానిని తీసుకువచ్చి నెయ్యిలో కలిపి తక్కువ ధరకు తిరుమల ఆలయానికి సరఫరా చేస్తున్నారని ఇప్పటికే ఆధారాలతో సహా బయటపడింది. అందుకే కిలో నెయ్యి రూ.319కి తిరుమలకు సరఫరా చేస్తున్నారు. దీనిని కప్పిపుచ్చడానికి పొన్నవోలు తాడేపల్లి గూటి నుంచి రాసి పంపించిన స్క్రిప్ట్ చదువుతున్నారు' అని పట్టాభి విమర్శించారు. జగన్‌కు ఈ వ్యవహారంలో తనను తాను ఎలా సమర్థించుకోవాలో తెలియక తన రోత పత్రికలో అడ్డగోలు రాతలు రాయిస్తున్నారు. చివరకు మంత్రి లోకేశ్ ట్వీట్‌ను కూడా వక్రీకరించే స్థితికి దిగజారారని ఆయన ఆరోపించారు. 'జగన్ చంద్రబాబు బురద చల్లడానికి వెంటనే రంగంలోకి దిగరేదు. ఆ నెయ్యిని పరీక్షలకు పంపారు. నివేదిక వచ్చిన తర్వాత సరఫరా చేసిన కంపెనీకి నోటీసులు ఇచ్చారు. ఈ సమస్యను అధిగమించడానికి నిపుణులతో ఒక కమిటీ వేశారు. వారి నివేదిక వచ్చిన తర్వాత ఆ ప్రకారం అనేక చర్యలు తీసుకున్నారు. కొన్ని కంపెనీలను బ్లాక్ లిస్ట్‌లో పెట్టారు. కొత్తగా టెండర్లు పిలిచి మంచి కంపెనీలను ఎంపిక చేశారు. విజిలెన్స్ విభాగాన్ని రంగంలోకి దించి దర్యాప్తు చేయించారు. ఆ నివేదిక వచ్చిన తర్వాత అప్పుడు సీఎం చంద్రబాబు దీనిపై మాట్లాడారు. వీటన్నింటికి రెండు నెలల సమయం పట్టింది. భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా ముందు అన్నీ లోపాలు సవరించిన తర్వాతే విషయాన్ని బయటపెట్టారు. ఒక బాధ్యత కలిగిన నేతగా వ్యవహరించారు' అని పట్టాభి అన్నారు. దీపక్‌రెడ్డి మాట్లాడుతూ, 'కల్తీ వ్యవహారం బయటకు వచ్చిన తర్వాత వైసీపీ నేతలు భూమన కరుణాకర్ రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, జగన్‌రెడ్డి వేస్తున్న వేషాలు చూస్తే బిగ్ బాస్ షోలో పాల్గొనే పోటీ దారులతో పోటీ పడుతున్నారు. అధికారంలో ఉన్నప్పుడు సకల అక్రమాలకు పాల్పడి ఇప్పుడు ఎక్కడలేని నీతి కబుర్లు చెబుతున్నారు. ప్రమాణాల పేరుతో నాటకాలు ఆడుతున్నారు. అన్యమతాన్ని పాటిస్తున్న జగన్ తిరుమలకు వచ్చినప్పుడు ఏనాడైనా నిబంధనల ప్రకారం డిక్లరేషన్ ఇచ్చారా? ఇవ్వాలని చైర్మన్లుగా పనిచేసిన సుబ్బారెడ్డి, కరుణాకరరెడ్డి అడిగారా' అని ప్రశ్నించారు.

అన్నం తింటున్నావా? గడ్డి తింటున్నావా!

● పొన్నవోలు సుధాకర్ రెడ్డిపై బుద్దా వెంకన్న ధ్వజం

● హైకోర్టు సుమోటోగా కేసు నమోదు చేయాలని విజ్ఞప్తి



విజయవాడ(వన్‌టౌన్), సెప్టెంబరు 24: పొన్నవోలు సుధాకర్ రెడ్డి నోటికొచ్చినట్లు వాగుతున్నాడని, జగన్ ప్రభుత్వంలో రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉండి కూడా ఇలాగే కూతలు కూశాడని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న మండిపడ్డారు. మంగళవారం విజయవాడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అన్నంలో పందికొవ్వు తింటున్నావా? నెయ్యి వేసుకుని తింటున్నావా? అని పొన్నవోలును నిలదీశారు. ఆవునెయ్యి కంటే లడ్డూ కల్తీ విషయంలో పొన్నవోలు, నెయ్యి, బంగారం, ఇత్తడి అంటూ పోలిక చేయటమేమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. అతని లాయర్ పట్టా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. హైకోర్టు సుమోటోగా అతనిపై కేసు నమోదు చేయాలని కోరారు. న్యాయవ్యవస్థనే కించపరిచి తెల్చిన అతన్ని కోర్టులోకి కూడా అనుమతించకూడదన్నారు. బార్ అసోసియేషన్ కూడా స్పందించి పొన్నవోలును సస్పెండ్ చేయాలన్నారు. ధర్మారెడ్డి బయటకు వచ్చి అప్పుడు జరిగిన విషయాలను ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు.

ఆ పాపం బోర్డుదే!

(మొదటి పేజీ తరువాయి)

అప్పటి పాలకమండలి మార్చేసింది. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిరాగానే ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ప్రామాణికమైన సంస్థలతో పరిమితమైన నెయ్యి సరఫరాను చిన్నా చితకా వ్యాపారులకూ అవకాశం కలిగేలా నిబంధనలు సడలించింది. 2019 డిసెంబరు 19న జరిగిన పాలకమండలి సమావేశంలో, మరిన్ని సంస్థలకు అవకాశం కలిగించేలా సూచనలు చేయాలంటూ (తీర్మానం నెం. 220) ఒక కమిటీని అప్పటి పాలకమండలి ఏర్పాటుచేసింది. 2020 జనవరి 23న ఆ కమిటీ ఒక నివేదిక సమర్పించింది. దానిని పర్చేజ్ విభాగానికి పంపారు. అదే ఏడాది ఫిబ్రవరి 18న పర్చేజ్ విభాగం దానికి ఆమోదం తెలిపింది. ఆ వెంటనే ఫిబ్రవరి 29న (తీర్మానం నెం. 371) యథాతథంగా సిఫారసులన్నింటికీ వైవీ సుబ్బారెడ్డి పాలకమండలి ఆమోదం తెలిపింది. ఇందుకనుగుణంగా టెండర్ నిబంధనలలో కొన్నింటిని సవరించింది. మరికొన్నింటిని పూర్తిగా ఎత్తివేసింది. స్పెషల్ గ్రేడ్ అగ్‌మార్క్ నాణ్యత కలిగిన ఆవు నెయ్యిని ట్యాంకర్లలో కొనుగోలు చేయడానికి అవసరమైన ఉన్న నిబంధనను పాలకమండలి మార్చేసింది. దాంతో కొరుకున్న సంస్థలు నెయ్యి సరఫరాకు రంగంలోకి దిగాయి. లాభాలే లక్ష్యంగా లక్షల లీటర్ల నెయ్యిని తిరుమలకు సరఫరా చేశాయి. గత ప్రభుత్వంలో కన్నా తక్కువ ధరకే నెయ్యిని కొనుగోలు చేసి ఆదా చేస్తున్నాం అని చెప్పడం మీద దృష్టిపెట్టారే గానీ, వారు సరఫరా చేస్తున్న నెయ్యి నాణ్యత మీద శ్రద్ధ పెట్టలేదు. పాలక పెద్దల అండదండలతోనే టెండర్లు దక్కించుకున్నారు కాబట్టి టీటీడీ ఉద్యోగులు కూడా అభ్యంతరం పెట్టే సాహసం ఏ దశలోనూ చేయలేకపోయారు.

నెయ్యి ప్రహసనం నాలుగేళ్ల కిందటే మొదలైందని సవరించిన, సడలించిన, తొలగించిన నిబంధనలు వెల్లడిస్తున్నాయి. అవి ఇలా ఉన్నాయి.

జాతీయ సంస్థలకు...

- ట్యాంకర్లలో నెయ్యి సరఫరా చేసే సంస్థలకు సంబంధిత రంగంలో కనీసం మూడేళ్ల అనుభవం కలిగి ఉండాలన్న నిబంధనను సవరించి, ఏడాది చాలంటూ సడలించారు.
- నెయ్యి సరఫరా చేసే సంస్థ కనీసం రోజుకు 4 లక్షల లీటర్ల ఆవు పాలు సేకరించే సామర్థ్యం కలిగి ఉండాలని, ఆ పరిమాణంలో కనీసం ఏడాదిగా సేకరిస్తూ ఉండాలని ఉన్న నిబంధనను పూర్తిగా తొలగించారు.
- తన రెగ్యులర్ మార్కెట్ అవసరాలకు అదనంగా కనీసం ఏడాది టన్నుల ఆవు నెయ్యి ప్రాసెస్ చేసే సామర్థ్యం, ఏడాది నుంచి కలిగి ఉండాలని, ఎఫ్ఎస్ఎస్ఏఐ (ఆహార భద్రత- ప్రమాణాల భారతీయ సంస్థ) సమర్పించిన రిటర్నుల్లో కూడా ఆ వివరాలు రికార్డయి ఉండాలని అప్పటిదాకా ఉన్న నిబంధననూ పాలకమండలి పూర్తిగా ఎత్తివేసింది.
- నెయ్యి సరఫరా చేసే సంస్థ నెయ్యి తయారీ కోసం ఇతర డెయిరీల నుంచి క్రీమ్ లేదా మిల్క్ బటర్ సేకరించేటట్టు అయితే వాటిని ప్రతిష్ఠాత్మక సంస్థల నుంచే సేకరించాలని, ఆ సంస్థ ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ కలిగి, ఎఫ్ఎస్ఎంఎస్ లేదా హెచ్ఏసీసీపీ, ఐఎస్ఓ తదితర సర్టిఫికెట్లు కలిగి ఉండాలని, కనీసం రోజుకు 12 టన్నుల ఆవు పాల కొవ్వు సేకరించే సామర్థ్యం కలిగి ఉండాలని నిబంధన ఉండేది. దానిని ఏడాదికి టన్నులకు కుదించారు.
- ఆ సామర్థ్యంతో కనీసం మూడేళ్లుగా వ్యాపారం సాగిస్తూ ఉండాలనే నిబంధనను ఏడాదికి తగ్గించారు.
- నెయ్యి సరఫరా చేసే సంస్థ కనీస వార్షిక టర్నోవర్ రూ. 250 కోట్లు ఉండాలని, ఆ మేరకు గడచిన మూడేళ్లలో ఒక ఏడాదికి సంబంధించిన ప్రాఫిట్ అండ్ లాస్, బ్యాలెన్స్ షీట్ సమర్పించాలని నిబంధన ఉండగా, వార్షిక టర్నోవర్‌ను రూ. 150 కోట్లకు సడలించారు.

రాష్ట్ర స్థాయి కొనుగోళ్లకూ అవే సడలింపులు

- ఏపీ పరిధిలో స్పెషల్ గ్రేడ్ ఆవు నెయ్యిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసేందుకు టెండర్లు దాఖలు చేయాలంటే ఆ సంస్థ కనీసం మూడేళ్లుగా నడుస్తూ ఉండాలన్న నిబంధనను ఏడాదికి తగ్గించారు.
- గడచిన ఏడాదిలో కనీసం 2 లక్షల ఆవు పాలను సేకరించి ఉండాలన్న నిబంధనను ఎత్తివేశారు.
- రోజువారీ మార్కెటింగ్ అవసరాలకు అదనంగా మూడు టన్నుల నెయ్యిని ప్రాసెస్ చేసే సామర్థ్యం కలిగి ఉండాలన్న నిబంధననూ తొలగించారు.
- టెండరుదారు ఇతర సంస్థల నుంచి క్రీమ్ లేదా బటర్ సేకరించేటట్టయితే సంబంధిత సంస్థ రోజుకు కనీసం ఆరు టన్నుల ఆవుపాల కొవ్వును సేకరించే సామర్థ్యం కలిగి ఉండాలన్న నిబంధనను మూడు టన్నులకు తగ్గిస్తూ సడలించారు.
- సంస్థ కనీసం మూడేళ్లుగా కార్యకలాపాలు సాగిస్తూ ఉండాలనే నిబంధనను ఏడాదికి తగ్గించారు.
- టెండరుదారు వార్షిక టర్నోవర్ రూ. వంద కోట్లు ఉండాలన్న నిబంధనను రూ. 50 కోట్లు ఉంటే చాలని సడలించారు.

నెయ్యి టిన్నుల కొనుగోలు నిబంధనలదీ అదే దారి

నెయ్యిని టిన్నుల్లో కొనుగోలు చేయడానికి అమల్లో ఉన్న నిబంధనలను సైతం నాటి టీటీడీ పాలకమండలి 2022లోనే సడలించింది. టెండరుదారు కనీసం మూడేళ్లుగా ఈ వ్యాపారం చేస్తుండాలన్న నిబంధనను సడలించి ఏడాదికే కుదించారు. గడచిన ఏడాదిలో టెండరుదారు కనీసం 2 లక్షల లీటర్ల ఆవుపాలు సేకరించి ఉండాలన్న నిబంధనను పూర్తిగా తొలగించారు. రెగ్యులర్ మార్కెట్ అవసరాలకు అదనంగా కనీసం 2 టన్నుల నెయ్యి ప్రాసెస్ చేసే సామర్థ్యం కలిగి ఉండాలన్న నిబంధనను కూడా ఎత్తివేశారు. టెండరుదారు ఇతర సంస్థల నుంచి క్రీమ్ లేదా బటర్ సేకరించే పక్షంలో సంబంధిత సంస్థ రోజుకు నాలుగు టన్నుల ఆవుపాల కొవ్వు సేకరించగల సామర్థ్యాన్ని రెండు టన్నులకు కుదించారు.

ఆర్.కృష్ణయ్య గుడ్‌బై

(మొదటి పేజీ తరువాయి)

వైసీపీ రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు, బీద మస్తాన్ రావు రాజీనామా చేసిన విషయం తెలిసిందే. దీంతో సభలో వైసీపీ ఎంపీల బలం 11 నుంచి 8కి తగ్గింది. మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి ఏరికోరి తెచ్చుకున్న నేతలు, సన్నిహితులు కూడా ఆయనకు దూరమవుతుండడం గమనార్హం. మాజీ మంత్రి, సమీప బంధువైన బాలినేని శ్రీనివాసరెడ్డి, జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను కొద్దిరోజుల కింద పార్టీకి గుడ్‌బై చెప్పిన సంగతి తెలిసిందే. ఈ విషయాన్ని తాడేపల్లి ప్యాలెస్‌లో ఈ నెల 20న జరిగిన విలేకరుల సమావేశంలో ప్రస్తావించగా.. 'యా సీనియర్ నేత పార్టీని వీడిపోతున్నాడమ్మా.. ఎవరు పోతున్నారు' అని జగన్ వెటకారంగా మాట్లాడారు. కొత్తవారు వస్తారని వ్యాఖ్యానించారు. అలా మాట్లాడిన 3 రోజులకే రాజ్యసభ సభ్యత్వానికి ఆర్.కృష్ణయ్య రాజీనామా చేశారు. కృష్ణయ్య రాజీనామా ఆమోదం పొందింది. ఇదే బాటలో మరికొందరు నేతలు ఉన్నారని.. తమ అధినేతకు షాకివ్వబోతున్నారని వైసీపీ వర్గాలు తెలిపాయి. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వచ్చిననాటి నుంచి ఇప్పటిదాకా.. జగన్‌కు రాజకీయంగా ప్రతికూలతే ఎదురవుతోంది. తన హయాంలో జరిగిన అక్రమాలు బయటకు వస్తున్నాయి. కేసులు నమోదవుతున్నాయి. అదే విధంగా టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి ఘటనలో మాజీ ఎంపీ నందిగం సురేశ్ అరెస్టయ్యారు. ఈ కేసులో వైసీపీ ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురాం, వైసీపీ నేత దేవినేని అవినాశ్.. చంద్రబాబు నివాసంపై దాడి ఘటనలో మాజీ మంత్రి జోగి రమేశ్ .. ఇలా ఒక్కరొక్కరుగా పోలీసు దర్యాప్తు ఎదుర్కొంటున్నారు. అధికారంలో ఉండగా.. ఎడాపెడా ప్రతిపక్ష నేతలపై కేసులతో వేధించిన జగన్‌కు.. వైసీపీ నేతల దాడులపై ఇప్పుడు కేసులు నమోదు కావడం మింగుడుపడడం లేదు. వైసీపీ నేతలు జైలుకు వెళ్తుంటే.. ప్రజల నుంచి విపరీతమైన సానుభూతి వస్తుందని మొదట్లో ఆశించారు. అలాంటిదేమీ లేకపోవడం ఆయనకు చికాకు తెప్పిస్తోంది. ఇదే తరుణంలో నమ్ముకున్నవారంతా ఒక్కొక్కరుగా పార్టీని వీడి వెళ్లిపోతున్నారు. ఇందులో ముఖ్యనేతలు, బంధువులు కూడా ఉండడంతో ఆయనలో అసహనం పెరిగిపోతోంది. ఇంకా ఎవరెవరు వెళ్తున్నారో తెలుసుకునేందుకు నిఘా పెడుతున్నారని పార్టీ నేతల్లో జోరుగా చర్చ సాగుతోంది.

జాతీయ బీసీ కమిషన్ చైర్మన్‌గా కృష్ణయ్య?

హైదరాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన ఆర్.కృష్ణయ్య తదుపరి అడుగు చర్చనీయాంశమైంది. ఆయన్ను మోదీ ప్రభుత్వం జాతీయ బీసీ కమిషన్ చైర్మన్‌గా నియమించే అవకాశం ఉందని బీజేపీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. బీసీల హక్కుల కోసం చేస్తున్న పోరాటంలో భాగంగా కొత్త పార్టీ ఏర్పాటు చేయాలని రెండ్రోజుల కిందట జరిగిన సమావేశంలో పలు బీసీ సంఘాలు ఆయన్ను కోరాయి. అంతకుముందే బీజేపీ జాతీయ అగ్రనేతలు ఆయన్ను పార్టీలోకి ఆహ్వానించినట్లు ప్రచారం జరిగింది. ఆయనకు కీలక పదవి కట్టబెట్టడం ద్వారా తెలంగాణలో బీసీ ఓటుబ్యాంకు మరింత పెంచుకోవచ్చన్న అంచనాల్లో భాగంగా వారు ఆయనతో చర్చించినట్లు చెబుతున్నారు. కృష్ణయ్య జన్మదినం సందర్భంగా ఈ నెల 13న ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా స్వయంగా ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇది ఆయన్ను జాతీయ బీసీ కమిషన్ ఛైర్మన్‌గా నియమిస్తారనడానికి సంకేతాలని బీజేపీ వర్గాలు అంటున్నాయి.

రఘురామ కేసులో.. విజయపాల్‌కు హైకోర్టు షాక్

(మొదటి పేజీ తరువాయి)

కేసు వెనుక రాజకీయ కుట్రలు ఉన్నాయని ఇరుపక్షాల వాదనలు బట్టి అర్థమవుతోందని.. ఎఫ్ఐఆర్ నమోదులో జాప్యం ఉందనే కారణంతో ఉన్న వాస్తవాలను పరిగణనలోకి తీసుకోకుండా ఉండలేమని న్యాయస్థానం స్పష్టం చేసింది. 'ఘటనలో రఘురామకు తీవ్ర గాయాలు కాలేదని ఎవరూ చెప్పలేరు. తప్పు చేసిన వ్యక్తులు పోలీసు ఉన్నతాధికారులు, రాజకీయ పెద్దలు అయినప్పుడు గాయాల తీవ్రత ముఖ్యం కాదు. నాలుగు గోడల మధ్య జరిగిన ఈ ఘటనను సామాన్యులు గమనించే అవకాశం లేదు. ఆ ప్రదేశం పిటిషనర్ (విజయపాల్) పూర్తి నియంత్రణలో ఉంది. ఆయన సీనియర్ పోలీసు అధికారి. ఆయనతో పాటు కేసులో ఉన్న సహ నిందితులూ ఉన్నత స్థానాల్లో ఉన్నారు. రఘురామపై కస్టడీలో దాడి జరిగిన సమయంలో పిటిషనర్ ఆ కేసు దర్యాప్తు అధికారిగా ఉన్నారు. జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛ ఎంతో విలువైనవి. వాటికి ముప్పుందని కస్టడీలో ఉన్న వ్యక్తులు ఫిర్యాదు చేస్తే.. వాటిని రక్షించడంలో సంబంధిత దర్యాప్తు అధికారి బాధ్యత మరింత పెరుగుతుంది. పౌరులు చట్ట ఉల్లంఘనలకు పాల్పడకుండా చూడడం ఎంత ముఖ్యమో.. పౌరుల స్వేచ్ఛ, జీవనానికి ముప్పు వాటిల్లేలా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా, అధికార దుర్వినియోగానికి పాల్పడకుండా చూడడం న్యాయస్థానానికి అంతే ముఖ్యం. చట్టవిరుద్ధంగా వ్యవహరించి పౌరుల స్వేచ్ఛ, జీవనాన్ని హరించేలా విధులు నిర్వర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అధికారులకు ఎలాంటి లైసెన్సూ ఇవ్వలేదు. చట్టనిబంధనలు అమలు చేసే యంత్రాంగంలోని ఉన్నతాధికారి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్ విషయంలో భిన్నమైన, కఠిన ప్రమాణాలు అనుసరించడం అవసరం. ఈ కేసులో విజయపాల్‌ను విచారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ముందస్తు బెయిల్ మంజూరు అందుకు అవరోధంగా మారుతుంది. ఈ నేపథ్యంలో ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేస్తున్నాం' అని పేర్కొంది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ మంగళవారం తీర్పు ఇచ్చారు. రఘురామరాజు ఫిర్యాదు ఆధారంగా గుంటూరు నగరంపాలెం పోలీసులు నమోదు చేసిన హత్యాయత్నం కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ విజయ్‌పాల్ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై ఇటీవల విచారణ జరిగింది. ప్రాసిక్యూషన్ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ.. బాధితుడు రఘురామరాజు తరఫున పీవీజీ ఉమేశచంద్ర, విజయపాల్ తరఫున సీనియర్ న్యాయవాది వీరారెడ్డి వాదనలు వినిపించారు. అన్ని పక్షాల వాదనలు ముగిశాక తీర్పును రిజర్వ్ చేసిన న్యాయస్థానం.. విజయ్‌పాల్ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేస్తూ మంగళవారం నిర్ణయాన్ని వెల్లడించింది.

గురుకులాల ఘోష

(మొదటి పేజీ తరువాయి)

లేకపోవడంతో విద్యార్థులు బహిర్భూమికి వెళ్లినప్పుడు పాము కాటుకు గురైన సంఘటనలూ చోటు చేసుకుంటున్నాయి. ఒకప్పుడు హాస్టళ్ల కంటే మెరుగైన వసతులు, నాణ్యమైన విద్య, ఆరోగ్యకరమైన మెనూ అందించాలన్న సంకల్పంతో తీసుకొచ్చిన గురుకులాల పరిస్థితి ఇలా తయారైంది. కూటమి సర్కార్ వచ్చిన తర్వాత సత్వరమే దిద్దుబాటు చర్యలు చేపడతారని పేద విద్యార్థుల తల్లిదండ్రులు ఆశించారు. అయితే వంద రోజులైనా హాస్టళ్లు, గురుకులాల ప్రక్షాళన దిశగా అడుగులు పడటం లేదని అంటున్నారు.

ఇప్పటికీ అవే పరిస్థితులు

ఒకప్పుడు గురుకులాల్లో విద్యార్థులకు డ్రై ఫ్రూట్స్ పెడతారని గొప్పగా చెప్పుకొనేవారు. గత ఐదేళ్లలో వైసీపీ సర్కార్ డైట్ చార్జీలు పెంచలేదు. ఎన్నికల ముందు పెంచిన డైట్‌చార్జీలు కంటితుడుపుగానే ఉన్నాయి. ఓ వైపు నిత్యావసరాల ధరలు పెరగడం, అందుకు తగినట్టుగా డైట్ చార్జీలు పెంచకపోవడంతో సర్దుకుపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా ఈ పరిస్థితి మారలేదు. మెనూలో పప్పు పూర్తిగా తగ్గిపోయిందని, మళ్లీ పిల్లలకు రసం భోజనంతో సరిపెడుతున్నారని ఇటీవల అధికారుల పరిశీలనలో తేలింది. దీంతో కొన్ని చోట్ల పిల్లలు భోజనం చేయడానికి ఇష్టపడటం లేదు. గ్యాస్ ఎక్కువగా ఖర్చవుతుందని కొన్ని చోట్ల బియ్యాన్ని సరిగా ఉడికించకపోవడంతో పిల్లలు వాంతులు చేసుకోవడం, జీర్ణ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. 50 శాతం గురుకులాల్లో వంట మనుషుల కొరత ఉంది. టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా హాస్టళ్లు, గురుకులాల్లో కలుషిత ఆహారం తిని అనారోగ్యంపాలైన సంఘటనలు ఉన్నాయి. సంక్షేమ మంత్రులు హాస్టళ్లు, గురుకులాల్లో అనర్థాలు జరిగినపుడు బాధితులను పరామర్శించడమే తప్ప దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించడం లేదంటున్నారు. నిత్యావసరాలు సరఫరా చేసే కాంట్రాక్టర్లకు బిల్లులు సకాలంలో చెల్లించడం లేదనే విమర్శలున్నాయి. ఇక పిల్లల కోసం ప్రతి గురుకులానికి రూ.లక్ష చొప్పున కంటింజెంట్ నిధులు అందించేవారు. విద్యార్థులెవరైనా అనారోగ్యానికి గురైతే ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు, మందులు, పోషకాహారం తదితర ఖర్చుల కోసం ఉపయోగించుకునేవారు. వైసీపీ ప్రభుత్వం ఆ నిధులను ఆపేసింది. రాష్ట్రంలో 80 శాతం గురుకులాలు, 90 శాతం పైగా హాస్టళ్లలో పారిశుధ్యం మరింత అధ్వానంగా తయారైంది. మరుగుదొడ్ల నిర్వహణ దారుణంగా ఉంది. దీంతో పిల్లలు బహిర్భూమికి వెళ్లి పాము కాటుకు గురైన సందర్భాలున్నాయి. గత ప్రభుత్వం కొంత మంది ఆయాలను నియమించి అమ్మఒడి ద్వారా తల్లిదండ్రులకిచ్చే డబ్బుల నుంచి మినహాయించి వారికి జీతాలుగా చెల్లించేది. కొత్త ప్రభుత్వం వచ్చాక అమ్మఒడి అమల్లోకి రాకపోవడంతో జీతాలు చెల్లించడం లేదు.

ఒకప్పుడు ఉన్నత చదువులు చదివిన అధ్యాపకులు గురుకులాల్లో బోధించేవారు. ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా గురుకులాల్లో పోస్టులు భారీ సంఖ్యలో ఖాళీగా ఉన్నాయి. పైగా ఇటీవల డీఎస్సీ నోటిఫికేషన్ పడటంతో చాలా మంది టీచర్లు (ఔట్ సోర్సింగ్) చెప్పకుండా శిక్షణ తీసుకునేందుకు వెళ్లిపోయారు. కొంత మంది టెట్ శిక్షణ కోసమంటూ సెలవులు పెట్టారు. దీంతో టీచర్ల కొరత ఏర్పడింది. 80 శాతం స్కూళ్లలో 8 నుంచి 10వ తరగతి వరకు ఫిజిక్స్ బోధించేందుకు టీచర్లు లేరు. మైదాన ప్రాంతాల్లో గిరిజన హాస్టళ్లను 81 గురుకులాలుగా మార్చాలని గతంలో టీడీపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అవి ఇప్పటికీ సౌకర్యాలకు నోచుకోక హాస్టళ్ల కంటే దారుణంగా ఉన్నాయి. ఇప్పటికీ టీచర్ల కొరత ఉంది.

పర్యవేక్షణ లోపం

ఐదేళ్లుగా గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో పర్యవేక్షణ పూర్తిగా లోపించింది. అక్కడ ఏం జరుగుతుందో కనీసం పట్టించుకునే వాళ్లు లేకపోయారు. గిరిజన గురుకులాల సొసైటీకి రెగ్యులర్ సెక్రటరీని నియమించలేదు. ఇన్‌చార్జుల పాలనలోనే సాగింది. ఎస్సీ గురుకులాల్లో సమర్థులైన అధికారులను నియమించకపోవడంతో సొసైటీ కింద గురుకులాలు దారుణంగా తయారయ్యాయి. గురుకులాలు, హాస్టళ్లలో అమర్చిన సీసీ కెమెరాలను స్టోర్ రూముల్లో పెట్టేశారు. మెనూను తనిఖీ చేసే నాథుడే లేరు. పలు గురుకులాల్లో అడ్మిషన్లు తగ్గాయి. ఫలితాలూ అంతంత మాత్రమే. కూటమి ప్రభుత్వం మెరుగైన వసతులు కల్పించడానికి తగిన చర్యలు తీసుకోవాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గిరిజన, సాంఘిక సంక్షేమ కార్యదర్శి కన్నబాబు నిర్విరామంగా సమావేశాలు ఏర్పాటు చేసి ఆ శాఖపై అధ్యయనం చేస్తున్నారు. సీఎం చంద్రబాబు హాస్టళ్లు, గురుకులాలను గాడిన పెట్టేందుకు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అమరావతిలో ఎంఎస్ఎంఈ టెక్ సెంటర్



అమరావతి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతిలో పారిశ్రామిక ప్రగతి దిశగా కీలక ముందడుగు పడింది. రూ.250 కోట్ల అంచనా వ్యయంతో అమరావతిలో తొలిసారిగా 'ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్ కమ్ టెస్టింగ్ ఫెసిలిటీ' త్వరలోనే ఏర్పాటు కానుంది. ఈ తాజా ప్రతిపాదనకు కేంద్ర ప్రభుత్వం ఆమోదముద్ర వేయడంతో సీఆర్‌డీఏ ద్వారా రాజధాని ప్రాంతంలో 20 ఎకరాల భూమిని కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) శాఖకు ఉచితంగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకొచ్చింది. రాష్ట్ర పరిశ్రమలశాఖ డైరెక్టర్‌తో సమన్వయం చేసుకుని గుర్తించిన 20 ఎకరాల భూమిని వెంటనే ఢిల్లీలోని కేంద్ర ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కమిషనర్‌కు బదిలీ చేయాలని సీఆర్‌డీఏ కమిషనర్‌ను ఆదేశిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. ప్రపంచ బ్యాంకు ఆధ్వర్యంలో కేంద్రం ఇప్పటికే రాష్ట్రంలో మొదటి ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్‌ను విశాఖలో ఏర్పాటు చేయగా.. అది విజయవంతంగా కార్యకలాపాలు నిర్వహిస్తోంది. అదే తరహాలో మరో సెంటర్‌ను గుంటూరు జిల్లాలో ఏర్పాటు చేయాలని నిపుణుల కమిటీ సిఫారసు చేసింది. దానికి కేంద్రం కూడా పచ్చజెండా ఊపింది. అయితే కడప జిల్లా కొప్పర్తి ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో దీనిని ఏర్పాటు చేయాలని జగన్ ప్రభుత్వం కోరింది. కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అయితే రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో కథ మళ్లీ మొదటికి వచ్చింది. కూటమి ప్రభుత్వం దీన్ని అమరావతి ప్రాంతంలో ఏర్పాటు చేయాలని కేంద్ర ఎంఎస్ఎంఈ మంత్రిత్వశాఖకు తాజాగా ప్రతిపాదనలు పంపింది. దీంతో సీఆర్‌డీఏ పరిధిలో గుర్తించిన 20 ఎకరాల విస్తీర్ణంలో రెండో ఎంఎస్ఎంఈ సెంటర్‌ను ఏర్పాటు చేయడానికి కేంద్రం ఓకే చెప్పింది. ఈ నేపథ్యంలో శరవేగంగా పనులు పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని పరిశ్రమల శాఖ డైరెక్టర్, సీఆర్‌డీఏ కమిషనర్‌లను ప్రభుత్వం ఆదేశించింది. అమరావతిలో ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటైతే యువతకు వరల్డ్ క్లాస్ స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్‌తోపాటు వివిధ ఇంజనీరింగ్ టెక్నాలజీ కోర్సుల్లో ఏఐసీటీఈ, ఎన్ఎస్‌క్యూఎఫ్ ఆమోదించిన డిప్లొమా, పోస్ట్ డిప్లొమా, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ప్రోగ్రాములు అందుబాటులోకి రానున్నాయి. రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి ఇది బాగా దోహదపడుతుందని పారిశ్రామికవర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.




విచారణకు హాజరైన అవినాశ్, రఘురాం

విచారణకు సహకరించని రఘురాం, అవినాశ్

- పోలీసుల ప్రశ్నలకు పొంతనలేని సమాధానాలు
- మంగళగిరిలో మరోసారి విచారణకు హాజరు
- నేడు మరికొందరిని విచారించే అవకాశం

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 24: టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసుకు సంబంధించి ఎమ్మెల్సీ తలశిల రఘురాం, వైసీపీ నేత దేవినేని అవినాశ్ మంగళవారం మరోమారు పోలీసు విచారణకు హాజరయ్యారు. మంగళగిరి సర్కిల్ కార్యాలయంలో రూరల్ సీఐ, కేసు దర్యాప్తు అధికారి వై.శ్రీనివాసరావు వీరిని విచారించారు. ఉదయం పది గంటలకు తలశిలను పిలిపించి ఏడు ప్రశ్నలు అడిగారు. అనంతరం 12 గంటలకు అవినాశ్‌ను పిలిచి 11 ప్రశ్నలు అడిగారు. తర్వాత సీఐ మీడియాతో మాట్లాడుతూ.. వారిని గతంలో పిలిపించి విచారించినప్పుడు చెప్పిన సమాధానాలను క్రాస్ చెక్ చేసుకునే నిమిత్తం మరోమారు పిలిచామని.. అయితే వారు విచారణకు సహకరించడం లేదని తెలిపారు. ఇదే కేసులో ఇప్పటివరకు 28 మందిని అరెస్టు చేశామన్నారు. వారంతా అప్పిరెడ్డి, అవినాశ్, రఘురాం అనుచరులుగా గుర్తించామని, వారు చెప్పిన సమాధానాలకు.. రఘురాం, అవినాశ్ చెబుతున్నవాటికి పొంతన లేదన్నారు. సాంకేతిక ఆధారాల కోసం సెల్‌ఫోన్లు, సిమ్ కార్డులు ఇవ్వాలని కోరుతున్నప్పటికీ.. అప్పుడు ఉపయోగించిన ఫోన్లు తమ వద్ద లేవని చెబుతున్నారని పేర్కొన్నారు. తమ వద్ద ఉన్న వీడియో ఫుటేజీలు, విచారణలో నమోదుచేసుకున్న అంశాలను కోర్టు ముందు ఉంచుతామని తెలిపారు. ఈ కేసుకు సంబంధించి బుధవారం మరికొంత మందిని విచారిస్తామని చెప్పారు.

'వివేకా' కేసులన్నీ ఒకేసారి విచారణ

- శివశంకర్ బెయిల్‌పై కూడా అదే రోజు
- విచారణ నవంబరు 5కు వాయిదా వేసిన సుప్రీం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు విచారణను సుప్రీంకోర్టు మరోసారి వాయిదా వేసింది. ఈ కేసులో శివశంకర్ రెడ్డి బెయిల్ రద్దు చేయాలని కోరుతూ ఈ ఏడాది మార్చి 15న ఆయన కుమార్తె సునీత నర్రెడ్డి సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఆ పిటిషన్‌పై మంగళవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. వివేకా హత్య కేసుకు సంబంధించి శివశంకర్‌రెడ్డి బెయిల్ రద్దుతోపాటు మిగిలిన పిటిషన్లు అన్నీ కలిపి ఒకేసారి విచారించాలని సునీత తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా కోరారు. మిగతా నిందితులపై దాఖలైన పిటిషన్లు నవంబరు 4న సుప్రీంకోర్టు ముందుకు వస్తున్నాయని.. అందుకే అన్నింటినీ కలిపి విచారించాలని విజ్ఞప్తి చేశారు. ఇదే కేసులో అప్రూవర్‌గా మారిన వ్యక్తిపై శివశంకర్‌రెడ్డి కొడుకు బెదిరింపులకు పాల్పడిన వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం ఇంప్లీడ్ అయ్యేందుకు అనుమతించాలని కోరారు. అన్ని పిటిషన్లు కలిపి ఒకేసారి విచారణ చేపట్టాలని బాధితులే కోరుతున్నందున నవంబరు 5న ఒకేసారి విచారణ చేపడతామని ధర్మాసనం స్పష్టం చేసింది.

దర్యాప్తునకు సహకరించండి

- ఐపీఎస్ కాంతిరాణా, సీఐ సత్యనారాయణకు హైకోర్టు ఆదేశం
- తదుపరి విచారణ వరకు వారిపై చర్యలొద్దని పోలీసులకు స్పష్టీకరణ
- ముందస్తు బెయిల్ పిటిషన్లపై విచారణ అక్టోబరు 1కి వాయిదా



అమరావతి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ముంబైకి చెందిన సినీనటి కాదంబరి జెత్వానీ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నమోదైన కేసులో.. దర్యాప్తునకు సహకరించాలని ఐపీఎస్ అధికారి కాంతిరాణా తాతా, సీఐ సత్యనారాయణను హైకోర్టు ఆదేశించింది. అలాగే తదుపరి విచారణ వరకు వారిపై ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులకు స్పష్టం చేసింది. జెత్వానీ ఫిర్యాదు ఆధారంగా నమోదైన కేసులో నిందితుడిగా ఉన్న ఇబ్రహీంపట్నం అప్పటి సీఐ సత్యనారాయణ వేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై మంగళవారం సుదీర్ఘ వాదనలు జరిగాయి. సత్యనారాయణ తరఫున సీనియర్ న్యాయవాది వినోద్‌కుమార్ దేశ్‌పాండే వాదనలు వినిపిస్తూ.. కొందరు వ్యక్తుల ప్రోద్బలంతోనే పోలీసులపై జెత్వానీ కేసు పెట్టారన్నారు. ఆమె అరెస్ట్ విషయంలో పిటిషనర్ చట్టనిబంధనలు అనుసరించారని, ఆమె నివాసంలో సోదాలు నిర్వహించేందుకు మేజిస్ట్రేట్ అనుమతి పొందారని, ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగానే నడుచుకున్నారని చెప్పారు. కుక్కల విద్యాసాగర్ ఫిర్యాదు ఆధారంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో పోలీసులు జెత్వానీపై కేసు పెట్టారని చెప్పారు. అప్పటి నుంచి ఆమెను పలుమార్లు మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చారని.. ఒకవేళ పోలీసులు అనుచితంగా ప్రవర్తించి ఉంటే ఆమె మేజిస్ట్రేట్ ముందు ఫిర్యాదు చేసి ఉండవచ్చు కదా అన్నారు. ఆరు నెలలపాటు మౌనంగా ఉండి అనుకూల పరిస్థితులు ఏర్పడిన తర్వాత పోలీసులపై తీవ్ర ఆరోపణలు చేస్తూ కేసు పెట్టారన్నారు. పోలీసులు నమోదుచేసిన సెక్షన్లు పిటిషనర్‌కు వర్తించవన్నారు. మంగళవారం కోర్టు సమయం ముగియడంతో సీఐ సత్యనారాయణ, ఇతర నిందితుల వాదనలు వినేందుకు వీలుగా న్యాయస్థానం విచారణను అక్టోబరు 1కి వాయిదా వేసింది. అప్పటివరకు వీరిపై ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులకు స్పష్టం చేసింది. కేసుకి సంబంధించి పూర్తి వివరాలతో కౌంటర్ వేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. నిందితులు వేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లలో తన వాదనలు వినిపించేందుకు అనుమతించాలని కోరుతూ జెత్వానీ వేసిన ఇంప్లీడ్ పిటిషన్లను అనుమతించింది. దీనిపై ఏమైనా అభ్యంతరాలుంటే కౌంటర్ వేయాలని సీఐ సత్యనారాయణ, కాంతిరాణా తాతాకు స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ మంగళవారం ఉత్తర్వులిచ్చారు.

ముందస్తు బెయిల్ ఇవ్వండి.. హైకోర్టులో గున్నీ పిటిషన్

జెత్వానీ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఇబ్రహీంపట్నం పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఐపీఎస్ అధికారి విశాల్ గున్నీ మంగళవారం హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై కోర్టు బుధవారం విచారణ జరపనుంది.

విద్యాసాగర్ కస్టడీ పిటిషన్‌పై విచారణ రేపటికి వాయిదా

విజయవాడ, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ముంబై నటి కాదంబరి జెత్వానీ కేసులో నిందితుడు కుక్కల విద్యాసాగర్‌ను ఐదు రోజులు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ గురువారానికి వాయిదా పడింది. వారి పిటిషన్‌పై కౌంటర్ దాఖలుకు సమయం కావాలని విద్యాసాగర్ తరఫున ఢిల్లీ నుంచి వచ్చిన ఐదుగురు న్యాయవాదులు కోరడంతో విజయవాడ 4వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ యు.రామ్మోహన్ విచారణను గురువారానికి వాయిదా వేశారు.

పంచాయతీరాజ్‌లో కారుణ్య నియామకాలు చేపట్టండి

- అధికారులకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాలు

అమరావతి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ సంస్థల్లో పనిచేసే జిల్లా పరిషత్, మండల పరిషత్ ఉద్యోగులు.. వాటి పరిధిలో ఉండే కారుణ్య నియామకాలు చేపట్టాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. నియామకాలకు ఉన్న అడ్డంకులను తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. డిప్యూటీ సీఎం మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇటీవల పలువురు ఇచ్చిన అర్జీలను పరిశీలించారు. కారుణ్య నియామకాల్లో నెలకొంటున్న జాప్యం, నిబంధనలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఖాళీలు తక్కువగా ఉండటంతో కారుణ్య నియామకాలు ఆలస్యం అవుతున్నాయని అధికారులు ఈ సందర్భంగా వివరించారు. పీఆర్ సంస్థల్లో కారుణ్య నియామకాల జాబితాలో వేచి చూస్తున్న వారికి, జిల్లా కలెక్టర్ కామన్‌పూల్‌లో ఉన్న ఖాళీల్లో అవకాశం కల్పించే అంశంపై డిప్యూటీ సీఎం చర్చించారు. ఆ దిశగా నియామకాలు చేసే విషయంపై సాధారణ పరిపాలన శాఖతో చర్చించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ముఖ్యకార్యదర్శి, కమిషనర్‌కు దిశానిర్దేశం చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● బుధవారం 25 సెప్టెంబరు 2024
diksuchi@andhrajyothy.com

ఐఐటీ మద్రాస్‌లో ఈఎంబీఏ

మద్రాస్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీఎం) నిర్వహిస్తున్న డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్(డీఓఎంఎస్)- ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ(ఈఎంబీఏ) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఆప్టిట్యూడ్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. దీనిని వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ప్రత్యేకించారు. వారాంతాల్లో క్లాస్ రూమ్ కాంటాక్ట్ ప్రోగ్రామ్‌లు ఉంటాయి. మూడు ప్రాజెక్ట్ వర్క్‌లు పూర్తిచేయాల్సి ఉంటుంది. ప్రోగ్రామ్‌లో భాగంగా కేస్ డిస్కషన్స్, సమ్మర్



ఇంటర్న్‌షిప్, ఎలక్టివ్ కోర్సులు ఉంటాయి. తొమ్మిది రోజుల ఇంటర్నేషనల్ ఇమ్మర్షన్ లెర్నింగ్ కోర్సు జతగా ఉంటుంది. ఇది 'గ్లోబల్ లీడర్‌షిప్ అండ్ కల్చరల్ ఇంటెలిజెన్స్'కు సంబంధించి ఉంటుంది. దీనిని బ్రస్సెల్స్-బెల్జియం; లిల్లీ& పారిస్-ఫ్రాన్స్‌లోని ఎస్ఈజీ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ క్యాంపస్‌లలో నిర్వహిస్తారు.


అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ప్రథమశ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. డిసెంబరు 31 నాటికి కనీసం మూడేళ్ల అనుభవం ఉండాలి.

ఆప్టిట్యూడ్ టెస్ట్: ఇందులో బిజినెస్ ఆప్టిట్యూడ్, లాజికల్ రీజనింగ్, క్వాంటిటేటివ్ ఎబిలిటీ, వెర్బల్ ఎబిలిటీ అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** రూ.1500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 20
- **వెబ్‌సైట్:** doms.iitm.ac.in

జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో డిస్టెన్స్ కోర్సులు

తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయం(ఎన్ఎస్‌కేటీయూ-సెంట్రల్ యూనివర్సిటీ)కి చెందిన సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ (సీడీఓఈ)- ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్(ఓడీఎల్) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.



సంస్కృతంలో సర్టిఫికెట్ కోర్సు

కోర్సు వ్యవధి ఆర్నెల్లు. గరిష్ఠంగా ఏడాదిలో పూర్తిచేయాలి. సంస్కృత మాధ్యమంలో బోధన ఉంటుంది.

అర్హత: దేవనాగరి లిపి రాయడం, చదవడం తెలిసి ఉండాలి. ఆగస్టు 15 నాటికి అభ్యర్థుల వయసు పదమూడేళ్లు నిండి ఉండాలి.

సంస్కృతంలో డిప్లొమా కోర్సు

కోర్సు వ్యవధి ఏడాది. గరిష్ఠంగా మూడేళ్లలో పూర్తిచేసే వీలుంది. ట్రెడిషనల్ సబ్జెక్టులను సంస్కృత మాధ్యమంలో, మోడరన్ సబ్జెక్టులను ఇంగ్లీష్ మాధ్యమంలో బోధిస్తారు. ఈ కోర్సు పూర్తిచేసినవారు సమ్మానిత శాస్త్రీ/బీఏ ప్రోగ్రామ్‌లో నేరుగా ప్రవేశం పొందవచ్చు.

అర్హత: ఆర్ఎస్ విద్యాపీఠం/ఎన్ఎస్ యూనివర్సిటీ నుంచి సంస్కృతంలో సర్టిఫికెట్ కోర్సు పూర్తిచేసినవారు, న్యూఢిల్లీలోని ఆర్ఎస్ సంస్థానం నుంచి సంస్కృత ప్రథమ దీక్ష కోర్సు ఉత్తీర్ణులు, ప్రాక్ శాస్త్రీ/ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. వయసు పదహారేళ్లు నిండి ఉండాలి.

ప్రాక్ శాస్త్రీ

ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. గరిష్ఠంగా నాలుగేళ్లలో పూర్తిచేయవచ్చు. ఇది ఇంటర్ లెవెల్ ప్రోగ్రామ్

అర్హత: పదోతరగతి ఉత్తీర్ణులు, పూర్వ మాధ్యమ కోర్సు పూర్తిచేసినవారు; శాన్‌స్క్రిట్ ఎంట్రెన్స్ ఎగ్జామ్‌లో అర్హత సాధించినవారు; వేద భూషణ్ సర్టిఫికెట్ కోర్సు ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. పదోతరగతి స్థాయిలో సంస్కృతం ఒక సబ్జెక్టుగా చదివినవారికి, ఎన్ఎస్‌యూ నుంచి సర్టిఫికెట్ ప్రోగ్రామ్ ఆఫ్ శాన్‌స్క్రిట్ పూర్తిచేసినవారికి ప్రాధాన్యం ఉంటుంది. అభ్యర్థుల వయసు ఆగస్టు 15 నాటికి పదిహేనేళ్లు నిండి ఉండాలి.

బీఏ ఆనర్స్ శాంస్క్రిట్

ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. గరిష్ఠంగా ఎనిమిదేళ్లలో పూర్తిచేయాలి.

అర్హత: ఇంటర్/ప్రాక్ శాస్త్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్ స్థాయిలో సంస్కృతం ఒక సబ్జెక్టుగా చదివినవారికి; ఎన్ఎస్‌యూ నుంచి సంస్కృతంలో సర్టిఫికెట్/డిప్లొమా కోర్సులు పూర్తిచేసినవారికి; ఇతర సంస్కృత సంబంధిత ప్రోగ్రామ్‌లు ఉత్తీర్ణులైనవారికి ప్రాధాన్యం ఉంటుంది. ఆగస్టు 15 నాటికి వయసు పదిహేడేళ్లు నిండి ఉండాలి.

శాస్త్రీ ఆనర్స్ సాహిత్య, శాస్త్రీ ఆనర్స్ వ్యాకరణ

ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. గరిష్ఠంగా ఎనిమిదేళ్లలో పూర్తిచేయాలి. ఇవి డిగ్రీ లెవెల్ ప్రోగ్రామ్‌లు.

అర్హత: ఇంటర్/ప్రాక్ శాస్త్రీ/ఉత్తర మాధ్యమ/ మాధ్యమ/వరిష్ఠోపాధ్యాయ/ఉప శాస్త్రీ/సాహిత్య/వేద విభూషణ కోర్సులు పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. డిప్లొమా ఇన్ సంస్కృతం/విచక్షణ కోర్సు పూర్తిచేసినవారికి ప్రాధాన్యం ఉంటుంది. వయసు పదిహేడేళ్లు నిండి ఉండాలి.

పీజీ డిప్లొమా ఇన్ యోగ విజ్ఞాన

ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. గరిష్ఠంగా నాలుగేళ్లలో పూర్తిచేయాలి. ఇంగ్లీష్ లేదా సంస్కృత మాధ్యమంలో బోధన ఉంటుంది.

అర్హత: ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు ఆగస్టు 15 నాటికి 20 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండాలి.

ఆచార్య సాహిత్య, ఆచార్య పురాణేతిహాస, ఆచార్య ఫలిత జ్యోతిష, ఆచార్య ధర్మ శాస్త్ర

ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. గరిష్ఠంగా నాలుగేళ్లలో పూర్తిచేయాలి. సంస్కృత మాధ్యమంలో బోధన ఉంటుంది. ఇవి పీజీ లెవెల్ ప్రోగ్రామ్‌లు.

అర్హత: మూడేళ్ల డిగ్రీ/శాస్త్రీ/బీఏ సంస్కృతం/శిరోమణి/మాధ్యమ/శాస్త్ర భూషణ/విద్యా ప్రవీణ/విద్యాలంకార /వేదాలంకార /విద్వత్ మాధ్యమ/బ్యాచిలర్ ఆఫ్ ఆయుర్వేదిక్ మెడిసిన్/ బ్యాచిలర్ ఆఫ్ ఆయుర్వేదిక్ మెడిసిన్ అండ్ సర్జరీ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు ఆగస్టు 15 నాటికి 20 ఏళ్లు నిండి ఉండాలి. ఎన్ఈపీ 2020 నిబంధనల ప్రకారం ప్రోగ్రామ్‌ల నుంచి వైదొలగే వీలుంది.

ముఖ్య సమాచారం
- దరఖాస్తు ఫీజు: రూ.700
- ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 10
- వెబ్‌సైట్: https://nsktu.ac.in

ఐఐఎఫ్‌టీలో పీజీ సర్టిఫికెట్ ఇన్ మేనేజ్‌మెంట్

న్యూఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ)- పోస్ట్ గ్రాడ్యుయేట్ సర్టిఫికెట్ ఇన్ మేనేజ్‌మెంట్(ఇంటర్నేషనల్ బిజినెస్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దీని వ్యవధి ఏడాది. ఇది వీకెండ్ ఆన్ క్యాంపస్ ప్రోగ్రామ్. దీనికి ఏఐసీటీఈ గుర్తింపు ఉంది.

ప్రోగ్రామ్ వివరాలు
- ఇందులో మూడు ట్రైమెస్టర్లు ఉంటాయి. ప్రతి ట్రైమెస్టర్ ప్రారంభంలో మూడు రోజులు కాంటాక్ట్ వీక్ నిర్వహిస్తారు. రెండో ట్రైమెస్టర్‌లో పోర్ట్ విజిట్ ఉంటుంది.

అర్హత
- గుర్తింపు పొందిన కళాశాల నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. రిజర్వ్‌డ్ వర్గాలవారికి 45 శాతం మార్కులు చాలు. వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ఈ ప్రోగ్రామ్ అనుకూలంగా ఉంటుంది.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1500, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.750
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 5
- **వెబ్‌సైట్:** www.iift.ac.in



ఆంధ్ర యూనివర్సిటీలో పీజీ

విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీకి చెందిన డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్(ఏయూడీఓఏ)- స్పాన్సర్డ్ కేటగిరీ ఎంటెక్ రెగ్యులర్ ప్రోగ్రామ్ సహా ఎంటెక్, ఎం ప్లానింగ్ ఈవెనింగ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. వీటిని ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ నిర్వహిస్తుంది. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. వర్సిటీ ఈ ఏడాది నుంచి నూతనంగా ఎంటెక్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ (ఆన్‌లైన్) ప్రోగ్రామ్‌ను కూడా ఆరంభించింది. ఈ ప్రోగ్రామ్‌లను స్థానిక ఉద్యోగులకు ప్రత్యేకించారు.

స్పాన్సర్డ్ ఎంటెక్ (రెగ్యులర్) ప్రోగ్రామ్

గేట్ వ్యాలిడ్ స్కోర్/ఏపీ పీజీఈసెట్ 2024 స్కోర్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి అడ్మిషన్స్ ఇస్తారు. అభ్యర్థులు పనిచేస్తున్న సంస్థ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్, స్పాన్సర్‌షిప్ సర్టిఫికెట్ సబ్మిట్ చేయాలి.

స్పెషలైజేషన్‌లు-సీట్లు: కెమికల్ ఇంజనీరింగ్ 2, సివిల్ ఇంజనీరింగ్ 12, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ 2, మెకానికల్ ఇంజనీరింగ్ 11, జియో ఇంజనీరింగ్ 2, మెరైన్ ఇంజనీరింగ్ 1, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ 11, ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ 1, మెటలర్జికల్ ఇంజనీరింగ్ 1, కంప్యూటర్ సైన్స్ అండ్ సిస్టమ్స్ ఇంజనీరింగ్ 4, నానో టెక్నాలజీ 1



ఎంటెక్, ఎం ప్లానింగ్ ఈవెనింగ్ ప్రోగ్రామ్‌లు

గేట్/పీజీఈసెట్/ఐసెట్ అర్హత పొందిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుంది. కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

ఎంటెక్ స్పెషలైజేషన్‌లు-సీట్లు: కెమికల్ ఇంజనీరింగ్ 18, స్ట్రక్చరల్ ఇంజనీరింగ్ 18, పవర్ ఎలక్ట్రానిక్ డ్రైవ్స్ అండ్ కంట్రోల్ 18, రాడార్ అండ్ మైక్రోవేవ్ ఇంజనీరింగ్ 30, ఎలక్ట్రానిక్ ఇన్‌స్ట్రుమెంటేషన్ 30, జియో ఇంజనీరింగ్ 18, రిమోట్ ఇంజనీరింగ్ 18, నేవల్ ఆర్కిటెక్చర్ 18, ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్ 18, క్యాడ్/క్యామ్ 18, థర్మల్ ఇంజనీరింగ్ 18, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్ 18, మెడికల్ ఇన్‌స్ట్రుమెంటేషన్ 18, ఇండస్ట్రియల్ మెటలర్జీ 18, కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ(ఆన్‌లైన్) 30, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్(ఆన్‌లైన్) 18

ఎం ప్లానింగ్: ఈ ప్రోగ్రామ్‌లో ఎన్విరాన్‌మెంటల్ స్పెషలైజేషన్ ఉంది. మొత్తం 18 సీట్లు ఉన్నాయి.

అర్హత వివరాలు

ఎంటెక్ ప్రోగ్రామ్‌లకు స్పెషలైజేషన్‌ను అనుసరించి కెమికల్/సివిల్/ఈఈఈ/ ఈసీఈ/ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/నేవల్ ఆర్కిటెక్చర్/ మెకానికల్/మెరైన్/ఏరోనాటికల్/ ఇండస్ట్రియల్/ ప్రొడక్షన్/ఇన్‌స్ట్రుమెంటేషన్/కంట్రోల్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/మెటలర్జీ/కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగాల్లో బీఈ/బీటెక్/ఏఎంఐఈ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. నిర్దేశించిన స్పెషలైజేషన్‌లకు ఎమ్మెస్సీ(ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ ఫిజిక్స్/ అప్లయిడ్ ఫిజిక్స్/వీఎల్ఎస్ఐ డిజైన్/డీఎస్‌పీ& ఈఎస్‌డీ)/ ఎంసీఏ/బీఆర్క్ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.

ఎం ప్లానింగ్ ప్రోగ్రామ్‌నకు అయిదేళ్ల బ్యాచిలర్ డిగ్రీ(ఆర్కిటెక్చర్)/ బీఆర్క్/బీ ప్లానింగ్/ బీఈ(సివిల్/ఎన్విరాన్‌మెంటల్)/ఎంఏ(సోషియాలజీ/ ఎకనామిక్స్/జాగ్రఫీ) ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. డిగ్రీ స్థాయిలో కనీసం 50 శాతం మార్కులు ఉండాలి. రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు 45 శాతం చాలు.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** స్పాన్సర్డ్ ఎంటెక్(రెగ్యులర్) ప్రోగ్రామ్‌నకు రూ.2000; ఈవెనింగ్ ప్రోగ్రామ్‌లకు రూ.1000
- **కౌన్సెలింగ్ ఫీజు:** స్పాన్సర్డ్ ఎంటెక్‌నకు రూ.500; ఈవెనింగ్ ప్రోగ్రామ్‌లకు రూ.600
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** సెప్టెంబరు 26 ● **కౌన్సెలింగ్ తేదీ:** సెప్టెంబరు 27
- **వెబ్‌సైట్:** www.audoa.andhrauniversity.edu.in

SCHOLARSHIP ALERT

Adani Gyan Jyoti Scholarship 2024-25

Description: Adani Group is offering this scholarship to first-year students who are domiciles of Andhra Pradesh, Rajasthan, Gujarat, Odisha, and Chhattisgarh and are pursuing courses related to JEE, NEET, CLAT, CA Foundation, and Economics, supporting their educational journey.

Eligibility: * Open for candidates who are domiciles of Andhra Pradesh, Rajasthan, Gujarat, Odisha, and Chhattisgarh only.
* Only first-year students pursuing BA Economics, BSc Economics, BEc, B.E./B.Tech., Integrated 5-Year Dual-Degree M.Tech., MBBS, and LLB courses are eligible.
* Applicants must have passed their higher secondary/pre-university/intermediate/CBSE/ISC or equivalent board exams after 2023.
* Admission must be based on the merit rank from state or national-level entrance exams.
* Family income must not exceed INR 4,50,000 per annum from all sources. **Prizes & Rewards:** Up to INR 3,50,000 (tuition fee) annually.

Last Date to Apply: 07-10-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/AGSP5

SBIF Asha Scholarship Program 2024

Description: The SBIF Asha Scholarship Program 2024, one of India's largest scholarship programs, is an initiative of the SBI Foundation. This scholarship aims to provide financial assistance to meritorious students from low-income families across India, ensuring the continuity of their education.

Eligibility: Open to school students from Class 6 to 12 and undergraduate & postgraduate students from the top 100 NIRF universities/colleges, undergraduate students from IITs, and students pursuing MBA/PGDM courses from IIMs. Applicants must have scored a minimum of 75% marks in the previous academic year. Their gross annual family income must be up to INR 6 lakh (Up to INR 3 lakh for Class 6-12 students).

Prizes & Rewards: * Classes 6 to 12: INR 15,000 each
* UG Students: Up to INR 50,000
* PG Students: Up to INR 70,000
* UG Students from IITs: Up to INR 2,00,000
* MBA Students from IIMs: Up to INR 7,50,000

Last Date to Apply: 01-10-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/SBIFS7

Reliance Foundation Post graduate Scholarships 2024-25

Description: The Reliance Foundation Postgraduate Scholarships aim to enable and propel India's future leaders who can think big, think green, and think digital for the benefit of society.

Eligibility: * Students who are enrolled in the first-year full-time regular postgraduation programmes pursuing select future-ready courses from Engineering, Technology, Energy and Life-Sciences
* Must have secured 550 to 1,000 in the GATE examination

OR

* Must have scored 7.5 or above in their undergraduate CGPA (or % normalized to CGPA) [If students have not attempted GATE]
* Open for resident Indian citizens.

Prizes & Rewards: Up to INR 6,00,000 over the duration of the degree
Last Date to Apply: 06-10-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/RFS10

buddy4study.com


లిటిల్స్

పచ్చటి గుర్రం




చతురతకు, చమత్కారానికి మారుపేరైన బీర్బల్, అక్బరు కొలువులో కొత్తగా చేరిన కొన్నిరోజులకు ఇద్దరూ వేటకు వెళ్లారు. అక్కడి ప్రకృతిని చూసి, మైమరచిపోయిన బీర్బల్ 'ఇంత పచ్చని చెట్ల నడుమ, పచ్చటి కొండలలో ఒక ఆకుపచ్చని గుర్రం మీద వెళితే ఎంత మజాగా ఉంటుందో కదా' అన్నాడు ఏదో ఆలోచిస్తూ. ఆ మాటలు విన్న అక్బరు 'ఏదీ పచ్చటి గుర్రం అన్నావే వారం రోజుల్లోగా నువ్వు నాకు, ఆ పచ్చటి గుర్రాన్ని తెచ్చి ఇవ్వాలి' అని ఆజ్ఞాపించి ఇదెలా సాధిస్తాడో చూద్దాం అని లోలోపల నవ్వుకుంటాడు. వారం రోజులు గడిచాక బీర్బల్ హడావుడిగా కొలువుకు వచ్చి 'జహాపనా.. ఒక చోట మీరడిగిన పచ్చటి గుర్రం దొరికింది. కానీ ఆ గుర్రం యజమాని మీరు స్వయంగా వస్తేనే, గుర్రం అమ్ముతా అంటున్నాడు' అని చెప్పాడు. అంత అరుదైన గుర్రం కోసం నేను రావడమే సముచితం, తప్పక వస్తాను అన్నాడు అక్బరు. కానీ అతను మీకు ఆ గుర్రాన్ని వారంలో ఎనిమిదవ రోజు మాత్రమే అమ్ముతాడట' అన్నాడు బీర్బల్, అక్బరు ఇవాళ శుక్రవారం రేపు శనివారం ఎనిమిదవ రోజు ఏదంటే అని లెక్క వేస్తూ ఒక్కసారిగా నాలిక కరుచుకుని, "వారంలో ఎనిమిది రోజులు ఎలా ఉంటాయి నీ చమత్కారం కాకపోతే?' అన్నాడు. దానికి బీర్బల్ మరి ఆకు పచ్చటి గుర్రం మాత్రం ఎలా ఉంటుంది జహాపనా? నేనేదో సరదాగా అంటే మీరు దాన్ని నిజంగా తీసుకురమ్మంటే నేనేంచేయగలను? అన్నాడు బీర్బల్.

10 తేడాలను కనిపెట్టండి



ఎవి ఎన్ని?



సరైన నీడ ఏది?



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 418

	9		2		8			
4		3		5			8	
				4				3
		6				9		4
	7						1	
1		5				7		
7				1				
	1			9		2		8
			3		2		4	

సుడోకు - 417 సమాధానం

2	7	3	9	4	1	6	5	8
8	4	6	5	9	2	1	3	7
1	5	9	7	2	8	4	6	3
5	8	4	3	1	6	2	7	9
9	6	7	4	8	3	5	1	2
6	3	8	2	5	4	7	9	1
3	1	2	8	6	7	9	4	5
4	2	5	1	7	9	3	8	6
7	9	1	6	3	5	8	2	4

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.